



www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి






మంగళవారం | 30-1-2018 | పేజీలు: 16 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 199 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి రా. 10.23 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: పునర్వసు రా. 8.18 తదుపరి పుష్యమి; వర్జ్యం: ఉ. 9.41-11.06, మ. 3.24-4.49; దుర్ముహూర్తం: ఉ. 9.07-9.52, రా. 10.18-11.07; అమృతఘడియలు: రా. 6.11-7.36; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.06 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai


# ఆ తలాక్ ఆగాలి!

త్వరలో తక్షణ తలాక్ నిషేధ చట్టం

మచ్చిక కాదు.. సాధికారతే లక్ష్యం

2022 కల్లా అందరికీ ఇంటి వసతి

చెట్ల జాబితాలో వెదురు తొలగింపు

దేశ ఆర్థిక స్థితి ఎంతో ఆశావహం

హింసను వీడే వారితోనే చర్చలు

పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగం

న్యూఢిల్లీ, జనవరి 29: తక్షణ తలాక్‌ను నిషేధిస్తూ తెచ్చిన బిల్లు త్వరలోనే చట్టరూపం దాల్చగలదన్న ఆశాభావాన్ని రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ వ్యక్తం చేశారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా- సోమవారం నాడు ఉభయసభలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. రాష్ట్రపతి పదవి చేపట్టాక ఆయన సంయుక్త సమావేశంలో ప్రసంగించడం ఇదే తొలిసారి. "ఇన్నేళ్లూ ముస్లిం మహిళల ఆత్మగౌరవం రాజకీయ ఆధిపత్య క్రీడలో బలైపోతూ వచ్చింది. ఈ పరిస్థితి నుంచి వారిని బయటపడేసే సమయం వచ్చింది. మా ప్రభుత్వం తెచ్చిన తలాక్ వ్యతిరేక బిల్లు చట్టంగా మారితే ముస్లిం సోదరీమణులు, కూతుళ్లు ఇక నిర్భయంగా, గౌరవ ప్రదమైన జీవితం సాగించగలరు. మోదీ ప్రభుత్వం మైనారిటీలను సంతృప్తి పరిచి- మచ్చిక చేసుకొనే నిర్ణయాలు తీసుకోదు.. వారికి సాధికారత కల్పించడం మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు. ముస్లిం ఓటర్లను ఆకట్టుకునే దిశగా మరికొన్ని అంశాలూ ప్రస్తావించారు. ఈ ఏడాది నుంచి మగతోడు లేకుండా (మెహరీన్)- 45ఏళ్లు దాటిన మహిళలు కూడా హజ్‌యాత్ర చేస్తారని, 1300 మహిళలు ఈ ఏడాది చేయబోతున్నారని చెప్పారు. ఆరు మైనారిటీ వర్గాల వారికి ఉపాధి అవకాశాలు కల్పించే ఐదు పథకాలు ప్రవేశపెట్టామని, వీటిని విస్తరిస్తామని ఆయన ప్రకటించారు. 45 లక్షల మందికి ఉపకారవేతనాలు అందిస్తున్నామన్నారు. చెట్ల జాబితా నుంచి వెదురును తొలగించినట్లు రాష్ట్రపతి వెల్లడించారు. తద్వారా లక్షల మంది గిరిజనులకు, ఈశాన్య భారత రాష్ట్రాల వారికి ఎంతో


మిగతా 16వ పేజీలో...


## వృద్ధి రేటు ఇక ఉరకలు


11


2018-19లో 7-7.5% ఖాయం.. ఆర్థిక సర్వేలో అచ్ఛేదిన్

బడ్జెట్ సంరంభం.. ఆరంభం



రాష్ట్రపతి కోవింద్‌ను పార్లమెంటుకు తోడ్కొని వస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య, స్పీకర్ సుమిత్రా మహాజన్, ప్రధాని నరేంద్ర మోదీ

# ముందస్తు జమిలి!

మనమే వాతావరణాన్ని సిద్ధం చేద్దాం

దీంతో నల్ల ధనం, వ్యయ నియంత్రణ

ఎన్డీయే పక్షాలకు ప్రధాని మోదీ పిలుపు

రాష్ట్రపతి ప్రసంగంలోనూ ప్రస్తావన

దేశంలో ఏటా ఒక చోట ఎన్నికలు

డబ్బు వృథా.. మానవ వనరులు వృథా

అభివృద్ధికీ అంతరాయం: కోవింద్

న్యూఢిల్లీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో ముందస్తు ఎన్నికలు రానున్నాయా!? అవి కూడా జమిలిగా రానున్నాయా!? రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం చేసిన వ్యాఖ్యలు ఇందుకు 'ఔను' అన్న జవాబునే ఇస్తున్నాయి. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా పార్లమెంట్ సెంట్రల్ హాల్లో ఉభయసభల సభ్యులను ఉద్దేశించి సోమవారం రాష్ట్రపతి కోవింద్ ప్రసంగించారు. లోక్‌సభకు, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకూ ఒకేసారి ఎన్నికలు జరపడమే ఉత్తమమని, దీనిపై విస్తృత చర్చ జరగాలని పిలుపిచ్చారు. "దేశంలో ఏదో ఒక రాష్ట్రంలో ఏటా ఏదో ఒక ఎన్నిక జరుగుతూనే ఉంది. దాంతో ఎంతో డబ్బు వృథా.. మానవ వనరులు వృథా. ఎన్నికల ప్రవర్తన నియమావళితో అభివృద్ధి కార్యక్రమాలకు ఎంతో ఆటంకం కలుగుతోంది. అందువల్ల, జమిలి ఎన్నికలే మేలు. ఈ అంశంపై విస్తృతంగా చర్చించి అన్ని పార్టీలు, పార్లమెంట్ సభ్యులంతా ఏకాభిప్రాయానికి రావాలి" అని పిలుపు ఇచ్చారు. అంతేనా, పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగం ఎన్నికల ప్రసంగంలా సాగింది. రాష్ట్రపతి హోదాలో కోవింద్‌కు ఇది తొలి బడ్జెట్ ప్రసంగం. మోదీ ప్రభుత్వానికి ఇవి చివరి బడ్జెట్ సమావేశాలు. సాధారణంగా కేంద్ర ప్రభుత్వం రాసి ఇచ్చిన ప్రసంగ పాఠాన్నే రాష్ట్రపతి చదివి వినిపిస్తారు. దాంతో, మూడేళ్లుగా మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను ఏకరువు పెడుతూనే ఆయన ప్రసంగం సాగింది. ఇక, ప్రధాని మోదీ కూడా ముందస్తు, జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు స్వయంగా రంగంలోకి దిగారు. ఇందుకు


మిగతా 6వ పేజీలో...


## నేడు అమిత్ షాతో సుజనా భేటీ


6


సీట్ల పెంపు సహా పెండింగ్ అంశాలపై చర్చ

## కేసీఆర్ సర్కారు బాటలో కేంద్రం?

## దేశవ్యాప్తంగా రైతులకు పెట్టుబడి మొత్తం

# నగదు సాయం!

## ఆర్థిక సర్వేలో సిఫారసు.. రాష్ట్రపతి ప్రసంగంలోనూ సంకేతాలు

వ్యవసాయంలో మున్ముందు దుర్భిక్షమే

నాలుగో వంతు తగ్గనున్న రాబడి

2022కల్లా రెట్టింపు ఆదాయం కలే

కరెంటు, ఎరువుల సబ్సిడీ ఎత్తేయండి

నేరుగా రైతుకు సాయం పంచండి

సాగునీటి ప్రాజెక్టులను కట్టండి: సర్వే

న్యూఢిల్లీ, జనవరి 29: రైతుకు పెట్టుబడి సాయం ప్రకటించినపుడు సీఎం కేసీఆర్.. దేశమంతా తెలంగాణ వైపు చూస్తోందని ప్రకటించారు. ఇప్పుడదే జరుగుతోంది. పెట్టుబడి సాయంపై పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆరా తీశారు. ఇప్పుడు ఏకంగా కేంద్ర ప్రభుత్వమే తెలంగాణ అడుగు జాడల్లో పెట్టుబడి సాయం పథకాన్ని ప్రవేశపెట్టే ఆలోచన చేస్తోంది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సోమవారం లోక్‌సభలో


మిగతా 16వ పేజీలో...




## ఎగుమతుల్లో తెలంగాణ భేష్

5 రాష్ట్రాల నుంచే 70 శాతం

వాటిలో మన రాష్ట్రం కూడా

వెల్లడించిన ఆర్థిక సర్వే


16


## ఒక ఆకాశం.. ముగ్గురు చంద్రులు

రేపు అద్భుత ఖగోళ ఘట్టం

150 ఏళ్ల తరువాత తొలిసారి

కళ్లారా చూడండి: శాస్త్రవేత్తలు

గ్రహణంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన ఆలయాల మూత


16


పగిడిద్ద రాజూ.. బైలెల్లినాడే



మేడారానికి పయనమైన పెళ్లికొడుకు... భక్తజన సంద్రమవుతున్న జాతర

రేపటి నుంచే తెలంగాణ కుంభమేళా.. లక్షలాదిగా తరలివస్తున్న భక్తులు


2


తెలంగాణ కుంభమేళా మేడారం జాతరలో గద్దెల వద్ద భక్తుల సందడి, పెళ్లికొడుకు పగిడిద్దరాజును గద్దెలకు తరలిస్తున్న దృశ్యం

# బీడీ కార్మికులకు జీఎస్టీ పోటు

పన్ను భారంతో కంపెనీల మూత

గణనీయంగా తగ్గిన పనిదినాలు

రోడ్డున పడిన మహిళా కార్మికులు



బీడీ చాటన్ చేస్తున్న కార్మికులు

ఆర్మూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను(జీఎస్టీ) బీడీ కార్మికుల పొట్ట కొడుతోంది! వారి ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కేంద్రం పొగాకుపై 5శాతం, తునికాకుపై 18శాతం, బీడీలపై 28శాతం జీఎస్టీ విధించడంతో కార్మికుల పనిదినాలు తగ్గిపోయాయి. గతంలో కార్మికులకు నెలలో అన్నిరోజులూ ఉపాధి లభించేది. జీఎస్టీ అమల్లోకి వచ్చాక ఒక్కొక్కరికి 10, 12 రోజులు మాత్రమే పని దొరుకుతోంది! గతంలో వెయ్యి బీడీల మీద రూ.16.31 ఎక్సైజ్ డ్యూటీ చెల్లించేవారు. జీఎస్టీ వల్ల ఆకు, బీడీలు, తంబాకుపై పన్ను పెంచడంతో కంపెనీలు వెయ్యి బీడీల మీద రూ.220 నుంచి రూ. 270 వరకు చెల్లించాల్సి వస్తోంది. ప్రజారోగ్యానికి హాని కలిగించే పొగాకు ఉత్పత్తుల వినియోగం తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్రం ఏటా బడ్జెట్‌లో పన్ను పెంచుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం తర్వాత మహిళలకు ప్రధానంగా ఉపాధి కల్పిస్తోంది బీడీ పరిశ్రమే. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో సుమారు రెండున్నర లక్షల మంది, తెలంగాణ వ్యాప్తంగా 7 లక్షల మంది బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. రాష్ట్రంలో చిన్నా, పెద్ద కలిపి సుమారు 70 బీడీ కంపెనీల శాఖలు ఉన్నాయి. ఒకవైపు పన్ను పెంచడం, మరోవైపు వినియోగం తగ్గేలా చర్యలు తీసుకోవడంతో పరిశ్రమలు మూతపడుతున్నాయి. దీంతో చాలా మందికి ఉపాధి లభించడం లేదు. గతంలో బీడీ కార్మికులకు నగదు చెల్లించేవారు. వెయ్యి బీడీలకు రూ.173.46 కూలీ చెల్లిస్తారు. పెద్దనోట్ల రద్దు తర్వాత బ్యాంకుల ద్వారానే చెల్లింపులు జరుపుతున్నారు. దీంతో ఎంత వచ్చిందనే


మిగతా 5వ పేజీలో...











# కృష్ణ కొల్లేరైంది

## 1000కి పైగా అక్రమ చేపల చెరువులు

- సర్కారు భూముల్లోనూ తవ్వేశారు!
- కృష్ణా, కాల్వల నీటినీ తోడేస్తున్నారు
- 1200 ఎకరాల్లో చెరువుల దందా
- గద్వాల జిల్లాలో 'చేపల' మాఫియా
- స్థానిక నేతల అండదండలు
- నిషేధిత క్యాట్‌ఫిష్ జోరుగా సాగు



ఇటిక్యాలలో సాగవుతున్న రొయ్యల చెరువు

గద్వాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ కొల్లేరవుతోంది! అదేంటి అనుకుంటున్నారా? అవును అక్రమ చేపల చెరువులతో జోగులాంబ గద్వాల జిల్లాలో కృష్ణమ్మ కాస్తా కొల్లేరవుతోంది! ఏపీ నేతల పెట్టుబడులకు స్థానిక నాయకుల సహకారం తోడవడంతో ఈ దందా మాఫియాలా మారింది. జిల్లాలో 1000కి పైగా అక్రమ చెరువులు ఉండడం గమనార్హం! ఏటా ఈ చెరువుల నుంచి రూ.200 కోట్ల విలువైన చేపలు, రొయ్యలను విదేశాలతో పాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. మామూళ్ల మాటున దశాబ్దకాలంగా ఈ అక్రమ చెరువుల వ్యాపారం గుట్టుచప్పుడు కాకుండా సాగిపోతోంది! మరో విస్మయకర విషయం ఏంటంటే.. ఈ చెరువుల్లో నిషేధిత క్యాట్ ఫిష్‌తో పాటు ఫంగస్, తెల్ల చేప, రొయ్యలను పెంచుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కొల్లేరు సరస్సులో ఉన్న చేపల చెరువులను ప్రభుత్వ ఆదేశాల మేరకు ధ్వంసం చేశారు. కొల్లేరు సరస్సు కింద చేపల సాగు చేసే వందకుపైగా కుటుంబాలు జోగులాంబ గద్వాల జిల్లాలోని కృష్ణానది, జూరాల


మిగతా 5వ పేజీలో...


## ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ హాజరు

అమలు యోచనలో విద్యాశాఖ

హాజరు అవకతవకలకు చెక్

పలు స్కూళ్లలో కానరాని రిజిస్టర్

హెచ్‌ఎంలు, టీచర్ల అవగాహన

సంఘాల నేతల ఇష్టారాజ్యం

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లకుండానే హాజరు వేయించుకునే ప్రభుత్వ ఉపాధ్యాయులకు సర్కారు ఇక చెక్ పెట్టనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు ప్రక్రియను గాడిలో పెట్టేందుకు పాఠశాల విద్యాశాఖ విప్లవాత్మకమైన చర్యకు శ్రీకారం చుట్టింది. ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. 2018-19 విద్యా సంవత్సరం నుంచి దీనిని అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఈ ప్రక్రియలో భాగంగా హాజరు నమోదుకు ప్రత్యేకంగా పాఠశాల వెబ్‌సైట్‌ను రూపొందించడంతోపాటు మొబైల్


మిగతా 2వ పేజీలో...



# కామాఖ్య కాళి



పరంజ్యోతి Paramjyothi

నీలాచల పర్వతం మీద కామాఖ్యా దేవి అవతరించి ఉన్నది. సతీదేవి శరీరంలోని వివిధ భాగాలు పడిన చోట్లు మహాశక్తి క్షేత్రాలుగా అలలారుతున్నాయి. అలా నీలాచల పర్వతం మీద సతీదేవి యోని పీఠం ఉన్నది. లలితాదేవి చేత పునరుజ్జీవితుడైన మన్మథుడు అమ్మవారి పట్ల కృతజ్ఞతతో ఆ పీఠంలో అమ్మవారిని ప్రతిష్ఠించాడు. భారతదేశంలో కాళీదేవికి సంబంధించిన క్షేత్రాలలో కామాఖ్య అతి ముఖ్యమైనది. కాళికా పురాణంలో కామాఖ్య కాళి తంత్రంలో అమ్మవారి శక్తిని గురించి, ఆమె మహిమల గురించి ఎన్నో అద్భుతమైన విశేషాలు కనిపిస్తున్నాయి. ఆ తల్లిని ఆరాధించి ఎందరో వ్యక్తులు సిద్ధులయ్యారు. నీలాచల పర్వతం మీద ఇప్పటికీ ఎందరో కాళీ మంత్ర సిద్ధులు సంచరిస్తుంటారు. నరకాసురుడు ఈ కామాఖ్యాదేవిని ఆరాధించి ఎన్నో సిద్ధశక్తులను సాధించాడు. అయితే ధర్మబద్ధం కాని వామాచార సాధనలను చేయడం వల్ల ఆ తల్లి ఆగ్రహానికి గురయ్యాడు. మహర్షి వశిష్ఠుని ప్రార్థనతో.. అధర్మ పరుడైన నరకుని రాజ్యం నుండి కామాఖ్య కాళి మాయమయ్యింది. ఆ తర్వాత సుమారు 300 సంవత్సరాల పాటు అమ్మవారు కైలాసంలో ఉన్నదని యోగినీ తంత్రంలో ఉంది. నరకాసురుని మరణవేళ ఆమెను కృష్ణుని ప్రక్కన చూసిన నరకుడు.. తాను ఉపాసించిన దేవతే తన తప్పులకు తనను శిక్షిస్తోందని తెలుసుకున్నాడు. ఆ తరువాత కృష్ణుడు మళ్లీ నీలాచలం మీద కామాఖ్యాదేవిని పునఃప్రతిష్ఠించి ఆ దేవతను పూజించాడు. సంవత్సరంలో ఒకసారి ఆమె రజస్వల అవుతుందని చెబుతారు. ఆ మూడు రోజులూ గుడిని మూసేసి.. ఆ రోజులలో స్రవించే రక్తాన్ని వస్త్రాలకు అద్ది భక్తులకు ఇస్తారు. కామాఖ్య కాళిని దర్శించినా, ఆమెను పూజించినా శీఘ్రంగా కాళీదేవి అనుగ్రహం పొందవచ్చు.

-మాతా రమ్యానంద భారతి



గణతంత్ర దినోత్సవ ప్రసంగం మధ్యలో 'ఇట్స్ ఫన్నీ' అంటూ వెనక్కి తిరిగి నవ్వుతున్న వరంగల్ అర్బన్ కలెక్టర్ ఆమ్రపాలి (ఫైల్)

## ఇదేం పద్ధతి!?

- కలెక్టర్ గౌరవాన్ని కాపాడాలి
- వరంగల్ అర్బన్ కలెక్టర్ ఆమ్రపాలికి సీఎస్ మందలింపు

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం రోజున జెండా వందనం తర్వాత వరంగల్ అర్బన్ కలెక్టర్ ఆమ్రపాలి కాట ప్రసంగించిన తీరుపై ప్రభుత్వం నారాజ్ అయింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ ఫోన్‌లో ఆమ్రపాలిని మందలించారు. 'ఇదేం పద్ధతి' అంటూ ఆయన కోప్పడగా.. తెలుగు పదాలు పలకడంలో ఇబ్బంది ఎదురైందని, ఉద్దేశపూర్వకంగా తప్పు చేయలేదని ఆమ్రపాలి బదులిచ్చినట్లు తెలిసింది. ఇకముందు ఇటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని, జిల్లా కలెక్టర్ పదవికి ప్రజల్లో గౌరవ భావం ఉందని, దానిని సడలకుండా చూసుకోవాలని హితవు పలికినట్లు తెలిసింది. గణతంత్ర దినోత్సవ ప్రసంగం మధ్యలో ఆమ్రపాలి పలుమార్లు తడబడ్డారు. మధ్య మధ్యలో అసందర్భంగా నవ్వారు. మరుగుదొడ్ల నిర్మాణంలో ప్రగతి గురించి ప్రస్తావన వచ్చినప్పుడు ఏకంగా వెనక్కి తిరిగి తనలో తాను నవ్వుకుంటూ 'ఇట్స్ ఫన్నీ' అని వ్యాఖ్యానించారు. అదంతా మైకుల ద్వారా ప్రసారమైంది. గణతంత్ర దినోత్సవం రోజున జిల్లా కలెక్టరుగా ఇదేం పని అంటూ సోషల్ మీడియాలో విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం స్పందించింది.



బెల్లం ప్రసాదం స్వీకరిస్తున్న లండన్ యువతి



పగిడిద్దరాజును పూలతో అలంకరిస్తున్న మహిళలు

# బైలెల్లిన పెళ్లికొడుకు

## మేడారానికి పయనమైన పగిడిద్దరాజు.. భక్తజన సంద్రమవుతున్న జాతర

- రేపటి నుంచే తెలంగాణ కుంభమేళా
- లక్షలాదిగా తరలివస్తున్న భక్తులు
- ఇప్పటికే మొక్కులు అప్పగించిన అరకోటి మంది
- 2న కుటుంబసమేతంగా రానున్న సీఎం కేసీఆర్

భూపాలపల్లి/గుండాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతర.. తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం మహాజాతర.. ప్రారంభానికి ముందే భక్తజన సంద్రంగా మారుతోంది. కన్నెపల్లి నుంచి సారలమ్మను బుధవారం గద్దెకు చేర్చడంతో తొలిఘట్టం మొదలయ్యే ఈ జాతర కోసం భక్తులు ముందస్తుగానే లక్షలాదిగా మేడారం బాట పడుతున్నారు. జాతర చుట్టూ పది కిలోమీటర్ల దాకా ఎటు చూసినా జనసందోహమే కనిపిస్తోంది. 2016లో జరిగిన గత జాతరకు కోటి మంది భక్తులు రాగా.. ఈసారి ఆ సంఖ్య కోటి యాభై లక్షలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ జాతరను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇప్పటికే రూ.80.55 కోట్ల నిధులు కేటాయించి జాతరలో వివిధ అభివృద్ధి పనులు, హైటెక్ హంగులతో ఏర్పాట్లు, భద్రతా చర్యలు చేపట్టింది. నాలుగు రోజులపాటు జరగనున్న మేడారం మహా జాతరలో ఈ నెల 31వ తేదీన సాయంత్రం సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలకు చేరడంతో తొలిఘట్టం మొదలవుతుంది. ఫిబ్రవరి 1వ తేదీన సాయంత్రం చిలుకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెకు చేరుకుంటుంది. 2వ తేదీన రోజంతా భక్తులు తల్లులకు మొక్కులు చెల్లించుకుంటారు. 3వ తేదీన సాయంత్రం తల్లులు తిరిగి వనప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది. కాగా పగిడిద్దరాజును ఆరెం వంశీయులు పెళ్లికొడుకుగా ముస్తాబు చేసి.. సోమవారం మేడారానికి పయనమయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలోని, యాపలగడ్డ గ్రామానికి చెందిన ఆరెం వంశానికి చెందిన ఆదివాసీలు భూపాలపల్లి జిల్లా మేడారం జాతరలో సమ్మక్కతో వివాహం జరిపించేందుకు పగిడిద్దరాజును తీసుకెళ్తారు. సుమారు 70 కిలోమీటర్ల దూరం కాలినడకనే వెళ్తారు. బుధవారం మేడారం చేరుకున్న అనంతరం, చిలకలగుట్ట నుంచి, సమ్మక్కను గద్దెలకు తరలిస్తారు. కాగా వన దేవతలను దర్శించుకునేందుకు జనం పోటెత్తుతున్నారు. ఈ నెలలో వరుసగా సంక్రాంతి సెలవులు రావడంతో ముందస్తుగా మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు మేడారం దారి పట్టారు. ఆదివారం, బుధవారాల్లో లక్ష నుంచి 3లక్షల వరకు భక్తులు వస్తుండగా, ఇతర రోజుల్లో రోజుకు 50వేల నుంచి లక్షకుపైగా భక్తులు వస్తున్నారు. జాతర ఏర్పాట్లు మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 45లక్షల మంది భక్తులు హాజరైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.



జంపన్న వాగు వద్ద కల్యాణకట్టల వెనుక ఎకరం స్థలంలో భక్తుల కోసం అటవీ శాఖ ఏర్పాటు చేసిన 'ఫారెస్ట్ గుడారాలు' ఇవే. 9553142346 నంబరులో సంప్రదించి ఈ గుడారాలు బుక్ చేసుకోవచ్చు.

### మేడారానికి కేంద్ర గిరిజన మంత్రి

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరకు కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జువల్ ఓరం రానున్నట్లు రాష్ట్ర మంత్రి అజ్మీరా చందూలాల్ తెలిపారు. ఓరంతోపాటు సహాయ మంత్రులు జస్వన్ సిన్హా సుమన్ భాయి బాబోర్, సుదర్శన భగత్ ఫిబ్రవరి 1న వస్తారని చెప్పారు. మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు, సీఎం దేవేంద్ర ఫడణవీస్, ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్‌సింగ్ హాజరయ్యే అవకాశం ఉందన్నారు. జాతర పరిసర ప్రాంతాల్లో 11 ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి తప్పిపోయిన వారి వివరాలను తెలిపే ఏర్పాట్లు చేశామన్నారు.

### 2న సీఎం, ఉప రాష్ట్రపతి రాక

మేడారం మహాజాతరకు ఫిబ్రవరి 2న సీఎం కేసీఆర్ సతీ సమేతంగా వస్తున్నారు. 2012లో ఉద్యమ సమయంలో కేసీఆర్ మహాజాతరలో పాల్గొని మొక్కులు చెల్లించారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక 2016లో మహాజాతర జరిగింది. అప్పుడు కేసీఆర్ పర్యటన ఖరారైనా చివరి నిమిషంలో రద్దయింది. ఇపుడు ఫిబ్రవరి 2న సీఎం కేసీఆర్‌తోపాటు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా వస్తున్నారు.

## పిల్లకాలువ కాదు గోదారే!




గోదావరి బక్కచిక్కింది. ఇలా పిల్ల కాలువలా మారిపోయింది. సరైన వర్షాలు లేకపోవడం, గోదావరి ఎగువన కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉండడంతో నదీ ప్రవాహం తగ్గుముఖం పట్టింది. నవంబరు నుంచే ఈ ప్రభావం స్పష్టంగా కానరాగా జనవరి నెల చివరిలోనే పరిస్థితి మరింత దిగజారింది. గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రం 6 గంటలకు 5.8 అడుగుల వద్ద ఉంది. గత ఏడాది ఇదే రోజున 6.8 అడుగులుండడం గమనార్హం.

- భద్రాచలం

# జెండా దిమ్మెపై తల.. మరోచోట మొండెం

- నల్లగొండలో దారుణ హత్య



జెండా దిమ్మెపై రమేశ్ తల

నల్లగొండ క్రైం, జనవరి 29: నల్లగొండలో మరో దారుణ హత్య! మునిసిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి భర్త శ్రీనివాస్ హత్య మరువకముందే ఇంకో ఘటన వెలుగులోకి వచ్చింది. సోమవారం తెల్లవారుజామున జెండా దిమ్మెపై మొండెం లేని తల పడి ఉండటం కలకలం రేపింది. కనగల్ మండల కేంద్రానికి చెందిన పాలకూరి రమేశ్(28) ట్రాక్టర్, ఆటో డ్రైవర్‌గా పనిచేసేవాడు. భార్యతో విభేదాల కారణంగా కొంతకాలం దూరంగా ఉన్నాడు. మూడునెలల క్రితమే భార్యను తన ఇంటికి తీసుకొచ్చి కలిసి జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి మందుల కోసం రమేశ్ బయటికి రాగా.. మిత్రులు ఫోన్ చేసి పిలవడంతో నల్లగొండకు వచ్చాడు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు భారత్‌గ్యాస్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో రమేశ్ గొంతుకోసి తల, మొండెంను వేరుచేశారు. తలను పట్టణంలోని బొట్టుగూడలో జెండా దిమ్మె మీద పెట్టి పారిపోయారు. సోమవారం తెల్లవారుజామున తలను చూసి భయాందోళనలకు గురైన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. తలను పరిశీలించి మొండెం కోసం సుమారు రెండుగంటలపాటు పట్టణంలో వెతికారు. భారత్ గ్యాస్ సమీపంలో మొండెం కనిపించడంతో దాన్ని తలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు నల్లగొండ డీఎస్పీ సుధాకర్ తెలిపారు.

## లండన్‌లో జగిత్యాల యువకుడి గల్లంతు

- కొడుకు ఆచూకీ కోసం తల్లిదండ్రులు వేడుకోలు



రమేశ్

మేడిపల్లి, జగిత్యాల 29: ఉన్నత చదువు కోసం విదేశాలకు వెళ్లిన కొడుకు నుంచి మూడేళ్లుగా ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కొడుకు ఆచూకీ తెలుసుకునేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరుతున్నారు. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని కాచారం గ్రామానికి చెందిన రాపర్తి వెంకటి, భూమక్కల కుమారుడు రమేశ్(31) ఎంబీఏ పూర్తి చేశాడు. ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తూ యాజమాన్యం సహకారంతో 2010లో లండన్ వెళ్లాడు. ఏడాదిపాటు చదివితే లండన్‌లో ఉద్యోగం వస్తుందని అక్కడి నుంచి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలిపాడు. రమేశ్ చదువు కోసమని అతని తల్లిదండ్రులు అప్పు చేసి డబ్బు పంపించారు. ఆ తర్వాత జనవరి 10, 2015న మరో రూ.2లక్షలు పంపించాలని రమేశ్ కోరగా తమ వద్ద అంత డబ్బు లేదని అతని తల్లిదండ్రులు చెప్పారు. అప్పటి నుంచి రమేశ్ వారికి ఫోన్ చేయలేదు. రమేశ్ నంబర్‌కు ఫోన్ చేస్తే వేరే వ్యక్తులు మాట్లాడుతూ ఈ నంబర్‌కు మరోసారి ఫోన్ చేయవద్దని చెబుతున్నారని అతని తల్లిదండ్రులు చెబుతున్నారు. రమేశ్ వీసా గడువు డిసెంబర్ 2011తో ముగుస్తుందని వారు చెప్పారు. రమేశ్ ఆచూకీ తెలుసుకునేందుకు ప్రభుత్వం సహకరించాలని వేడుకుంటున్నారు.

# ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ హాజరు!

(మొదటిపేజీ తరువాయి...)

యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. దీంతో ఉపాధ్యాయుల హాజరు ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ ద్వారా జరగనుంది. సెలవు తీసుకోదలచిన ఉపాధ్యాయులు యాప్ ద్వారా సమాచారం అందిస్తే సరిపోతుంది. అది నేరుగా విద్యాశాఖ ఉన్నతాధికారులకు చేరుతుంది. అదే విధంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు కూడా ఈ యాప్ ద్వారానే హాజరు వేసుకుంటే సరిపోతుంది. దీంతోపాటే ప్రధానోపాధ్యాయులు వెబ్‌సైట్‌లో హాజరును ప్రతిరోజూ క్రమం తప్పకుండా నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ ఆన్‌లైన్ హాజరు విధానం అమలును విద్యాశాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి ధ్రువీకరించారు. ఇందుకు సంబంధించి చర్చలు జరుగుతున్నట్లు, త్వరలోనే సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆ అధికారి పేర్కొన్నారు.

### విస్తృత తనిఖీలకు చర్యలు..

ప్రభుత్వ పాఠశాలల్లో ఆన్‌లైన్ హాజరు విధానం అమలు చేయడం వల్ల ఉపాధ్యాయులు పాఠశాలకు రాకుండా హాజరు వేయించుకుంటే ఆ విషయం తనిఖీల్లో సులువుగా బయటపడుతుందని అధికారులు తెలిపారు. ఈ విధానం అమలు తర్వాత పాఠశాలల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పలు అంశాలపై బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో అధికారులు విస్తుపోయే నిజాలు బయటపడినట్లు సమాచారం. ముఖ్యంగా ఉపాధ్యాయుల హాజరు విధానంలో అనేక అవకతవకలు జరిగినట్లు బృందాలు గుర్తించాయి. కొన్ని పాఠశాలల్లో హాజరు రిజిస్టర్‌ను సరిగా నిర్వహించడం లేదని, అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అవగాహన కుదుర్చుకుని ఇష్టానుసారంగా సెలవులు తీసుకుంటున్నారని వెల్లడైంది. దీంతో పాఠశాలల్లో తరగతుల నిర్వహణ ఇబ్బందిగా మారింది. సాక్షాత్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి ఇటీవల వరంగల్ జిల్లాలో ఓ పాఠశాలను తనిఖీ చేసిన సందర్భంగా.. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను సరిగా నిర్వహించని విషయాన్ని పసిగట్టారు. రోజుల తరబడి ఉపాధ్యాయులు హాజరు పట్టికలో సంతకం చేయకపోవడాన్ని, ఆ రోజు పాఠశాలకు రాని ఉపాధ్యాయుల లీవ్ లెటర్లు కూడా లేకపోవడాన్ని ఆయన గుర్తించారు. హాజరులో ఈ అవకతవకలు స్వయంగా విద్యాశాఖ మంత్రికే ఎదురుకావడం గమనార్హం. ముఖ్యంగా కొన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఇష్టారాజ్యంగా సెలవులు తీసుకుంటున్నట్లు తనిఖీల్లో బయటపడింది. ప్రతి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు కేలండర్ ఇయర్‌లో సాధారణ సెలవులు అదనంగా ఉంటాయి. అయితే వీరు.. వాటికన్నా అదనంగా సెలవులు వినియోగించుకుంటున్నట్లు తేలింది.

### ఆర్‌సీ నం. 83లో మార్పులు స్వల్పమే..

హాజరులో అవకతవకలకు చెక్ పెట్టేందుకు విద్యాశాఖ పలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. ఇందులో భాగంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సెలవు మంజూరు అధికారాన్ని ప్రధానోపాధ్యాయుల నుంచి తొలగించి ఎంఈవోలకు ఇస్తూ ఇటీవల ఆర్‌సీ నం.83ను జారీ చేసింది. అయితే దీనిని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించాయి. వారి ఆందోళన నేపథ్యంలో జీవోలో స్వల్ప మార్పులు చేసేందుకు అధికారులు అంగీకరించారు. సెలవు మంజూరు అధికారం మళ్లీ హెచ్ఎంలకు ఇవ్వాలని నిర్ణయించారు. పలు నిబంధనల్ని అమలు చేయనున్నారు. హాజరు రిజిస్టర్‌ను హెచ్ఎంలతోపాటు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం, ఎంఈవో వద్ద కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉపాధ్యాయుల హాజరు, సెలవులను కచ్చితమైన సమయంలోగా స్కూల్ కాంప్లెక్స్‌కు పాఠశాల హెచ్ఎం తెలియజేయాల్సి ఉంటుంది. హాజరు మాత్రమే కాకుండా మొబైల్ ఎస్ఎంఎస్ ద్వారా కూడా వివరాలు తెలియజేయాల్సి ఉంటుంది. ఉపాధ్యాయులు పాఠశాలకు రాకపోయినా హాజరు వేయించుకుంటే తనిఖీల్లో బయటపడే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

## లోకం తీరు




ఈసారి జనాలు తిరగబడతారేమో.. ఎందుకైనా మంచిదని 'బౌన్సర్ల'ను ఏర్పాటు చేశా..

### ఉష్ణోగ్రతలు

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 6.8 | 31.0 |
| రామగుండం | 13.2 | 31.0 |
| నిజామాబాద్ | 15.9 | 31.6 |
| వరంగల్ | 16.5 | 29.0 |
| హైదరాబాద్ | 16.8 | 30.0 |

### ఆదిలాబాద్‌లో నేడూ శీతల పవనాలు!


హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలిగాలులు కొనసాగుతున్నాయి. ఆదిలాబాద్‌లో సోమవారం పలుచోట్ల శీతల పవనాలు నమోదయ్యాయని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుందని పేర్కొంది. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా సాధారణం కంటే తక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు కొనసాగాయి. భద్రాచలం, ఖమ్మంలలో 4 డిగ్రీలు, రామగుండం, మెదక్‌లలో 3 డిగ్రీల మేరకు సాధారణం కంటే తక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఆదిలాబాద్‌లో 6.8 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది.



### రజనీ, కమల్‌కు చేతులు కాలితేగానీ తెలీదు

రజనీ, కమల్ రాజకీయాల్లో రాణించలేరు. రాజకీయాలంటే సినిమాల్లో నటించినంత సులువు కాదు. అగ్నిలాంటి రాజకీయాల్లో చేతులు పెట్టి కాల్చుకుంటేగానీ ఆ ఇద్దరికీ ఆ కష్టమేంటో అర్థంకాదు.

- భారతీరాజా, దర్శకుడు



### బెడ్‌పై నుంచి ట్వీట్ చేస్తుంటా

ప్రజలకు ఎల్లప్పుడూ సోషల్ మీడియాలో అందుబాటులో ఉంటాను. ఒక్కోసారి పడుకునేప్పుడు కూడా ట్వీట్ చేస్తుంటా. బ్రేక్‌ఫాస్ట్, లంచ్ చేసేప్పుడు, ఎప్పుడు సమయం దొరికితే అప్పుడు ట్వీట్ చేస్తా. రోజంతా ఏదో కార్యక్రమ ంలో బిజీగా ఉండటం వల్లే ఇలా చేయాల్సి వస్తోంది.

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

### నేటి పెట్రో ధరలు (లీ.)

| పెట్రోల్ | డీజిల్ |
|---|---|
| పాత ధర రూ.77.13 | పాత ధర 69.46 |
| కొత్త ధర రూ.77.22 | కొత్త ధర 69.53 |
| పెరుగుదల 0.09 పైసలు | పెరుగుదల 0.07 పైసలు |



### మధుమేహంతో జ్ఞాపకశక్తి క్షీణత!

లండన్, జనవరి 29: మధుమేహం ఉన్నవారికి దీర్ఘకాలంలో జ్ఞాపకశక్తి క్షీణించే ప్రమాదం ఉందని తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉంటే మెదడుకు రక్త ప్రసరణ తగ్గి పనితీరు మందగిస్తుందని, దాంతో జ్ఞాపకశక్తి కోల్పోయే అవకాశం ఉందని ఇంగ్లండ్‌కు చెందిన పరిశోధకులు చెప్పారు.



### నెలసరి అధిక రక్తస్రావానికి త్వరలో స్వస్తి!

లండన్, జనవరి 29: 'హెచ్ఐఎఫ్-1' అనే ప్రొటీన్ వల్లే నెలసరి సమయంలో అధిక రక్తస్రావం జరుగుతోందని యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్‌బర్గ్ పరిశోధకులు గుర్తించారు. ఈ ప్రొటీన్ తక్కువగా ఉత్పత్తి కావడం వల్ల సమస్య ఉత్పన్నమవుతోందని వెల్లడించారు. ఓ ఎలుకలో హెచ్ఐఎఫ్-1 ఉత్పత్తిని పెంచే ఔషధాన్ని ప్రవేశపెట్టగా రుతుస్రావం సమస్య తగ్గిందని వివరించారు.

# కలెక్టర్ ముందే ఆత్మహత్యాయత్నం

» సూర్యాపేటలో మహిళను అడ్డుకున్న సిబ్బంది

» కిరోసిన్ సీసాతో పాలమూరులో రైతు ఆందోళన

సూర్యాపేట క్రైం/ మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 29 : సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఓ మహిళ ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. సూర్యాపేట మండలంలోని ఇమాంపేట ఆదర్శ పాఠశాలలో కొన్ని నెలల క్రితం కేర్‌టేకర్‌గా పని చేసి రాజీనామా చేసిన నాగిరెడ్డి ఝాన్సీ రాణి తిరిగి తనకు కేర్‌టేకర్ ఉద్యోగం ఇవ్వాలని జిల్లా అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల తనను పాఠశాల ప్రిన్సిపాల్ లైంగికంగా వేధించడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోలేదని ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వెళ్లారు. కలెక్టర్‌ను కలిసేందుకు చాంబర్‌లోకి వెళ్లిన ఝాన్సీ రాణి తనవెంట తెచ్చుకున్న కిరోసిన్‌ను ఒంటిపై పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా, గమనించిన కలెక్టర్ సురేంద్ర మోహన్ వెంటనే అప్రమత్తమై సిబ్బందిని పిలిపించి అడ్డుకున్నారు. మరోవైపు, తనకున్న ఏడు గుంటల భూమి కబ్జాకు గురైందని, కబ్జాదారుల చెర నుంచి విడిపించి తనకు పట్టా చేయడం లేదంటూ ఓ రైతు కిరోసిన్ సీసాతో కలెక్టరేట్ వద్ద ఆత్మహత్య చేసుకుంటానని ఆందోళన చేశాడు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం చిలివేరుకు చెందిన రైతు ఈశ్వర రెడ్డి తన ఏడు గుంటల భూమిని సమీప రైతులు కబ్జా చేశారని, పలుమార్లు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. సోమవారం జేబులో కిరోసిన్ సీసాతో ఆయన కలెక్టరేట్‌కు వచ్చాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పడంతో అక్కడే ఉన్న కలెక్టరేట్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఈశ్వర్‌రెడ్డి చేతిలో ఉన్న కిరోసిన్ సీసాను లాక్కున్నారు. భూమి కబ్జాపై విచారణ జరిపిస్తానని ఈశ్వర్ రెడ్డికి కలెక్టర్ నచ్చజెప్పి పంపారు. వెంటనే ఫిర్యాదును డీఆర్వోకు అందజేసి, సమస్యను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు.


కిరోసిన్ పోసుకుంటున్న ఝాన్సీరాణి

# ట్రాక్టర్లతో మహాధర్నా

» దీర్ఘకాలిక రుణాలపై ప్రభుత్వం 6% వడ్డీ రాయితీ భరించాలని డిమాండ్

హుజూర్‌నగర్/రాజపేట, జనవరి 29: రైతుల దీర్ఘకాలిక రుణాలపై.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ప్రభుత్వం 6 శాతం వడ్డీ రాయితీని భరించాలంటూ సూర్యాపేట, యాదాద్రి జిల్లాల రైతులు, అఖిలపక్షాలు ట్రాక్టర్లతో ఆందోళనలు చేపట్టాయి. హుజూర్‌నగర్‌లో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో నిర్వహించాయి. మహాధర్నా చేపట్టాయి. సహకార సంఘాల చైర్మన్లు, అఖిలపక్షాల నాయకులు మాట్లాడుతూ.. దీర్ఘకాలిక రుణాలకు సంబంధించి మూడు దశాబ్దాలుగా ప్రభుత్వమే వడ్డీ రాయితీని భరిస్తోందని గుర్తుచేశారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ సంప్రదాయానికి తెరపడిందని ఆరోపించారు. గత ప్రభుత్వాల మాదిరిగా రిబేట్ అందించాలని డిమాండ్ చేశారు. ట్రాక్టర్లు, గేదెలు, వ్యవసాయ మోటార్లు, గొర్రెలకు సంబంధించి ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోందని దుయ్యబట్టారు. అటు యాదాద్రి జిల్లా రాజపేట మండల కేంద్రంలో రైతులు ఇదే అంశంపై ట్రాక్టర్లతో రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. ఈ ధర్నాల్లో.. సహకార సంఘాల చైర్మన్లు, అఖిలపక్షాల నాయకులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్‌లో ట్రాక్టర్లతో రైతులు, అఖిలపక్షం రాస్తారోకో

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


ప్రతాప్‌రెడ్డి (ఫైల్)

మెట్‌పల్లి టౌన్, జనవరి 29: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం చౌలమద్దిలో అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. గడ్డం ప్రతాప్‌రెడ్డి (36) మూడెకరాల్లో వ్యవసాయం చేసి నష్టపోయాడు. 5 లక్షల రూపాయల వరకు అప్పులు పేరుకుపోవడంతో సోమవారం తన పొలంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

## 93 సబ్సిడీ గొర్రెల పట్టివేత

» ఆరుగురిపై కేసు నమోదు

కురవి, జనవరి 29: ప్రభుత్వం, పోలీసులు ఎన్ని కేసులు పెట్టినా సబ్సిడీ గొర్రెల రీసైక్లింగ్ ఆగడం లేదు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరడ క్రాస్‌రోడ్ వద్ద సోమవారం డీసీఎంలో తరలిస్తున్న 93గొర్రెలను పోలీసులు పట్టుకున్నారు. కేసముద్రం మండలం కోమటిపల్లి శ్రీకృష్ణ ప్రాథమిక గొర్రెల సహకార సంఘ సభ్యులైన పూజారి ఐలుమల్లు, కొమ్మనబోయిన ఐలయ్య, గొసుల కొమురయ్య, గొసుల ఐలయ్యలకు సబ్సిడీ ద్వారా ప్రభుత్వం అందించిన గొర్రెలను.. కృష్ణా జిల్లా వత్సవాయి మండలం దవ్వపల్లి గ్రామానికి చెందిన వ్యాపారి జాల రమేష్‌కు విక్రయించారు. గొర్రెలను డీసీఎం వ్యానులో కృష్ణా జిల్లాకు తరలిస్తుండగా కురవిలో పోలీసులు పట్టుకున్నారు. డీసీఎంలో 93 గొర్రెలు ఉండగా, గొర్రెల మధ్య తొక్కిసలాట జరిగి 20 మృత్యువాత పడ్డాయి. 73 గొర్రెలను స్వాధీనం చేసుకుని పశువైద్యాధికారికి అప్పగించారు. గొర్రెలను విక్రయించిన నలుగురు లబ్ధిదారులతో పాటు వ్యాపారి జాల రమేష్, డీసీఎం డ్రైవర్‌పై కేసులు నమోదు చేశారు.

## టీఎస్‌టీపీపీ నిర్మాణం 2020లో పూర్తి: ఈడీ దూబే

జ్యోతినగర్ (గోదావరిఖని) జనవరి 29: తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ పాజెక్టు (టీఎస్‌టీపీపీ) నిర్మాణాన్ని 2020లో పూర్తి చేస్తామని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దిలీప్ కుమార్ దూబే తెలిపారు. 2020 మే నెలలో 800 మెగావాట్ల మొదటి యూనిట్ ప్రారంభమవుతుందని, రెండో యూనిట్‌ను అదే ఏడాది నవంబర్‌లో పూర్తి చేస్తామని వివరించారు. సోమవారం టీఎస్‌టీపీపీ 2వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఆడిటోరియంలో జరిగిన వేడుకకు ఈడీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మిస్తున్న ప్రాజెక్టుకు సంబంధించి ఈ రెండేళ్లలో ప్రధానమైన నిర్మాణాలు మొదలయ్యాయని చెప్పారు.

# సుపరిపాలన కోసమే కొత్త పంచాయతీలు

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

» మే నాటికి 'యాదాద్రి' పూర్తి: అల్లోల

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: మారుమూల ప్రాంతాలకు కూడా సుపరిపాలనను చేరువ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పంచాయతీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. సోమవారం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హైదర్‌సాయి పేటలో రూ. 1.20 కోట్లలో చేపడుతున్న విద్యుత్ సబ్ స్టేషన్, మిషన్ కాకతీయ నాలుగో దశలో భాగంగా తిప్పారెడ్డి గూడెం వద్ద ఆకేరు నదిపై రూ.46.38 లక్షలతో చేపడుతున్న చెక్ డ్యాం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తిప్పారెడ్డి గూడెంలో జరిగిన సభలో ప్రసంగించారు. ఎన్నికల సమయంలో 500 జనాభా గల ప్రాంతాలను పంచాయతీలుగా ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీనిచ్చారని, ఈ మేరకు కొత్త పంచాయతీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. జిల్లాలో 173 కొత్త పంచాయతీల ఏర్పాటు కానున్నాయని అన్నారు. అనంతరం మండలంలోని 71 మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. యాదాద్రి ప్రధాన ఆలయ నిర్మాణం ఏప్రిల్ లేదా మే నాటికి పూర్తి కానుందని, దసరా నాటికి గర్భాలయ దర్శనాలు ప్రారంభమవుతాయని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. ప్రధానాలయ ముఖ మండపం, గోపుర నిర్మాణ పనులు పరిశీలించారు. వైటీడీఏ అధికారులు, ఇంజనీర్లు, స్థపతులు, శిల్పులతో పాటు సివిల్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కాగా, ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు జరిగే వేములవాడ రాజరాజేశ్వర స్వామి జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఇంద్రకరణ్ రెడ్డి ఆదేశించారు. జాతర ఆహ్వాన పోస్టర్, బ్రోచర్‌ను మంత్రి హైదరాబాద్‌లో ఆవిష్కరించారు.


తిప్పారెడ్డి గూడెం వద్ద ఆకేరు నదిపై చెక్‌డ్యాంకు శంకుస్థాపన చేస్తున్న తుమ్మల

# మట్టి తింటున్నాడని.. చిన్నారికి వాతలు

» నాలుగేళ్ల కుమారుడిపై కన్నతల్లి కర్కశం

భద్రాచలంటౌన్, జనవరి 29: చిన్నారి మట్టి తింటున్నాడన్న కోపంతో ఓ కన్నతల్లి కర్కశంగా ప్రవర్తించింది. బాలుడిని చితకబాదడమే కాకుండా గరిటె కాల్చి వాతలు పెట్టింది. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం జగదీష్ కాలనీలో జరిగిన ఈ ఘటన సోమవారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. పల్లపు లంకమ్మకు ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి. ఆమె భర్త గతేడాది మృతి చెందాడు. తన నాలుగేళ్ల కుమారుడు మట్టి తింటున్నాడని చితకబాది, గరిటెను కాల్చి శరీరంపై వాతలు పెట్టింది. విషయం బయటకు రావడంతో ఐసీడీఎస్‌కు కౌన్సిలర్ యశోద, అంగన్‌వాడీ టీచర్లు ఆమెకు కౌన్సెలింగ్ నిర్వహించారు. లంకమ్మ మానసిక పరిస్థితి సరిగా లేదని, భర్త చనిపోవడం, ఆదాయం లేకపోవడంతో పిల్లలను చీటికీ మాటికీ చితకబాదుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో బాలుడిని ఖమ్మంలోని చైల్డ్‌కేర్‌లో ఉంచాలని అధికారులు నిర్ణయించారు.


బాలుడి శరీరంపై వాతలు



# చంపి ఆపై తగలబెట్టారు?

» సూర్యాపేట జిల్లాలో యువతి దారుణహత్య


అన్నపూర్ణ(ఫైల్)

నాగారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల క్రితం అదృశ్యమైన యువతి దారుణ హత్యకు గురైంది. ఆమెను చంపిన గుర్తుతెలియన వ్యక్తులు.. మృతదేహాన్ని కాల్చివేశారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నాగారం మండలం విజయనగర్ కాలనీలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. అడిమయ్య, లక్ష్మమ్మ దంపతులకు ఐదుగురు కుమార్తెలు. నాలుగో కుమార్తె అన్నపూర్ణ.. తిరుమలగిరిలో కంప్యూటర్ శిక్షణ పొందుతోంది. ఈ నెల 26న ఉదయం ఫోన్ మాట్లాడుతూ బయటకు వెళ్లిన అన్నపూర్ణ తిరిగి ఇంటికి రాలేదు. అయితే.. సోమవారం ఉదయం కాలనీ పరిధిలోని ఎస్సారెస్పీ పిల్ల కాల్వ వద్ద గుర్తుతెలియని శవం ఉందని సమాచారం అందించడంతో సీఐ రవీందర్ అక్కడికి చేరుకున్నారు. విషయం తెలిసి.. మృతురాలి తల్లి లక్ష్మమ్మ, కుటుంబీకులు సంఘటనా స్థలానికి చేరుకుని చెప్పులు, కాళ్ల పట్టీలను గుర్తించి మృతురాలు తమ కూతురే అని నిర్ధారించారు. ఏఎస్పీ ఇస్మాయిల్, డీఎస్పీ నాగేశ్వర్‌రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతురాలి కాల్‌డేటా ప్రకారం అసలైన నేరస్థులను గుర్తించి త్వరలోనే పట్టుకుంటామని వారు తెలిపారు. కాగా.. అన్నపూర్ణను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో సూర్యాపేట - జనగాం రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

# సింగరేణి పని తీరు బాగుంది

» కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి ప్రశంస

మంచిర్యాల/గోదావరిఖని, జనవరి 29, (ఆంధ్రజ్యోతి): సింగరేణి పనితీరు, ప్రగతి పట్ల కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి సంతృప్తి వ్యక్తం చేస్తూ సంస్థ సీఎండీ శ్రీధర్‌ను ప్రశంసించారు. మూడు రోజులుగా సింగరేణిలో కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి సుశీల్‌కుమార్ పర్యటిస్తున్నారు. సోమవారం సింగరేణి సీఎండీ శ్రీధర్‌తో కలిసి మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పెగడపల్లి వద్ద సింగరేణి నిర్మించిన 1200 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా కొత్త భవన సముదాయానికి ఆయన ప్రారంభోత్సవం చేశారు. కంట్రోల్ రూం, సర్వీస్ బిల్డింగ్‌ను పరిశీలించారు. సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం, కొత్తగా నిర్మించనున్న 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ గురించి సింగరేణి అధికారులతో చర్చించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు-1, 2లను సందర్శించి అక్కడ ఉత్పత్తి జరుగుతున్న విధానాలను పరిశీలించారు.


కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న కోల్ సెక్రెటరీ సుశీల్‌కుమార్, సింగరేణి సీఎండీ శ్రీధర్, డైరెక్టర్లు





సమావేశంలో మాట్లాడుతున్న మట్టుపల్లి మోహన్

## సీఏ ఐపీసీసీలో సత్తా చాటిన 'మాస్టర్ మైండ్స్'

» జాతీయ స్థాయిలో 8 ర్యాంకులు కైవసం

గుంటూరు (విద్య), జనవరి 29: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయిలో ప్రకటించిన సీఏ ఐపీసీసీ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు మరోసారి విజయ పరంపర కొనసాగించారని డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. సోమవారం గుంటూరులోని మెయిన్ క్యాంపస్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ స్థాయిలో తొలి 50 ర్యాంకుల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు ఎనిమిది ర్యాంకులు సాధించారని వివరించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో అత్యధిక ర్యాంకులు సాధించిన సంస్థగా మాస్టర్ మైండ్స్ మరోసారి చరిత్ర సృష్టించినట్లు పేర్కొన్నారు. తమ విద్యా సంస్థలకు చెందిన వి. వెంకట సౌజన్య జాతీయ స్థాయిలో 29వ ర్యాంకు, యుఎస్ఎన్ఎస్‌వి ఎం ప్రభాకర్ 30, టి. హేమంత్‌కుమార్ 36, వి. కళ్యాణి 39, వి. జ్యోత్స్న 43, ఎస్. కృష్ణ హేమంత్, జె రామకృష్ణ 44వ ర్యాంకు, ఎ లక్ష్మణ్ 50వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. మరో 1400 మంది సీఏ ఐపీసీసీలో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా సీఏ ఐపీసీసీ పరీక్షల్లో 35 వేల మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మొత్తం ర్యాంకుల్లో మాస్టర్ మైండ్స్ 16 శాతం కైవసం చేసుకుందని తెలిపారు. గత ఐపిసిసిలో మాస్టర్ మైండ్స్ 20 జాతీయ స్థాయి ర్యాంకులను కైవసం చేసుకుందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులను డైరెక్టర్ మోహన్ అభినందించారు.

## ప్రజా సేవకే పోలీసు పవర్

» శిక్షణ విభాగం ఐజీపీ చారుసిన్హా

» ఫ్రెండ్లీ పోలీసింగ్ కావాలి: ఐజీ నాగిరెడ్డి

మామునూరు/ఖమ్మం అర్బన్, జనవరి 29: విధి నిర్వహణలో పోలీసు పవర్‌ను ప్రజల సేవకు వినియోగించాలని రాష్ట్ర పోలీసు శాఖ శిక్షణ విభాగం ఐజీపీ చారుసిన్హా అన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీసు శిక్షణ కళాశాలలో సోమవారం సివిల్ పోలీసు కానిస్టేబుల్ శిక్షణార్థుల పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చారుసిన్హా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ పొందిన పోలీసు కానిస్టేబుళ్ల నుంచి ఆమె గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుల సేవలను సమాజంలోని అన్ని వర్గాలకు అందించాలన్నారు. సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలుకు కానిస్టేబుళ్లు పాటుపడాలని నార్త్ జోన్ ఐజీ నాగిరెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్లకు చెందిన 246మంది కానిస్టేబుళ్లు ఖమ్మంలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో సోమవారం శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఔట్ పాసింగ్ కార్యక్రమానికి ఐజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలు మరింత పెంపొందించే చర్యల్లో భాగంగా తెలంగాణ పోలీస్‌శాఖ నూతన సంస్కరణలు అమలు చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లకు త్వరలో పోస్టింగ్‌లు ఇస్తామని పేర్కొన్నారు.


శ్రీశైలం ఆలయంలో కవిత దంపతులు

## తెలుగు రాష్ట్రాలకు న్యాయం చేయాలి

» 'విభజన' హామీలన్నీ నెరవేర్చాలి: ఎంపీ కల్వకుంట్ల కవిత

శ్రీశైలం, జనవరి 29: కేంద్ర బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు న్యాయం చేయాలని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కవిత దంపతులు సోమవారం శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపీ కవిత ఆలయం వెలుపల విలేకరులతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌పై ఇరురాష్ట్రాలు ఆశగా ఎదురు చూస్తున్నాయన్నారు. ఈ చివరి బడ్జెట్‌లోనైనా విభజన చట్టంలోని హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హైకోర్టు విభజనకు సంబంధించి కేంద్రంపై తాము తీసుకొచ్చిన ఒత్తిడి ఓ కొలిక్కి వస్తోందని తెలిపారు. శ్రీశైలం మల్లన్నను కుటుంబ సమేతంగా దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. హైదరాబాద్-శ్రీశైలం రైలుమార్గం, కృష్ణానదిపై ఉన్న సరిహద్దు వంతెనకు మరమ్మతులు, రద్దయిన హైదరాబాద్ ఆర్టీసీ సర్వీసు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. తాము ఏ కొండకు వెళ్లినా.. తెలంగాణ ప్రజలు బాగుండాలని, ఇరురాష్ట్రాల ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని కోరుకుంటున్నామని కవిత చెప్పారు.

# ఏసీబీ వలలో సీనియర్ అసిస్టెంట్

» కొత్తగూడెం డీఈవో కార్యాలయంలో దాడులు


సైదులు

కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 29: లంచం తీసుకుంటూ భద్రాద్రి కొత్తగూడెం డీఈఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సైదులు సోమవారం ఏసీబీకి పట్టుబడ్డాడు. పాల్వంచకు చెందిన బత్తుల అంథోని ప్రైవేటు పాఠశాల రిజిస్ట్రేషన్ రెన్యువల్ కోసం డిసెంబర్ 2015న దరఖాస్తు చేసుకున్నాడు. జిల్లాల విభజన నేపథ్యంలో పాఠశాల భద్రాద్రి కొత్తగూడెం డీఈవో కార్యాలయ పరిధిలోకి రావడంతో అంథోని అక్కడి అధికారులు చుట్టూ తిరుగుతున్నాడు. ఈ క్రమంలో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సైదులు.. రెన్యువల్ కోసం రూ. 25 వేలు లంచం ఇస్తేనే ఫైల్ ముందుకు కదులుతుందని చెప్పడంతో చేసేది లేక ఆంథోని ఏసీబీని ఆశ్రయించాడు. వారి సూచన మేరకు ఆంథోని నగదును సీనియర్ అసిస్టెంట్ సైదులుకు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. విచారణలో రూ.25 వేలు లంచం అడిగింది వాస్తవమేనని సైదులు అంగీకరించడంతో కేసు నమోదు చేశారు.

● కమ్ముకున్న పొగమంచు


యాదాద్రి భువనగిరి జిల్లాలో సోమవారం పొగమంచు కమ్ముకోవటంతో 10గంటల వరకు రహదారులపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్- భూపాలపట్నం, యాదగిరిగుట్ట మార్గంలో దారి కనిపించక అవస్థలు పడ్డారు. - యాదాద్రి

# అవినీతి 'ప్లానింగ్'!

» రూ.66 కోట్ల అక్రమాస్తులు పోగేసిన 'వుడా' అడిషనల్ చీఫ్ అర్బన్ ప్లానర్

» 12చోట్ల ఏసీబీ సోదాలు.. ప్రదీప్ అరెస్ట్

అమరావతి, విశాఖ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ముప్పై మూడేళ్ల క్రితం రూ.3 వేల లోపు జీతగాడు. మూడు నెలల క్రితం కుమారుడి పెళ్లి ఖర్చు రూ.33లక్షలు, చదువు కోసం రూ.60లక్షలు ఖర్చు చేశాడు. ఈ ఆసామి జీతం సంగతి అటుంచితే, తన చేతివాటంతో ఆయన వెనకేసుకున్న ఆస్తుల మార్కెట్ విలువే సుమారు రూ.66కోట్లు ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేశారు. వీటికి లెక్కలు చూపకపోవడంతో 'వుడా' అడిషనల్ చీఫ్ అర్బన్ ప్లానర్ పసుపర్తి ప్రదీప్ కుమార్‌ను అరెస్టు చేశారు. కర్నూలు జిల్లా పత్తికొండలో సామాన్యకుటుంబంలో జన్మించిన ప్రదీప్ కుమార్, 1984లో అనంతపురం జిల్లా గుంతకల్లు మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగంలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరారు. పదోన్నతులను పొందుతూ, అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. గతంలో విజయవాడ, ఇప్పుడు విశాఖపట్నంలో పనిచేస్తుండగా.. భారీగా ఆస్తులను కూడబెట్టినట్టు ఏసీబీకి ఆయనపై ఫిర్యాదులు అందాయి. దీంతో సోమవారం తెల్లవారుజామున విశాఖ వాల్తేరు అప్‌ల్యాండ్స్‌లోని ప్రదీప్ కుమార్ ఇంట్లో సోదాలతో మొదలుపెట్టి.. బృందాలుగా రాష్ట్రమంతా ఏసీబీ అధికారులు తనిఖీలు సాగించారు. ఈ సోదాలు విశాఖలో ఐదు చోట్ల, అనంతపురంలోని అతని తండ్రి, అత్త, బామ్మర్ది ఇళ్లు, ఒంగోలులో తండ్రికి గల మరో నివాసం, హైదరాబాద్‌లోని మామ, భార్య సోదరి ఇళ్లు, విజయవాడలోని ప్రదీప్ ఇల్లు సహా మొత్తం 12 చోట్ల కొనసాగాయి. అనంతపురం, కడప, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, ఒంగోలు తదితర ప్రాంతాల్లో ఐదు వాణిజ్య, నివాస స్థలాలు, నాలుగు అపార్ట్‌మెంట్లలో ప్లాట్లు, 9.20 ఎకరాల వ్యవసాయ భూమిని ప్రదీప్ సంపాదించినట్టు ఏసీబీ గుర్తించింది. ఆడంబరాలకు ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చే తన భార్య కోసం వజ్రాల నెక్లెస్‌లు, బంగారు వడ్డాణాలను ఆయన కొనుగోలు చేశారు. ఇంట్లో భోజనానికి వెండి కంచాలు, నీరు తాగేందుకు వెండి గ్లాసులు దేవుడి ముందు వెలిగించే దీపం నుంచి బీరువా తాళాల వరకూ అన్నీ వెండితోనే ఉన్నాయి. తన తండ్రి వెంకట్రాజు పేరుతో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో స్థిరాస్తి, బామ్మర్ది కృష్ణమోహన్ పేరుతో విశాఖలోని మధురవాడలో ఇల్లును ప్రదీప్ కొనుగోలు చేశారని ఏసీబీ డీజీ ఆర్పీ ఠాకూర్ తెలిపారు.

### కుమారుడి ఖర్చు రూ.కోటి

ప్రదీప్ కుమార్, తన పెద్దకుమారుడిని స్కాట్లాండ్‌లో రూ.30లక్షలు ఖర్చుచేసి ఇంజనీరింగ్ చదివించారు. తర్వాత అమెరికాలో ఎంఎస్ చేసేందుకు రూ.35లక్షల వరకూ ఖర్చు చేశారు. గత ఆగస్టులో విజయవాడలోని న్యాక్ కల్యాణ మండపంలో రూ.33లక్షలు ఖర్చు చేసి పెళ్లి చేశారు. ఇలా అధికారికంగా ఏసీబీకి కనిపిస్తోన్న ఖర్చు రూ. కోటి అయినా.. మరింత ఎక్కువగా ఇది ఉండొచ్చని కృష్ణా జిల్లా ఏసీబీ అధికారి సామల ప్రసాదరావు అనుమానం వ్యక్తం చేశారు.

# అచ్ఛేదిన్ ఆవిష్కరణ

నాలుగేళ్లుగా మోదీ ప్రభుత్వం ఊరిస్తున్న అచ్ఛేదిన్‌ను ఆర్థిక సర్వే మరోసారి తెరపైకి తెచ్చింది. పెద్ద నోట్ల రద్దు, పక్కా ఏర్పాట్లు లేకుండా హడావుడిగా ప్రవేశపెట్టిన జీఎస్‌టి దెబ్బకు కుప్పకూలిన ఆర్థిక రంగంలో మళ్లీ ఊర్ధ్వ ముఖ చలనం కనిపిస్తోందని సోమవారం నాడు కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2017–18 ఆర్థిక సర్వే వెల్లడించింది. ఆర్థిక రంగాన్ని ముఖ్యంగా అవ్యవస్థీకృత రంగాన్ని చావుదెబ్బతీసిన ఈ రెండు చర్యల ప్రతికూల ప్రభావం సమసిపోయిందని ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ తయారు చేసిన నివేదిక పేర్కొంది. ఆర్థిక సర్వేలో అంతర్లీనంగా ఉన్న అనేక అంశాలు కలవరం కలిగిస్తున్నా, నివేదిక గంభీరంగా బయటకు వెల్లడించిన పలు అంశాలు మాత్రం అధికార పార్టీకి ఉల్లాసం కలిగించేవని చెప్పకతప్పదు. ఈ ఏడాది పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆర్థిక రంగంలోని తిరోగమనం ప్రభుత్వాన్ని కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో సర్వే, నిదానంగానే అయినా చాలా బలంగా కోలుకొని ఆర్థిక రంగం ముందుకు దూసుకుపోతున్నదని ప్రకటించడం ప్రభుత్వ పెద్దలకు ధైర్యాన్ని ఇస్తుంది. సర్వే లెక్క ప్రకారం.. వచ్చే ఏడాది భారత్ 7–7.5 శాతం వృద్ధి రేటును నమోదు చేసే అవకాశం ఉంది. ప్రపంచంలోనే శరవేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ మరోసారి మెరుపులు మెరిపించనుంది. సర్వే ఆశాజనకమైన అంచనాలు అత్యంత బలహీనమైన ప్రాతిపదికలపై ఉండటం గమనించాల్సిన విషయం. ఆర్థిక రంగంలో పొంచి ఉన్న సవాళ్లపై సర్వే చేసిన హెచ్చరికలే ఇందుకు ఉదాహరణ. ఈ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకుంటే ఆర్థిక రంగంపై ఆశలు కల్పించడానికి సర్వే చేసిన ప్రయత్నాలు అక్కడే వీగిపోతాయి.

మధ్యకాలికంగా ప్రభుత్వం, ఉద్యోగాల కల్పన, విద్యావంతులైన కార్మికశక్తిని తయారు చేయడం, వ్యవసాయ రంగంలో ఉత్పాదకత పెంచడం.. అనే మూడు అంశాలపై ఫోకస్ చేయాలని సర్వే సలహా ఇచ్చింది. నిజానికి గత కొన్నేళ్లలో ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఈ లక్ష్యాలకు విరుద్ధంగా ఉన్నాయి. దేశవ్యాప్తంగా కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తున్న అవ్యవస్థీకృత రంగాన్ని పెద్ద నోట్ల రద్దు దాన్ని వెన్నంటి వచ్చిన జీఎస్‌టి చావుదెబ్బతీశాయి. పెద్ద సంఖ్యలో ఉపాధి నష్టం జరిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దీని ప్రభావం ఉంది. ఇప్పటికీ ఉపాధి కల్పనలో వృద్ధి లేదు. ఇక విద్య విషయానికి వస్తే గత కొన్నేళ్లలో విద్యతోపాటు వైద్యంపై ప్రభుత్వ వ్యయం తగ్గింది. జనాభా పెరుగుతున్నా, జీడీపీ పరిమాణం పెరుగుతున్నా ఈ వ్యయంలో మార్పులేదు. సామాజిక రంగాలపై ప్రభుత్వ వ్యయం తగ్గడం వల్ల స్థూల ఆర్థిక రంగంపై పడుతున్న ప్రభావంపైనా సర్వే విశ్లేషించలేదు. గతేడాది పరిణామాల పరామర్శలో అసౌకర్యంగా ఉన్న అనేక విషయాలను సర్వే పక్కనబెట్టినట్టు కనిపిస్తోంది. ఇందుకు ఉదాహరణ వ్యవసాయం. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత పెరుగుదల స్థూల ఆర్థిక రంగం వృద్ధికి కీలకమని చెప్పిన సర్వే వ్యవసాయ రంగం ప్రస్తుత స్థితిగతులను చర్చించలేదు. ఈ రంగం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యల జోలికి వెళ్లలేదు. రైతుల రాబడులను రెట్టింపు చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా గత కొన్నేళ్లుగా రైతుల రాబడుల్లో పైసా పెరుగుదల కూడా లేకపోవడానికి కారణాలేమిటో విశ్లేషించే ప్రయత్నం చేయలేదు. సర్వే కవర్ పేజీని పింక్ కలర్‌కు మార్చడంతో, మహిళల సాధికారికత సిద్ధించదు. ఆర్థిక వృద్ధిలో వారికి భాగస్వామ్యం లభించదు. వారి విషయంలో పురుషాధిక్య సమాజం భావజాలం మారదు.

భారీ ఆర్థిక వృద్ధిపై ఆశలు కల్పిస్తూనే రెండు రకాల ప్రమాదాలపై కూడా సర్వే హెచ్చరించింది. మార్కెట్లు కుప్పకూలితే ఆర్థిక వృద్ధికి అవరోధమని సర్వే పేర్కొంది. స్టాక్‌మార్కెట్లు పెరగడం వృద్ధికి చిహ్నం కాదు. ఆర్థిక రంగంలోని నిజ పరిస్థితులకు సంబంధం లేకుండా రాకెట్ వేగంతో దూసుకుపోయిన స్టాక్ మార్కెట్లు ప్రమాదకరమైన బుడగరూపాన్ని సంతరించుకున్నాయి. ఈ బుడగ పేలితే వృద్ధి రేటునే కాదు.. లక్షలాది మంది జీవితాలు కుప్పకూలే ప్రమాదం ఉంది. ఆర్థిక రంగాన్ని ఇది తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. నిజానికి మోదీ ప్రభుత్వ తొలి మూడేళ్ల పాలనలోని వెసులుబాటు అంతా కారు చౌక ముడి చమురు ధరల నుంచి కలిగిన లబ్ధి ఫలితం. ఇప్పుడా సౌకర్యం పోతున్నది. దీని ప్రభావం కరెంట్ ఖాతాలోటుపైనా ద్రవ్యోల్బణంపైనా ఉంటుంది. ఈ ప్రతికూల అంశాల నడుమ సర్వే ఆవిష్కరించిన కొత్త ఆశలు, అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే మోదీ ప్రభుత్వం ఎక్కుపెట్టిన అచ్ఛేదిన్‌కు కొనసాగింపుగా ఉన్నాయి. అచ్ఛేదిన్ కేవలం ఆర్థిక రంగానికి మాత్రమే కాకుండా ప్రజాజీవితంలోని అన్ని పార్శ్వాలకు వర్తిస్తుందనుకుంటే గత నాలుగేళ్లలో అలాంటి ఛాయలు కనిపించలేదు. మునుముందు కనిపిస్తాయన్న విశ్వాసాన్నీ ప్రభుత్వం కలిగించడం లేదు.

## జనవాక్యం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన మెయిల్: editpage@andhrajyothy.com

### ఐపీఎల్ క్రేజే వేరు!

ప్రపంచ క్రికెట్‌లో భారత క్రికెట్ నియంత్రణ మండలి అగ్రస్థానంలో నిలుస్తున్నదంటే కారణం బీసీసీఐ అత్యంత ధనికమైనది కావడమే. మరి బీసీసీఐ అంత ధనికమైనది ఎలా అయిందంటే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వల్లే! ప్రపంచవ్యాప్తంగా క్రికెటర్లంతా ‘ఒక్కసారి ఐపీఎల్‌లో ఆడితే చాలు’ అని అనుకుంటారంటే అతిశయోక్తి కాదు. అది గ్రహించి కాబోలు ఈసారి ఐపీఎల్ సమయంలో ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు తమ జట్టుకు ఇతర సిరీస్‌లు ఏవీ నిర్ణయించలేదు. ఇక బెంగళూరులో రెండు రోజులపాటు జరిగిన ఐపీఎల్ వేలం సందర్భంగా దేశంలోని టీనేజర్లంతా టీవీలను అతుక్కుపోవడం ఈ పొట్టి క్రికెట్ క్రేజ్‌ను తెలియజేస్తుంది. మొత్తం 578 మంది క్రికెటర్లు వేలంలో నిలవగా, ఎనిమిది ఐపీఎల్ ఫ్రాంచైజీలు 169మందిని కొనుగోలు చేశాయి. ఇందులో 56మంది భారత ఆటగాళ్ళు, 56 మంది విదేశీ క్రికెటర్లు. వీరి కోసం అన్ని ఫ్రాంచైజీలన్నీ కలిపి 431.70 కోట్లు ఖర్చు చేయడం విశేషం. ఇలా ఫ్రాంచైజీలు తమపై కోట్లు కుమ్మరించిన నేపథ్యంలో వాటి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆటగాళ్లంతా పూర్తి స్థాయి ప్రదర్శన చేస్తారని ఆశిద్దాం.

**– తన్నీరు శ్రియ, హైదరాబాద్**

# గాంధీ మార్గమే వెలుగుబాట

**రాజకీయ పోరాటాల్లో గాంధీ ప్రవేశపెట్టిన అహింస అనే అరుదైన ప్రక్రియకు సత్యం పునాది. భారత దేశం నేడు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు గాంధీమార్గం ఆచరణాత్మకమైనది. మత సామరస్యాన్ని, కుల రహిత సమాజాన్ని సాధించాలన్నా, పేదరికంలేని దేశంగా ఎదగాలన్నా గాంధీ భావజాలాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలి.**

మహాత్మాగాంధీ మరణించి నేటికి 70 సంవత్సరాలు. అయినా ఆయన మరణం మన సమాజంలోని అనేక చీకటి కోణాలను నేటికీ చూపిస్తూనే ఉంది. గాంధీని హిందూ మతోన్మాది గాడ్సే దగ్గర నుంచి మూడు రౌండ్లతో కాల్చి చంపటం ప్రపంచానికి తెలుసు. గాంధీ జీవితం భారత జాతికి ఆదర్శంకాగా, ఆయన మరణం జాతికి ఒక సందేశంగా నిలిచింది.

భారత స్వాతంత్ర్య సంగ్రామాన్ని చారిత్రక దృష్టికోణంతో పాటుగా సామాజిక దృష్టికోణంతో పరిశీలించినట్లయితే గాంధీకి ముందరి యుగం, గాంధీ యుగంగా ఉద్యమ తీరుతెన్నులను మరింత ప్రస్ఫుటంగా అర్థం చేసుకోవటం వీలవుతుంది. గాంధీ నాయకత్వాన నడిచిన స్వాతంత్ర్య సమరం సామాజిక, రాజకీయ కోణాలను కలుపుకొని ఒక విలక్షణమైన తాత్వికతతో ముందుకు సాగింది. ఆయన తాత్విక నేపథ్యానికి మూలం అహింస, ప్రేమ. గాంధీజీ తన జీవిత కాలంలో నీతివంతమైన జీవితాన్ని జీవించాడు. తాను ఆచరించిన విలువలనే ఇతరులకు చెప్పాడు. స్వాతంత్రోద్యమ కాలంలో దేశంలోని ప్రతి సమస్యకు బ్రిటీష్‌వారిని నిందించటం పరిపాటిగా ఉండేది. ఈ పద్ధతిని గాంధీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ధోరణి వలన మనలోని తప్పులను మనం గుర్తించలేమని నొక్కి చెప్పారు. దేశంలోని వివిధ సామాజిక వర్గాల మధ్య అంతరాలు, అనైక్యత, కులం కట్టుబాట్లు పరాయిపాలనకు కారణమని అర్థం చేసుకోవాలని సూచించాడు. నేడు కొన్ని రాజకీయ శక్తులు దేశంలోని ప్రతి సమస్యకు కారణం మధ్యయుగాల ముస్లిం పాలకులు అనే ధోరణితో ముస్లింలపై విద్వేషం పెంచటం వాస్తవాన్ని గుర్తించకపోవడంగా భావించవచ్చు.

వివిధ సామాజిక వర్గాలను ఒక తాటిపైకి తెచ్చి ఒకరి గురించి మరొకరు తెలుసుకునే చర్చకు (డైలాగ్) మహాత్ముడు విశేషంగా దోహదం చేశారు. దళితులు, అగ్రవర్ణాలు, హిందువులు, ముస్లింలు, వ్యాపారులు, రైతులు కలిసి మాట్లాడుకునే అవకాశాన్ని కల్పించి, ఒకరి భావనను మరొకరు అర్థం చేసుకునే ప్రక్రియను నెలకొల్పారు. తద్వారా అనేక విషయాలలో ద్వేష భావం పెరగకుండా నివారించగలిగారు.

గాంధీజీకి ఆయన సమకాలీన రాజకీయ నాయకులకు మధ్య ఎన్నో విషయాల్లో స్పష్టమైన వ్యత్యాసం ఉంది. ప్రజల జీవితాలతో సమస్యలతో, ఆశలు, ఆశయాలతో ఆయన సంబంధం కలిగి ఉండేవారు. రాజకీయాలంటే విద్వాంసులైన రాజకీయవేత్తల మధ్య జరిగే చర్చలుగా గాంధీజీ భావించలేదు. ప్రజా సమస్యలకు పరిష్కారాన్ని చూపించే నిస్వార్థ లక్ష్యంగా రాజకీయాలను భావించారు. గాంధీజీ ఆచరించి చూపిన ఆదర్శ జీవన విధానమే అశేష ప్రజానీకంలో ఆయన్ను మహాత్మునిగా నిలిపింది. జీవితాంతం వ్యక్తులతో, సమాజంతో ప్రపంచంతో చర్చోపచర్చలు చేస్తూ సత్యాన్ని కనుగొనే ప్రయత్నం చేశారు. శంకరాచార్యుని అద్వైతం తరువాత వెయ్యేండ్లకు గాంధీజీ సత్యాన్వేషణ, అహింస అనే గొప్ప ఆచరణాత్మక సిద్ధాంతాలను ప్రపంచానికి అందించి భారత దేశాన్ని ప్రపంచం ముందు గొప్ప నైతికత కలిగిన దేశంగా నిలిపాడు. ‘బహుశా కొన్ని తరాల తరువాత ఇటువంటి మనిషి ఒకడు రక్తమాంసాలతో ఈ నేలమీద జీవించాడంటే నమ్మశక్యం కాని వాస్తవంగా భావిస్తారు’ అన్న ఐన్‌స్టీన్ వాఖ్యలు నిండు సత్యాలు. గాంధీ నిరంతరం మారుతూ అభివృద్ధి చెందుతూ వచ్చిన మనిషి. సత్యం, అహింసలను ఆయుధాలుగా స్వీకరించి సుదీర్ఘకాలం విశాల ప్రజాలక్ష్యం కోసం పోరాటం చేసిన మొదటి వ్యక్తి గాంధీ. రాజకీయ పోరాటాల్లో గాంధీ ప్రవేశపెట్టిన అహింస అనే అరుదైన ప్రక్రియకు సత్యం పునాది. ప్రేమ ప్రాతిపదిక. భారతీయ మధ్యతరగతి గాంధీని కేవలం స్వాతంత్రోద్యమ నాయకుడిగానే గుర్తిస్తుంది. కానీ ఆయన గొప్ప ఆలోచనాపరుడు, తాత్వికుడు.

20వ శతాబ్ది రాజకీయ నాయకుల్లో అత్యధికంగా మానవాళిని ప్రభావితం చేసిన నాయకుడిగా పలు సర్వేలు గాంధీని పేర్కొన్నాయి. ప్రజా ఉద్యమాల ద్వారానే వలస పాలన నుంచి దేశానికి స్వాతంత్ర్యం లభిస్తుందనే రాజకీయ వ్యూహాన్ని ఎంచుకున్న దీశాలి. ప్రజలను సమీకరించడం గాంధీజీ రాజకీయ వ్యూహాల్లో ఒక అంశం. వలస పాలకుల్లోని కొందరినైనా తటస్థులుగా మార్చటం, వారిని మన స్వాతంత్ర్య సమరానికి మద్దతుదారులుగా మలిచే ప్రయత్నం ఆయన రాజకీయాల్లోని విశేషాంశం. క్రింది స్థాయిలో ఉండే కార్యకర్తల చొరవను శక్తి సామర్థ్యాలను పెంపొందించటం, ప్రజా ఉద్యమం ప్రారంభం కాగానే పైస్థాయిలో ఉండే నాయకులను ప్రభుత్వం అరెస్టు చేస్తే క్రింది స్థాయి కార్యకర్తలు సైతం ఉద్యమాన్ని నడిపేలా చేయడం ఆయన రాజకీయ చతురత, ఉద్యమ ఎత్తుగడ. నేడు జనసామాన్యం కోసం ఉద్యమాల్లో పనిచేస్తున్న నాయకులకు ముఖ్యంగా దళిత, పేదవర్గాల వారికోసం పనిచేస్తున్న వారికి గాంధీజీ ఎత్తుగడలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. మత సామరస్యాన్ని, కుల రహిత సమాజాన్ని సాధించాలన్నా, పేదరికంలేనిదేశంగా ఎదగాలన్నా గాంధీ భావజాలాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలి. నేటి సమాజంలో ఆయన రాజకీయ సిద్ధాంతాలను నిశితంగా పరిశీలించి అనుసరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ప్రస్తుత పరిస్థితుల్లో దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు గాంధీ దృక్కోణంలో పరిష్కారం చూపితే ఘర్షణలు చాలా వరకు నివారించవచ్చు. నేడు ప్రభుత్వాల్లో నెలకొంటున్న అనేక ఘర్షణలకు ఆయన రాజకీయ విధానాల ద్వారా పరిష్కారం చూపవచ్చు. సాంఘిక సమానత్వాన్ని అంగీకార మార్గం (డిబేట్) ద్వారా సాధించాలని, రాడికల్‌గా మార్పులను సమాజం అంగీకరించదని హిందూ సమాజాన్ని ఆ దిశగా ప్రిపేర్ (సిద్ధం) చేశాడాయన. కులాంతర, మతాంతర వివాహాలు, మరెన్నో విషయాల పట్ల తన అభిప్రాయాలను ఆయన మార్చుకున్నారు. అంబేడ్కర్ వంటి మేధావులు లేవనెత్తిన అంశాల పట్ల సానుకూలంగా స్పందించి దళిత సమస్యల పరిష్కారానికి ప్రేరణ పొందారు. హిందూ మతం బతికి బట్టకట్టాలంటే అది కులరహితమైన మతం కావలసి ఉంటుందని గాంధీజీ చెబుతూవచ్చారు. కుల వ్యవస్థకు మూలస్తంభంగా ఉన్న సజాతి వివాహ పద్ధతిని పూర్తిగా వ్యతిరేకించి కులాంతర వివాహాలు ముఖ్యంగా హరిజనులకూ పైకులాల వారికీ మధ్య వివాహాలు జరగాలని గాంధీజీ తన జీవిత చివరి సంవత్సరాల్లో ఉద్బోధించారు.

హిందూ, ముస్లిం ఐక్యతకోసం, మత సామరస్యం కోసం అహర్నిశలు కృషిచేసిన గాంధీని నాడు ముస్లింలు నమ్మలేదు. నేడు హిందువులు అనుసరించడం లేదు. జిన్నా వంటి ముస్లిం నాయకులు గాంధీని హిందూ నాయకుడిగా పరిగణిస్తే, హిందువులు ముస్లిం పక్షపాతిగా భావించారు. ఇరు పక్షాల వారూ గాంధీని అపార్థం చేసుకున్నారు.

ఒకే సమయంలో ఆచరణశీలిగా, ఆదర్శవాదిగా ఉండగలగడం గాంధీజీలో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునే అంశం. జీవితాంతం ఆయన వ్యక్తులతో, సమాజంతో, ప్రపంచంతో చర్చోపచర్చలు చేస్తూ సత్యాన్ని కనుగొనే ప్రయత్నం చేశారు. గాంధీలోని గొప్ప సుగుణాల్ని చాలా మంది అర్థం చేసుకోలేకపోతున్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం నిర్విరామంగా విలక్షణమైన రీతిలో పోరాడిన ఈ మహామనీషి హత్య వెనుక దాగిన చారిత్రక సందర్భాన్ని వర్తమాన తరాలు అర్థం చేసుకోనట్లయితే భవిష్యత్‌లో ఇటువంటి విపత్కర స్థితి తటస్థించినపుడు ఎదుర్కోవటం కష్టమవుతుంది.

సనాతన హిందువుగా జీవించిన గాంధీ ఒక హిందూ దురభిమాని చేతిలో హత్యగావించబడటం చారిత్రక విషాదం. అందరికీ సమాన హక్కులు లభించే భారత దేశం అనే భావనను వ్యతిరేకించే భావజాలం ఉన్నవాళ్ళు కొన్ని దశాబ్దాలుగా గాంధీపై దాడి చేస్తుండటం రహస్యం కాదు. గాంధీయిజాన్ని తమ మార్గానికి అవరోధంగా భావిస్తున్న వీరే 1948 జనవరి30న మహాత్ముణ్ని కాల్చి చంపారు. గాంధీ చూపిన అహింసా సిద్ధాంతం భారత జాతికి ఎన్నటికీ భగవద్గీతే.

**■ డొక్కా మాణిక్యవరప్రసాద్**
ఎమ్మెల్సీ, పూర్వ మంత్రి

# మహాత్ముడు మన మధ్య ఉంటే...

నేడు గాంధీ 70వ వర్ధంతి



**శాంతియుతనిరసన, బాధ్యతాయుత నాయకత్వం, చట్టబద్ధతల రూపంలో గాంధీ అందించిన ఒరవడికి కాలదోషం పట్టడం ఎన్నడూలేనంత ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. గాంధీ భారతపు ఆనవాళ్ళు పూర్తిగా చెరిగిపోయి గాంధీరహిత భారతం అన్నివిధాలా వేళ్ళుదన్నుకుంటోంది. చట్టపాలకులకు, చట్ట ఉల్లంఘులకు మధ్య అంతరం అదృశ్యమై దేశం గాంధీకి పూర్వపు అరాచకదశకు మళ్లుతోంది.**

గాంధీని మరచిపోవడానికి ఈరోజున చాలామందికి చాలా కారణాలే ఉన్నాయి. అయినాసరే, ఇప్పుడాయన తరచు గుర్తొస్తున్నాడు. తన దక్షిణాఫ్రికా పోరాట అనుభవాలను వెంటతీసుకుని 1915లో భారతస్వాతంత్రోద్యమంలోకి అడుగుపెట్టినప్పటినుంచీ ఆయన ఏదో విధంగా ప్రభావితం చేస్తూవచ్చిన గత వందేళ్ల పైచిలుకు చరిత్రా కళ్ల ముందు కదిలి, నేడు ఆయన జీవించి ఉంటే ఏం చేసేవాడన్న ప్రశ్నను ముందుకు తెస్తోంది. గాంధీరహిత భారతానికి వందేళ్ల నిండకుండానే సిక్కుల ఊచకోత, గుజరాత్ మారణహోమం, దేశంలో అనేక ప్రాంతాలలో దారుణ మత కల్లోలాలు, దళితులపై అత్యాచారాలు జరిగిన మాట నిజమే. గాంధీ జీవించి ఉంటే ఏం చేసేవాడన్న ప్రశ్నకు అవీ సందర్భాలే. కానీ వందేళ్ల విభజనరేఖ ఇప్పుడు మరింత స్పష్టతను తెచ్చుకుంటూ, ఆయన విడిచి వెళ్ళిన శూన్యాన్ని మరింత బొమ్మ కడుతోంది.

‘పద్మావత్’ సినిమా గురించే చూద్దాం. ఆ సినిమా విడుదల కాకుండానే, కథ తెలియకుండానే దర్శకునిపై దాడి జరిగింది. చూస్తుండగానే ఆ సినిమా వ్యతిరేకులు ఒక ప్రైవేట్ సేనగా ఏర్పడి, మూడు నాలుగు రాష్ట్రాలలో ఉనికిని స్థాపించుకున్నారు. విధ్వంసానికి పాల్పడుతూ కొన్ని మాసాలపాటు జాతీయ మీడియాలో వెలిగిపోయారు. ఈ అరాచకానికి అడ్డుకట్ట వేయకపోగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఆ సినిమాను నిషేధిస్తామని ప్రకటించాయి. చివరికి ముఖ్యమంత్రులు, మంత్రులు సైతం విధ్వంసకారులతో గొంతు కలిపారు. సెన్సార్ సర్టిఫికెట్టు, సర్వోన్నత న్యాయస్థానం నుంచి అనుకూలమైన తీర్పూ వచ్చిన తర్వాత కూడా అల్లరిమూకల ఆగడాలు ఆగలేదు. శాంతిభద్రతల పరిరక్షణను ప్రభుత్వాలు చేతుల్లోకి తీసుకోలేదు. గుర్గావ్‌లో స్కూలు బస్సుపై దాడి చేసి పిల్లలను భయభ్రాంతం చేసిన ఘటనపై మీడియా నోరు చేసుకున్న తర్వాతే, ఈ అరాచకశక్తుల దూకుడు ఏ కొంచమైనా ఆగింది. తీరా సినిమా విడుదలై, అందులో అంత వ్యతిరేకించాల్సినవేవీ లేవని తెలిసాక ఇదంతా యాంటీ క్లైమాక్స్‌గా తేలిపోయింది. అల్లరి మూకలతోపాటు ప్రభుత్వాలూ, రాజకీయనాయకత్వాలూ కూడా నవ్వుల పాలయ్యాయి. నిజానికి ఈ ప్రహసనకారుల జాబితా ఇంతటితో పూర్తికాదు. దేశభక్తి గురించి, వ్యక్తుల శీలనిర్మాణం గురించి, జాతీయవాదం గురించి ఉద్ఘాటిస్తూ తాము దేశానికి సాంస్కృతికనాయకత్వాన్ని అందిస్తున్నట్టు చెప్పుకునే వారిని కూడా వీరి పక్కన నిలబెట్టాల్సి ఉంటుంది. పసిపిల్లలపై పశుత్వం ప్రకోపించిన దశలో కూడా ఈ సోకాల్డ్ సాంస్కృతిక జాతీయవాద నాయకత్వం నోరు విప్పి, ఇది తప్పు అనలేదు. రాజకీయ నాయకత్వాలది వోటు కక్కుర్తి అయితే, తమ భావజాల అజెండాకు కలిసొచ్చే వివాదం కనుక వీరిది వ్యూహాత్మక మౌనం. మొత్తం మీద ‘పద్మావత్’ వేదికగా సాగిన ఈ బఫూనరీ అంతటిలో కొట్టొచ్చినట్టు కనిపించినది ఒకటే...ఈ దేశాన్ని ఆవరించిన నైతికనాయకత్వ దారిద్ర్యం!

గాంధీ ఇప్పుడు జీవించి ఉంటే ఏం చేసేవాడన్న ప్రశ్న తలెత్తుతున్నది ఇక్కడే. ‘పద్మావత్’ ఉదంతంలో చట్టపాలకులే చట్టవిధ్వంసకులతో చేతులు కలిపి శాంతిభద్రతలను గాలికొదిలేస్తే; చట్టాన్ని ధిక్కరిస్తూ కూడా శాంతిభద్రతలకు బాధ్యత వహించడం తన పోరాటజీవితం పొడవునా గాంధీ అనుసరించిన విధానం. ఆయన దక్షిణాఫ్రికా పోరాటాన్ని అలా ఉంచితే, గుజరాత్‌లోని ఖెడాలో రైతుల ఆందోళన, రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా నిర్వహించిన హర్తాళ్, బార్డోలీ సత్యాగ్రహం, ఉత్తరప్రదేశ్‌లోని చౌరీచౌరా ఘటన ఇందుకు ప్రముఖ ఉదాహరణలు. 1918 ప్రారంభంలో సర్దార్ పటేల్ నాయకత్వంలో ఆయన సాగించిన ఖెడా రైతుల ఆందోళనకు నేటికి వందేళ్లు కావడం కూడా గమనించవలసిన విశేషమే. భూమిశిస్తుకు వ్యతిరేకంగా సాగిన ఆ ఆందోళన, తన పోరాటశైలికి భిన్నంగా అక్కడక్కడ హింసాత్మకం కావడం గాంధీని ఆలోచనలో పడేసింది. ఆ తదుపరి సత్యాగ్రహాలలో జాగ్రత్తపడ్డాడు. ఉద్యమం అదుపుతప్పినప్పుడు దానిని తక్షణమే విరమించడానికి ఆయన ఏ దశలోనూ సందేహించలేదు. ఆ సంవత్సరంలోనే రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా తను పిలుపు నిచ్చిన దేశవ్యాప్త హర్తాళ్ హింసాత్మకంగా మారినప్పుడు వెంటనే దాన్ని ఉపసంహరించుకున్నాడు. 1921 నాటి బార్డోలీ సత్యాగ్రహ సమయంలో, వేల్స్ రాకుమారుని భారత్ పర్యటనకు నిరసనగా హింస సంభవించినప్పుడు, మరోసారి అలాంటిది జరిగితే తన కుమారుడు దేవదాసును హింసాకారుల మధ్యకు పంపి అతని ప్రాణాలు బలిపెట్టడానికైనా సిద్ధమని హెచ్చరించాడు. ఆ సమయంలోనే చౌరీచౌరా ఘటనగా ప్రసిద్ధికెక్కిన హింసాత్మకఘటన జరగగానే మోతీలాల్, పటేల్, నెహ్రూ, రాజగోపాలాచారి, ఆజాద్ సహా నాయకులందరినీ దిగ్భ్రాంతులనుచేస్తూ ఉద్యమాన్ని నిలిపివేసి కొన్నేళ్లపాటు నిర్మాణకార్యక్రమానికి పరిమితమయ్యాడు.

ఇప్పుడు వెనుదిరిగి చూస్తే, గాంధీ ఈ దేశానికి సత్యాగ్రహమనే పేరుతో శాంతియుత నిరసన రూపాన్ని పరిచయం చేయడమే కాదు, ఉద్యమ నిర్వహణలో నాయకత్వబాధ్యతకు సంబంధించిన గొప్ప నమూనా అందించాడు. తన నాయకత్వబాధ్యతను స్థాపించుకొని సందర్భం ఆయన పోరాటచరిత్ర మొత్తంలోనే లేదనే చెప్పవచ్చు. ఉద్యమానికి దిగే ప్రతిసారీ అందుకు కారణాలను ఆధారసహితంగా పొందుపరుస్తూ ప్రభుత్వానికి లేఖ రాయడం, అంతకంటే ముందు పత్రికారచనలద్వారా ఉద్యమ అవసరాన్ని వివరిస్తూ తగిన పూర్వరంగాన్ని కల్పించడం ఆయన అనుసరించిన బాణీ. ఒక సినిమాకు వ్యతిరేకంగా ఆయన ఆందోళన చేపట్టడం ఊహాజనితమే కానీ, ఒకవేళ భావప్రకటన స్వేచ్ఛ అనే గీటురాయికి కూడా నిలవనంతగా ఏదైనా సినిమా అభ్యంతరకరంగా తనకు తోచినప్పుడు ముందుగా నిజానిజాలను నిర్ధారించుకోకుండా ఆయన ఆందోళనకు దిగే ప్రసక్తే లేదు. దిగిన తర్వాత ఏ దశలోనైనా హింస సంభవిస్తే వెంటనే ఆందోళనను విరమించడమే కాదు, ఆ తప్పు తన మీద వేసుకుంటూ తనను తాను శిక్షించుకుని ఉండేవాడు. ఇక స్కూలు పిల్లలపై దాడిని ఆయన క్షమించడం అన్నది ఊహించడానికే అసాధ్యం. అప్పుడు తనపై ఆయన విధించుకునే శిక్ష మరింత తీవ్రంగా ఉండేది. కనీసంలో కనీసం ఇలాంటి ఘటనలపై ఆయన నిరసనగళం దేశమంతటా మారుమోగి ఉండేది. అందుకు భిన్నంగా ‘పద్మావత్’ సందర్భంలో అత్యున్నతదేశనాయకత్వంతో ప్రారంభించి అన్ని అంచెలలోనూ నీరవ నిశ్శబ్దం తాండవించి ఈ దేశానికిపట్టిన నాయకత్వ దారిద్ర్యం ఎలాంటిదో చాటి చెప్పింది.

చట్టధిక్కారంలో కూడా చట్టబద్ధతను గౌరవించిన విలక్షణశైలి గాంధీది. బార్డోలీ సత్యాగ్రహ సందర్భంలో తనను అరెస్టు చేసినప్పుడు చట్టధిక్కారం పౌరుల విధ్యుక్త ధర్మమని న్యాయస్థానం ముందు ఎలుగెత్తి ప్రకటిస్తూనే, చట్టం విధించే ఎంతటి శిక్షకైనా తను సిద్ధమని చెప్పుకుంటాడు. చట్టబద్ధత పట్ల ఆయన పట్టింపును విశాలచారిత్రకకోణం నుంచి చూడవలసి ఉంటుంది. బ్రిటిష్ పాలనకు చెందిన దుర్మార్గపు పార్శ్వాన్ని అలా ఉంచి, ఆధునికకాలానికి పరిమితమై చెప్పుకుంటే భారతదేశానికి చట్టబద్ధపాలనను, ప్రజాస్వామిక రీతిరివాజులను పరిచయం చేసినది బ్రిటిష్ ప్రభుత్వమేనన్న అభిప్రాయం ఒకటుంది. గాంధీ కూడా అలాగే భావించినట్టు కనిపిస్తుంది. బ్రిటిష్ పట్ల తన అయిష్టాన్నే కాక ఇష్టాన్నీ ఆయన ఎప్పుడూ దాచుకోలేదు. ‘బ్రిటిష్ సామ్రాజ్యంలోని ప్రతిపౌరుడికీ స్వేచ్ఛగా తన శక్తియుక్తులను ప్రకటించుకునే అవకాశమూ, తన అంతఃకరణ ప్రబోధానుసారం ఎలాగైనా ఆలోచించగల అవకాశమూ ఉన్నాయనీ, అందుకే దానితో నేను ప్రేమలో పడ్డాననీ’ 1915లో మద్రాసులో మాట్లాడుతూ ఆయన అంటాడు.

శాంతియుతనిరసన, బాధ్యతాయుత నాయకత్వం, చట్టబద్ధతల రూపంలో గాంధీ అందించిన ఒరవడికి కాలదోషం పట్టడం ఎన్నడూలేనంత ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. గాంధీ భారతపు ఆనవాళ్ళు పూర్తిగా చెరిగిపోయి గాంధీరహిత భారతం అన్నివిధాలా వేళ్ళు దన్నుకుంటోంది. చట్టపాలకులకు, చట్ట ఉల్లంఘులకు మధ్య అంతరం అదృశ్యమై దేశం గాంధీకి పూర్వపు అరాచకదశకు మళ్లుతోంది.

**■ భాస్కరం కల్లూరి**

## గాంధీని కాల్చింది ఒక్కడే!

బీజేపీ సారథ్యంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఎర్పడిన తరువాత ఎన్నో విచిత్ర వివాద అంశాలు తెరపైకి వస్తున్నాయి. మహాత్ముని హత్య సందర్భంలో గాడ్సేతో పాటు మరొక తుపాకీ కూడా పేలిందనే వార్త ఇటీవల సంచలనమయ్యింది. దీనిపై, 1948 జనవరి 30న గాంధీజీ హత్యకు సజీవ సాక్షి అయిన అప్పటి ఆయన వ్యక్తిగత సహాయకుడు ఇప్పటికీ సజీవంగా ఉన్న వి.కళ్యాణం ఇటీవలే స్పందించారు. ‘గాంధీజీని నాథూరామ్ గాడ్సే క్లోజ్ రేంజ్‌లో కాల్చడాన్ని ఆయన వెనుకనే ఉండడంతో నేను స్వయంగా చూసాను. ఈ దుర్ఘటనకు 70 సంవత్సరాలైనా, నేను ఒక్కణ్ణే సజీవ సాక్షిని. ఆఖరి రోజులలో గాంధీజీ నాటి మత విద్వేష, క్రూరత్వాన్ని నిస్సహాయంగా, నిశ్శబ్దంగా భరించవలసి రావడంతో.. దేవుడు తనను తీసుకుపోవాలని ప్రార్థించేవారు. నేను అనుకోవడం.. భగవంతుడు ఆయన కోర్కెకు, హంతకుడు గాడ్సే ద్వారా సమాధానం ఇచ్చాడు. మూడు గుండ్లు. ఒకే హంతకుడు. ఆకస్మిక సునాయాస మరణం కారణంగా ‘హే రామ్’ అనాలనే గాంధీజీ అంతిమ వాంఛ తీరలేదు’ అన్నారు కళ్యాణం. 1944 మే నెలలో తొలిసారిగా గాంధీజీని సందర్శించి ప్రభావితుడై, ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా సేవలందించిన వి. కళ్యాణం ప్రస్తుతం 95 ఏళ్ల వయస్సులో చెన్నైలో ఉన్నారు.

అఖండ భారతావని విభజనానంతరం రెండు దేశాలలోనూ మత విద్వేషం రగుల్కొనడంతో అమానుష మారణకాండ చోటుచేసుకొంది. ఆ సమయంలో శాంతిని నెలకొల్పేందుకు గాంధీజీ ఎనలేని కృషి చేశారు. ప్రార్థనా సమావేశాలలో శాంతి, సుహృద్భావం, మానవతా విలువల కోసం ప్రార్థించేవారు. స్వతంత్ర భారత ప్రభుత్వంపై పాకిస్తాన్ ఎంత రాజకీయ దుర్నీతితో కాలుదువ్వుతున్నా, సంయమనంతో వ్యవహరించమని వత్తిడి తెస్తుండడంతో అప్పటికే గాంధీపట్ల ఆగ్రహంతో ఉన్న హిందుత్వ రాష్ట్ర వాదులు ఇక ఆయనను భౌతికంగా తొలగించడం తప్ప గత్యంతరం లేదని హత్యాయత్నాలు ముమ్మరం చేశారు. 1948 జనవరి 20న గాంధీజీ ప్రార్థనా సమావేశంలో బాంబు పేలుడు సంఘటన జాతిని దిగ్భ్రాంతికి గురిచేసింది. గాంధీజీ సమావేశాలకు హాజరయ్యే వారిని సోదా చేయాలని, సెక్యూరిటీ ఏర్పాటు చేయాలనీ హోం మంత్రి పటేల్ ఆదేశించారు. కానీ గాంధీజీ అందుకు అంగీకరించలేదు. ‘నా జీవితం భగవంతుని చేతిలో ఉంది. నేను మరణించవలసివస్తే ఎటువంటి సెక్యూరిటీ నన్ను రక్షించడం అసాధ్యం. అదీగాక సెక్యూరిటీ చర్యలు రక్షణగా, బతికే హక్కు నాకు వద్దు’ అన్నారు.

**■ జయసూర్య**

# కొత్త బడ్జెట్: కలలూ కష్టాలూ

**మౌలికసదుపాయాల రంగంలో ప్రస్తుత మదుపులను అదే స్థాయిలో కొనసాగిస్తారా? ప్రభుత్వ వ్యయాలను అదుపు చేస్తారా? చిన్న, మధ్యతరహా పరిశ్రమల పునరుద్ధరణకు పటిష్ఠ చర్యలు చేపడతారా? పెట్రోలియం ఉత్పత్తులపై పన్నులు తగ్గిస్తారా? కొత్త బడ్జెట్ వేళ, ఆమ్ ఆద్మీలు, ఆస్తిపరులు, ఆర్థిక నిపుణులను సతమతం చేస్తోన్న ప్రశ్నలివి.**


భరతవాక్యం



■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

కొత్త బడ్జెట్ రాబోతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధిని వేగవంతం చేయడానికి ప్రభుత్వం ఎటువంటి విధానాలను అనుసరించనున్నది? ఈ క్రింద ప్రస్తావించిన అంశాలకు బడ్జెట్‌లో లభించే ప్రాధాన్యాన్ని బట్టి కొత్త ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ నిర్దేశమేమిటో విశదమవగలదు. మొదటి ప్రశ్నేమిటంటే మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు ప్రస్తుతం చేస్తున్న వ్యయాలను యథాతథంగా కొనసాగిస్తారా? హైవేలు, రైలు మార్గాల నిర్మాణంలో ప్రభుత్వ పెట్టుబడులను ఇతోధికంగా పెంచడంలో మోదీ సర్కార్ సఫలమయింది. హైవేలను విశాలం చేయడాన్ని, రైలు మార్గాలను అనూహ్యవేగంతో నిర్మించడాన్ని దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థ (పిఎస్‌యు)ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ఫలితంగా సమకూరిన ఆదాయం వల్ల మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారీ స్థాయిలో నిధులు సమకూర్చడం సాధ్యమయింది. ఇది సరైన విధానం. ఇంతకు ముందు కూడా పిఎస్‌యూలలో జాతి ధనాన్ని పెద్ద ఎత్తున మదుపు చేయడం జరిగింది. ఇప్పుడు ఆ సొమ్ములో కొంత భాగాన్ని హైవేలు తదితర సరికొత్త, అత్యవసర రంగాలలో మదుపు చేస్తున్నారు. ప్రశ్న ఏమిటంటే పెట్టుబడుల స్థాయిని యథాతథంగా కొనసాగిస్తారా? కొనసాగిస్తారనేదే నా అంచనా. కొనసాగించిన పక్షంలో అందుకు ఆర్థిక మంత్రిని అభినందించి తీరాలి.

ఇక రెండో ప్రశ్న. ప్రభుత్వ వ్యయాలను అదుపు చేస్తారా? హైవేలలో మదుపులతో పాటే ప్రభుత్వోద్యోగుల వేతన భత్యాలు, సబ్సిడీలు, వడ్డీరేట్ల చెల్లింపు మొదలైన వ్యయాలు కూడా అమితంగా పెరిగిపోయాయి. మరి మన వృద్ధిరేటు 6 నుంచి 8 శాతం మేరకు మాత్రమే ఉంటోంది. అంతరిక్ష పరిశోధన, కొత్త తరం ఇంటర్నెట్, జన్యు సాంకేతికతలు, డేటాప్రాసెసింగ్ మొదలైన రంగాలలో తక్షణమే సముచిత రీతిలో మదుపులు చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. మన ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటును 12నుంచి 15 శాతం మేరకు పెంపొందించుకోవాలంటే ఇది తప్పనిసరి. సబ్సిడీలను తగ్గించడానికి వీలులేదు. తగ్గిస్తే పేదల సంక్షేమం దెబ్బతింటుంది. వడ్డీ చెల్లింపులను తగ్గించడం మరింత కష్టం. తీసుకున్న రుణంలో కొంత భాగాన్ని అయినా వెంటనే చెల్లిస్తే గాని వడ్డీ చెల్లింపులను తగ్గించడం సాధ్యం కాదు. ప్రభుత్వ సిబ్బంది వేతన భత్యాలపై వ్యయాలను తగ్గిస్తే గాని కొత్త రంగాలలో మదుపులకు సొమ్ము లభించదు. ప్రశ్న ఏమిటంటే కరువు భత్యం (డి.ఎ.)ను స్తంభింప చేయడం లేదా విధినిర్వహణలో సామర్థ్యాన్ని గీటురాయిగా తీసుకొని ఏటా పది శాతం మంది అప్రయోజక ఉద్యోగులకు ఉద్వాసన చెప్పడం మొదలైన చర్యలను ఆర్థిక మంత్రి చేపడతారా? చేపడతారని నేను భావించడం లేదు. మోదీ ప్రభుత్వం అధికారులతోనే నడుస్తోంది సుమా! ప్రధానమంత్రి కార్యాలయంలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తోన్న అధికారులకు తాము సేవకులం మాత్రమేనని కేంద్ర మంత్రులు పలువురు వాపోతున్నారు. మరి ఆ ఉన్నతాధికారులు తమ సహచర ఉద్యోగ గణ ప్రయోజనాలకు విరుద్ధంగా ఎటు వంటి నిర్ణయాలు తీసుకోరని మరి చెప్పాలా?




మూడో ప్రశ్నకు వద్దాం. చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎస్ఎమ్ఇ) పునరుద్ధరణకు పటిష్ఠ చర్యలు చేపడతారా? ప్రస్తుతం వృద్ధిరేటు తక్కువ స్థాయిలో ఉన్నది. ఇదే సమయంలో షేర్ మార్కెట్ ఉరకలు వేస్తోంది. వ్యాపారం ఎస్ఎమ్ఇల నుంచి లిస్టెడ్ కంపెనీల (స్టాక్‌ఎక్స్ఛేంజ్ ప్రపధాన మార్కెట్‌లో నమోదయ్యే వాటాలను జారీ చేసే కంపెనీలు)కు బదిలీ అవ్వడం వల్లే ఈ విచిత్ర పరిస్థితి నెలకొన్నది. ఎస్ఎమ్ఇలను దెబ్బ తీసిన పెద్ద నోట్ల రద్దు, వస్తుసేవల పన్ను (జీఎస్టీ) ఈ కంపెనీలకు ఎటువంటి నష్టాన్ని కల్గించలేదు. ఎస్ఎమ్ఇల పతనం మార్కెట్‌లో డిమాండ్‌ను పూర్తిగా తగ్గించివేసింది. తత్ఫలితంగా వృద్ధిరేట్లు తగ్గిపోయాయి. ఆర్థిక వ్యవస్థ అంతా ప్రతికూలంగా ప్రభావితమయింది. అదే సమయంలో రంగం నుంచి ఎస్ఎమ్ఇలు నిష్క్రమించడంతో పెద్ద కంపెనీలు తమ లాభాలను పెంపొందించుకున్నాయి. దీంతో షేర్‌మార్కెట్లు ఉరకలు వేస్తున్నాయి. ఈ పరిస్థితి ఎంతోకాలం కొనసాగదు. కొనసాగలేదు. జీఎస్టీ మండలి నిరంతరం ఎస్ఎమ్ఇలకు అనుకూలంగా చర్యలు తీసుకొంటున్నది. అయితే ఆ చర్యలు ప్రయోజనకర ఫలితాలనివ్వడం లేదు. ప్రశ్న ఏమిటంటే ఎస్ఎమ్ఇలను కాపాడడానికై, ప్రభుత్వ అవసరాలకు చేసే కొనుగోళ్ళలో చిన్న, మధ్యతరహా సంస్థల ఉత్పత్తులకు ప్రాధాన్యమిచ్చే విధానాన్ని ఆర్థికమంత్రి పునః ప్రవేశపెడతారా? మోదీ ప్రభుత్వం ఈ సానుకూల చర్య తీసుకోగలదని నేను భావించడం లేదు. ఎందుకంటే ప్రభుత్వం అసలు సమస్యనే గుర్తించలేదు. ఇక పరిష్కరించడంపై ఏమి శ్రద్ధ చూపుతుంది?

చివరిప్రశ్న. పెట్రోలియం ఉత్పత్తులపై పన్నులు తగ్గిస్తారా? అంతర్జాతీయ విపణిలో చమురు ధరలు అంతకంతకూ పెరుగుతున్నాయి. సమీప భవిష్యత్తులోనూ, ఆ తరువాత కూడా ఆ ధరలు మరింతగా పెరిగే అవకాశమున్నది. అమెరికా ఆర్థిక వ్యవస్థ మళ్ళీ పుంజుకోవడంతో చమురు ధరలు పెరగడానికి ఆస్కారమేర్పడింది. కేంద్ర ప్రభుత్వం రవాణా ఇంధనంపై వసూలు చేస్తున్న పన్నులను తగ్గించాలని ప్రజల నుంచి డిమాండ్ వస్తోంది. వినియోగదారులను ఆదుకోవడానికి ఈ తగ్గింపు తప్పనిసరి. అయితే ఈ చర్య చమురు వినియోగం తగ్గుదలను నిరోధిస్తుంది. లీటర్ పెట్రోల్ ధర ప్రస్తుతం రూ.73గా ఉన్నది. ఈ ధరను రూ.85కు పెంచితే వినియోగం పది శాతం మేరకు తగ్గగలదు. పన్నుల తగ్గుదల ధర తక్కువ పెరుగుదలకు (రూ.73 నుంచి రూ.80కి) దారి తీస్తుంది. అయితే వినియోగం తగ్గుదల పెద్దగా ఉండదు. చెప్పవచ్చిందేమిటంటే పెట్రోలియం ధరలను పెంచడం వివేకవంతమైన నిర్ణయమవుతుంది. దిగుమతుల భారం తగ్గిపోగలదు. ప్రశ్నేమిటంటే ప్రజలనుంచి వస్తున్న డిమాండ్‌కు తలొగ్గి ఆర్థిక మంత్రి చమురుపై పన్నులను తగ్గిస్తారా? తగ్గిస్తారనే నా అంచనా. కనుక పన్నులు తగ్గుతాయి. చమురు వినియోగం యథాతథంగా కొనసాగడమే కాకుండా మరింతగా పెరుగుతుంది. చమురు వినియోగం బాగా పెరిగిపోవడం వల్ల మన ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యం మరింతగా దిగజారిపోవడం ఖాయం.

**(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగుళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)**

## గురుకుల డిగ్రీ ప్రిన్సిపాళ్ల పోస్టులకు
# అభ్యర్థులు కరువు

**» 30 పోస్టులకు 75 మంది దరఖాస్తు.. నలుగురు ఎంపిక**

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీకళాశాలల ప్రిన్సిపాళ్ల పోస్టులకు అభ్యర్థులు కరువయ్యారు. అర్హతా నిబంధనలే కారణంగా తెలుస్తోంది. ఐదేళ్ల డిగ్రీ లెక్చరర్‌గా, ఐదేళ్ల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, పదేళ్ల జూనియర్ లెక్చరర్‌గా పనిచేసిన వాళ్లే దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ప్రభుత్వ కాలేజీల్లో రెగ్యులర్‌గా పనిచేస్తున్న మహిళా అభ్యర్థులై ఉండాలన్నది. దీంతో 30 మహిళా డిగ్రీ కాలేజీల్లో 30 ప్రిన్సిపాళ్ల పోస్టులకు 75 దరఖాస్తులే వచ్చాయి. ఇందులో ఐదుగురు ఇం టర్వ్యూకు హాజరుకాగా నలుగురునే ఎంపిక చేశామని ఎస్‌పీఎస్సీ సెక్రటరీ వాణి ప్రసాద్ తెలిపారు.

### సీడీఎస్-టీ సిపార్డ్.. ఇక టీఎస్ఐఆర్‌డీ

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్-తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(సీడీఎస్-టీ సిపార్డ్) పేరును తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ)గా మారుస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### మిషన్ భగీరథకు బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణం

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మిషన్‌భగీరథ ప్రాజెక్టుకు బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.553.36 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూరు, మహేశ్వరం నియోజకవర్గాల్లో పనులకు ఈ నిధులు ఖర్చు చేస్తారు.

### మహిళల భద్రతకు స్మార్ట్‌ఫోన్‌లో 'బటన్'

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో మహిళలను రక్షించేందుకు స్మార్ట్‌ఫోన్‌లో ప్యానిక్‌బటన్‌ను రూపొందిస్తామని 2016-17 వార్షిక నివేదికలో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ తెలిపింది. శాటిలైట్ జీపీఎస్ సాయంతో ఈ ప్రక్రియకు 2018 నుంచే ప్రారంభిస్తామన్నది. మొబైల్‌లోని 5 లేదా 9 నంబర్‌ను ప్యానిక్ బటన్‌గా సెట్ చేస్తామని, అత్యవసర సమయాల్లో ఆ బటన్‌ను ప్రెస్ చేస్తే వారు ఎక్కడున్నారో కుటుంబసభ్యులకు, పోలీసులకు తెలుస్తుందని పేర్కొన్నది.

### ఫిబ్రవరి 1నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను ఫిబ్రవరి 1 నుంచి 21 వరకు నిర్వహిస్తామని ఇంటర్ బోర్డు తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 1632 జూనియర్ కళాశాలల్లోని 3,38,480 మంది విద్యార్థులు హాజరవుతారని, 6,410 మందిని ఎగ్జామినర్లుగా నియమించామని పేర్కొంది.

### యూఆర్ఎస్ టీచర్ల వేతనాలు పెంపు

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల ఉపాధ్యాయుల వేతనాలు పెరిగాయి. స్పెషల్ ఆఫీసర్ల వేతనాలను నెలకు రూ.25 వేలు, కాంట్రాక్టు టీచర్ల వేతనాలను నెలకురూ.20 వేలుగా పెంచుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

### 10న ఎస్పీడీ కార్యాలయం ముట్టడి: యూటీఎఫ్

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలంటూ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల ఉద్యోగులు యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న టీచర్లను సస్పెండ్ చేస్తానంటూ నాగర్‌కర్నూల్ డీఈవో ఎస్ఎంఎస్‌లు పంపించడాన్ని రాష్ట్ర యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఖండించారు. సమస్యలు పరిష్కరించకుంటే ఫిబ్రవరి 10న ఎస్పీడీ కార్యాలయాన్ని ముట్టడిస్తామనిహెచ్చరించారు.

### కోమటిరెడ్డి కాదు.. అబద్ధాల వెంకటరెడ్డి: పల్లా



హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌ది రాజకీ య హత్య కాదని పోలీసులు వెల్లడించినా కోమటిరెడ్డి బ్రదర్స్, కాంగ్రెస్ నేత లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న గొడవలో క్షణికావేశానికి గురై శ్రీనివాస్ ను అతడిఅనుచరులే హత్య చేశారన్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి కాస్తా అబద్ధాల వెంకటరెడ్డిగా మారారన్నారు. స్ట్రీట్‌ఫైట్‌ని స్టేట్‌ఫైట్‌గా మార్చాలన్న వెంకటరెడ్డి ప్రయత్నాలు సఫలం కాలేదని, ప్రభుతాన్ని బదనాం చేసేలా శ్రీనివాస్ భార్యపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు కోమటిరెడ్డి లేదా డీకే అరుణతోనే ముప్పు అన్నారు.

### ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్స్ పోస్టుల భర్తీ

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పొల్యూషన్ కంట్రోల్‌బోర్డులో 26 ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్స్ పోస్టులకు గానూ 25 మందిని ఎంపిక చేసినట్లు టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ వాణీప్రసాద్ తెలిపారు. మరోముగ్గురు జూనియర్‌అసిస్టెంట్ కం టైపిస్టు పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు. తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల విద్యా సంస్థల్లో 6 ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు ముగ్గురే ఎంపికయ్యారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ 7 పోస్టులకు 6 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు.

### సకల నేరస్థుల సర్వేపై హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఓ కేసులో తనను కోర్టు నిర్దోషిగా ప్రకటించినా తన వివరాలు ఇవ్వాలంటూ కల్వకుర్తి ఎస్‌హెచ్‌వో వేధిస్తున్నారంటూ కల్వకుర్తికి చెందిన అబ్దుల్ హఫీజ్ సకల నేరస్థుల సర్వేను సవాల్ చేస్తూ సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తరచూ నేరాలకు పాల్పడుతున్న వారిపై నిఘా ఉంచేందుకు వారి వివరాలు సేకరించాలంటూ పోలీసు ఉన్నతాధికారులు ఈనెల 3న సర్క్యులర్ జారీచేశారు. తన వివరాలు ఇవ్వకుంటే జైలుకు పంపుతానంటూ బెదిరిస్తున్నారని హఫీజ్ పేర్కొన్నారు.

### గిరిజన రైతులకు సబ్సిడీ ట్రాక్టర్లు : చందూలాల్



హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గిరిజన రైతులకు సబ్సిడీ ట్రాక్టర్లను మంజూరు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి అజ్మీరా చందూలాల్ ఆదేశించారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజనులతో పాటు, మైదాన ప్రాంతాల్లో నివసిస్తూ, 5 ఎకరాలు, అంతకంటే ఎక్కువ భూమి కలిగిన గిరిజన రైతులకు ఎస్టీఎస్‌డీఎఫ్ ద్వారా 50% సబ్సిడీతో ట్రాక్టర్లు ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది.

### తెలుగుకు సులువైన పాఠ్యపుస్తకాలు : కడియం



హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు తెలుగును తప్పనిసరి చేయడంలో భాగంగా సరళమైన పాఠ్యాంశాల తో నూతనపాఠ్యపుస్తకాలను ముద్రిస్తున్నామని ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. తప్పనిసరి తెలుగు, భాషా పండితుల సమస్యలపై సోమవారం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. 2018-19 విద్యా సంవత్సరం నుంచి తెలుగు భాషను తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

## చీడ పురుగులు ఇంకా ఉన్నాయి!

**» సమీక్షలో నేతల తీరుపై తెలుగు తమ్ముళ్ల ఆక్రోశం**

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): "పార్టీలో చీడపురుగులున్నాయి.. మీరు వాళ్లను పంపించకపోతే మేమే ఏరేస్తాం" అని టీడీపీ శ్రేణులు రాష్ట్ర నాయకత్వానికి తేల్చిచెప్పాయి. ఎన్టీఆర్‌భవన్‌లో 'పల్లెపల్లెకు తెలుగుదేశం'పై సోమవారం జరిగిన సమీక్షలో క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని నియోజకవర్గ నాయకులు కుండబద్ధలు కొట్టారు. పార్టీకి నమ్మకద్రోహం చేసి వెళ్లిన నాయకులతో కార్యకర్తలెవరూ వెళ్లలేదని, కేడర్‌కు జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు భరోసా ఇవ్వాలని కోరారు. మోత్కుపల్లి నర్సింహులు వ్యాఖ్యలపైనా నియోజకవర్గ నాయకులు మండిపడ్డారు. కాగా, పార్టీ కార్యకర్తలెవ్వరూ అధైర్యపడవద్దని టీడీపీటీఎస్ అధ్యక్షుడు రమణ సూచించారు. మార్చి 29న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బహిరంగసభకు చంద్రబాబు హాజరవుతారని, ఆ వేదికపై మేనిఫెస్టో ప్రకటిస్తామని పార్టీ నేత పెద్దిరెడ్డి వెల్లడించారు.

# కాంగ్రెస్‌కు 70 స్థానాలు.. కలే!



సభకు హాజరైన ప్రజలు

## ఏం చేశారని అన్ని సీట్లు వస్తాయి

**» పాలమూరులో ఎన్ని ప్రాజెక్టులు కట్టారు ?**

**» చెక్కుల రూపంలోనే 'పెట్టుబడి': హరీశ్**

వనపర్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): "రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ఏం చేసిందని 2019 ఎన్నికల్లో 70 సీట్లు గెలుస్తది..ప్రాజెక్టులను పెండింగ్‌లో ఉంచినందుకా? రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఎగ్గొట్టినందుకా? పగటి పూట 9గంటల కరెంటు ఇస్తామని 3 గంటలు కూడా ఇవ్వనందుకా?" అంటూ ఉత్తమ్‌ను ఉద్దేశించి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ ప్రశ్నించారు. వనపర్తి జిల్లాలో సోమవారం పర్యటించిన ఆయన వెల్టూరు, చిట్యాలలో మార్కెట్ గోదాంలను ప్రారంభించారు. అలాగే, పెద్దమందడి బ్రాంచ్ కెనాల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన రైతు సభలో మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో పాలమూరు ప్రాజెక్టులను పదేళ్లు పెండింగ్‌లో ఉంచి 50 వేల ఎకరాలకే సాగు నీరందించారని, తాము అధికారంలోకి వచ్చాక మూడున్నరేళ్లలోనే ఉమ్మడి పాలమూరుజిల్లాలో 6.5 లక్షల ఎకరాలకు సాగునీరందించామన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న పదేళ్లు రైతులు ఎరువులు, విత్తనాల కోసం పోలీస్‌స్టేషన్ల వెంట తిరిగేవారని, కరెంటు కోసం రోడ్డెక్కి ధర్నాలు, రాస్తారోకోలు చేసేవారని గుర్తుచేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రైతులకు 24 గంటల ఉచిత కరెంటును సరఫరా చేస్తున్న ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉంటే మరో పదేళ్లయినా ఈ ఘనత సాధ్యమయ్యేది కాదన్నారు. 2009 ఎన్నికల్లో 9 గంటలు పగటి పూట విద్యుత్ ఇస్తామని చెప్పి రెండు పూటలా కలిపి కనీసం 6గంటలు కూడా ఇవ్వని విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకోవాని హితవు పలికారు. కాంగ్రెస్ హయాంలోనే పాలమూరు ప్రాజెక్టులు 90 శాతం పూర్తయ్యాయని పదేపదే చెబుతున్న నాయకులు నెట్టెంపాడు, కల్వకుర్తి ప్రాజెక్టుల ద్వారా ఎన్ని ఎకరాలకు నీళ్లిచ్చారో సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. పంట నష్టపోయిన రైతులకు కేంద్రం మంజూరు



చేసిన ఇన్‌పుట్ సబ్సిడీ రూ.480 కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొడితే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత చెల్లించామన్నారు. మొసలి కన్నీరు కారుస్తున్న కాంగ్రెస్ నేతలకు చిత్తశుద్ధి ఉంటే ప్రాజెక్టులపై పెట్టిన కేసులను ఇప్పటికైనా విత్‌డ్రా చేసుకోవాలన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక కల్వకుర్తి ఎత్తిపోతల పథకం సామర్థ్యాన్ని 25 టీఎంసీల నుంచి 40 టీఎంసీలకు పెంచామని తెలిపారు. భవిష్యత్తులో కల్వకుర్తి, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాలకు వరద జలాలు కాకుండా నికర జలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కాగా, ఎకరాకు రూ.4 వేల పెట్టుబడి సాయాన్ని రైతులకు చెక్కుల రూపంలోనే అందించనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఏ కూటమి పెట్టినా విజయం మాదే

**» ఉత్తమ్‌వన్నీ ప్రగల్భాలే: ఎమ్మెల్యే చల్లా**

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఏ కూటమి ఏర్పాటు చేసినా రానున్న ఎన్నికల్లో టీఆర్ఎస్‌దే విజయమని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు ధీమా వ్యక్తం చేశారు. మహాకూటమిలో చేరే ఏ పార్టీకీ పెద్దగా బలం లేదని, కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటూ రాదన్నారు. టీఆర్ఎస్ఎల్పీలో సోమవారం టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రావుతో కలిసి పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ 70 సీట్లు గెలుస్తుందని ఉత్తమ్ ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే దాకా గడ్డం తీయనని ఉత్తమ్ శపథం చేశారని, ఆయన గడ్డం భూమిని తాకినా అది సాధ్యమయ్యే పని కాదన్నారు. పరకాలలో తనపై ఉత్తమ్ పోటీ చేసి గెలిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ చేశారు. ఆయనకు ధైర్యం లేకపోతే రేవంత్‌రెడ్డితో పోటీ చేయించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను టీఆర్ఎస్‌లో చేరానన్నారు. బ్లాక్‌మెయిలర్, బ్రోకర్ అయిన రేవంత్‌రెడ్డిని పార్టీలో చేర్చుకున్న ఉత్తమ్.. పరకాలకు అత్యధిక నిధులు తెచ్చిన తనను బ్రోకర్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

# కృష్ణ కొల్లేరైంది!



(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టు కాల్వల నీటిలభ్యత ప్రాంతాలకు చేరుకున్నారు. నది పక్కనఉన్న భూములను లీజ్‌కు తీసుకొని చేపల చెరువుల తవ్వకం ప్రారంభించారు. జిల్లాలోని ఇటిక్యాల, ధరూర్,గద్వాల మండలాల్లో రూ.150 కోట్లతో చేపల చెరువులు తవ్వారు. రైతులపేరున ఉన్నభూములను ఎకరానికి రూ.30 వేలు చొప్పున లీజ్‌కు తీసుకొన్నారు. స్థానిక నాయకుల అండతో కొందరు బంచరాయి, ప్రభుత్వభూముల్లోనూ చేపల చెరువులు తవ్వారనే ఆరోపణలున్నాయి. ఇందులో నిషేధిత క్యాట్‌ఫిష్‌లనూ పెంచుతున్నారు. క్యాట్‌ఫిష్ పెంచుతున్న చెరువులపై పలుమార్లు దాడులు నిర్వహించారు. ఫంగస్ అనే తెల్ల చేపను పెంచుతున్నవారు కూడా ఉన్నారు.



ఇటిక్యాల ప్రాంతంలోని చేపల చెరువులు

#### వ్యర్థాల వినియోగంతో అనర్థాలు..

చెరువుల్లో పెంచుతున్న చేపలకు ఆహారంగా మత్స్యశాఖ సలహాతో ఆరోగ్యకరమైన దాణాను వాడాలి. కానీ, చేపల చెరువుల నిర్వాహకులు మాంసం, కుళ్లిన కోడిగుడ్ల వ్యర్థాలను ఉడికించి చేపలకు వేస్తున్నారు. వీటిని తిని పెరిగిన చేపలను ఆరగించినవారు అనారోగ్యం పాలవుతారని వైద్యులు చెబుతున్నారు.క్యాట్‌ఫిష్ తింటే వాతంతో పాటు పాత రోగాలు బయటపడే ప్రమాదం ఉందని మత్స్యశాఖ అధికారి మధుసూదన్ అంటున్నారు. వ్యర్థాల వినియోగంపై నిఘా లేకపోవడంతో రాత్రివేళల్లో చికెన్, మటన్, కోడిగుడ్ల దుకాణాల నుంచి వ్యర్థాలను చేపల చెరువులకు ట్రాలీల్లో చేర్చుతున్నారు.

#### నీటిని గుంజేస్తున్నారు..

కృష్ణానది ఒడ్డున 1200 ఎకరాల్లో 1000కి పైగా చేపల చెరువుల్లోకి అనుమతి లేకుండానే నీటిని తీసుకుంటున్నారు. నది నుంచి నేరుగా పైపులైన్లు వేసుకొని విద్యుత్తు చౌర్యంతో నీటిని తోడుకుంటున్నారు. మరికొందరు జూరాలప్రాజెక్టు కుడికాల్వ నుంచి నీటిని పంపుల ద్వారా నింపుకొంటున్నారు. దీనివల్ల ఆయకట్టు చివరి ప్రాంతాలకు సాగునీరు అందడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండతో చేపల చెరువుల నిర్వహణకు, నివాస గుడిసెలకు విద్యుత్తును అక్రమంగా వాడుకుంటున్నారు. ఒక చేపల చెరువు ఎకరం నుంచి ఐదెకరాల విస్తీర్ణంలో ఉంటుంది. భారీగా పెట్టుబడులు పెట్టిన బడా నాయకులు ఏడాదిలో రెండు మూడు సార్లు చేపలు, రొయ్యల దిగుబడులను తీసి నెల్లూరుకు ఎగుమతి చేస్తారు. అక్కడి నుంచి విదేశీ కంపెనీలు రొయ్యలను తీసుకెళతాయి. క్యాట్‌ఫిష్, ఫంగస్ లాంటి చేపలను కర్ణాటక, ఏపీ, తెలంగాణలోని కొన్ని జిల్లాలతో పాటు మహారాష్ట్రకు ఎగుమతులు చేస్తున్నారు.

#### ఎవరికీ అనుమతుల్లేవు



చేపల చెరువుల నిర్వహణకు ఎవరూ మత్స్యశాఖ నుంచి అనుమతులు తీసుకోలేదు. క్యాట్‌ఫిష్ పెంచుతున్నారనే ఆరోపణలతో దాడులు నిర్వహిస్తుండగా అక్రమ చెరువుల విషయం వెలుగు చూసింది. వీటిపై ఉన్నతాధికారుల అనుమతులు తీసుకొని ఏం చేయాలనే విషయమై ఆలోచిస్తాం. జిల్లాలో ఈ చేపల చెరువులు ఒక మాఫియాగా నడుస్తుండడం విస్మయపరుస్తోంది.

**– మధుసూదన్, జిల్లా మత్స్యశాఖ అధికారి, గద్వాల**

## బడ్జెట్ @ 1.8 లక్షల కోట్లు..!



**» బడ్జెట్‌పై ఆర్థిక శాఖ సమీక్షలు పూర్తి**

**» సీఎం ఆమోదం తర్వాత తుది రూపు**

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): 2018-19 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ రూ.1.75 లక్షల కోట్ల నుంచి రూ.1.80 లక్షల కోట్ల మధ్యలో ఉంటుందని ఆర్థిక శాఖ వర్గాలు భావిస్తున్నాయి. ఈ బడ్జెట్‌పై ఈ నెల 20న ప్రారంభమైన ఆర్థిక శాఖ సమీక్షలు సోమవారం పూర్తయ్యాయి. రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు రోజూ 3, 4 శాఖల ప్రతిపాదనలను సమీక్షించారు. 2017-18 బడ్జెట్ వాస్తవ వ్యయాలు, కొత్త ప్రతిపాదనలు, సిబ్బంది, అధికారుల సంఖ్య, వారి జీత, భత్యాల వ్యయం తదితర అంశాలన్నింటిపై సమీక్ష నిర్వహించారు. ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ఈ నెల 25న అన్ని శాఖల ప్రతిపాదనలను సమీక్షించారు. ఈ ప్రతిపాదనలకు సీఎం కేసీఆర్ ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. ఫిబ్రవరి ఒకటిన ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్ తర్వాత సీఎం కేసీఆర్ రాష్ట్ర బడ్జెట్‌ను సమీక్షిస్తారు. అయితే.. ఈ సారి అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలు భారీగానే వచ్చినా గత కేటాయింపులపై పెంపుదల 15% మాత్రమే ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఈ సారి సాగునీరు, వ్యవసాయ శాఖలకే పెద్ద వేయనుంది. వ్యవసాయం, దాని అనుబంధ శాఖలు, సాగు నీటి శాఖలకు 20 శాతానికి పైగా నిధులు కేటాయించనుంది. సాగు నీటి శాఖ నుంచి రూ.27 వేల కోట్ల పైచిలుకు ప్రతిపాదనలు వచ్చినట్లు సమాచారం. ఈ సారి అమలు చేయనున్న పెట్టుబడి మద్దతు పథకం పద్దు కింద రూ.12 వేల కోట్లు కేటాయించాలని వ్యవసాయ శాఖ కోరినట్లు తెలిసింది. బీసీ సంక్షేమానికీ నిధుల కేటాయింపు భారీగానే ఉండే అవకాశముంది. రూ.25 వేల కోట్లతో బీసీ ప్రత్యేక అభివృద్ధి పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించే అవకాశం ఉంది. దానికి తగ్గట్లుగానే బీసీ సంక్షేమ శాఖ ప్రతిపాదనలు సమర్పించింది.

# ఐరిస్‌తో రేషన్!

**» అక్రమాలకు వంద శాతం చెక్**

**» తప్పనున్న వేలిముద్రల సమస్యలు**

**» ఈపాస్ యంత్రాలతో అనుసంధానం**

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో ఇకపై ఐరిస్(కంటి చూపు) ద్వారా నిత్యావసరాలు అందజేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం అమలవుతున్న ఈ-పాస్ యంత్రాలతో ఇప్పటికే అక్రమాలకు చెక్‌పెట్టిన ఈ శాఖ మరో అడుగు ముందుకు వేసి అన్ని రేషన్ దుకాణాల్లో ఐరిస్ ద్వారానే నిత్యావసరాలను పంపిణీ చేయాలని భావిస్తోంది. ఐరిస్ టెక్నాలజీని అందజేసే ఓ సంస్థ ప్రతినిధులతో కమిషనర్ సీవీ ఆనంద్ సోమవారం సివిల్ సప్లై శాఖ కార్యాలయంలో చర్చించారు. వారం రోజుల్లో ఇందుకు సంబంధించిన విధివిధానాలతో నివేదిక ఇవ్వాలని సంస్థ ప్రతినిధులను కమిషనర్ కోరినట్లు సమాచారం.

#### సమస్యలు అధిగమించేందుకే..

ఈ-పాస్ మిషన్లు ప్రారంభించిన తొలినాళ్లలో పలు సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిజేసే వారి వేలిముద్రలు అరిగిపోవడంతో రేషన్ తీసుకోవడం ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా మహిళలు, వృద్ధుల వేలిముద్రలను ఈపాస్ మిషన్లు గుర్తించకపోవడంతో వారికి బియ్యం అందలేదు. వేలిముద్రలు గుర్తించని కారణంగా సరుకులు అందని వారిని గ్రామాల్లో వీఆర్వోలు, గ్రేటర్ పరిధిలో పౌరసరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్లు గుర్తించి వారి అథెంటికేషన్‌తో రేషన్ ఇచ్చే వెసులు బాటును ప్రభుతత్వం కల్పించారు. ఇది కూడా పెద్దయెత్తున దుర్వినియోగం అవుతున్నట్టు పౌరసరఫరాల శాఖ అంతర్గత విచారణలో వెల్లడైంది. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు పౌరసరఫరాల శాఖ ఐరిస్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించింది.



#### కంటిచూపుతో రేషన్

రాష్ట్రంలోని 17,200 రేషన్ దుకాణాల్లో బియ్యాన్ని ఇప్పటికే ఈ-పాస్ ద్వారానే అందిస్తున్నారు. వీటన్నింటిలోనూ ఐరిస్ పరికరాలను అనుసంధానం చేస్తారు. ఆధార్‌నంబరు రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో ప్రతి ఒక్కరూ ఐరిస్ ఇచ్చి ఉంటారు. తద్వారా ఐరిష్ ద్వారా రేషన్ ఇవ్వడం తేలికవుతుందని అధికారులు భావిస్తున్నారు.డూప్లికేషన్ సమస్యలు కూడా రావంటున్నారు. కాగా.. ఒక్కో ఐరిస్ పరికరానికి ప్రభుత్వం రూ.5 వేల వరకు ఖర్చు చేయనుంది. ఐరిస్ విధానం అమల్లోకి వస్తే రేషన్ దుకాణాల్లో ప్రతి బియ్యపు గింజకు లెక్క పక్కాగా ఉంటుంది. అక్రమాలకు వందశాతం ఫుల్‌స్టాప్ పడనుంది.

### పంట బీమాకు ఉమ్మడి నోటిఫికేషన్

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రానున్న ఖరీఫ్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, సవరించిన వాతావరణ ఆధారిత పంటల బీమాలకు ఉమ్మడి నోటిఫికేషన్ జారీ చేయాలని పంటల బీమా రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ(ఎస్ఎల్‌సీసీఐ) నిర్ణయించింది. వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథి నేతృత్వంలో సోమవారం సచివాలయంలో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ ఖరీఫ్‌లోనూ రాష్ట్రంలోని 30 జిల్లాలను ఆరు క్లస్టర్లుగా చేసి నోటిఫికేషన్లు జారీ చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథి మాట్లాడుతూ రానున్న ఖరీఫ్‌లో వరి, జొన్న, మొక్కజొన్న, కంది, పెసర, మినుము, సోయాబీన్, పసుపు, వేరుశనగ, పత్తి, మిర్చి, బత్తాయి, పామాయిల్ పంటకు సవరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా వర్తింపజేయాలని నిర్ణయించామన్నారు. పరిహారం చెల్లింపు స్థాయిని 80 శాతంగా నిర్ణయించామని చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్‌మోహన్, ఉద్యానవన శాఖ డైరక్టర్ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బీడీ కార్మికులకు జీఎస్టీ పోటు!

(మొదటి పేజీ తరువాయి)

వివరాలేవీ కార్మికులకు తెలియడం లేదు. డబ్బు కోసం ప్రతిసారీ బ్యాంకుకు వెళ్లి అడగాల్సి రావడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

#### జీఎస్టీ నుంచి మినహాయించాలి

బీడీ పరిశ్రమపై ఆధారపడి దేశ వ్యాప్తంగా 7 కోట్ల మంది కార్మికులు జీవిస్తున్నారు. గతంలో బీడీ కంపెనీలో 20 రోజులు పని దినాలు కొనసాగుతుండగా ప్రస్తుతం పది రోజులకు పడిపోయింది. బీడీ పరిశ్రమను జీఎస్టీ నుంచి మినహాయించాలి.

**– రేగుల్ల సత్యనారాయణ, బీడీ టేకేదార్, ఆర్మూర్**

#### పని దొరకడం లేదు

బీడీ కంపెనీల్లో పని దొరక్కపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గతంలో రూ.1000-2000 వరకు సంపాదించే వాళ్లం. ప్రస్తుతం రూ.1000 కూడా రావట్లేదు. చేసే పని దొరకడం లేదు.

**– పల్లికొండ సువర్ణ, బీడీ రోలర్, ఆర్మూర్**

### '1.50 లక్షల టన్నుల కందులు సేకరించండి'

**» కేంద్రానికి రాష్ట్రం లేఖ**

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్దతు ధరకు కందుల సేకరణ పరిమితిని 1.50లక్షల టన్నులకు పెంచాలని, సేకరణకు తుది గడువును మార్చి 31 వరకు పొడిగించాలంటూ కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శికి రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి లేఖ రాశారు. రాష్ట్రంలో ఈ ఏడాది 2.84లక్షల టన్నుల కంది దిగుబడి రానుందని లేఖలో పేర్కొన్నారు.



చంచల్‌గూడ జైలు నుంచి విడుదలై బయటకు వస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

## కేసీఆర్‌తో నా ప్రాణానికి ముప్పు

**» పోలీసులతో ఎన్‌కౌంటర్ చేయించేందుకు కుట్ర**

**» గజ్వేల్‌లో ఓడిపోతానని ఆయనకు భయం : వంటేరు**

**» చంచల్‌గూడ జైలు నుంచి బెయిల్‌పై విడుదల**

సైదాబాద్/హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సీఎం కేసీఆర్ నుంచి తన ప్రాణానికి ముప్పు ఉందని టీడీపీటీఎస్ నేత, తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తనను పోలీసులతో ఎన్‌కౌంటర్ చేయించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. వంటేరు స్వగ్రామం దౌలాపూర్‌కు చెందిన ఓయూ విద్యార్థి మురళి డిసెంబరు 3న ఆత్మహత్య చేసుకోగా, విద్యార్థుల ఆందోళనకు ఆయన మద్దతు పలికారు. ఈ క్రమంలో జరిగిన అల్లర్లపై నమోదైన కేసులో అప్పుడే వంటేరు అరెస్టు కాగా, నాలుగు రోజుల తర్వాత బెయిల్ లభించింది. మరో మూడు కేసుల్లో పోలీసులు అరెస్టు చేస్తారని తెలిసి డిసెంబరు 12న అజ్ఞాతంలోకి వెళ్లిన ఆయనను ఈ నెల 9న సుచిత్ర వద్ద సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. 10వ తేదీన కోర్టులో హాజరుపర్చగా, 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. రిమాండ్ అనంతరం పోలీసులు కస్టడీ కోరగా నిరాకరించిన కోర్టు విచారణను వాయిదా వేసింది. ఎట్టకేలకు ఆయనకు బెయిల్ మంజూరు కావడంతో జైలు నుంచి సోమవారం రాత్రి విడుదలయ్యారు. ఈ సందర్భంగా వంటేరు మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ రాష్ట్రాన్ని పోలీస్‌రాజ్యంగా మారుస్తున్నారని, తనకు హాని జరిగితే ఆయనే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. 2019లో గజ్వేల్‌లో ఓడిపోతానన్న భయంతోనే కేసీఆర్ తనపై తప్పుడు కేసులు బనాయించి జైల్లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందంటూ కోదండరాం పర్యటనకు అనుమతించని పోలీసులు.. పవన్‌కల్యాణ్‌కు అనుమతి ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తనకు జరిగిన అన్యాయాన్ని గజ్వేల్ నియోజకవర్గంలో ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరిస్తానన్నారు. ఇక్కడి నుంచి ఆత్మహత్య చేసుకున్న మురళి కుటుంబసభ్యులను పరామర్శించడానికి వెళ్తున్నట్లు తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన వందలాది మంది కార్యకర్తలు జైలు వద్దకు తరలిరాగా, పోలీసులు వారిని బలవంతంగా వెళ్లగొట్టారు. అనంతరం శామీర్‌పేట వద్ద కార్యకర్తలను వంటేరు కలుసుకున్నారు.

# పంచాయతీల అనుమతి అక్కర్లేదు!

- పారిశ్రామికవాడలకు స్వయం ప్రతిపత్తి
- పీఆర్ నూతన చట్టంలో చేర్చే ఆలోచనలో సర్కారు

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవాడల ఏర్పాటులో పంచాయతీలకు సంబంధం లేకుండా.. వాటికే స్వయం ప్రతిపత్తిని ఇచ్చే దిశగా సర్కారు అడుగులు వేస్తోంది. ఈ మేరకు నూతన పంచాయతీరాజ్ (పీఆర్) చట్టంలో నిబంధనను పొందుపర్చనున్నట్లు విశ్వసనీయ సమాచారం. భౌగోళికంగా ఇవి గ్రామ పంచాయతీ పరిధిలోనే ఉన్నా.. వాటిలో నెలకొల్పే సంస్థల విషయంలో అనుమతులను గ్రామ పంచాయతీతో సంబంధం లేకుండా నేరుగా ప్రభుత్వ శాఖల ఆధీనంలో చేసే విషయాన్ని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. పరిశ్రమల ఏర్పాటుకు గ్రామ పంచాయతీ పాలక మండలి తీర్మానాన్ని మినహాయించాలనే నిర్ణయాన్ని ఇప్పటికే మంత్రి వర్గ ఉప సంఘంతో పాటు అధికారులతో కూడిన కమిటీ తీసుకున్నట్లు సమాచారం. తాజాగా పారిశ్రామిక వాడల్లో ఏర్పాటు చేసే సంస్థలకు కూడా పంచాయతీతో సంబంధం లేకుండా చూడాలని యోచిస్తున్నారు. పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాలన్నీ.. మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న విషయం తెలిసిందే. అంటే, పంచాయతీలు నిర్వహించాల్సిన బాధ్యతను మౌలిక సదుపాయాల కల్పన సంస్థ చేపడుతోంది. ఈ క్రమంలో పంచాయతీలకు చెల్లించాల్సిన కొన్ని రకాల పన్నుల నుంచి కూడా పారిశ్రామిక వాడలను మినహాయించే అవకాశం ఉంది. నూతన చట్టం ముసాయిదా పూర్తయ్యేలోగా ఈ అంశాన్ని పరిశీలించే అవకాశం ఉందని సమాచారం.

సరుకుల విలువ రూ. 50వేలు మించితే..

# ఈ-వేబిల్లులు తప్పనిసరి

- లేదంటే.. భారీ జరిమానా
- ఫిబ్రవరి 1 నుంచి అమలు
- రాష్ట్ర పన్నుల కమిషనర్ అనీల్ కుమార్

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ, అంతర్‌రాష్ట్రీయ సరుకు రవాణాల్లో.. వస్తువుల విలువ రూ. 50వేలకు మించితే.. తప్పనిసరిగా ఈ-వేబిల్లులు తీసుకోవాలని రాష్ట్ర పన్నుల కమిషనర్ వీ అనీల్‌కుమార్ తెలిపారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఈ నిబంధనను అమలు చేయనున్నట్లు వెలడించారు. రాష్ట్రంలోని ట్రాన్స్‌పోర్టర్లు, సప్లయర్లు తప్పనిసరిగా ఛ్రీఁఞజీజూజూ.ఱ జీఛి.జీ, ఛ్రీఁఞజీజూజూఞట్టజౌ౭.జీ వెబ్‌సైట్లలో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారికి టీజీఎస్టీ చట్టం మేరకు భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఇందుకు సంబంధించి అనుమానాలేమైనా ఉంటే.. స్థానిక సర్కిల్ కార్యాలయాల్లో గానీ, టోల్‌ఫ్రీ నంబరు 1800-425-3787కు ఫోన్ చేసి గానీ నివృత్తి చేసుకోవాలని సూచించారు.

మూడు డాక్యుమెంట్లతో..

# మూడు రోజుల్లో పాస్‌పోర్టు



- బ్యూరోక్రాట్ల తనిఖీ పత్రానికి స్వస్తి
- ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి విష్ణువర్ధన్ రెడ్డి

సికింద్రాబాద్/హైదరాబాద్, జనవరి 29: మూడు కీలక డాక్యుమెంట్లు ఉంటే చాలు.. ఇక పాస్‌పోర్టు మూడు రోజుల్లో వస్తుంది. పైగా.. ఇకపై బ్యూరోక్రాట్లు, గ్రూప్-1 అధికారుల తనిఖీ పత్రం అవసరం లేకుండా.. కేంద్రం నిబంధనలను సడలించింది. అంటే.. సామాన్యులు కూడా తత్కాల్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి విష్ణువర్ధన్ రెడ్డి ఈ విషయాలను వెల్లడించారు. 'ఇకపై తత్కాల్‌కు దరఖాస్తు చేసుకునేవారు ఒక స్వయం ప్రకటిత (సెల్ఫ్ డిక్లరేషన్) పత్రంతో పాటు.. ఆధార్‌కార్డు/ఆధార్ నమోదు నంబరు, గుర్తింపు/నివాస ధ్రువీకరణకు సంబంధించిన 12 పత్రాల్లో ఏవైనా రెండింటిని సమర్పిస్తే సరిపోతుంది. తత్కాల్ మొదటి కేటగిరీ రుసుం రూ. 3,500 (రూ. 1,500 సాధారణ ఫీజు, రూ. 2వేలు అదనపు చార్జీలు) చెల్లిస్తే.. మూడు రోజుల్లో పాస్‌పోర్టును జారీ చేస్తాం. ఒకవేళ పైన పేర్కొన్న డాక్యుమెంట్లు జతచేసి, రూ. 1,500 (సాధారణ ఫీజు) చెల్లిస్తే.. తత్కాల్ రెండో కేటగిరీ కింద పరిగణించి మూడు నుంచి ఏడు రోజుల్లో పాస్‌పోర్టును జారీ చేస్తాం' అని వివరించారు.

సర్పంచ్ ఉప ఎన్నికల్లో

# కారు జోరు

- 22 పంచాయతీల్లో ఉప ఎన్నికలు
- 15 చోట్ల టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపు
- 5చోట్ల కాంగ్రెస్ మద్దతుదార్లు, 2 చోట్ల స్వతంత్రులు విజయం

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లోని పంచాయతీల సర్పంచ్ పదవులకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్ పార్టీ సత్తా చాటింది. 22 సర్పంచ్ పదవుల్లో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు 15 చోట్ల గెలుపొందారు. మొత్తం 15 జిల్లాల పరిధిలోని 22 గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవులకు, 165 వార్డు సభ్యుల పదవులకు సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నిక నిర్వహించి, వెంటనే లెక్కింపు ప్రారంభించారు. పార్టీ రహితమైన ఈ ఎన్నికలకు ఆయా పార్టీలు మద్దతిచ్చి తమ అభ్యర్థులను గెలిపించుకున్నాయి. 15 చోట్ల అధికార టీఆర్ఎస్, ఐదింటిలో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందగా.. రెండు చోట్ల స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. కేసీఆర్ సొంత జిల్లా సిద్దిపేటలోని పొట్లపల్లిలో కాంగ్రెస్ గెలిచింది. అలాగే సంగారెడ్డి జిల్లా మానూరు మండలం రాయికోడ్‌లో కూడా విజయకేతనం ఎగురవేసింది. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం బోరెగాంలో టీఆర్ఎస్ గెలిచింది. భద్రాద్రికొత్తగూడెం జిల్లా సుజాతనగర్ సర్పంచ్ పదవికి టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోటీ చేసిన సీపీఎం అభ్యర్థికి కాంగ్రెస్, సీపీఐ, టీడీపీలు మద్దతిచ్చాయి. అయినా ఇక్కడ టీఆర్ఎస్ విజయం సాధించింది. అదే జిల్లా గుంపెనలో కూడా గులాబీ పార్టీనే గెలిచింది. పెద్దపల్లి జిల్లా బ్రాహ్మణపల్లిలో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. అయితే గెలిచిన అభ్యర్థికి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి టీఆర్ఎస్ కండువా కప్పి, ఫలితాన్ని పార్టీ ఖాతాలో వేసుకున్నారు. కాగా నాగర్‌కర్నూలు జిల్లా గడ్డంపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. వనపర్తి జిల్లా వీనపగండ్లలో కాంగ్రెస్ గెలిచింది. జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం రామాపురంలో కాంగ్రెస్ గెలిచింది. ఇక కరీంనగర్ జిల్లాలోని ఉప్పర్ మాల్యాల, మహబూబాబాద్ జిల్లాలోని గుర్తూరు, బూరుగుపల్లి, గుండంరాజ్‌పల్లి, మంచిర్యాల జిల్లా కర్నమామిడి, మెదక్ జిల్లా అల్లీపూర్, దామరంచ, నల్గొండ జిల్లా వద్దిపట్ల, పాలెం, సూర్యాపేట జిల్లా మానాపురంలో అధికార టీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు. వనపర్తి జిల్లాలోని నాగల్‌కడ్మూర్‌లో స్వతంత్ర అభ్యర్థి గెలిచారు. కాగా, మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలంలోని గుండంరాజుపల్లి సర్పంచ్‌గా టీఆర్ఎస్ బలపర్చిన మేడ లలిత తన సమీప ప్రత్యర్థిపై 106 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మేడ లలిత గెలిచినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించగా.. ఆ ప్రకటన చెల్లదంటూ సీపీఎం, కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ తనయుడు డీఎస్ రవిచంద్ర వాహనంపై రాళ్లు రువ్వటం ఉద్రిక్తతలకు దారితీసింది.




అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న గద్దర్, రాములు, పోటు రంగారావు, కోదండరాం లక్ష్మణ్,మంద కృష్ణ, ఉత్తమ్, చాడ,గోవర్ధన్, చెరుకుసుధాకర్

# ఎస్సీ వర్గీకరణకు మద్దతిస్తాం

- రాహుల్ లేఖ రాసేలా చూస్తాం : ఉత్తమ్
- ప్రధాని మోదీ సైతం సానుకూలమే
- 31న అమిత్‌షాతో మాట్లాడుతాం : లక్ష్మణ్
- అఖిలపక్షంతో ఢిల్లీ వెళదాం : కోదండరాం
- ప్రైవేటు బిల్లు పెడతాం : సీపీఎం
- కేసీఆర్‌కు భయపడేది లేదు : మంద కృష్ణ
- అఖిలపక్షం సమావేశంలో నేతలు

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా సహకరిస్తుందని, పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెడితే మద్దతు ఇస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రధాని మోదీకి ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ లేఖ రాసేలా చూస్తామన్నారు. 'పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు, ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి' అన్న అంశంపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ అధ్యక్షతన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లేందుకు ప్రధాని అపాయింట్‌మెంట్ దొరకటం లేదంటూ సీఎం కేసీఆర్ బుకాయిస్తున్నారని మండిపడ్డారు. ఢిల్లీలో అపాయింట్‌మెంట్ దొరక్కపోతే ప్రధాని మోదీ హైదరాబాద్ వచ్చినపుడు అఖిలపక్షంతో వెళ్లి ఎందుకు కలవలేదని ప్రశ్నించారు. సీపీఐ ఆధ్వర్యంలో ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లేందుకు పూర్తిగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు ప్రధాని మోదీ కూడా సానుకూలంగా ఉన్నారన్నారు. 31న బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాతో వర్గీకరణ విషయమై చర్చించి, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వాన్ని కూడా ఒప్పిస్తామన్నారు. టీజేఏసీ చైర్మన్ కోదండరాం మాట్లాడుతూ వర్గీకరణకు అనుకూలంగా ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లకపోతే ప్రతిపక్షాలుగా అందరం కలిసి వెళ్దామన్నారు. మాదిగల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఎమ్మార్పీఎస్ పోరాడుతోందని అభినందించారు. వర్గీకరణ విషయంలో కేంద్రంలోని బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌కు చిత్తశుద్ధిలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాములు ఆరోపించారు. వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో కేంద్రం ప్రవేశపెట్టకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ప్రైవేటు బిల్లు పెడతామని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ 15 రోజుల్లోగా ప్రభుత్వం స్పందించకపోతే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లే బాధ్యత తను తమ పార్టీ తీసుకుంటుందని ప్రకటించారు. తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షులు చెరుకు సుధాకర్ మాట్లాడుతూ వర్గీకరణ కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో విశాల వేదిక ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ చేస్తోన్న పోరాటం కుల పిచ్చితో కూడుకుంది కాదని, కుల స్పృహతో చేస్తోందని ప్రజాయుద్ధనౌక గద్దర్ అభిప్రాయపడ్డారు.ఎంత నిర్బంధం విధించినా సీఎం కేసీఆర్‌కు భయపడేది లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ స్పష్టం చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించే శక్తి మాదిగ జాతికి ఉందని అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం పెట్టుకునేందుకు కూడా ఎమ్మార్పీఎస్‌కు అనుమతి ఇవ్వకపోతే, ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేరుపై అనుమతి తీసుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెడితే మద్దతు ఇస్తామని ప్రధానికి రాహుల్‌గాంధీ లేఖ రాస్తే అది ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి బ్రహ్మాస్త్రం అవుతుందన్నారు. ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లే విషయంలో సీఎం కేసీఆర్‌కు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఈ విషయమై కేసీఆర్‌పై ఒత్తిడి తెచ్చేందుకు పార్టీలు ఉమ్మడిగా ధర్నాలు, కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాలకు పిలుపునివ్వాలని విజ్ఞప్తి చేశారు.

# శ్రీనివాస్‌ది రాజకీయ హత్యే

- సీఎం కేసీఆర్ ప్రోద్బలం ఉంది : కోమటిరెడ్డి
- నన్ను కూడా చంపుతారేమో? : వీహెచ్
- హత్య వెనుక పెద్ద తలలు : డీకే అరుణ

హైదరాబాద్/నల్లగొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నేత బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య విషయంలో పోలీసులు చెబుతున్నవన్నీ అవాస్తవమని సీఎల్పీ ఉప నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. హత్యలో నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం పాత్ర ఉందని, సీఎం కేసీఆర్ ప్రోద్బలం కూడా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో భయంకరంగా జరిగిన హత్య కేసు నిందితులను పోలీసులు విచారించిన తీరు సరిగ్గా లేదన్నారు. కేసులో కీలక వ్యక్తి మిర్చి బండి యజమాని యాదయ్యను ఇంత వరకూ విచారించలేదని తెలిపారు. వాస్తవానికి ఘటనా స్థలంలో పెద్దగా రాళ్లు లేవనీ, ముందే అక్కడికి రాళ్లు తెచ్చి పెట్టుకున్నారన్నది స్పష్టమవుతోందన్నారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరగడం ముఖ్యమంత్రి కేసీఆర్ అసమర్థతకు నిదర్శనమన్నారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను చంపడానికి కుట్ర జరుగుతోందన్నారు. హత్యలో సీఎం హస్తం లేదంటే సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ప్రభుత్వానికి భయం పట్టుకుందని, ఓటమి భయంతో హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తోందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఎవరినైనా చంపే అవకాశం ఉందని, ఈ క్రమంలో కోదండరాంను, తననూ చంపే అవకాశం ఉందన్నారు. కాగా, శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించాలని టీజేఏసీ చైర్మన్ కోదండరాంను తార్నాకలో కలిసి ఆయన కోరారు. అలాగే, బొడ్డుపల్లి కుటుంబాన్ని పరామర్శించి సామాజిక బాధ్యతను చాటుకోవాలని పవన్‌కల్యాణ్‌కు వీహెచ్ లేఖ రాశారు. కాగా, నల్లగొండలో శ్రీనివాస్ కుటుంబాన్ని ఎమ్మెల్యే డీకే అరుణ పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీనివాస్ హత్య వెనుక టీఆర్ఎస్ పెద్ద తలలు ఉన్నాయని ఆరోపించారు.



## అత్యంత పొడగరి.. అతి పొట్టి మహిళ

గిజా(ఈజిప్టు), జనవరి 29: ఈ ఫొటోలో కనిపిస్తున్నాయన పేరు సుల్తాన్ కొసెన్. టర్కీకి చెందిన సుల్తాన్ వయసు 36. ఎత్తు 8 అడుగుల 9 అంగుళాలు. ఆ పక్కనే ఉన్న మహిళ పేరు జ్యోతి ఆమ్గే. నాగ్‌పూర్‌కు చెందిన ఈమె వయసు 25. ఎత్తు 2 అడుగుల 6 అంగుళాలు. అంటే రెండేళ్ల వయసున్న పిల్లల ఎత్తు కంటే తక్కువ. ప్రపంచంలో పొడగరి అయిన సుల్తాన్, అత్యంత పొట్టి మహిళ జ్యోతి.. నైలు నది తీరంలో కలిశారు. ఈజిప్టుకు చెందిన ఈజిప్షియన్ ప్రొమోషన్ బోర్డు తమ దేశ పర్యాటకాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా వీరిద్దరినీ ఆహ్వానించింది. వీరిద్దరూ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నారు.

# ముందస్తు జమిలి!

(మొదటిపేజీ తరువాయి)

తొలుత మిత్రపక్షాలను ఒప్పించేందుకు పావులు కదిపారు. ఎన్డీయే మిత్రపక్ష నేతల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. దేశంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరిగేందుకు అనుకూల వాతావరణం ఏర్పరిచే దిశగా పని చేయాలని మిత్రపక్ష నేతలకు పిలుపునిచ్చారు. లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలు జమిలిగా జరగాల్సిన అవసరం ఉందని, ఎన్నికల ప్రవర్తన నియమావళి కారణంగా అభివృద్ధి పనులు కుంటుపడే అవకాశం ఉండదని ఆయన అన్నారు. ఎన్నికల్లో పెరిగిపోతున్న వ్యయాన్ని అరికట్టేందుకు జమిలి ఎన్నికలు దోహదపడతాయని చెప్పారు. నిజానికి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిసా, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలతోపాటు సాధారణ ఎన్నికలు వచ్చే ఏడాది ప్రారంభంలో జరగాల్సి ఉంది. అంతకు ఆరు నెలల ముందే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీలకు గడువు ముగియనుంది. ఈ మూడు రాష్ట్రాల్లోనూ బీజేపీయే అధికారంలో ఉంది. ఇక, 2019 చివర్లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. అక్కడ కూడా బీజేపీ ప్రభుత్వమే ఉంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌ల్లో షెడ్యూలు మేరకు ఎన్నికలు జరిగితే, ఇప్పటికే అక్కడ బీజేపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నందున ప్రతికూల ఫలితాలు ఎదురైతే ఆ ప్రభావం సాధారణ ఎన్నికలపై పడుతుందని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, అధికారంలోకి వచ్చిన నాటినుంచే ప్రధాని మోదీ ముందస్తు జమిలి దిశగా పావులు కదుపుతున్నారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ పరిశీలన జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. న్యాయ శాఖకు చెందిన పార్లమెంటరీ స్థాయీ సంఘం కూడా ఈ మేరకు వివిధ పార్టీలతో పలు దఫాలు చర్చలు జరిపింది. కొద్ది రోజుల కిందట ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా జమిలి ఎన్నికలతో నల్లధనం బెడద తగ్గిపోతుందని, ఎన్నికల ఖర్చు పడిపోతుందని, తరచూ రాజకీయాలపై దృష్టి కేంద్రీకరించే అవసరం ఉండదని మోదీ చెప్పారు. ఎన్డీయే సమావేశంలో కూడా ఇదే స్పష్టం చేశారు.

**జమిలిపై చంద్రబాబుతో చర్చిస్తాం: సుజనా**

జమిలి ఎన్నికలపై తమ పార్టీ అధినేత చంద్రబాబుతో చర్చించి తమ వైఖరిని తెలియజేస్తామని కేంద్ర మంత్రి సుజనా చౌదరి అన్నారు. ఎన్డీయే మిత్రపక్ష నేతల సమావేశం తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. జమిలి ఎన్నికలపై మిత్రపక్ష నేతల అభిప్రాయాన్ని ప్రధాని కోరారని, చంద్రబాబును సంప్రదించి చెబుతామని తాము తెలిపామని చెప్పారు. కాగా, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాతో సుజనా చౌదరి మంగళవారం సమావేశం కానున్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ సీట్ల పెంపు, రాజకీయ పరిస్థితులపై వారి మధ్య కీలక చర్చ జరగనుంది.



ముర్షీదాబాద్‌లోని భైరవ్‌నదిలో పడిపోయిన బస్సును తీస్తున్న సహాయక సిబ్బంది

## కాలువలో పడిన బస్సు.. 36 మంది మృతి

కోల్‌కతా, జనవరి 29: పశ్చిమబెంగాల్‌లోని దౌల్తాబాద్ సమీపంలో ఘోర ప్రమాదం జరిగింది. అతివేగంగా వెళ్తున్న బస్సు ఓ కాలువలోకి దూసుకెళ్లడంతో 36 మంది మరణించారు. పశ్చిమబెంగాల్ రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు 56 మంది ప్రయాణికులతో సోమవారం నదియా జిల్లాలోని షికార్‌పూర్ నుంచి మాల్డాకు బయలుదేరింది. బాలర్‌ఘాట్ వంతెనపై బస్సు ప్రయాణిస్తుండగా ఎదురుగా వస్తున్న ట్రక్కును తప్పించబోయి ఘోగ్రా కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాద సమాచారం తెలియడంలో పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల కుటుంబాలకు సీఎం మమతాబెనర్జీ రూ.5లక్షల నష్ట పరిహారం ప్రకటించారు.

# సాగు భళా!

- లక్ష్యాలను మించి ఆహార ధాన్యాల ఉత్పత్తి
- డీఈఎస్ రెండో ముందస్తు అంచనా నివేదిక వెల్లడి

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది ఆహార ధాన్యాల ఉత్పత్తి.. లక్ష్యాలను మించిపోనుంది. వ్యవసాయశాఖ పెట్టుకున్న లక్ష్యాలనూ దాటిపోనుంది. అర్థగణాంకశాఖ (డీఈఎస్) రెండో ముందస్తు అంచనా నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. దీని ప్రకారం రాష్ట్రంలో ఖరీఫ్, రబీలు కలుపుకొని 95.01 లక్షల టన్నుల మేరకు ఆహార ధాన్యాలు ఉత్పత్తి కానున్నాయి. వ్యవసాయ శాఖ పెట్టుకున్న దిగుబడి లక్ష్యాలకు ఇది 4.12 లక్షల టన్నులు అధికం. ఖరీఫ్ లక్ష్యం కంటే దిగుబడి అంచనాలు 4.31 లక్షల టన్నుల మేరకు తగ్గినా.. రబీలో 8.44 లక్షల టన్నుల మేరకు పెరగడంతో మొత్తంగా వ్యవసాయశాఖ దిగుబడి లక్ష్యాల కంటే అధికంగా దిగుబడులు రానున్నట్లు డీఈఎస్ నివేదిక స్పష్టం చేస్తోంది. కాగా ఖరీఫ్‌లో ఆహార ధాన్యాల దిగుబడి.. లక్ష్యాలను చేరుకోలేదు. ఆ నివేదిక ప్రకారం ఖరీఫ్ (2017-18)లో 50.29 లక్షల టన్నుల మేరకు ఆహార ధాన్యాలు దిగుబడి కానున్నాయి. ఇది వ్యవసాయ శాఖ పెట్టుకున్న 54.60 లక్షల టన్నుల కన్నా 4.31 లక్షల టన్నుల మేరకు తక్కువ. అయితే రెండో ముందస్తు అంచనా నివేదికలో అంచనాలు.. వాస్తవ దిగుబడి అంచనాలకు దగ్గరగా ఉంటాయి. రాష్ట్రంలో ప్రధాన ఆహార ధాన్యాల పంట అయిన వరిధాన్యం దిగుబడి.. 30.42 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తికి సరిపడా రానున్నట్లు డీఈఎస్ అంచనా వేసింది. ఖరీఫ్‌లో ప్రధానంగా మొక్కజొన్న సాగు లక్ష్యాల మేరకు జరగలేదు. దీంతో ఉత్పత్తి అంచనాలూ తగ్గాయి. వ్యవసాయశాఖ ఈ ఖరీఫ్‌లో 18.64 లక్షల టన్నుల మేరకు మొక్కజొన్నల ఉత్పత్తి జరుగుతుందని అంచనా వేయగా.. డీఈఎస్ నివేదిక.. 15.70 లక్షల టన్నుల మేరకు ఉత్పత్తి జరగనున్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది పప్పుధాన్యాల ఉత్పత్తి వ్యవసాయశాఖ లక్ష్యాలను మించనున్నట్లు డీఈఎస్ నివేదిక వెల్లడించింది. ఖరీఫ్‌లో 2.94 లక్షల టన్నుల మేరకు పప్పుధాన్యాల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకోగా.. డీఈఎస్ నివేదిక ప్రకారం 3.71 లక్షల టన్నుల మేరకు ఉత్పత్తి రానుంది.

## కర్ణాటకలో మహిళా మంత్రుల మకాం

- నెలపాటు ఉండనున్న సుష్మ, నిర్మల, స్మృతి
- రాహుల్ ప్రచారానికి ప్రత్యేక బస్సు..



రాహుల్ ఉపయోగించనున్న బస్సు

బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే ప్రచారానికి పార్టీలు సిద్ధమవుతున్నాయి. కేంద్ర మంత్రులు సుష్మాస్వరాజ్, నిర్మలా సీతారామన్, స్మృతిఇరానీ, ఎంపీ మీనాక్షి లేఖిలను ప్రచారం కోసం బీజేపీ ఖరారు చేసింది. నెలపాటు కీలక మంత్రులతోపాటు జాతీయ మహిళా నేతలు బెంగళూరులో బసచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సుష్మకు కర్ణాటకతో సుదీర్ఘ అనుబంధం ఉంది. కర్ణాటకలో బీజేపీ అధికారంలో ఉన్నంతకాలం ఆమె బెంగళూరుతో పాటు బళ్లారికి వచ్చేవారు. రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ కర్ణాటక నుంచే రాజ్యసభ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. పార్టీ ఎన్నికల ఇన్‌చార్జులు ప్రకాశ్ జావడేకర్ తదితరులు నెలన్నర బెంగళూరులోనే మకాం వేసి పర్యవేక్షించనున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ప్రచారానికి ప్రత్యేక బస్సు సమకూర్చారు. ఫిబ్రవరి 10 నుంచి ఆయన కర్ణాటకలో మూడు రోజులు పర్యటించనున్నారు. హోసపేట నుంచి రాహుల్ ప్రచారం ప్రారంభమవుతుంది. మరోవైపు ఏఐఎంఐఎంతో కర్ణాటక బీజేపీ పొత్తుకు ప్రయత్నించిందని, ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీతో హైదరాబాద్‌లో రహస్య చర్చలు జరిగాయని కర్ణాటక హోంమంత్రి రామలింగారెడ్డి ఆరోపించారు. మరోవైపు మజ్లిస్‌తో పొత్తుకు కాంగ్రెస్ కూడా యత్నించినట్లు ఆరోపణలు వచ్చాయి.



# నాలుగేళ్లలో 637 కోట్లు

- రాజకీయ పార్టీలకు 9 ఎన్నికల ట్రస్టుల విరాళాలు
- బీజేపీకి 488 కోట్లు.. కాంగ్రెస్‌కు 86 కోట్లు


న్యూఢిల్లీ, జనవరి 29: తొమ్మిది ఎన్నికల ట్రస్టులు నాలుగేళ్లలో దేశంలోని రాజకీయ పార్టీలకు రూ.637.54 కోట్ల విరాళాలు అందించినట్టు తాజా నివేదిక ఒకటి సోమవారం వెల్లడించింది. 2013-14 నుంచి 2016-17 సంవత్సరాలకు ఏడీఆర్(అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్) అనే సంస్థ ఈ నివేదికను రూపొందించింది. ఈ విరాళాల్లో ఐదు జాతీయ పార్టీలకు 92.30 శాతం(రూ.588.44కోట్లు), 16 ప్రాంతీయ పార్టీలకు 7.7శాతం(రూ.49 కోట్లు) అందాయి. బీజేపీ అత్యధికంగా రూ.488.94 కోట్లు, కాంగ్రెస్ 86.65 కోట్లు అందుకున్నాయి. శిరోమణి అకాలీదళ్(ఎస్ఏడీ), సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) కూడా విరాళాలు అందుకున్న పార్టీల్లో ఉన్నాయి. బీజేపీ, కాంగ్రెస్ ప్రతి ఆర్థిక సంవత్సరంలోనూ ఈ విరాళాలు అందుకుంటున్నాయని ఆ నివేదిక పేర్కొంది. సీబీడీటీ(ప్రత్యక్ష పన్నుల సెంట్రల్ బోర్డు)లో నమోదైన 21 ఎన్నికల ట్రస్టుల్లో 14 మాత్రమే తమ విరాళాల నివేదికను ఎన్నికల కమిషన్(ఈసీ)కు అందజేస్తున్నాయని తెలిపింది. ప్రభుత్వ నివేదికల ప్రకారం ఎన్నికల ట్రస్టులు ఒక ఆర్థిక సంవత్సరంలో సమీకరించిన మొత్తంలో 95 శాతాన్ని రిజిస్టర్ అయిన ఎన్నికల పార్టీలకు విరాళంగా ఇచ్చేయాలి. 2016-17 సంవత్సరంలో 14 ట్రస్టులు తమ విరాళాల నివేదికను ఈసీకి అందజేశాయి. వీటిలో ఆరు ట్రస్టులు ఆ సంవత్సరంలో కార్పొరేట్ సంస్థలు, వ్యక్తుల నుంచి మొత్తం రూ.325.45 కోట్లు స్వీకరించి, అందులో రూ.325.27 కోట్లను వివిధ రాజకీయ పార్టీలకు ఇచ్చేశాయని నివేదిక వివరించింది.

## భారత్ పర్వ్‌లో ఆకట్టుకున్న పేరిణి శివతాండవం



దేశవ్యాప్తంగా విభిన్న కళలు, సంస్కృతులు ఒకే చోటుకి చేర్చే లక్ష్యంతో నిర్వహించిన భారత్ పర్వ్‌లో తెలంగాణకు సొంతమైన పేరిణి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశ రాజధాని ఎర్రకోట ముందు సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళాకారులు ప్రదర్శించిన శివతాండవం, డోలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వీటిని టీఎస్ భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి ప్రారంభించారు.

-న్యూఢిల్లీ




వినూత్నం

పుస్తకం కాకుండా సెల్‌ఫోన్ హస్త భూషణం... అనే రోజులొచ్చాయి. టెక్నాలజీ అరచేతిలోకి వచ్చి చేరడంతో బుర్ర బద్ధకంగా తయారైపోతోందని వాపోయే వాళ్లూ లేకపోలేదు. అయితే అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగించుకుని పుస్తక పఠనం బదులుగా శ్రవణం చేసి పుస్తకాలకు మరింత దగ్గరగా ఉండొచ్చు అంటున్నారు భావనా సత్య. అదెలాగో తెలియాలంటే 'కథ చెబుతానోచ్' పేరిట ఆమె నిర్వహిస్తున్న ఫేస్‌బుక్ పేజీ గురించి తెలుసుకోవాలి.



# ఫేస్‌బుక్‌లో కథ చెబుతానోచ్...

"కథ చెబుతానోచ్ అనే ఫేస్‌బుక్ పేజీ మొదలుపెట్టి నాలుగు నెలలవుతోంది. ఒక కథను చదివినప్పుడు నా ఇరవై ఏళ్ల వయసులో ఒకలా అనిపించింది. ముప్ఫైల్లో చదివితే మరోలా అర్థమైంది. అదే ఇప్పుడు నలభైల్లో చదువుతుంటే ఇంకాస్త వేరుగా అర్థమైంది. అంటే మన పరిణితిని బట్టి ఒకే విషయాన్ని పలు రకాలుగా అర్థం చేసుకుంటామన్నమాట. ఉదాహరణకి చలం కథల్ని నా ఇంటర్మీడియెట్ చదువయ్యాక చదివాను. వాటినే ఇప్పుడు చదువుతుంటే అర్థం చేసుకునే దృష్టికోణం మారిపోయింది. అలాగే ఒకప్పుడు పుస్తకాలను బాగా చదివిన వాళ్లు, పలు కారణాల వల్ల ఇప్పుడు పుస్తకాలకు దూరంగా ఉంటున్నారు. అందుకు టెక్నాలజీ, సోషల్ మీడియా వంటి అనేక కారణాలు ఉండొచ్చు. కానీ... సమయం ఉండి.. ఒక పుస్తకాన్ని చేతిలోకి తీసుకుంటే కలిగే అనుభూతి వేరుగా ఉంటుంది. చదివిన పుస్తకాలు, కథల్లోంచి మనం నేర్చుకోదగిన అంశాలెన్నో ఉంటాయి. ఇది నేను స్వయంగా అనుభూతి చెందాను. దాన్నే మిగతా వాళ్లకి దగ్గర చేయాలనుకున్నాను. ఆ ఆలోచనకి రూపమే 'కథ చెబుతానోచ్'.

## అక్కడ అలా కుదరదని...

ఈ ఆలోచనకు బీజం పడింది మాత్రం నా స్నేహితుల వల్లే. వాళ్లలో కొందరు తెలుగు మాట్లాడతారు కానీ చదవడం రాదు. మేమంతా ఒక దగ్గర చేరి మాట్లాడుకుంటున్నప్పుడు 'కొన్ని సామాజికాంశాలను శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, చలం, సుబ్రహ్మణ్య శాస్త్రి, రావిశాస్త్రి, బుచ్చిబాబు అప్పట్లోనే ప్రస్తావించారు' అని చెప్తే, 'అవునా!' అని ఆశ్చర్యపోయారు. 'మేమెలాగూ చదవలేం కాబట్టి వాటిని నువ్వే చదివి వినిపించొచ్చు కదా' అన్నారు. నేను రాసిన కథలు, కవితలు ఆడియో ఫైల్స్ రూపంలో స్నేహితులకు మూడు నాలుగేళ్ల నుంచి ఇ-మెయిల్స్, వాట్సాప్ ద్వారా పంపుతున్నా. అందుకు రేడియో జాకీగా చేసిన అనుభవం ఉపయోగపడింది. వాటిని వాళ్లు ఆఫీసుకి ప్రయాణించేటప్పుడు, ఖాళీ సమయం దొరికినప్పుడు వినేవాళ్లు. అలానే ఆడియో ఫైల్స్‌ను ఫేస్‌బుక్‌లో అప్‌డేట్ చేయొచ్చు అనుకున్నా. కానీ ఫేస్‌బుక్‌లో వాయిస్ ఫైల్ షేర్ చేయలేమనే విషయం ఆ ప్రయత్నం చేశాక కాని తెలిసింది కాదు. దాంతో కథల్ని చదివి, వాటికి బొమ్మలు చేర్చి వీడియో ఫైల్స్ అప్‌లోడ్ చేయడం మొదలుపెట్టా. అలా ఇప్పటి వరకు 30కి పైగా వీడియోలు పెట్టాను. మొన్నీ మధ్య ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి కదా. వాటికంటే ముందు 'తొలితరం తెలంగాణా కథలు' అనే పుస్తకం ఒకటి వచ్చింది. తెలుగు మహాసభల సందర్భంగా ఆ పుస్తకంలోని వట్టికోట ఆళ్వారుస్వామి కథలు చదివి, ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేశాను. కథలకి డైలాగ్ వెర్షన్ ఉండదు కదా. అందుకని కథానిక నమూనాలో భావయుక్తంగా చదువుతాను.

## వినిపించొచ్చు కదా!

అలానటి ఆణిముత్యాల్ని చదువుతుంటే ఆ కాలంలోకి వెళ్లడం ఖాయం. ఆ కథల్లో అప్పటి సామాజిక పరిస్థితుల నేపథ్యం ఉంటుంది. ఒక రచయిత ఆకలి గురించి మాట్లాడితే... మరొకరు పంటలు, కరువు, ప్రేమ, సంస్కృతి వంటి విషయాలు స్పృశిస్తారు. అంశం ఏదైనా సామాజిక నేపథ్యం, సమకాలీన పరిస్థితులను బట్టి ఉంటుంది. కథలు చదవడం వల్ల చరిత్ర, సమాజం ఇది వరకు ఎలా ఉంది? వాళ్ల ఆలోచనా తీరుకి, మన ఆలోచనా సరళికి మధ్య ఎంత వ్యత్యాసం ఉందనే విషయం తెలుస్తుంది. మా ఇంట్లో నాకో లైబ్రరీ ఉంది. అందులో నాలుగొందల పుస్తకాలు ఉన్నాయి. అవన్నీ నేను మాత్రం చదివి ఊరుకుంటే వాటి నుంచి వచ్చే విజ్ఞానాన్ని తరువాతి తరాలకు అందించలేను. అందుకే వాటన్నింటినీ కూడా చదివి డిజిటలైజ్ చేయాలనుకుంటున్నా. తెలుగు చదవడం రాని తెలుగు వాళ్లకి తెలుగు సాహిత్యం, కథలు చదివించలేం. కానీ వినిపించొచ్చు కదా!

## సోషల్ మీడియా వేదికగా...

తెలుగు సాహిత్యంలో వందేళ్ల క్రితం రచయితలు స్పృశించని అంశం లేదు. ప్రపంచంలో ఎక్కడెక్కడి సాహిత్యాన్నో మనం మెచ్చుకుంటుంటాం. మన మాతృభాష తెలుగులో కూడా అలాంటి సాహిత్యమెంతో ఉంది. అలానాటి సాహిత్యంలో ఎంతో లోతుగా మానవసంబంధాలు, బంధాలు, సమస్యలు, సమాజం వంటి ఎన్నో అంశాలు స్పృశించారు. వాటన్నింటినీ మళ్లీ ఒకసారి మననం చేసుకుని, తెలియని వాళ్లకి ఇవి మన దగ్గర ఉన్నాయని తెలియచెప్పాలి. ఈ తరంలో కొందరైనా మన సాహిత్యపు గొప్పదనాన్ని తెలుసుకోవాలి. అందుకు సోషల్ మీడియా మంచి వేదిక అవుతుందని భావిస్తున్నా. త్వరలో వెబ్‌సైట్ ఏర్పాటు చేస్తాను. అందులో కథకు సంబంధించిన స్క్రిప్ట్‌తో పాటు ఆడియో ఫైల్ కూడా ఉంచుతా. కథలు అనగానే చిన్న పిల్లలకు అనుకుంటారు. కానీ తెలుగు సాహిత్యంలో ఉండే అద్భుతమైన రసాన్ని ఒకప్పుడు ఎంజాయ్ చేసి, ఇప్పుడు మిస్ అవుతున్న పెద్దవాళ్ల కోసం ఈ పని చేస్తున్నా. ఆస్ట్రేలియా, దుబాయ్, అమెరికాల్లో ఉన్న నా స్నేహితులు ఇవి విని 'మధురమైన పూర్వ జ్ఞాపకాలను మరోసారి తడుముకుంటున్నాం' అని చెప్తుంటే ఎంత ఆనందంగా ఉందో మాటల్లో చెప్పలేను" అన్నారామె.





నేను పుట్టి పెరిగింది వరంగల్ జిల్లా కొడకండ్లలో. పదో తరగతి వరకు అక్కడే చదివాను. గ్రాడ్యుయేషన్, పోస్టుగ్రాడ్యుయేషన్ వరంగల్‌లో చదివా. ఆ తరువాత ఎంబిఎ చేశా. మొదటి ఉద్యోగం ఆలిండియా రేడియోలో పార్ట్‌టైం అనౌన్సర్‌గా. రెయిన్‌బో ఎఫ్‌ఎంలో రేడియో జాకీగా కొన్నాళ్లు చేశాను. ఆ తర్వాత కార్పొరేట్ ఉద్యోగం వైపు వెళ్లాను. అక్కడ కొన్నేళ్లు పనిచేశాక తిరిగి మీడియా వైపు వచ్చా. ఇప్పుడు యూట్యూబ్ చానల్స్‌కి స్టోరీలు, షార్ట్ ఫిల్మ్స్‌కు ఇంగ్లీష్ సబ్ టైటిల్స్ రాస్తూ, అనువాదాలు చేస్తున్నా.

రావూరి భరద్వాజగారికి జ్ఞానపీఠ్ అవార్డు వచ్చాక 'పాకుడురాళ్లు' మళ్లీ చదివాను. దాన్ని కూడా ఆడియో ఫైల్ చేస్తాను. నవల అయితే ఎక్కువ పాత్రలుంటాయి. అందుకని ఆలస్యమవుతుంది. అదే కథలయితే అలా కాదు. అందుకని కథలతో మొదలుపెట్టాను. రవీంద్రనాథ్ ఠాగూర్ కథలు ఎంత బాగుంటాయి... ఆయన అప్పట్లో రాసిన కథలు ఇప్పటికీ మోడ్రన్‌గా ఉంటాయి. అలాగే సైకాలజీ బేస్డ్‌గా ఉండే బుచ్చిబాబు కథల్లాంటివి అందరితో పంచుకుంటే బాగుంటుంది కదా!

• కిరణ్మయి
ఫొటో: ఎల్. అనిల్‌రెడ్డి

సేవ

కాంతా సరూప్ క్రిషన్.. ఇంకొద్ది రోజుల్లో 89 వ జన్మదినాన్ని జరుపుకోనున్నారామె. సమాజసేవంటే ప్రాణం పెట్టే కాంతా సరూప్ ఇన్నేళ్లుగా అలసటన్నది ఎరుగకుండా చేసిన పని తెలిస్తే ఎవరైనా అబ్బురపడతారు. 30 ఏళ్ల వయసులో చండీగఢ్‌లో స్వచ్ఛంద రక్తదాన ఉద్యమాన్ని ప్రారంభించిన ముఖ్యుల్లో ఆమె ఒకరు. ఈ ఉద్యమంలో 46 సంవత్సరాలుగా కాంతా సరూప్ పని చేస్తున్నారు. ఆమె చేసిన కృషి వల్లనే స్వచ్ఛంద రక్తదాన ఉద్యమానికి జాతీయస్థాయి పునాదులు పడ్డాయి. కాంతా సరూప్ స్వచ్ఛంద రక్తదాన ఉద్యమంలో ఎలా ప్రవేశించారో తెలుసుకుందాం....



# ఈ కాంత రక్తదాన ఉద్యమకర్త

కాంతా సరూప్ క్రిషన్ పశ్చిమ పంజాబ్‌లో (ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉంది) 1929 సంవత్సరంలో పుట్టారు. వీళ్లది బాగా సంపన్న కుటుంబం. తండ్రి ఆర్.బి. విషన్ భగవాన్ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) మాజీ ఛైర్మన్. కాంత చదువులో ఎంతో చురుగ్గా ఉండేవారు. స్కాలర్‌షిప్‌తో మెట్రిక్యులేషన్ చదివారు. పదహారేళ్ల వయసులోనే కాంతకు సరూప్ క్రిషన్‌తో వివాహమైంది. క్రిషన్ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌లో అధికారి. కాంతా సరూప్‌కు చదువు మీద ఆసక్తి ఉన్నా అది మధ్యలోనే ఆగిపోయింది. 'ఆరోజుల్లో అమ్మాయిలు మెట్రిక్యులేషన్ వరకూ చదివితే సరిపోతుందనే అభిప్రాయం ఉండేది. అందుకే అక్కడితో నా చదువు ముగిసింది. దాని తర్వాత నేను కుట్లు, అల్లికలు బాగా నేర్చుకున్నాను. అందులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో బహుమతులు కూడా తెచ్చుకున్నాను. స్వచ్ఛంద రక్తదాన ఉద్యమం చేపట్టిన తర్వాత మాత్రం అదే నాలోకమైంది' అన్నారామె.

### ఎన్నో అవార్డులు...

కాంతా సరూప్ స్వచ్ఛంద రక్తదానం విషయంలో చేసిన కృషికి గాను 1972లో భారత ప్రతిష్ఠాత్మక పౌర పురస్కారం 'పద్మశ్రీ' లభించింది. రెడ్‌క్రాస్ బంగారు పతకంతోపాటు, హెచ్‌డి శౌరీ అవార్డు వచ్చింది. మదర్ థెరిస్సా, రాజీవ్ అవార్డులు కూడా కాంతా సరూప్‌ను వరించాయి.

### మలుపు తిప్పింది...

చండీగఢ్‌లో ఉన్నప్పుడు కాంతా సరూప్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లోని ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ విభాగాధిపతి, ప్రొఫెసర్ అయిన జె.జి. జోలీని కలిశారు. ఆమె జీవితంలో ముఖ్యమైన మలుపు ఇదే. ప్రొఫెసర్ జోలీతో కలిసి కమర్షియల్ బ్లడ్ డొనేషన్స్ మీద కాంతా సరూప్ పోరాటం ప్రారంభించారు. దీనికి కారణం కమర్షియల్ బ్లడ్ డొనేషన్స్ వల్ల రోగులు సురక్షితం కాని రక్తం బారిన పడే ప్రమాదం ఉండడమే. తమ పోరాటంలో భాగంగా చండీగఢ్‌లో బ్లడ్ బ్యాంక్ సొసైటీని ఏర్పాటుచేశారు. ఈ కృషిలో ప్రొఫెసర్ జోలీకి కాంతా సరూప్ చేదోడువాదోడుగా ఉన్నారు. అదొక్కటే కాదు 'ఇండియన్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ అండ్ ఇమ్యునో హెమటాలజీ (ఐఎస్‌బిటిఐ) స్థాపనలో కూడా ప్రొఫెసర్ జోలీకి ఆమె సహకరించారు. ఆ తర్వాత ఐఎస్‌బిటిఐకి ఆమె 45 సంవత్సరాలపాటు వ్యవస్థాపక సెక్రటరీ జనరల్‌గా ఉన్నారు. భారత రెడ్‌క్రాస్ సొసైటీ, మహిళా రక్షణ మండలి, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్, చైల్డ్ వెల్ఫేర్ కౌన్సిల్ విభాగాలతో కూడా కాంతా సరూప్ పనిచేశారు.

సుప్రీంకోర్టు కమర్షియల్ బ్లడ్ డొనేషన్స్‌ను నిషేధిస్తూ తీర్పు వెలువరించిన అనంతరం కాంతా సరూప్ రక్త దానానికి సంబంధించి పలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు. దేశ విదేశాల్లో స్వచ్ఛంద రక్తదానంపై పలు అధ్యయనపత్రాలను సమర్పించారు. భారత ప్రభుత్వం చేపట్టిన జాతీయ రక్త దాన విధానం వెనుక కాంతా సరూప్ చేసిన కృషి ఎంతో ఉంది. రోటరీ అండ్ బ్లడ్ బ్యాంక్స్ సొసైటీ వ్యవస్థాపకుల్లో కాంత కూడా ఒకరు. వారి కుటుంబంలోని అందరూ ఈ ఉద్యమంలో పాల్గొనడం విశేషం.

'నేను 33 సార్లు రక్తదానం చేశాను. నా కూతురు నీతి 50 సార్లు, ఆమె భర్త మార్క్ సటిన్ 106 సార్లు రక్తదానం చేశారు'.



ఒక్కమాటలో చెప్పాలంటే స్వచ్ఛంద రక్త దాన ఉద్యమాన్ని కాంతా సరూప్ కుటుంబం ఒక పవిత్ర యజ్ఞంలా నిర్వహిస్తోంది.

### వయసు మీదపడ్డా...

కొంతమందిని పనిరాక్షసి అంటారు. ఇది కాంతా సరూప్‌కి బాగా సరిపోతుంది. 89వ పడిలో కూడా కాంతా సరూప్‌కు అలసట అంటే తెలియదు. ఒక్క క్షణం కూడా పనిచేయకుండా ఉండలేరామె. కొన్నిసార్లు తాను చేయాలనుకున్న పనికి ముసలితనం అడ్డువస్తోందని తనపై తానే చిరాకుపడుతుంటారు!! 'ఇప్పుడు కూడా నాకెంతో చేయాలని ఉంది కానీ నా వయసు సహకరించడం లేదు' అని కాంతా సరూప్ అన్నారు. తాము చేపట్టిన స్వచ్ఛంద రక్తదాన ఉద్యమంలోని కొన్ని చేదు అనుభవాలను కాంత పంచుకున్నారు 'డబ్బుల కోసం పేదవాళ్లు, పోషకాహార లేమితో బాధపడేవాళ్లు తమ రక్తాన్ని అమ్ముకోవడానికి వచ్చేవారు' అని చెమ్మగిల్లిన కళ్లతో చెప్పారు. కొందరు శ్రామికులు రక్తదానాన్ని చేసి రోడ్ల మీద పడిపోయిన సంఘటనలు గుర్తుచేసుకున్నారామె.



రక్తదానం విషయంలో ప్రజల్లో ఉన్న అపోహలను పోగొట్టడం అంత సులువేమీ కాదన్నారు. చండీగఢ్‌తో పాటు పొరుగు రాష్ట్రాలలో కూడా స్వచ్ఛంద రక్తదాన ఉద్యమ కార్యక్రమాన్ని కాంతా సరూప్ నిర్వహించారు. 'రక్తం మ్యాజిక్ లాంటి మందు. దాన్ని రోగులకు అందిస్తున్నందుకు నాకెంతో సంతోషంగా ఉంది. రక్తానికి సరైన ప్రత్యామ్నాయం వచ్చేంతవరకూ దాని స్థానాన్ని మరేదీ పూరించలేద'న్నారామె. ప్రస్తుతం ఆరోగ్యం సహకరించక నాలుగు గోడల మధ్య తాను ఉన్నా... ఫోన్ల మీద రక్త దానానికి సంబంధించి నిధులు సేకరిస్తున్నారామె. 'ఈ పవిత్రమైన పని కోసం ఎలాంటి సహాయానికైనా నేను సిద్ధమే' అంటున్న కాంతా సరూప్‌కు అంతా 'రక్త' సంబంధీకులే.

# ఈ చిట్కాల్లో నిజమెంత?



మన దేశంలో చాలా ఆరోగ్య సమస్యలకు ఏదో ఒక ఇంటి చిట్కా తప్పకుండా ఉంటుంది. జ్వరమొచ్చినా, మొటిమలొచ్చినా ఇంట్లో దొరికే వాటితోనే నయం చేసే చిట్కాలకు కొదవలేదు. అయితే ఇవి నిజంగా పనిచేస్తాయా? వైద్యశాస్త్రం ప్రామాణికంగా వాటిల్లో వాస్తవమెంత? కొన్ని ఇంటి చిట్కాల గురించి వైద్య నిపుణులేమంటున్నారంటే...

### ఉప్పునీటిని పుక్కిలిస్తే గొంతు నొప్పి తగ్గుతుందా?

అవును. తగ్గుతుంది. శాస్త్రీయంగా ఇది నిజమేనని రుజువైంది. ఉప్పులో యాంటీ సెప్టిక్ గుణాలు ఉన్నాయి. శ్లేష్మం నుంచి ఉపశమనం కలిగించి, శ్వాసక్రియ సాఫీగా సాగేందుకు దోహదం చేస్తుంది. గొంతు కణజాలాన్ని అంటిపెట్టుకొని ఉండే ద్రవాలను నిర్మూలిస్తుంది. వైరస్, బ్యాక్టీరియాలను తుడిచిపెట్టేస్తుంది. శ్వాసనాళాలకు వచ్చే ఇన్ఫెక్షన్లను 40 శాతం వరకు తగ్గిస్తుంది.

### ఆస్తమా ఉంటే పెరుగు తీసుకోకూడదా?

ఇది అక్షరాలా అపోహ. సాధారణంగా ఆస్తమా ఉన్నవారికి చల్లని పదార్థాలు పడవు. పెరుగు కూడా చలవ చేస్తుందనే భయంతో తినకూడదంటారు. పెరుగు తినడం వల్ల ఆస్తమా పెరుగుతుందని ఎక్కడా రుజువు కాలేదు. కాకపోతే పూర్తిగా తోడుకోకుండా ఉన్న పెరుగు తింటే ఎలాంటి ఇబ్బంది ఉండదు.

### ఆలివ్ ఆయిల్‌తో గోళ్లకు పగుళ్లు ఏర్పడవా?

తరచూ గోళ్లకు పగుళ్లు ఏర్పడుతుంటే... అది తప్పకుండా విటమిన్ల లోపమే. ఒకవేళ గోళ్లు పెళుసుగా ఉంటే మాత్రం ఆలివ్ ఆయిల్ రాస్తే అది లూబ్రికేట్‌గా పనిచేస్తుంది. అందుకని ఇలా చేయడాన్ని పూర్తిగా తప్పని అనలేం.

### క్యారెట్ తింటే కంటిచూపు పెరుగుతుందా?

'విటమిన్-ఇ' కంటి ఆరోగ్యానికి మేలు చేస్తుందనే విషయం తెలిసిందే. ఇది క్యారెట్‌లో కెరోటిన్ రూపంలో ఉంటుంది. చలికాలంలో క్యారెట్ జ్యూస్ తాగితే కంటి చూపు బాగుంటుంది.



# పిల్లలకు కష్టాలు తెలియొద్దా?

పేరెంటచ్

"మా బాల్యంలో మేము పడ్డ కష్టాలు, బాధలు మా పిల్లలకు అస్సలు రాకూడదు" అనే మాటలు చాలా మంది తల్లిదండ్రుల నోట వినబడుతూ ఉంటాయి. "మేము అంతో ఇంతో సంపాదించడం మొదలెట్టే దాకా కూడూ గుడ్డకు కూడా వగచిన సందర్భాలు ఉన్నాయి. ఆ దుర్భర స్థితి మా పిల్లలకు రాకుండా చూడటానికి ఎన్ని కష్టాలు పడటానికైనా సిద్ధమే" అని కూడా అంటుంటారు.

నిజమే... పిల్లల్ని ప్రాణప్రదంగా ప్రేమించే వారు అలా కాకుండా ఎలా అంటారు? అలాగని పిల్లలు కోరిందల్లా కొనిపెడుతూ పోతే మీ ఆర్థిక పరిమితులేమిటో వారికి తెలిసే అవకాశమే రాదు. నిజానికి అవసరాలు ఎవరికైనా కోకొల్లలుగా ఉంటాయి. కానీ, వాటిలో అత్యవసరమైనవి కొన్నే ఉంటాయి. 'అవసరమైనవన్నీ కొనుక్కుంటూపోతే, ఏదో ఒకరోజున అత్యవసరమైన వాటిని అమ్ముకోవాల్సి వస్తుంది' అన్నట్టు, పిల్లల



అవసరాలన్నీ తీరుస్తూ పోతే ఒకనాటికి అత్యవసరమైన వాటిని తీర్చడం వీలుకాకపోవచ్చు. ఆ మాటకొస్తే అత్యవసరాలే కాదు, అవసరాల్లో కూడా కొన్ని తీర్చవచ్చు. అలా కాకుండా అవసరాలన్నీ తీర్చాలనుకుంటేనే కష్టాలపాలు, అప్పులపాలూ కావల్సివస్తుంది. కాబట్టి ఆ కష్టాలేమిటో, బాధలేమిటో పిల్లలకు తెలియడం కూడా అవసరమే.

అప్పుడప్పుడైనా మీరు పడుతున్న కష్టాలేమిటో వారికి చెప్పకపోతే, ఎప్పటికప్పుడు తమకు ఏమేం కావాలో ఒక చిట్టా తయారుచేసుకుని, తల్లిదండ్రులకు ఏకరువు పెడుతూనే ఉంటారు. అవన్నీ తెచ్చిపెట్టడం ఎంత కష్టమో వారికి అసలే తెలియకపోతే వారేం చేస్తారు? పైగా కష్టాలేమిటో అసలే తెలియకపోతే ముందు తమ జీవితంలో ఎదురయ్యే కష్టాల్ని ఎలా అధిగమించాలో వారికి ఏ మాత్రం తెలియకుండా పోతుంది. అధిగమించలేనితనం వారిని అసమర్థుల్ని చేస్తుంది. ఎందుకూ పనికిరాకుండా ఎక్కడా నిలబడకుండా చేస్తుంది.

అందుకే పిల్లలకు చదువూ- సంధ్యల విషయాలే కాదు... జీవితంలో ఎదురయ్యే కష్టాలూ, బాధల గురించి కూడా కొంత తెలియజేయాల్సిన బాధ్యత తమపై ఉంటుందనే విషయం తల్లిదండ్రులు మర్చిపోకూడదు.



ఆయుర్వేదం

# జుట్టు రాలిపోకుండా..

కొందరికి అప్పటిదాకా నల్లగా, ఒత్తుగా మిలమిలలలాడుతూ అలరాలిన జుట్టు కొందరికి కొద్ది నెలల్లోనే విపరీతంగా రాలిపోయి, చివరికి బట్టతల వచ్చేస్తుంది.

**కారణాలు అనేకం!**

జుట్టు రాలడానికి గల కారణాలు అనేకం. దీర్ఘకాలిక జ్వరాలు, తల చర్మం ఇన్‌ఫెక్షన్లు, క్లోరినేటెడ్ నీరు తాగడం, రేడియేషన్, కొన్ని రకాల మందులు, దీర్ఘకాలిక ధాతుగత వ్యాధుల వంటివి కూడా ఈ సమస్యకు కారణం కావచ్చు. థైరాయిడ్, పిట్యూటరీ గ్రంధి, పిట్యూటరీ గ్రంధి స్రావాల లోపం, జీర్ణక్రియ దోషాలు, గర్భనిరోధక మాత్రలు కూడా బట్టతలకు దారి తీసే అవకాశం ఉంది. అయితే వెంట్రుకలు రాలిపోయినా వాటి మూలాలు ఇంకా మిగిలి ఉంటే అవి మళ్లీ పెరిగే అవకాశం ఎక్కువ. అలా కాకుండా కుదుళ్లతో సహా సమూలంగా రాలిపోతే అవి తిరిగి మొలిచే అవకాశం తక్కువ. పోషకాలలోపం వల్ల జుట్టు రాలిపోతే, ఆ లోటును పూరించడం ద్వారా తిరిగి జుట్టు మొలవడం సులువే.



## వైద్యం ఇలా!

మౌలికంగా వెంట్రుకలకు సంబంధించిన మూలకణం తల్లి గర్భంలో ఉన్నప్పుడే ఉంటుంది. పుట్టుక తర్వాత తల్లి మూలకణం విభజన ప్రక్రియ ద్వారా అనేక వెంట్రుకలుగా విస్తరిస్తుంది. ఇలా ఎన్ని పిల్లకణాలు ఏర్పడ్డాయి అనే దాని మీద జుట్టు నిర్మాణం ఆధారపడి ఉంటుంది. అయితే విభజన క్రియ, కణాల్లోని జీవపదార్థ పరిమాణం పైన కూడా ఆధారపడి ఉంటుంది. ఒక్కోసారి ఈ జీవపదార్థం ఉన్నా పనిచేయదు. ఈ దశలోనే వైద్య చికిత్సల అవసరం పెరుగుతుంది.

## ఆయుర్వేదం ఏం చేస్తుంది?

ఆయుర్వేద చికిత్సలో ...

● గుంటగలగర, ఉసిరి వంటి మూలికౌషధాలను, ...

- ప్రొఫెసర్ ... డాక్టర్ ...



# నిద్రాభంగిమలతో సమస్యలు దూరం!

జీవనశైలి

**కొన్ని చిన్నపాటి ఆరోగ్య సమస్యలు, శారీరక ఇబ్బందులను పడుకునే భంగిమలతో దూరం చేయొచ్చు. మీకున్న ఇబ్బందినిబట్టి ఈ భంగిమలను అనుసరిస్తే ఇబ్బందులు సర్దుకుంటాయి. నిద్రాభంగం లేకుండా కంటినిండా నిద్ర పడుతుంది.**

**భుజం నొప్పి:** ఈ సమస్య ఉన్నవాళ్లు నొప్పి లేని వైపుకు తిరిగి పడుకోవాలి. ఈ భంగిమలో పడుకున్నప్పుడు కాళ్లు, చేతులు మడిచి వంచి, వాటి మధ్య దిండ్లు ఉంచుకోవాలి. తల కింద కూడా దిండు ఉండాలి.

**వెన్ను నొప్పి:** తల కింద దిండు ఉంచుకుని వెల్లకిలా పడుకోవాలి. నడుము, తొడల అడుగున కూడా ఎత్తు ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం టవల్‌ను గుండ్రంగా చుట్టి నడుము అడుగున, దిండును తొడల కింద ఉంచుకుని పడుకోవాలి. ఈ భంగిమలో పడుకున్నప్పుడు చేతులు మడిచి ఛాతీ మీద ఉంచుకోవాలి.

**సైనస్ సమస్య:** ఈ సమస్య ఉన్నవాళ్లు తల కింద కాస్త ఎక్కువ ఎత్తు ఉండేలా రెండు దిండ్లు పెట్టుకుని పడుకోవాలి. ఇలా చేస్తే శ్వాసకు అడ్డంకి ఏర్పడకుండా ఉంటుంది.



# అర్ధ మత్స్యేంద్రాసన యోగా!

ఫిట్‌నెస్

**అర్ధ మత్స్యేంద్రాసన లేదా వక్రాసన అనేది హఠ యోగా లోని 12 స్థూల ఆసనాల్లో ఒకటి. ఈ ఆసనాన్ని ఉదయాన్నే పరగడుపున లేదా భోజనం చేసిన 4 నుంచి 6 గంటల తర్వాత మాత్రమే వేయాలి. ఈ ఆసనం వేసే సమయంలో కడుపు ఖాళీగా ఉండాలి.**

**ఆసనం ఇలా!:**

- కటి ఎముకలు నేలకు తగిలేటట్టుగా కూర్చుని, కుడి కాలు మడిచి, పాదం ఎడమ పిరుదుకు తగిలేలా ఉంచాలి.
- ఎడమ కాలును కుడి ... వేసి పాదాన్ని నేలకు తాకించాలి.
- నడుము పై భాగాన్ని ఎడమ వైపుకు తిప్పాలి.
- చేతులు రెండూ జోడించి ఉంచాలి.
- ఈ భంగిమలో 30 నుంచి 60 సెకండ్లపాటు ఉండి, రెండోవైపు చేయాలి.
- ఈ ఆసనం వేస్తున్నంతసేపు నెమ్మదిగా ఊపిరి పీల్చుకోవాలి.

**ఆసనం వల్ల లాభాలు:** ఈ ఆసనం వల్ల వెన్ను బలంగా తయారవుతుంది. వెన్నుపాము పనితీరు మెరుగవుతుంది.

- వెన్నుపూసల మధ్య బిగుతును తొలగించి, వెన్ను నొప్పిని తొలగిస్తుంది.
- పిత్తాశయాన్ని ప్రేరేపించి, మధుమేహం సమస్యను తగ్గిస్తుంది.
- అడ్రినలిన్, బైల్ స్రావాలను క్రమబద్ధం చేస్తుంది.

## చక్కెర కంటే తేనె మేలా?

అపోహ - వాస్తవం

**అపోహ:** చక్కెర చేసే హానిని తప్పించుకోవాలంటే దాని బదులు తేనె వాడాలి.

**వాస్తవం:** ఇది నిజం కాదు. టీ, కాఫీల్లో చక్కెర బదులు తేనె కలుపుకుని తాగినా చక్కెరతో సమానమైన క్యాలరీలే శరీరానికి అందుతాయి. చెరకు నుంచి తయారయ్యే చక్కెరకూ, సహజసిద్ధమైన తేనెలోని చక్కెరకూ తేడా లేదు. కాబట్టి మధుమేహులు, బరువు తగ్గాలనుకునేవాళ్లు చక్కెరతోపాటు తేనె వాడకాన్నీ మానేయాలి.



నవ్య సకల

**బాద్‌షాహో, ముబారకన్...వరుస హిట్లతో బాలీవుడ్‌లో బిజీ బిజీగా మారిపోయిన ఇలియానాకు ఇక అడ్డేముంది? అనుకుంటున్న తరుణంలో ఆమెకు ఎవరూ ఊహించని బ్రేక్ పడింది. అదే...డిప్రెషన్. 'బాడీ డిస్‌మార్ఫిక్ సిండ్రోమ్' అనే విచిత్ర మానసిక రుగ్మతకు గురైన ఇలియనా, హఠాత్తుగా... మానసిక ఒత్తిడి, నిరాశానిస్పృహలతో ఒంటరితనంలో కూరుకుపోయింది. ఆ భావనల నుంచి ఎలా బయట పడిందో, ఆ సమయంలో తనకు బాసటగా నిలిచిందెవరో ఈ గోవా సుందరి బాహాటంగా చెప్పుకొచ్చింది.**

## నా బాయ్‌ఫ్రెండ్‌కి ఋణపడి ఉన్నా!

- ఇలియానా

'మైతెరా హీరో', 'హ్యాపీ ఎండింగ్'...నేను చేసేవన్నీ భారీ సినిమాలే! అయినా ఏదో నిరాశ. బహుశా అవసరానికి మించి ఒత్తిడికి లోనయ్యానేమో? ఊహించనివిధంగా మానసిక కుంగుబాటుకు గురయ్యాను. నటిగా నేను అనుకున్నంత గొప్ప స్థితిలో లేనని, మిగతా నటీమణులందరూ ...

### అంత బాయ్‌ఫ్రెండ్ పుణ్యం!

### ఫోన్లు చేసి ఛీ కొట్టుకున్నా!


### నా బాధ వారికి చెప్పను!

... లేదు. అది నాకెలా వస్తుంది?' అన్నాను. అదే వెర్రి భ్రమలో ఉండిపోయాను. అదే విషయం అతనితో వాదించాను కూడా! చివరికి అతను చెప్పింది తప్పని నిరూపించటం కోసం మానసిక వైద్యుల్ని కూడా కలిశాను.



... కలిసి గడపాలి. ఒక నెల సెలవు తీసుకుని కుటుంబంతో గడపాలని అనుకుంటున్నాను. ఇక నుంచి ఏం జరిగినా ఎదుర్కోవటానికి నేను సిద్ధం. డిప్రెషన్ నా ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది!

# సర్వం స్వాహా చేస్తే?



## గ్యాస్ట్రోఈసోఫేగల్ రిఫ్లక్స్ డిసీజ్ (జిఈఆర్‌డి)

అన్నవాహికకు సంబంధించిన సమస్య ఇది. విపరీతమైన నూనె, కొవ్వులు ఉన్న పదార్థాలను తినటం, ఈ పదార్థాల్లో పీచు తక్కువగా ఉండటం, తిన్న వెంటనే పడుకోవటం, అర్థరాత్రి తినటం, మొదలైన అలవాట్ల వల్ల జిఈఆర్‌డి సమస్య మొదలవుతుంది. ఈ సమస్య లక్షణాలు అసిడిటీని పోలి ఉండటంతో యాంటాసిడ్లు వాడేస్తూ ఉంటారు. కానీ ఇదే సమస్య పదే పదే కనిపిస్తూ ఉంటే జీఈఆర్‌డిగా భావించి వైద్యులను సంప్రదించాలి.

**లక్షణాలు:** ఛాతీలో మంట, నొప్పి, తిన్న వెంటనే నొప్పి ఎక్కువవటం, గొంతులోకి యాసిడ్ తన్నుకురావటం.

**నిర్లక్ష్యం చేస్తే:** అన్నవాహిక ఇరుకుగా మారి పదార్థం మింగుడుపడదు. అరుదుగా కొందరిలో అన్నవాహిక ఇరుకుగా మారిన కారణంగా అది క్యాన్సర్‌కు కూడా గురి కావొచ్చు.

### చికిత్స ఇదే!

లక్షణాలతోపాటు, ఎండోస్కోపీ ద్వారా వ్యాధి నిర్ధారించుకుని వైద్యులు చికిత్స చేస్తారు. ఈ సమస్యకు నోటి మాత్రలు వాడడంతోపాటు, జీవనశైలిలో కూడా మార్పులు ...

### హయాటిక్ హెర్నియా

### జీర్ణరోగ్యం

### ఇన్‌ఫ్లమేటరీ బొవెల్ డిసీజ్

### ఇరిటబుల్ బొవెల్ సిండ్రోమ్

### పెప్టిక్ అల్సర్ డిసీజ్

### ఫ్యాటీ లివర్ డిసీజ్

... ల్లు, దోశలు కాదు.... శాండ్‌విచ్‌లు, సలాడ్లు.
... జనం అంటే?... 'బర్గర్లు, పిజ్జాలు'.
... లంటే...'కూల్‌డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్'.
... యం అల్పాహారం తింటే తినటం, లేదంటే మానేయటం. మధ్యాహ్న... త్రికి ముగించటం...ఇవి వారి ఆహారపు వేళలు. ఇలాంటి ఆహారశైలి కొనసాగితే జీర్ణకోశ సమస్యలు తప్పవు.

... తగ్గించుకోవాలి. ఐబిఎస్ ఉన్నవాళ్లు నూనె, కొవ్వు పదార్థాలతో పాటు మానసిక ఒత్తిడినీ తగ్గించుకోవాలి. మందులతోపాటు, వేళ పట్టున ఆహారం తినటం, సమతులాహారం, మరీ ముఖ్యంగా పీచు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవటం తప్పనిసరి.

## ఈ నియమాలు తప్పనిసరి!

**జీర్ణకోశ, కాలేయ సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ఈ కింది నియమాలు పాటించాలి.**

- పీచు పదార్థం ఎక్కువగా ఉండే తాజా ఆకుకూరలు, కూరగాయలు, పళ్లు తినాలి.
- మాంసకృత్తులతోపాటు పీచు, పిండి పదార్థాలు, విటమిన్లు, మినరల్స్ తగు పాళ్లలో ఉండే సమతులాహారం తీసుకోవాలి.
- ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవటం వల్ల మలబద్ధకం తలెత్తకుండా పీచు పదార్థం ఉండే ఆహారం తప్పనిసరిగా తినాలి.
- మైదా, చక్కెర, మసాలాలు, కారం, ఉప్పు తగ్గించాలి.
- ప్రిజర్వేటివ్స్(పదార్థాల నిల్వకు వాడేవి), కలరింగ్ ఏజెంట్లు (పదార్థాలకు రంగు తెప్పించేవి) ఉన్న పదార్థాలు తినకూడదు.
- ప్యాకేజ్‌డ్ ఫుడ్ పూర్తిగా మానేయాలి.
- కూల్ డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్‌కు బదులుగా తాజా కొబ్బరి నీరు, మజ్జిగ, నిమ్మరసం లాంటి పానీయాలు తాగాలి.
- ఒకే నూనెలో పదే పదే వేయించిన పదార్థాలు తినకూడదు.
- రోజుకి కనీసం 5 రకాల కూరగాయలు, పళ్లు తినాలి.
- ఉదయం అల్పాహారం మానకూడదు.
- రాత్రి నిద్రకు కనీసం 3 గంటల ముందే భోజనం ముగించాలి.
- జంక్ ఫుడ్ సాధ్యమైనంత అరుదుగా తినాలి.
- నియమిత వేళల్లో ఆహారం తీసుకోవాలి.
- ఒత్తిడి తగ్గించుకోవాలి.



డాక్టర్ కె.ఎస్.సోమశేఖర రావు,
కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్, అపోలో హాస్పిటల్స్,హైదరాబాద్.
drk.sekharrao@gmail.com



హెల్తీ ఫుడ్

# సబ్జా సత్తా!

**సబ్జా విత్తనాలు పోషక భాండాగారాలు. వీటిలో ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లు, ప్రొటీన్లతోపాటు, సంపూర్ణారోగ్యానికి అవసరమైన పోషకాలెన్నో ఉంటాయి. అవేంటంటే....**

- **ప్రిబయోటిక్ ఫైబర్:** 300 గ్రాముల సబ్జా విత్తనాల్లో 11 గ్రాముల పీచు పదార్థం ఉంటుంది. వీటిలో ఉండే ప్రొబయోటిక్ ఫైబర్ పేగుల్లోని ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాకు ఆహారంగా ఉపయోగపడుతుంది. ఫలితంగా జీర్ణక్రియ సాఫీగా జరుగుతుంది. మలబద్ధకం దరి చేరదు.
- **గుండె పదిలం:** సబ్జా విత్తనాల్లో పెద్ద మొత్తంలో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. గుండె జబ్బులకు కారణమయ్యే ఆక్సిడేటివ్ ...



హెల్తీ రెసిపీ

# జొన్న దోసె

# యాంటీబయాటిక్స్ వాడకం ఎంతవరకూ?

ఇదీ లెక్క!




# జలాశయాన్ని జయించారు!

వాళ్లిద్దరూ విధి వంచితులు... అనుకోని కారణాలతో భర్తకు దూరమైన వనిత ఒకరైతే... అనారోగ్యంతో కట్టుకున్న వ్యక్తి కన్నుమూయడంతో ఒంటరైన అతివ మరొకరు... ఇద్దరి దీనగాథలు వేరైనా, వారికి మాత్రమే ఆ ఒక్కటే ఆధారమైంది. అదే చేపల వేట. 23 అడుగుల లోతుండే పాలేరు జలాశయం అలలను లెక్కచేయకుండా... తెప్పలపై చేపలు, రొయ్యల వేట సాగిస్తూ ఔరా అనిపిస్తున్నారు ఖమ్మం జిల్లాకు చెందిన వీరమల్లు రేణుక, పానుగోతు బుల్లెమ్మ. ఈతలో ఉన్న నైపుణ్యమే వారికి కొండంత ధైర్యాన్నిచ్చింది. పురుషులతో దీటుగా జలాశయంలో చేపలు పట్టే ఉత్సాహాన్నిచ్చింది.

● వీరమల్లు రేణుక... ఈమెది కూసుమంచి మండలం నాయకన్‌గూడెం. కాపరబోయిన నర్సయ్య-వెంకటనర్సమ్మ దంపతుల పెద్దకూతురు. 18ఏళ్లక్రితం సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలోని గుడిబండకు చెందిన వీరమల్లు ... పెద్దకూతురు వివాహం కూడా చేసింది. 'విధివంచించింది.. జ్వరం రూపంలో భర్తను దూరం చేసింది. ఇద్దరు బిడ్డలను సాకాలి అందుకే చేపలు పడుతున్నా. అలల మధ్య లోతైన జలాశయంలో చేపలు పట్టడం.. ఒక్కోసారి గాలిదుమారంలో తెప్ప తలకిందులైనా, పట్టు తప్పినా జీవితంపై ఆశ వదులుకోవడమే. అయినా తప్పదు. నాకు మత్స్యసంఘంలో సభ్యత్వం కూడా లేదు. ఏదైనా జరిగితే పిల్లలకు దిక్కు కూడా ఉండదు. మత్స్యసంఘంలో సభ్యత్వం ఇప్పించాలి. ఎలాగో ఇబ్బందులు పడి పెద్దకూతురు పెళ్లి చేశా. మరో ఇద్దరు ఆడపిల్లలున్నారు' అంటోంది రేణుక.

● పానుగోతు బుల్లెమ్మ.. ఈమెది ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పాలేరు గ్రామపంచాయితీ పరిధిలోని భోజ్యతండా. భర్తతో కలహాలు రావడంతో ఎర్రగడ్డతండాలోని తన పుట్టింటికి వెళ్లింది. అప్పటికే ఆమెకు ...


వీరమల్లు రేణుక


పానుగోతు బుల్లెమ్మ

## సహజసిద్ధంగా లైంగిక తృప్తి పొందేదెలా?

సెక్సువల్ హెల్త్

**ప్రశ్న:** డాక్టర్! స్వయంతృప్తి, ముఖరతి...ఈ రెండింటి ద్వారా మాత్రమే నేను లైంగిక తృప్తి పొందగలుగుతున్నాను. భాగస్వామితో సహజరతిలో నాకు ఎలాంటి తృప్తీ కలగట్లేదు. ఇలా ఎందుకు? సమస్య నా మనసులో ఉందా? లేక శరీరంలోనా?

**జవాబు:** అన్నిటికంటే ముందు మీ పరిస్థితే ఎంతోమందికి ఉంటుందని గ్రహించండి. దాదాపు 70 శాతం మంది మహిళలు పెనట్రేటివ్ సెక్స్ మినహా మిగతా పద్ధతుల్లో మాత్రమే లైంగిక తృప్తి పొందగలుగుతారు. సహజ రతి ద్వారా వాళ్లు భావప్రాప్తికి చేరుకోవటం కష్టం. స్త్రీ సంపూర్ణంగా భావప్రాప్తి పొందాలంటే వారి క్లైటోరిస్ ప్రాంతంలో తగినంత రాపిడి అవసరమవుతుంది. ఇలా సహజ రతిలో జరగకపోవటం వల్ల వాళ్లు భావప్రాప్తి పొందలేరు. కొందరి విషయంలో సహజ రతికి మానసిక స్థితీ అడ్డంకి కావొచ్చు. ఇంకొందరిలో రెండు కారణాలూ ఉండొచ్చు. ఇక మీ విషయంలో చెప్పాలంటే ముఖ రతి సమయంలో మీ భాగస్వామి క్లిటోరిస్ ప్రాంతంలో తగినంత రాపిడి కలిగిస్తూ ఉండి ఉంచొచ్చు. అలాగే స్వయంతృప్తి పొందేటప్పుడు కూడా భావప్రాప్తి పొందే మెలకువల మీద మీకు పట్టు ఉంటుంది. ...



డా॥ షర్మిలా మజుందార్,
Email: mill77@gmail.com

## పసికందుల్లో అవి కనిపిస్తే..?

చైల్డ్ హెల్త్

**ప్రశ్న:** మా బాబుకు పుట్టుకతోనే రొమ్ములు ఉన్నాయి. వాటిని పిండేదెలా? రొమ్ములను పిండేయకపోతే బిడ్డ ఆరోగ్యం దెబ్బ తింటుందని అంటూ ఉంటారు. ఇదెంతవరకూ నిజం?

**జవాబు:** పుట్టుకతోనే అందరు పసికందుల్లో కొద్దో, గొప్పో రొమ్ములు కనిపించటం సహజం. ఆడ పిల్లలతోపాటు, మగ పిల్లల్లో కూడా రొమ్ములు ఉంటాయి. కొందర్లో చిన్నవిగా ఉంటే, మరి కొందరిలో పెద్ద పరిమాణంలో ఉంటాయి. ఇవి అందరూ అనుకున్నట్టు పాలు నిండిన రొమ్ములు కావు. వీటిలోని పాలు పిండేయాలనీ, లేదంటే బిడ్డకు హాని కలుగుతుందనే అపోహతో తల్లులు బలవంతంగా పిండటానికి ప్రయత్నం చేస్తూ ఉంటారు. కానీ ఇలా చేయటం వల్ల పిల్లలు లేనిపోని ఇన్‌ఫెక్షన్లకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. ఇలా పిల్లల రొమ్ములు పిండకపోయినా, పుట్టిన 6 నుంచి 8 వారాల్లోగా అవి తగ్గిపోతాయి. ఆలోగా తగ్గకపోయినా, మరికొన్ని రోజులకు క్రమక్రమంగా తగ్గిపోతాయి. పసి కందుల్లో ఇలా రొమ్ములు ఏర్పడటానికి కారణం ప్రసవం చివరి రోజుల్లో ...




డాక్టర్ ...

పరిశోధన

## లేజర్ పాయింటర్లతో కళ్లకు చేటు

ఏదైనా ఒక ప్రదేశాన్ని హైలైట్ చేసి చూపించటం కోసం వాడే 'లేజర్ పాయింటర్లు' పిల్లల చేతుల్లో ఆట వస్తువులుగా మారుతున్నాయి. అయితే వీటి వాడకం వల్ల కళ్లు దెబ్బ తిని, కంటి చూపుకు నష్టం వాటిల్లుతుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. డ్యాషెస్ ఆర్జెటాబ్లాట్ ఇంటర్నేషనల్ పత్రికలో ప్రచురితమైన ఓ వ్యాసంలో, లేజర్ పాయింటర్లు, పెన్నుల వల్ల కంటోని రెటీనా తిరిగి సరిదిద్దలేనంతగా దెబ్బ తింటుందని పరిశోధకులు వివరించారు. రేడియేషన్ వేవ్‌లెంగ్త్, లేజర్ తాకిన సమయం, తాకిన ప్రదేశం, పరిమాణం ఆధారంగా కంటికి ఫోటోథర్మిక్ డ్యామేజీ జరుగుతుందినీ, లేజర్ కళ్లలో పడిన వెంటనే కళ్లు మూసినా, తల తిప్పేసుకున్నా పెద్దగా ప్రయోజనం ఉండదనీ పరిశోధకులు అంటున్నారు. మరీ ముఖ్యంగా, ఎక్కువ వేవ్ లెంగ్త్ ఉండే ఎరుపు రంగు లేజర్ల (లేజర్ పాయింటర్లు: 635-750 నానో మీటర్లు) కంటే, షార్ట్ వేవ్ లెంగ్త్ కలిగి ఉండే లేజర్ల వల్ల (ఆకుపచ్చ లేజర్ పాయింటర్లు: వేవ్ లెంగ్త్ 490-570 నానోమీటర్లు) ప్రమాదం ఎక్కువ. ...



## డైలీ సుడోకు - 91

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 1 | 6 | | 7 | | 4 | 2 |
| 9 | | | | | 2 | | | |
| | 2 | | | | | 5 | | 9 |
| | | 9 | | 1 | 5 | | 6 | 4 |
| | | | | | | | | |
| 6 | 5 | | 4 | 2 | | 1 | | |
| 4 | | 5 | | | | | 8 | |
| | | | 9 | | | | | 7 |
| 3 | 7 | | 5 | | 6 | 2 | | |

### ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ ...

సుడోకు- 90 సమాధానం

# యాక్షన్@ హైదరాబాద్!


రామ్‌చరణ్


వివేక్ ఒబెరాయ్

ఎప్పుడు? ఫిబ్రవరి 25వ తేదీ నుంచి! యాక్షన్‌లో ఎవరెవరుంటారు? రామ్‌చరణ్, వివేక్ ఒబెరాయ్, ఇతర నటీనటులు! యాక్షన్ అంటే ఫైట్ కాదు. సింగిల్ ఫ్రేమ్‌లో కలిసి నటించడం! ఎందుకు? బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా కోసం! రామ్‌చరణ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య సినిమా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ ముగిసింది. అయితే... ఈ షెడ్యూల్‌లో రామ్‌చరణ్ పాల్గొనలేదు. వచ్చే నెలలో హైదరాబాద్‌లో ప్రారంభం కానున్న రెండో షెడ్యూల్‌లో పాల్గొంటారు. ఫిబ్రవరి మూడోవారంలో ఈ షెడ్యూల్ మొదలుకానుంది. రామ్‌చరణ్ 25వ తేదీ నుంచి, వివేక్ ఒబెరాయ్ ప్రారంభం నుంచి చిత్రీకరణకు హాజరుకానున్నారు. సుమారు నెల రోజుల పాటు కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నారని సమాచారం. ముంబయ్ బ్యూటీ కియారా అలీ అద్వాణీ ఈ చిత్రంలో కథానాయిక. వివేక్ ఒబెరాయ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. 'రక్త చరిత్ర' చిత్రాల తర్వాత ఆయన చేస్తున్న తెలుగు చిత్రమిది.

# రయ్యి రయ్యిమంటూ..


రామ్


అనుపమ

'ఉన్నది ఒకటే జిందగీ'లో రయ్యి రయ్యిమంటూ ప్రేమజంటగా నటించిన రామ్, అనుపమ మరోసారి జోడీకట్టబోతున్నారా? అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. రామ్ హీరోగా త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రానికి దిల్‌రాజు నిర్మాత. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ సరసన అనుపమ పరమేశ్వరన్‌ను ఎంపిక చేశారట. పెర్ఫార్మెన్స్ బేస్డ్ రోల్ కావడంతో అనుపమ అయితే చక్కగా సరిపోతుందని చిత్ర యూనిట్ భావించిందట. దిల్‌రాజు నిర్మాణంలో ఇంతకు ముందు జాతీయ అవార్డు పొందిన 'శతమానం భవతి'లో నటించారు అనుపమ. ఈ సినిమా విషయంలోనూ పాజిటివ్‌గా స్పందించారని సమాచారం.

# గురువుగారు వేంచేస్తున్నారహో..!


అమితాబ్


చిరంజీవి

'సైరా నరసింహారెడ్డి' అంటూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గురువు వేంచేయనున్నారు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించి 'పాలెగాడు' ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పావులు కదపడంలో కీలక పాత్ర పోషించింది ఆయన గురువే. సిల్వర్‌స్క్రీన్ మీద ఆవిష్కృతం కానున్న ఈ కథలో గురువుగా అమితాబ్‌బచ్చన్ నటించనున్నారు. నరసింహారెడ్డిగా చిరంజీవి నటిస్తున్నారనే విషయం తెలిసిందే. వీరిద్దరు కలిసి సినిమా చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నారు. ఇన్నాళ్లకు అది కుదిరింది. కొణిదెల ప్రొడక్షన్స్ కంపెనీ నిర్మిస్తోన్న చిత్రం 'సైరా నరసింహారెడ్డి'. రామ్‌చరణ్ నిర్మాత. సురేఖ కొణిదెల సమర్పిస్తున్నారు. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా తదుపరి షెడ్యూల్ ఫిబ్రవరి నుంచి హైదరాబాద్‌లో జరుగనుంది. ఈ షెడ్యూల్లోనే అమితాబ్ మీద కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తారని యూనిట్ వర్గాలు తెలిపాయి. రాజస్తాన్, కేరళలో జరిగే షూటింగ్‌లోనూ బిగ్‌బీ పాల్గొంటారు.

# రాజా 'మార్తాండ వర్మ'


రానా

రానా ఇప్పుడు రాజా మార్తాండ వర్మగా కనిపించబోతున్నారు. తిరువనంతపురాన్ని పరిపాలించిన రాజు జీవిత కథ ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. 1729-1758 మధ్యకాలంలో మార్తాండవర్మ ట్రావెన్‌కోర్‌ను పరిపాలించారు. తాజా చిత్రాన్ని కె.మధు దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ "నేను, రానా ఇంతకుముందు తిరువనంతపురం గుడిలోనే కలుసుకున్నాం. అందుకే ఇక్కడే షూటింగ్ మొదలుపెట్టాం. రానాకి ఈ పాత్ర చాలా చక్కగా సరిపోతుంది" అని అన్నారు. "రానా ప్రస్తుతం మార్తాండవర్మ జీవన శైలి, ఆయన పరిపాలించిన ప్రదేశాలు, తదితర అంశాలకు సంబంధించి అధ్యయనం చేస్తున్నారు" అని కథా రచయిత రాబిన్ తిరుమల చెప్పారు.

# విష్ణుతో నటించానా... నిజంగా గుర్తులేదు!

\- శ్రియ



**"పద్దెనిమిదేళ్ల అమ్మాయి ఇరవైయేళ్ల అబ్బాయితో ప్రేమలో పడడం మాత్రమే కాదు. సమాజంలో మహిళలు ఎన్నో గొప్ప పనులు చేస్తున్నారు. ఏంజెలా మెర్కెల్ (జర్మనీ ఛాన్సలర్) దేశాన్ని ఏలుతోంది. అటువంటి కథలను తెరమీదకు తీసుకురావలసిన అవసరం ఉంది. ఐదు పాటలు, ఇరవై సన్నివేశాలున్నా... కథానాయికకు ఏమాత్రం ప్రాముఖ్యత లేని చిత్రాలు నేను చాలా చేశా. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే... ఏం అర్థం కాలేదు. తర్వాత నిడివితో సంబంధం లేకుండా ప్రాముఖ్యత ఉన్న పాత్రలు చేయడం ప్రారంభించా" అన్నారు శ్రియ. మోహన్‌బాబు హీరోగా, విలన్‌గా నటించిన 'గాయత్రి'లో మంచు విష్ణుకి జోడీగా నటించారీమె. మదన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం వచ్చే నెల 9న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శ్రియ చెప్పిన సంగతులు...**

❖ 'గాయత్రి'లో అందంతో పాటు అమాయకత్వం కూడిన పల్లెటూరి అమ్మాయి పాత్ర చేశా. తను చాలా నిజాయితీగా, పట్టుదలగా ఉంటుంది. విష్ణుకి జంటగా నటించా. సినిమా అంతా కనిపించను. కానీ, కథను మలుపు తిప్పే కీలకమైన పాత్ర నాది. దర్శకుడు మదన్ నా పాత్రను చాలా సహజంగా, అందంగా తీర్చిదిద్దారు. తెలుగులో దాదాపు అగ్ర హీరోలందరితోనూ నటించా. మోహన్‌బాబుగారి సినిమా చేసే ఛాన్స్ రాలేదనుకుంటున్న టైమ్‌లో ఈ అవకాశం వచ్చింది. అందులోనూ మంచి పాత్ర. వెంటనే అంగీకరించా.

❖ 'గేమ్' చిత్రంలో విష్ణుతో చిన్న అతిథి పాత్ర చేశారు. ఇప్పుడు పెద్ద పాత్ర చేశారు' అని చెప్పగా... "నిజంగా విష్ణుతో ఇంతకు ముందు నటించానా? నాకు గుర్తు లేదు! జోక్ చేయడం లేదు. సీరియస్‌గా చెబుతున్నా" అన్నారు. ఇందులో విష్ణుకి, నాకు మధ్య ఒక పాట ఉంటుంది. అది చాలా బాగా వచ్చింది. తమన్ మంచి సంగీతానిచ్చారు. అలాగే, చిత్రంలో నా స్టైలింగ్ బాగుంటుంది.

❖ దర్శక రచయితలు మంచి మంచి పాత్రలు నా కోసం రాయడం వల్లే ఇన్నేళ్లు చిత్రపరిశ్రమలో ఉండగలిగా. అయితే... ఇప్పటివరకూ ఇద్దరు మహిళా దర్శకులతో మాత్రమే పని చేశా. మగవారితో నాకు ఎటువంటి చేదు అనుభవాలూ లేవు. కానీ, మరింతమంది మహిళలు రావాలి. అప్పుడే మహిళలకు శక్తివంతమైన పాత్రలు, మహిళలపై చిత్రాలు వస్తాయి.

❖ చిన్నప్పటి నుంచి కథక్ డ్యాన్సర్ కావడంతో కథక్‌పై ఒక చిత్రం చేయాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నా. ఎప్పటికి తీరుతుందో! ఇప్పుడు తెలుగులో 'వీరభోగ వసంతరాయులు', తమిళంలో 'నరగాసురన్' చిత్రాలు చేస్తున్నా. హిందీలో 'తడ్కా' చిత్రీకరణ పూర్తి చేశా. 'గౌతమిపుత్ర శాతకర్ణి' సినిమాటోగ్రాఫర్ జ్ఞానశేఖర్ నిర్మించనున్న చిత్రం అంగీకరించా.

# అమ్మాయిలకు నేనిచ్చే సలహా అదే!

\- రాశీ ఖన్నా



**"దక్షిణాది చిత్రాలతో చాలా సంతోషంగా ఉన్నాను. హిందీ గురించి అస్సలు ఆలోచించడం లేదు. మరీ మంచి పాత్ర ఏదైనా వస్తే అప్పుడు హిందీ చిత్రాల గురించి ఆలోచిస్తా" అన్నారు రాశీ ఖన్నా. రవితేజ హీరోగా విక్రమ్ సిరికొండను దర్శకుడిగా పరిచయం చేస్తూ నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీ నిర్మించిన సినిమా 'టచ్ చేసి చూడు'. రాశీ ఖన్నా, సీరత్ కపూర్ హీరోయిన్లుగా నటించిన ఈ సినిమా వచ్చే నెల 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా రాశీతో చిట్‌చాట్...**

**సినిమాలో రవితేజ పెళ్లి క్యాన్సిల్ అవుతుందా? ట్రైలర్‌లో 'పెళ్లి క్యాన్సిల్ అయ్యిందా!' అనే డైలాగ్‌ను చాలా హ్యాపీగా చెప్పారు!**

(ఆలోచిస్తూ..) మీరు సినిమా చూసి తెలుసుకోవాలి. అదంతా చెబితే... ప్రేక్షకులకు కథ తెలిసిపోతుంది. తెరపైన చూస్తే మంచి కిక్ ఇస్తుంది.

**సరే... సినిమా మీ పాత్ర గురించి చెప్పండి!**

ఇందులో నా పాత్ర పేరు పుష్ప. డ్యాన్స్ ట్యూటర్! సాధారణంగా హీరోయిన్లకు కామెడీ చేసే ఛాన్స్ రాదు. నటనకు ఆస్కారమున్న, వీలున్న పాత్రలు అరుదుగా, అతి కష్టం మీద లభిస్తాయి. ప్రతి ఒక్కరూ రవితేజ సినిమాలో హీరోయిన్ అంటే... గ్లామర్ గ్లామర్ అంటుంటారు. కానీ, 'టచ్ చేసి చూడు'లో నా పాత్ర చాలా ముఖ్యమైనది. రవితేజకు, నాకు మధ్య చాలా కామెడీ సన్నివేశాలు ఉన్నాయి. నాకు కామెడీ అంటే చాలా ఇష్టం. 'సుప్రీమ్' తర్వాత మళ్లీ ఈ సినిమాలో కామెడీ చేసే ఛాన్స్ వచ్చింది. అలాగని, 'బెల్లం' శ్రీదేవికి, పుష్పకు ఏం సంబంధం లేదు.

**డ్యాన్స్ ట్యూటర్ అంటున్నారు. సినిమా కోసం స్పెషల్ డ్యాన్స్ ఏదైనా నేర్చుకున్నారా?**

వెస్ట్రన్ డ్యాన్స్ ట్యూటర్‌గా కనిపిస్తా. స్పెషల్ డ్యాన్స్ అంటే... ఒక సీన్ కోసం ఐదు రోజులు వెస్ట్రన్ డ్యాన్స్ ప్రాక్టీస్ చేశా. చాలా హార్డ్‌వర్క్ చేశా. ప్రేక్షకులకూ నచ్చుతుందని ఆశిస్తున్నా.

**దర్శకుడు విక్రమ్ సిరికొండ ఫస్టాఫ్‌లో మీ పాత్ర హీరోలా ఉంటుందంటున్నారు!**

రవితేజగారు డబ్బింగ్ చెప్పిన తర్వాత ఫోన్ చేసి... 'ఫస్టాఫ్‌లో నీ పాత్రకు మంచి పేరొస్తుంది. వన్నాఫ్ ద హైలైట్స్ అవుతుంది' అని చెప్పారు. నాకొచ్చిన అతి పెద్ద ప్రశంస ఇది. ఇప్పటివరకూ నా కో-స్టార్స్ ఎవరూ అలా చెప్పలేదు. అందువల్ల సినిమా విడుదల కోసం నేనూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. రవితేజ ఈజ్ సో గుడ్ ఎట్ కామెడీ! ఈ సినిమా చిత్రీకరణలో ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నా. ముఖ్యంగా చిన్న చిన్న హావభావాలు సన్నివేశంలో ఎంత మార్పు తీసుకొస్తాయో తెలుసుకున్నా. దర్శకుడు విక్రమ్ కూడా చాలా సహాయం చేశాడు.

**'బెంగాల్ టైగర్', 'రాజా.. ది గ్రేట్'లోని పాటలో అతిథి పాత్ర, ఇప్పుడీ 'టచ్ చేస్తే చూడు'... రవితేజతో వరుసగా సినిమాలు చేస్తున్నారు!**

ఐ ఎంజాయ్ హిజ్ కంపెనీ ఎలాట్! రవితేజగారు ఎంత హుషారుగా ఉంటారో అందరికీ తెలుసు. ఆయన మనసులో ఒకలా, బయట ఒకలా ఉండరు. వెరీ జోవియల్, హ్యాపీ, పాజిటివ్ పర్సన్. సెట్‌లోనూ అంతే. ఆయనతో పని చేసే అవకాశాలు వస్తున్నాయి. చేస్తున్నా.

**రవితేజ తర్వాత సినిమాలో ఛాన్స్ వస్తే...**

అర్రే... తప్పకుండా చేస్తా. ఆయనతో మళ్లీ మళ్లీ పని చేయాలని కోరుకుంటున్నా.

**'సుప్రీమ్', 'టచ్ చేసి చూడు'... కామెడీ పాత్రలను ఏరికోరి ఎంపిక చేసుకుంటున్నారా?**

నేను ఎంపిక చేసుకోవాలంటే చాలా ఎక్కువ అవకాశాలు కావాలి. కామెడీ పాత్రలు చేయాలని ఎంపిక చేసుకోలేదు. అవకాశాలు వచ్చాయంతే. అది నా అదృష్టంగా భావిస్తున్నా.

**తెలుగులో కమర్షియల్ సినిమాలు... తమిళ, మలయాళ సినిమాలు చేస్తున్నారు. బ్యాలెన్స్ చేస్తున్నారా?**

మలయాళ 'విలన్'లో సీరియస్ పోలీస్‌గా నటించా. తమిళ సినిమాలో పక్కింటి అమ్మాయిగా చేశా. 'తొలిప్రేమ'తో తెలుగులోనూ అటువంటి అవకాశం వచ్చింది. అది కమర్షియల్ చిత్రమైనా నాది గ్లామరస్ రోల్ కాదు. ఇప్పుడు తెలుగు చిత్రపరిశ్రమ కూడా మారుతోంది. 'తొలిప్రేమ' తర్వాత నాకు అటువంటి పాత్రలు వస్తాయని ఆశిస్తున్నా. అందంతో పాటు అభినయానికి ఆస్కారమున్న పాత్రలు చేసినప్పుడు నాకు ఎక్కువ గుర్తింపు, కెరీర్ ఉంటుంది.

**ఇటీవల బాగా బరువు తగ్గారు. సినిమాల కోసమా? మీ కోసమా?**

రెండిటి కోసం! ముఖ్యంగా చెప్పాలంటే... నా ఆరోగ్యాన్ని, ఫిట్‌నెస్‌ని దృష్టిలో పెట్టుకుని తగ్గా. బరువు తగ్గడం 'తొలిప్రేమ'లో పాత్రకు హెల్ప్ అయ్యింది. అందులో మూడు వేరియేషన్స్ ఉన్న పాత్ర చేశా. ఇప్పుడు తమిళవాళ్లు, తెలుగులో కొంతమంది బరువు పెరగమని సలహాలు ఇస్తున్నారు. నేనిలాగే హ్యాపీగా ఉన్నా. మళ్లీ బరువు పెరిగే ఆలోచన లేదు.

**అమ్మాయిల బాడీ షేమింగ్ గురించి ఇటీవల ఎక్కువ వినిపిస్తుంది. మీకు అలాంటి అనుభవాలు ఎదురయ్యాయా?**

ఇప్పుడు నన్ను ప్రేమించేవాళ్లు, ఇష్టపడేవాళ్లు... నేను చబ్బీగా ఉన్నా, సన్నగా ఉన్నా ప్రేమిస్తారు. ద్వేషించేవాళ్లు నేనెలా ఉన్నా ద్వేషిస్తారు. అందుకని, నేను బాడీ షేమింగ్‌ని హార్ట్‌కి తీసుకోను. అమ్మాయిలకు నేనిచ్చే సలహా కూడా అదే. విమర్శలను పట్టించుకోవద్దు. మనసుకు ఎక్కించుకోవద్దు. మీకు ఇష్టం వచ్చినట్టు మీరు ఉండండి.

**తెలుగు ఇంత బాగా మాట్లాడుతున్నారు. మీ పాత్రలకు మీరు డబ్బింగ్ ఎప్పుడు చెబుతారు?**

'టచ్ చేసి చూడు', 'తొలిప్రేమ' చిత్రాలకు చెపుకోవాలనుకున్నా. కానీ, కుదరలేదు. తమిళంలో ఒక సినిమా చేస్తున్నా. అందువల్ల, టైమ్ లేదు.

# ప్రేక్షకులే నిర్ణయిస్తారు!

\- శ్రీకాంత్


శ్రీకాంత్, నజీయా

"నేను నటించిన తొలి హారర్ కామెడీ చిత్రమిది. హారర్ తక్కువ, వినోదం ఎక్కువ. ఇందులో మనుషులను చూసి దెయ్యాలు భయపడే కొన్ని సన్నివేశాలు బాగా వచ్చాయి. మంచి చిత్రం తీశామని వంద శాతం నమ్మకంతో ఉన్నాం. మా నమ్మకం నిజమో.. కాదో.. ప్రేక్షకులే నిర్ణయిస్తారు. వచ్చే నెలలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం" అన్నారు శ్రీకాంత్. ఆయన హీరోగా శ్రీమిత్రచౌదరి సమర్పణలో ఎం. విజయ్ నిర్మించిన చిత్రం 'రా.. రా'. విజి చెరిష్ దర్శకుడు. వచ్చే నెల 23న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ "ఈ చిత్రంలో నేను 'మంచి చిత్రం తీయాలి, సక్సెస్ కొట్టాలి' అనే కసితో కథలు రాసుకుంటూ అవకాశాల కోసం ప్రయత్నించే దర్శకుడిగా కనిపిస్తా" అన్నారు. "చిత్రపరిశ్రమలోని హాస్యనటులందరూ ఇందులో నటించారు. కొందరు దెయ్యాలుగా, మరికొందరు మనుషులుగా కనిపిస్తారు. తొంభై శాతం చిత్రం వినోదాత్మకంగా సాగుతుంది" అన్నారు ఎం. విజయ్. "సుమారు 120 చిత్రాల్లో శ్రీకాంత్‌గారు ఎన్నో వైవిధ్యమైన పాత్రలు చేశారు. 'రా.. రా'లో విభిన్నమైన పాత్ర చేశారు" అన్నారు శ్రీమిత్రచౌదరి. నజియా, సీతా నారాయణ, అలీ, రఘుబాబు, పోసాని కృష్ణమురళి, పృథ్వీ, జీవా, హేమ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: 'ర్యాప్‌రాక్' షకీల్.

# 15 కిలోలు తగ్గా!


పూజా చోప్రా


పాత్ర కోసం బరువు పెరగడం, తగ్గడం ఆర్టిస్టులకు తప్పనిసరి. అలాగే 'అయ్యారే' సినిమా కోసం పూజా చోప్రా ఏకంగా 15 కిలోలు తగ్గేసింది. ఈ చిత్రంలో ఆమె బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ కెప్టెన్‌గా నటించింది. 'ఫెమినా మిస్ ఇండియా -2009'గా ఎన్నికైన ఈ అందాల సుందరి ఇంతవరకూ నాలుగు చిత్రాల్లో నటించింది. అయితే వాటిల్లో అంత ప్రాధాన్యం లేని పాత్రలు చేశాననీ, 'అయ్యారే' సినిమా మాత్రం తన కెరీర్‌కు మంచి బ్రేక్ ఇస్తుందనే నమ్మకం ఉందని చెబుతోందీ అందాల సుందరి. 'దర్శకుడు నీరజ్ పాండే నన్ను పిలిచి ఈ పాత్ర గురించి చెప్పి' ఆర్మీ ఆఫీసర్ పాత్ర ఇది. చాలా ఫిట్‌గా ఉండాలి. నువ్వు బరువు బాగా తగ్గాలి అని చెప్పిన మరుసటి రోజు నుంచే స్ట్రిక్ట్ డైటింగ్ ఫాలో అయ్యాను. హాలీవుడ్ తారలు మిరందా కేర్, లివ్ టైలర్, క్రిస్టీ టర్లింగ్‌టన్, బెన్ ఎఫ్లిక్ తదితరులంతా ఫాలో అయ్యే డైట్ చార్ట్‌ను ఫాలో అయ్యాను. నేను అంతలా బరువు తగ్గడం చూసి దర్శకుడే ఆశ్చర్యపోయారు' అని చెప్పింది పూజ. రకుల్ ప్రీత్‌సింగ్ కథానాయికగా నటించిన 'అయ్యారే' చిత్రం ఈ నెల 26న విడుదల కావాల్సి ఉంది. అయితే 'పద్మావత్' కారణంగా ఫిబ్రవరి 9న విడుదలవుతోంది.

# యు... కథే హీరో!


హిమాన్షి, కౌవెర

కౌవెర హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'యు.. కథే హీరో'. హిమాన్షి కాంట్రగడ్డ హీరోయిన్. శ్రీమతి నాగానిక సమర్పణలో కౌవెరా క్రియేషన్స్ పతాకంపై విజయలక్ష్మీ కొండా నిర్మిస్తున్న ఈ చిత్ర మోషన్ పోస్టర్‌ను దర్శకుడు సుకుమార్ విడుదల చేశారు. "ఈ చిత్ర కథాంశం విన్నా. చాలా ఆసక్తిగా ఉంది. మోషన్ పోస్టర్‌నూ కథానుగుణంగా వినూత్నంగా రూపొందించారు. చిత్రం విజయం సాధించాలని మనఃస్ఫూర్తిగా కోరుకుంటున్నా" అన్నారు సుకుమార్. కౌవెర మాట్లాడుతూ "ప్రముఖ రచయిత వి. విజయేంద్రప్రసాద్‌గారి దగ్గర పని చేశా. కొన్ని చిత్రాలకు రచయితగా చేసి, తొలి ప్రయత్నంగా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నా. కథ చాలా కొత్తగా ఉంటుంది. సినిమా చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి" అన్నారు. తనికెళ్ల భరణి, 'శుభలేక' సుధాకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సత్య మహావీర్.

# రెండు తరాల వ్యక్తిత్వం


మనోజ్ నందం, సౌందర్య

మనోజ్ నందం, సౌందర్య జంటగా నటిస్తున్న 'ఎక్కడ నా ప్రేమ'చిత్రం ఆడియో వేడుక ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు సినీరాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్రనిర్మాతలు ఎస్.రామకృష్ణ, వడ్డే గోపాల్ మాట్లాడుతూ 'రెండు తరాల వ్యక్తిత్వాన్ని ఈ చిత్రంలో చూపిస్తున్నాం. ప్రేమే జీవితంగా బతికే యువత నిర్ణయాలు, పిల్లల బాగు కోసం తపించే తల్లిదండ్రుల ఆరాటాలు కథలో ప్రధానాంశాలుగా ఉంటాయి. ప్రేమికుల్లోని ఆకర్షణ, మనస్పర్థలను మా దర్శకుడు ఏఎండీ హుస్సేన్ చక్కగా తెరకెక్కించారు. చిత్రం సెన్సార్ పూర్తయింది. ఫిబ్రవరి 22న విడుదల చేస్తున్నాం' అని తెలిపారు.

## ప్రగతి బాటలో విమానయానం

ముంబై : దేశీయ విమాన రంగం మెరుగైన పురోగతి సాధిస్తోంది. విమాన టికెట్ల పరంగా భారత్ మూడో అతిపెద్ద మార్కెట్‌గా అవతరించింది. ఉడాన్ పథక అమలుతో ప్రాంతీయ మార్గాల్లో విమాన సేవలు ఊపందుకున్నాయి. ఇప్పటివరకు సర్వీసులు ఆరంభించని లేదా చాలా తక్కువగా నడుస్తున్న ఎయిర్‌పోర్టులను ప్రధాన నగరాలతో అనుసంధానం చేయడంతోపాటు సామాన్యులకు సైతం విమాన సేవలను అందుబాటులోకి తెచ్చే ఉద్దేశంతో కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. 2016-17లో దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య 23.5 శాతం వృద్ధి చెందింది. అదే కాలానికి అమెరికాలో 3.3 శాతం, చైనాలో 10.7 శాతం వృద్ధి నమోదైంది. 2007-08 నుంచి 2016-17 మధ్యకాలంలో దేశీయ విమాన ప్రయాణికుల రద్దీ ఏటేటా 9.89 శాతం వృద్ధిని నమోదు చేసుకుంది.

# వృద్ధి రేటు ఇక ఉరకలు

## 2018-19లో 7-7.5 శాతం ఖాయం.. అచ్ఛేదిన్‌ను ఆవిష్కరించిన సర్వే

**సవాళ్లు : స్టాక్ మార్కెట్ బబుల్, ముడి చమురు ధర**

**బలాలు : ఎగుమతులు, ప్రైవేట్ పెట్టుబడులు**

న్యూఢిల్లీ: ఆర్థిక రంగంలో మళ్లీ జోరు మొదలైంది. ఇక అచ్ఛేదిన్ వచ్చేసినట్టే కనిపిస్తోంది. దేశ ఆర్థిక వృద్ధి రేటు 2018-19లో మళ్లీ 7 నుంచి 7.5 శాతానికి దూసుకుపోయే అవకాశం ఉందని ఆర్థిక సర్వే ప్రకటించింది. నిశ్శబ్దంగానే గానే అయినా చాలా బలంగా కోలుకొని పట్టాలనెక్కిన ఆర్థిక రంగం "ప్రపంచంలో శరవేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ"గా మరోసారి సంచలనం సృష్టించే అవకాశం ఉందని పేర్కొంది. ఆర్థిక రంగాన్ని కుంగదీసిన పెద్ద నోట్ల రద్దు ప్రభావం సమసిపోయిందని పేర్కొంది. వ్యాపార, పారిశ్రామిక రంగాలను కుదిపేసిన జిఎస్‌టి ఇప్పుడు సర్దుకుందని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం సాధారణ వార్షిక బడ్జెట్‌ను ఫిబ్రవరి ఒకటిన పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో సోమవారం నాడు ఆర్థిక సర్వేను ఆవిష్కరించారు. ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ తయారు చేసిన సర్వే నివేదికను ఆర్థిక మంత్రి జైట్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఆర్థిక వృద్ధికి సంబంధించి ఆశాజనకమైన అంచనాలను ప్రకటిస్తూనే, ఈ దారిలో భారీ సవాళ్లు కూడా పొంచుకొని ఉన్నాయని సర్వే హెచ్చరించింది.


పెరుగుతున్న ముడిచమురు ధరలు, అసాధారణ స్థాయిలో పెరిగిన స్టాక్‌మార్కెట్లలో కరెక్షన్ అవకాశాలు.. ఆర్థికవృద్ధి రేటు జోరును దెబ్బతీసే అవకాశాలున్నాయని తెలిపింది. కొత్త సంవత్సరంలో ఎగుమతులు పుంజుకుంటాయనీ, ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్లలో మళ్లీ సందడి మొదలవుతుందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.75 శాతం ఉంటుందని అంచనావేసింది.

### పెరుగుతున్న ఆశలు.. వెన్నంటి భయాలు

వృద్ధి రేటు విషయంలో సర్వే అంచనాలు కొత్త ఆశలకు అవకాశం ఇస్తున్నాయి. ఈ ఏడాది పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సర్వే అంచనాలు అధికారపార్టీకి ఊరటనిచ్చేవిధంగా ఉన్నాయి. 2014-15లో 7.5 శాతం ఉన్న వృద్ధి రేటు 2015-16లో 8 శాతం 2016-17లో 7.1 శాతానికి పడిపోయింది. ఈ ఏడాది 6.75 శాతం ఉంటుందని ఆర్థిక సర్వే చెబుతుండగా సిఎస్ఓ 6.5 శాతం వృద్ధిరేటును అంచనావేసింది. గతేడాది ఆర్థిక రంగంలోని పరిణామాలను సమగ్రంగా పరామర్శిస్తూ వచ్చే ఏడాది పొంచుకొని ఉన్న సవాళ్లను వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలను సర్వే సూచించింది. ముడి చమురు ధరలు భారత్ ఆశలపై నీళ్లు చల్లే అవకాశాలు ప్రధానంగా కనిపిస్తున్నాయని అభిప్రాయపడింది. గతేడాది భారత్ ముడి చమురు కొనుగోలు ధర 14 శాతం వరకు పెరగ్గా, 2018-19లో కనీసం 10-15 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. బ్యారెల్ ధర 10 డాలర్లు పెరిగితే ద్రవ్యోల్బణం 0.3 శాతం మేర భగ్గుమంటుంది. జిడిపి 0.3 శాతం మేర కుంగుతుంది. కరెంట్ ఖాతాలో లోటు మరింత విస్తరిస్తుంది. అదే సమయంలో ఇప్పటికే తారాపథానికి చేరిన స్టాక్ మార్కెట్లలో కరెక్షన్ వచ్చి మార్కెట్లు కుప్పకూలితే విదేశీ ఇన్వెస్టర్లు ఉడాయించే అవకాశం ఉంది. దాని ప్రభావం కూడా ఆర్థిక రంగాన్ని కుంగదీస్తుంది.

ఈ నేపథ్యంలో విధానపరమైన పర్యవేక్షణ కట్టుదిట్టంగా ఉండాలని సర్వే సలహాఇచ్చింది. ప్రపంచ ఆర్థిక రంగంలో కనిపిస్తున్న పునరుత్తేజం, జిఎస్‌టి కుదురుకోవడం, ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్లలో పెరుగుదల.. ఇవన్నీ ఆర్థిక రంగానికి పాజిటివ్ పాయింట్లని తేల్చిచెప్పింది. ఎన్‌పిఎల సమస్య పరిష్కారం, ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ, స్థూల ఆర్థిక రంగం ముప్పులను కట్టడి చేయడం ప్రధానమని ప్రకటించింది. ఉద్యోగాల కల్పన ముఖ్యంగా శ్రమశక్తిలో మహిళల పాత్ర పెంపు, విద్య, ఆరోగ్యవంతమైన, విద్యావంతులైన కార్మికశక్తిని అభివృద్ధి చేయడం, వ్యవసాయ రంగంలో ఉత్పాదకత పెంచడం కీలకమని తెలిపింది. భారత్‌కు ఎగుమతులు, ప్రైవేట్ పెట్టుబడులు అతిపెద్ద బలాలని, వీటిని మళ్లీ ఉత్తేజితం చేయడం ద్వారా వృద్ధి రేటు దూసుకుపోతుందని పేర్కొంది.

## వడ్డీ రేట్ల తగ్గింపు అనుమానమే: సిఇఎ




న్యూఢిల్లీ : ఆర్‌బిఐ ఇప్పట్లో కీలక వడ్డీ రేట్లు తగ్గించే సూచనలు కనిపించడం లేదు. ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ సోమవారం సూచనప్రాయంగా ఈ విషయం చెప్పారు. తదుపరి ద్రవ్య, పరపతి విధాన సమీక్ష కోసం గవర్నర్ ఉర్జిత్ పటేల్ అధ్యక్షతన ద్రవ్య విధాన కమిటీ (ఎంపిసి) ఫిబ్రవరి 7న సమావేశమవుతోంది. గత ఏడాది ఆగస్టు నుంచి ఆర్‌బిఐ కీలకమైన రెపో రేటును ఆరు శాతం దగ్గరే కొనసాగిస్తోంది. రెపో రేటు తగ్గించి జిడిపి వృద్ధి రేటు గాడిలో పడేందుకు సహకరించండి మహా ప్రభో అని పారిశ్రామికవర్గాలు, ప్రభుత్వ పెద్దలు మొత్తుకుంటున్నా ఆర్‌బిఐ పట్టించుకోవడం లేదు.

### పొంచి ఉన్న ద్రవ్యోల్బణం

పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టితో నీరసించిన ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. రిటైల్ ద్రవ్యోల్బణం మళ్లీ కోరలు చాస్తోంది. గత ఏడాది డిసెంబరు నాటికి 5.21 శాతానికి చేరింది. మరోవైపు ముడి చమురు ధర సెగలు కక్కుతోంది. పీపా ముడి చమురు ధర 60 డాలర్లు దాటక పోవచ్చని గత ఏడాది ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశ పెడుతూ ఆర్థిక మంత్రి జైట్లీ అంచనా వేశారు. ఇప్పుడు ఆ అంచనాలన్నీ తలకిందులయ్యాయి. ఇప్పటికే పీపా ముడి చమురు ధర 65 నుంచి 70 డాలర్లు పలుకుతోంది. దీంతో ముందు ముందు రిటైల్ ద్రవ్యోల్బణం మరింత కోరలు చాచే ప్రమదాముందనే భయాలు వ్యక్తం అవుతున్నాయి . ఈ విషయాల దృష్ట్యా ఫిబ్రవరి 7న జరిగే ఎంపిసి సమావేశంలోనూ కీలకమైన వడ్డీ రేట్లలో ఎ లాంటి తగ్గింపు ఉండక పోవచ్చని భావిస్తున్నారు.

## ఆర్థిక సర్వే 2017-18 ముఖ్యాంశాలు



**2019 ఆర్థిక సంవత్సర వృద్ధి రేటు అంచనా 7-7.5 శాతం**

**3.3 శాతానికి సగటు రిటైల్ ద్రవ్యోల్బణం, ఆరేళ్లలోనే అతి తక్కువ స్థాయి**

- 2017-18లో వృద్ధి రేటు అంచనా 6.75 శాతం
- ఆయిల్ ధరలు గరిష్ఠ స్థాయిల్లో ఉండి స్టాక్ మార్కెట్లలో కరెక్షన్ అవకాశాలున్న దృష్ట్యా విధానపరమైన నిఘా ఆవశ్యం
- వచ్చే ఏడాది పాలసీ ప్రాధాన్యతలు - వ్యవసాయ రంగానికి మద్దతు, ఎయిరిండియా ప్రైవేటీకరణ, బ్యాంకుల రీ క్యాపిటలైజేషన్ పూర్తి చేయడం
- జిఎస్‌టితో 50 శాతం పెరిగిన పరోక్ష పన్ను చెల్లింపుదారులు
- రాష్ట్రాలు, స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న పన్నులు ఇతర దేశాలతో పోల్చితే తక్కువే
- డీమానిటైజేషన్‌తో మరింతగా పెరిగిన పొదుపు
- ఎన్‌పిఎ కష్టాల నివారణకు దివాలా కోడ్ సమర్థ వినియోగం
- ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.20,339 కోట్ల వ్యవసాయ రుణాల వడ్డీ సబ్సిడీకి ఆమోదం
- 2017-18 సంవత్సరంలో చేపట్టిన సంస్కరణలతో సేవల రంగంలో 15 శాతం పెరిగిన ఎఫ్‌డిఐ
- సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహించేందుకు విద్య, ఆరోగ్యం వంటి సామాజిక మౌలిక వసతులకు పెద్దపీట
- అంతర్జాతీయ వాణిజ్యం పుంజుకుంటుందన్న ఆశావహ సూచికలతో విదేశీ రంగంలో స్థిరత్వం ఏర్పడే అవకాశం

## మార్కెట్లకు పొంచి ఉన్న కరెక్షన్?

స్టాక్ మార్కెట్ ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నప్పటికీ ప్రస్తుత విలువలను నిలబెట్టుకోవాలంటే ఆర్థిక వ్యవస్థ, కార్పొరేట్ లాభాల్లో వృద్ధి అవసరం. లేదంటే కరెక్షన్‌ను తోసిపుచ్చలేం. పొదుపు చేసే ప్రజలు భారీ ఎత్తున పోర్ట్‌ఫోలియో మార్పులు చేసుకోవడం వల్ల ఏర్పడిన ఈక్విటీ రిస్క్ ప్రీమియం (ఇఆర్‌పి) తగ్గడమే స్టాక్ మార్కెట్ విలువలు గరిష్ఠ స్థాయిలకు దూసుకుపోవడానికి కారణం. 2015 డిసెంబరు నుంచి సెన్సెక్స్ రూపాయి విలువ పరంగా 46 శాతం, డాలర్ విలువపరంగా 52 శాతం పెరిగింది. ఎస్ అండ్ పి ఇండెక్స్ వృద్ధి ఇదే సమయంలో 45 శాతమే. ఈ కారణంగానే భారత మార్కెట్ పిఇ అమెరికన్ మార్కెట్ పిఇతో సమానం అయింది. ఏ ఆస్తి విలువనైనా అది అందించే రాబడుల ఆధారంగానే కాకుండా ఇతర ఆస్తులు అందిస్తున్న రాబడులతో కూడా సరిపోల్చాల్సి ఉంటుంది. ఈ రకంగా చూస్తే ఇతర పెట్టుబడి సాధనాలపై రాబడులు ఆకర్షణీయంగా లేక పోవడం కూడా ఇన్వెస్టర్లు పోర్ట్‌ఫోలియోల్లో మార్పులు చేసుకోవడానికి కారణం. ఇదిలా ఉండగా ప్రైమరీ మార్కెట్ ద్వారా ఈ ఏడాది ఏప్రిల్-నవంబరు నెలల మధ్య కాలంలో వివిధ కంపెనీలు 70,316 కోట్ల రూపాయలు సమీకరించాయి. ఒక్క ఈక్విటీ బాటలోనే సమీకరించిన మొత్తం 66,420 కోట్ల రూపాయలు కాగా రుణపత్రాల రూపంలో సమీకరించింది 3675 కోట్ల రూపాయలు. 122 కంపెనీలు పబ్లిక్ ఇష్యూ బాటలో 66641 కోట్లు సమీకరించాయి.

### మ్యూచువల్ ఫండ్స్ హాట్‌కేక్స్...

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా తమ పొదుపు మొత్తాలను ఫండ్స్‌లోకి మళ్లించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 2016-17లో మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు 400 శాతం మేర పెరగడం విశేషం. గత ఏడాది కుటుంబాల పొదుపులో బ్యాంకు డిపాజిట్లు, లైఫ్ ఇన్సూరెన్స్ ఫండ్స్, షేర్లు, డిబెంచర్లలోకి వెళ్లిన మొత్తం వరుసగా 82 శాతం, 66 శాతం, 345 శాతం మేర పెరిగాయి. షేర్లు, డిబెంచర్ల కేటగిరీ కింద మ్యూచువల్ ఫండ్స్‌లో పొదుపు 400 శాతానికి పైగా పెరిగింది. ఈ విభాగంలో 2015-16 సంవత్సరంలో నమోదైన వృద్ధి 126 శాతంగా ఉంది. రెండేళ్లకాలంలోనే మ్యూచువల్ ఫండ్స్‌లో పొదుపు మొత్తాలు 11 రెట్లకు పైగా వృద్ధి చెందడం విశేషం. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబరు మధ్యకాలంలో మ్యూచువల్ ఫండ్స్‌లోకి రూ.2.53 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దీంతో ఎంఎఫ్ సంస్థల ఆస్తుల మొత్తం రూ.21.43 లక్షల కోట్లకు చేరింది.

### ఎంఎస్ఎంఇలకు రుణ కష్టాలు

దేశీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఇ) రుణ సేకరణ విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాంతో వారు వ్యాపారాన్ని విస్తరించలేకపోతున్నారు. ఇప్పటివరకు మంజూరైన మొత్తం రుణాల్లో ఎంఎస్ఎంఇలకు ఇచ్చిన వాటా కేవలం 17.4 శాతమే.

### రుణభారం, ధరల యుద్ధం వల్లే టెలికాంపై ఒత్తిడి

మొబైల్ ఆపరేటర్లపైమోతాదుకు మించిన రుణ భారంతో పాటు మార్కెట్లో ఆధిపత్యం కోసం సంస్థ చేస్తున్న ధరల యుద్ధం, అధిక ధరకు స్పెక్ట్రమ్ కొనుగోలువంటి అంశాలే టెలికాం రంగం లో ఒత్తిడికి ప్రధాన కారణం. స్పెక్ట్రమ్ వేలంలో ఓవర్ బిడ్డింగ్ పరిస్థితులకు దారితీయకుండా విధానపర మార్పులు అవసరం.

### 10 కోట్లకు ముద్రా రుణగ్రహీతలు

ప్రధాన మంత్రి ముద్ర యోజనలో భాగంగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.1.8 లక్షల కోట్ల రుణాలు మంజూరయ్యాయి. డిసెంబర్ 2017నాటికి ముద్ర రుణాలు తీసుకున్నవారి సంఖ్య 10.1 కోట్లకు చేరుకుంది. అందులో 7.6 కోట్లు మహిళలే.

### ఆర్ అండ్ డి వ్యయం అంతంతే..

మన దేశంలో పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి) వ్యయం స్థూల దేశీయోత్పత్తి(జిడిపి)లో 0.6-0.7 శాతంగానే ఉంటోంది. గడిచిన 20 ఏళ్లుగా ఇదే పరిస్థితి. అమెరికా, చైనా, దక్షిణ కొరియా, ఇజ్రాయెల్‌తో పోలిస్తే చాలా స్వల్పంగా ఖర్చు చేస్తున్నాం.

### వివాదాలకు సత్వర పరిష్కారం


వాణిజ్య వివాదాలను వాయిదా వేయకుండా సత్వరమే పరిష్కరించగలిగేలా ప్రభుత్వం, న్యాయవ్యవస్థ పరస్పర సహకారంతో చర్యలు చేపట్టాలి. తద్వారా వ్యాపార నిర్వహణకు అనుకూలమైన దేశాల జాబితాలో భారత్ స్థానం మరింత మెరుగుపడటంతోపాటు వాణిజ్య కార్యకలాపాలు మరింత పుంజుకునేందుకు అవకాశం ఉంటుంది.

### పునరుత్పాదక రంగ రాయితీలపై పునఃసమీక్ష

సోలార్, హైడ్రో వంటి పునరుత్పాదక ఇంధన రంగాలకు కల్పిస్తున్న సబ్సిడీలు, రాయితీలపై పునః సమీక్ష జరపాల్సిన అవసరం ఉంది. ఈ మధ్యకాలంలో సోలార్ ప్లాంట్ల నుంచి సరఫరా అయ్యే విద్యుత్ యూనిట్ ధర భారీగా తగ్గిన నేపథ్యంలో డిస్కమ్‌లు ప్రస్తుత పిపిఎ ఒప్పందాలపై మళ్లీ బేరమాడుతున్నాయి.

## ఆర్థిక సర్వే 2017-18

**విదేశీ వాణిజ్యం** (మార్పు శాతంలో)




### ఉక్కు ఎగుమతుల్లో 53 శాతం వృద్ధి

గడిచిన మూడు త్రైమాసికాల్లో (ఏప్రిల్-డిసెంబర్ 2017) ఉక్కు ఎగుమతులు 52.9 శాతం వృద్ధి చెంది 76 లక్షల టన్నులకు పెరిగాయి. అంతకు ముందు ఏడాదిలో ఇదేకాలానికి ఉక్కు ఎగుమతులు 49.75 లక్షల టన్నులుగా నమోదయ్యాయి. ఈ మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు చర్యలు ఎగుమతుల వృద్ధి దోహదపడ్డాయి. గడిచిన తొమ్మిది నెలల్లో ఉక్కు దిగుమతులు మాత్రం కేవలం 10 శాతం పెరిగాయి.

- దేశీయ జెమ్స్ అండ్ జువెల్లరీ రంగంలో ఎగుమతులు, ఉద్యోగావకాశాలను పెంపొందించేందుకు కొత్తగా ఆభరణాల పార్కులను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో జువెల్లరీ డిజైనింగ్ ట్రైనింగ్ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.

## పెరిగిన పన్ను చెల్లింపుదారులు

నోట్ల రద్దు, జిఎస్‌టి జిడిపి వృద్ధి రేటును దెబ్బతీసినా మరో విధంగా ఆర్థిక వ్యవస్థకు మేలు చేశాయి. పన్ను చెల్లించే వారి సంఖ్య ఏకంగా 18 లక్షలు పెరిగింది. దాదాపు 12 పరోక్ష పన్నుల స్థానంలో తీసుకొచ్చిన జిఎస్‌టి మరిన్ని వ్యాపార సంస్థలను పన్నుల పరిధిలోకి తీసుకొచ్చింది. పన్నుల చెల్లింపు పరిధిలోకి వచ్చిన వ్యాపార సంస్థల సంఖ్య 34 లక్షలు పెరిగింది. జిఎస్‌టికి ముందున్న సంస్థలతో పోలిస్తే ఇది 50 శాతం ఎక్కువ.

- పెద్ద నోట్ల రద్దుతో 18 లక్షలు పెరిగిన పన్ను చెల్లింపుదారుల సంఖ్య.
- ప్రస్తుత పన్ను చెల్లింపుదారుల్లో వీరి సంఖ్య మూడు శాతం.
- పెట్టుబడుల అలవాట్లలోనూ స్పష్టమైన మార్పు.
- బంగారం, రియల్టీ వంటి రంగాల్లో తగ్గుతున్న మదుపు.
- ద్రవ్య ఆస్తుల్లో పెరుగుతున్న పెట్టుబడులు.
- బంగారాన్ని ద్రవ్య ఆస్తులుగా మార్చేందుకు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలి.

### హైకోర్టుల్లో ప్రత్యేక బెంచ్‌లు

- కొత్తగా ఐటి రిటర్న్‌లు ఫైల్ చేస్తున్న వారి వార్షిక సగటు ఆదాయం రూ.2.5 లక్షలు.
- పన్ను వివాదాల పరిష్కారం కోసం హైకోర్టుల్లో ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటు చేయాలి.
- జిఎస్‌టితో 50 శాతం పెరిగిన పరోక్ష పన్ను చెల్లింపుదారులు.
- కొత్తగా 34 లక్షల వ్యాపారాలు పన్నుల పరిధిలోకి.
- జిఎస్‌టితో తయారీ రాష్ట్రాలకు నష్టం లేదు.
- ఎగుమతులపై పన్నులను సమీక్షించాలి.

## భారత ఐసిటి రంగానికి చైనా నుంచి తీవ్ర పోటీ

భారత ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసిటి) రంగానికి పలు దేశాల నుంచి పోటీ క్రమంగా పెరుగుతోంది. చైనా, బ్రెజిల్, రష్యా, ఫిలిప్పీన్స్, ఇజ్రాయెల్, ఉక్రెయిన్ వంటి దేశాలు భారత ఐసిటికి గట్టిపోటీనిస్తున్నాయి. దీంతో భారత్ నుంచి ఎగుమతయ్యే సర్వీసుల్లో ఐసిటి వాటా క్రమంగా తగ్గుతోంది. 2006-2016 మధ్యకాలంలో ఐసిటి పనితీరును పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తోంది. 2006 సంవత్సరంలో దేశ సర్వీసుల ఎగుమతుల్లో ఐసిటి వాటా 68 శాతంగా ఉండేది. 2016 సంవత్సరంనాటికి ఇది 67 శాతానికి తగ్గిందని ప్రపంచబ్యాంకు గణాంకాల ద్వారా తెలుస్తోంది.

పొరుగు దేశాల సర్వీసుల ఎగుమతుల్లో ఐసిటి వాటా పెరుగుతుంటే.. మన దేశంలో మాత్రం తగ్గుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం అవుతోంది. దశాబ్దకాలంలో (2006-2016) చైనా సర్వీసుల ఎగుమతుల్లో ఐసిటి వాటా 22 శాతం నుంచి 40 శాతానికి పెరిగింది. బ్రెజిల్‌లో 43 శాతం నుంచి 55 శాతానికి చేరింది. ఆర్‌బిఐ గణాంకాల ప్రకారం.. 2016-17 సంవత్సరంలో సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో 0.7 శాతం ప్రతికూల వృద్ధి నమోదైంది. 2017-18 ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో ఈ రంగంలో వృద్ధి 2.3 శాతం ఉంది. అయితే సాఫ్ట్‌వేర్ రంగంలో వృద్ధి సానుకూలంగా మారుతోందని ప్రభుత్వం చెబుతోంది.

దేశీయ సర్వీసు రంగం భవిష్యత్ మెరుగ్గానే కనిపిస్తోందని అంటోంది. అయితే రిస్క్ మాత్రం పొంచి ఉందన్న భయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. భారత ఐటి, ఐటి ఆధారిత సర్వీసుల ఎగుమతుల్లో యుఎస్, యుకె, యూరోపియన్ యూనియన్ వాటా 90 శాతంగా ఉంది. ఈ దేశాల్లో మారుతున్న పరిస్థితులు దేశీయ సర్వీసుల రంగ ఎగుమతులపై ప్రభావం చూపుతున్నాయి.

# టి-హబ్‌తో చేతులు కలిపిన ఆర్ఇసి

**» ఇంధన సమస్యల పరిష్కారానికి కృషి**



మంత్రి కెటిఆర్ సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఆర్ఇసి చైర్మన్ పివి రమేష్, టి-హబ్ సిఇఒ జయ్ కృష్ణన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇంధన రంగంలో ముఖ్యంగా పవన, సౌర విద్యుత్ రంగాల్లో ఎదురవుతున్న సమస్యలపై కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని గ్రామీణ విద్యుదీకరణ సంస్థ (ఆర్ఇసి) దృష్టి పెట్టింది. ఇందుకు అవసరమైన పరిష్కారాల కోసం టి-హబ్‌తో కలిసి 'ఆర్ఇసి ఇన్నోవేషన్ ప్లాట్‌ఫామ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కె తారక రామారావు సమక్షంలో ఆర్ఇసి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పివి రమేష్, టి-హబ్ సిఇఒ జయ్ కృష్ణన్ ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఎపి, తెలంగాణలోని ఎంపిక చేసిన 30 ప్రభుత్వ కాలేజీలకు చెందిన 1,800 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రత్యేక పరిశోధనా కార్యక్రమం కింద వీరందరూ ఇంధన రంగం ముఖ్యంగా పునరుత్పాదక ఇంధన రంగంలో ఎదురవుతున్న సమస్యలపై పరిశోధనలు జరిపి వినూత్న పరిష్కారాలు అందజేస్తారు. ఇందులో అత్యున్నత పరిష్కారాలు చూపిన మూడు స్టార్టప్ కంపెనీలు ఎంపిక చేసి అవి మరింత అభివృద్ధి చెందేందుకు అవసరమైన అన్ని వసతులు టి-హబ్ ద్వారా సమకూరుస్తారు. 'సౌర, పవన విద్యుత్ రంగాల్లో ఎదురవుతున్న విద్యుత్ స్టోరేజి, ఇతర సమస్యలకు సంబంధించిన సమస్యలపై ఈ ఒప్పందం ద్వారా దృష్టి పెడతారు' అని కెటిఆర్ చెప్పారు.

### టాప్-5లో తెలంగాణ

ఉత్పత్తి, తయారీ రంగాల్లో తెలంగాణ ప్రస్తుతం ఐదో స్థానంలో ఉన్నట్టు కేంద్ర ఆర్థిక వ్యవహారాల సలహాదారుడు అరవింద్ సుబ్రమణ్యం ఒక నివేదికలో పేర్కొన్నట్టు కెటిఆర్ చెప్పారు. సిఎం కెసిఆర్ నాయకత్వంలో అమలు చేస్తున్న మెరుగైన ఆర్థిక, పారిశ్రామిక విధానాలతో త్వరలోనే రాష్ట్రం ఈ విషయంలో మొదటి స్థానానికి చేరుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. దీంతో స్థానికులకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయన్నారు. ఆర్ఇసి తరహాలో మరిన్ని ప్రభుత్వ రంగ సంస్థలు టి-హబ్ ద్వారా తమ సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నన్ని ఇన్నోవేషన్ కేంద్రాలు దేశంలో మరెక్కడా లేవన్నారు.

### ఆర్ఇసి రూ.9,600 కోట్ల సమీకరణ

ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా వివిధ మూలధన అవసరాల కోసం 150 కోట్ల డాలర్ల (సుమారు రూ.9,600 కోట్లు) నిధులు సమీకరించనున్నట్టు ఆర్ఇసి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పివి రమేష్ చెప్పారు. విద్యుత్ రంగంలోని సమస్యల పరిష్కారం కోసం టి-హబ్‌తో కలిసి పని చేయడం ఆనందంగా ఉందన్నారు. తమ సంస్థ ద్వారా వివిధ విద్యుత్ ప్రాజెక్టులకు ఈ ఆర్థిక సంవత్సరం రూ.80,000 కోట్ల వరకు రుణాలుగా అందజేయనున్నట్టు తెలిపారు. ముందస్తు ప్రణాళికతో తెలుగు రాష్ట్రాలు విద్యుత్ రంగంలో మిగులు సాధించినట్టు చెప్పారు. ఎపి, తెలంగాణలోని పలు విద్యుత్ ప్రాజెక్టులకు రూ.40,000 కోట్లు రుణాలుగా అందిస్తున్నట్టు తెలిపారు.

## పిఓఎస్ మెషిన్లతో నగదు విత్‌డ్రాయల్

**» ప్రారంభించిన బ్యాంక్ ఆఫ్ ఇండియా**



పిఓఎస్ మెషిన్లను విడుదల చేస్తున్న సిజి చైతన్య

ఖైరతాబాద్ (ఆంధ్రజ్యోతి): పాయింట్ ఆఫ్ సేల్ (పిఓఎస్) మిషన్ల ద్వారా ఇప్పటి వరకు డెబిట్ కార్డులను స్వైప్ చేసి నగదు చెల్లించే పద్ధతి అమల్లో ఉండగా తాజాగా నగదు విత్‌డ్రాయల్ చేసుకునే సేవలను బ్యాంక్ ఆఫ్ ఇండియా (బిఓఐ) అందుబాటులోకి తీసుకువచ్చింది. తెలంగాణలో ఈ తరహా సేవలను బ్యాంక్ ఆఫ్ ఇండియా తొలిసారిగా ప్రారంభించింది. ఇందుకోసం బిఓఐ.. తెజారీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారంనాడిక్కడ మాసబ్‌ట్యాంక్ శాఖలో జరిగిన కార్యక్రమంలో బిఓఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిజి చైతన్య.. 1000 మొబైల్ పిఓఎస్ మెషిన్లను తెజారీ సొల్యూషన్స్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎటిఎం సేవలు అందుబాటులోని మారుమూల ప్రాంతాల్లోని దుకాణాల్లోని పిఓఎస్‌ల్లో డెబిట్ కార్డులను వినియోగించటం ద్వారా ప్రతి రోజు రూ.1,000 నుంచి రూ.2,000 వరకు విత్‌డ్రా చేసుకోవచ్చని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటలైజేషన్‌లో భాగంగా బిఓఐ సాంకేతికపరంగా ముందుకు వెళుతోందని అన్నారు. మార్చినాటికి తెలంగాణవ్యాప్తంగా 5 వేల మెషిన్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన చెప్పారు. ఏ బ్యాంక్ డెబిట్ కార్డునైనా వినియోగించి ఈ పిఓఎస్ మెషిన్ల ద్వారా నగదును ఉపసంహరించుకోవచ్చని చైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఓఐ జనరల్ మేనేజర్లు ఆర్‌కె మిత్రా, ఆర్‌సి ఠాకూర్, జోనల్ మేనేజర్ ఎస్‌బి రాయ్ పాల్గొన్నారు.

## ఫైనాన్షియల్ టైమ్స్ గ్లోబల్‌లో ఐఎస్‌బికి 28 వ ర్యాంక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి) అందిస్తున్న పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ప్రపంచంలోని అగ్రశ్రేణి 100 ఎంబిఎల్లో 28వ ర్యాంక్‌ను దక్కించుకుంది. ఫైనాన్షియల్ టైమ్స్ గ్లోబల్ ఎంబిఎ 2018 ర్యాంకింగ్‌ల్లో ఈ స్థానాన్ని దక్కించుకోవటమే కాకుండా భారత్‌లోని బిజినెస్ స్కూల్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. ప్రపంచస్థాయి విద్యను అందించటంతోపాటు ఫ్యాకల్టీ, రీసెర్చ్ సెంటర్లు, ఇనిస్టిట్యూట్స్‌ను అత్యుత్తమంగా తీర్చిదిద్దటంపై దృష్టిని సారించటంతో ఈ ఖ్యాతి లభించిందని ఐఎస్‌బి డీన్ రాజేంద్ర శ్రీవాత్సవ తెలిపారు.

# మార్కెట్‌కు సర్వే బూస్ట్

## ఆగని సూచీల జోరు.. సెన్సెక్స్ మరో 230 పాయింట్లు అప్



ముంబై : దేశ వృద్ధి రేటు 2018-19 సంవత్సరంలో పుంజుకుంటుందని, మళ్లీ త్వరితగతిన ఆర్థిక వ్యవస్థ అనే గుర్తింపును భారత్ సాధిస్తుందని ఆర్థిక సర్వేలో అంచనా వేయడం మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత బలపరిచింది. ఈ సంవత్సరంలో 6.75 శాతం వృద్ధిని సాధించనున్న ఆర్థిక రంగం వచ్చే ఏడాది 7 నుంచి 7.5 శాతం వృద్ధిని నమోదు చేయడం ఖాయమని ఆర్థిక సర్వే అంచనా వేసింది. దీనికి తోడు కార్పొరేట్ ఫలితాలు కూడా ఆశాజనకంగా ఉండడంతో ఫిబ్రవరి డెరివేటివ్ కాంట్రాక్టులు సానుకూలంగానే ప్రారంభమయ్యాయి. శుక్రవారంనాడు అమెరికా మార్కెట్ రికార్డు స్థాయిలో ముగిసిన ఫలితంగా యూరోపియన్ మార్కెట్లు పాజిటివ్‌గా ప్రారంభం కావడంతో సోమవారం ప్రారంభం నుంచే భారత మార్కెట్లో ఉత్సాహపూరిత వాతావరణం కనిపించింది. మార్కెట్ వర్గాలన్నీ ఆర్థిక సర్వే ఇచ్చిన ఉత్తేజం జోడుకావడంతో కొనుగోళ్లు హోరెత్తి సూచీలు కొత్త రికార్డుల దిశగా సాగిపోయాయి. ఉదయమే లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్ ఇంట్రాడేలో 36443.98 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకినా ఆ స్థాయిలో సాగిన లాభాల స్వీకరణ తో కొంత తగ్గినప్పటికీ చివరికి 232.81 పాయింట్ల లాభంతో 36161.64 పాయింట్ల వద్ద క్లోజయింది. నిఫ్టీ 60.75 పాయింట్ల లాభంతో 11130.40 వద్ద ముగిసింది.

### అత్యంత విలువైన కంపెనీగా టిసిఎస్

దేశంలో అత్యంత విలువైన కంపెనీల జాబితాలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మళ్లీ అగ్రస్థానానికి చేరుకుంది. రూ.6.11 లక్షల కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో రిలయన్స్ ఇండస్ట్రీస్‌ను వెనక్కి నెట్టి నెంబర్ వన్ స్థానాన్ని దక్కించుకుంది. బీఎస్ఈలో ట్రేడింగ్ ముగిసేసరికి కంపెనీ షేరు ధర 2.48 శాతం ఎగబాకి రూ.3,195.10కి చేరుకుంది. దీంతో మార్కెట్ విలువ రూ.6,11,634 కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో రిలయన్స్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6,10,463 కోట్లకు తగ్గింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 5.18 లక్షల కోట్లతో మూడో స్థానంలో ఉండగా.. ఐటీసీ నాలుగు (రూ.3.36 లక్షల కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ ఐదో (రూ.3.12 లక్షల కోట్లు) స్థానంలో ఉన్నాయి.

### రామచంద్ర ఎన్ గల్లాకు ఔట్‌స్టాండింగ్ బిజినెస్ లీడర్ అవార్డు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్‌లో ప్రపంచ స్థాయి వ్యాపార కార్యకలాపాలను అందుబాటులోకి తీసుకురావటంలో చేసిన విశేష కృషికి గుర్తింపుగా అమర రాజా గ్రూప్ ఫౌండర్ చైర్మన్ రామచంద్ర ఎన్ గల్లా 2018 సంవత్సరానికిగాను గ్రాండ్ మోనోజుకురి నుంచి ఔట్‌స్టాండింగ్ బిజినెస్ లీడర్‌షిప్ అవార్డును పొందారు. సోమవారం చెన్నైలో జరిగిన కార్యక్రమంలో జపాన్ కాన్సుల్ జనరల్ షెజీ బాబా చేతుల మీదుగా రామచంద్ర ఎన్ గల్లా ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డుతో అమర రాజా గ్రూప్ సహా కంపెనీ వృద్ధి పథంలో పాలు పంచుకున్న అందరికి మరింత గుర్తింపు లభించిందని సంస్థ ఫౌండర్ చైర్మన్ రామచంద్ర ఎన్ గల్లా అన్నారు.

# మార్కెట్లోకి సరికొత్త మసెరాటి 'లెవాంటే'



## ప్రారంభ ధర రూ. 1.45 కోట్లు

## 6.9 సెకన్లలోనే 100 కిలో మీటర్ల వేగం

న్యూఢిల్లీ : ఇటలీ లగ్జరీ కార్ల కంపెనీ మసెరాటి భారత మార్కెట్లో తన ఎస్‌యువి లెవాంటే అప్‌డేటెడ్ వెర్షన్‌ను విడుదల చేసింది. దీని ప్రారంభ ధర 1.45 కోట్ల రూపాయలు (ఎక్స్‌షోరూమ్). గ్రాన్‌స్పోర్ట్ వేరియంట్లలో ఈ మోడల్ అందుబాటులో ఉంటుంది. వీటి ధర వరుసగా 1.48 కోట్ల రూపాయలు, 1.53 కోట్ల రూపాయలు. ప్రీమియం ఎస్‌యువిలకు భారత మార్కెట్లో డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని, ఈ నేపథ్యంలో కస్టమర్ల సంతృప్తి కోసం 2018 లెవాంటేను తెచ్చామని మసెరాటి ఇండియా ఆపరేషన్స్ హెడ్ బొజాన్ జాన్‌కులోవ్‌స్కీ తెలిపారు. ఆకర్షణీయమైన డిజైన్, అద్భుతమైన పనితీరు ఈ కారులో ఉన్నాయని ఆయన తెలిపారు. 275 హెచ్‌పి 3 లీటర్ టర్బో డీజిల్ ఇంజన్, 8స్పీడ్ ఆటోమేటిక్ గేర్ బాక్స్ కలిగిన ఈ కారు 6.9 సెకన్ల వ్యవధిలోనే 0-100 కిలో మీటర్ల వేగాన్ని అందుకుంటుంది. గరిష్ఠంగా గంటకు 230 కిలో మీటర్ల వేగాన్ని అందుకుంటుంది. అడ్వాన్స్‌డ్ డ్రైవింగ్ అసిస్టెన్స్ సిస్టమ్స్ (ఎడిఎఎస్), లేన్ కీపింగ్ అసిస్ట్ (ఎల్‌కెఎ), యాక్టివ్ బ్లైండ్ స్పాట్ అసిస్ట్ (ఎబిఎస్‌ఎ), ట్రాఫిక్ సైన్ రికగ్నిషన్ (టిఎస్‌ఆర్)వంటి అత్యాధునిక టెక్నాలజీ ఫీచర్లు ఈ కారులో ఉన్నట్టు కంపెనీ తెలిపింది. 2015 జూలైలో మసెరాటి భారత మార్కెట్లోకి పునః ప్రవేశించింది. క్వాట్రోపోర్టె, ఘిబ్లి, లెవాంటే వంటి కార్లను కంపెనీ విక్రయిస్తోంది. గ్రాన్‌టురిస్మో/గ్రాన్‌కాబ్రియో మోడల్‌ను భారత మార్కెట్లోకి తీసుకురావాలని కంపెనీ యోచిస్తోంది.

# టెక్ మహీంద్రా లాభం రూ.943 కోట్లు

## క్యూ3లో 10 శాతం పెరుగుదల

న్యూఢిల్లీ: దేశంలో ఐదో అతిపెద్ద ఐటి సంస్థ టెక్ మహీంద్రా ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలనుమించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18) డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) సంస్థ లాభం 10.2 శాతం వృద్ధి చెంది రూ.943 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి కంపెనీ లాభం రూ.856 కోట్లుగా నమోదైంది. భారతీయ అకౌంటింగ్ ప్రమాణాల ప్రకారం.. ఈ క్యూ3లో టెక్ మహీంద్రా కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.7,776 కోట్లకు పెరిగింది. 2016-17లో ఇదే సమయానికి నమోదైన రూ.7,557 కోట్లతో పోలిస్తే 2.9 శాతం ఎగబాకింది. క్యూ3లో షేర్ ఒక్కింటికి కంపెనీ రాబడి రూ.10.73గా నమోదైంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబరు)తో పోలిస్తే అక్టోబర్-డిసెంబరు మధ్యకాలానికి టెక్ మహీంద్రా లాభం 12.8 శాతం, రాబడి 2.2 శాతం పెరుగుదలను నమోదు చేసుకుంది. డాలర్ రూపంలో సంస్థ లాభం 16.5 శాతం వార్షిక వృద్ధితో 14.7 కోట్ల డాలర్లుగా, రెవెన్యూ 8.3 శాతం పెరుగుదలతో 120 కోట్ల డాలర్లుగా నమోదైంది. గడిచిన త్రైమాసికంలో కంపెనీ మరో 18 క్లయింట్లతో డీల్స్ కుదుర్చుకుంది. దాంతో మొత్తం క్లయింట్ల సంఖ్య 903కు పెరిగింది. డిసెంబరు 2017 చివరినాటికి సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య 1,15,241గా ఉంది.

## లారస్ ల్యాబ్స్ లాభం రూ.35 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో లారస్ ల్యాబ్స్ నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది.అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ 488.87 కోట్ల రూపాయల మొత్తం కన్సాలిడేటెడ్ రాబడులపై 34.8 కోట్ల రూపాయల నికర లాభాన్ని సాధించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నికర లాభం 45 కోట్ల రూపాయలు ఉండగా మొత్తం రాబడులు 522.69 కోట్ల రూపాయలుగా ఉన్నాయి. సమీక్షా త్రైమాసికంలో సింథసిస్ డివిజన్ నిర్వహణాపరంగా మెరుగైన పనితీరును కనబరిచినప్పటికీ హెప్ సి ఔషధ వాటా ఆశించిన స్థాయిలో లేకపోవటంతో జెనరిక్ పోర్టుఫోలియో నిరాశాజనకమైన పనితీరును నమోదు చేసిందని లారస్ లాబ్స్ సిఇఒ సత్యనారాయణ చావా తెలిపారు. అయితే అంకాలజీ, ఇతర ఎపిఐ విభాగాలు అద్భుతమైన వృద్ధిని కనబరిచాయని చెప్పారు.

## తగ్గిన ఆర్‌కామ్ నష్టాలు

న్యూఢిల్లీ : రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో నష్టాలను తగ్గించుకుంది. నష్టాల్లో సాగుతున్న మొబైల్ టెలిఫోనీ వ్యాపారాన్ని మూసివేయటంతో అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ నికర నష్టాలు 531 కోట్ల రూపాయల నుంచి 130 కోట్ల రూపాయలకు తగ్గాయి. కాగా మొత్తం రాబడులు కూడా 30 శాతం క్షీణించి 1,698 కోట్ల రూపాయల నుంచి 1,176 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి.

## హెచ్‌డిఎఫ్‌సి లాభం రెండింతలు

ముంబై : తాకట్టుపై రుణాలిచ్చే ప్రముఖ సంస్థ హెచ్‌డిఎఫ్‌సి లాభం భారీగా పుంజుకుంది. గత ఏడాది డిసెంబరుతో ముగిసిన మూడు నెలల కాలానికి కంపెనీ కన్సాలిడేటెడ్ లాభం రెండింతలకు పైగా పెరిగి రూ.6,677.06 కోట్లకు చేరుకుంది. అంతక్రితం సంవత్సరంలో ఇదే సమయానికి ఆర్జించిన లాభం రూ.2,728.66 కోట్లుగా ఉంది. గత త్రైమాసికంలో సంస్థ ఆదాయం రూ.16,846.77 కోట్లకు పెరిగింది. అంతక్రితం ఏడాదిలో ఇదే కాలానికి రాబడి 14,988.87 కోట్ల రూపాయలుగా నమోదైంది.


- సమీక్ష కాలానికి కంపెనీ నిర్వహణ ఆదాయం 7.8 శాతం వృద్ధి చెంది రూ.9,673.05 కోట్లకు చేరుకోగా.. బీమా విభాగ వ్యాపారం నుంచి ప్రీమియం ఆదాయం 18.5 శాతం ఎగబాకి రూ.6,182.24 కోట్లకు పెరిగింది.
- గత త్రైమాసికంలో కంపెనీ కేటాయింపులు వార్షిక ప్రాతిపదికన రూ.153.13 కోట్ల నుంచి రూ.164.54 కోట్లకు పెరిగాయి.

## బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 31,320 | 31,000 | --- | 30,850 | 30,400 |
| క్రితం ముగింపు | 31,590 | 31,100 | 31,520 | 31,050 | 30,680 |
| 22 క్యారెట్లు | 29,000 | 28,800 | --- | 28,660 | 28,950 |
| క్రితం ముగింపు | 29,250 | 28,850 | 28,990 | 28,820 | 29,220 |
| వెండి (కిలో) | 41,200 | 41,000 | --- | 40,600 | 42,600 |
| క్రితం ముగింపు | 41,000 | 41,200 | 41,000 | 40,700 | 43,100 |

## ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 74.00 | విజయవాడ | 80.00 |
| కరీంనగర్ | 75.00 | గుంటూరు | 80.00 |
| వరంగల్ | 74.00 | ఒంగోలు | 82.00 |
| మహబూబ్‌నగర్ | 74.00 | చిత్తూరు | 70.00 |
| కర్నూలు | 74.00 | నెల్లూరు | 80.00 |
| విశాఖపట్నం | 75.00 | అనంతపురం | 73.00 |
| గోదావరి | 80.00 | | |

## రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.30 నెక్ (100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 370.00 | చిత్తూరు | 383.00 |
| వరంగల్ | 372.00 | చెన్నై | 390.00 |
| విజయవాడ | 372.00 | నమక్కల్ | 375.00 |
| గోదావరి | 372.00 | బెంగళూరు | 380.00 |
| విశాఖపట్నం | 382.00 | ముంబై | 415.00 |

## ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)



| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| యుఎస్ డాలర్ | 57.88 | 67.11 |
| పౌండ్ | 81.80 | 94.88 |
| యూరో | 71.82 | 82.30 |
| ఆస్ట్రేలియా డాలర్ | 46.83 | 54.19 |
| బహ్రెయిన్ దినార్ | 156.75 | 179.63 |
| కువైట్ దినార్ | 175.61 | 218.62 |
| ఒమని రియాల్ | 153.50 | 175.62 |
| సౌదీ రియాల్ | 15.39 | 18.24 |
| సింగపూర్ డాలర్ | 44.25 | 52.42 |
| యుఎఇ దిరమ్ | 15.75 | 18.41 |

## 11100 దిగువన బలహీనం

టెక్ వ్యూ

నిఫ్టీ సోమవారంనాడు మరింత అప్‌ట్రెండ్‌లో ప్రారంభమై ఇంట్రాడేలో 11160 పాయింట్ల వరకు దూసుకుపోయినా రియాక్షన్‌లో పడి చివరికి 60 పాయింట్ల లాభంతో సరిపెట్టుకుంది. డే గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు మధ్యన క్లోజ్ కావడం ట్రెండ్‌లో నెలకొన్న అనిశ్చితిని సూచిస్తోంది. 11100 పాయింట్ల వద్ద బ్రేకౌట్ ఏర్పడినందు వల్ల మైనర్ పుల్‌బ్యాక్ రియాక్షన్‌కు ఆస్కారం ఉంది.

- మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 11200 పాయింట్ల కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి.
- గత మూడు సెషన్లలో ఏర్పడిన టాప్ 11100 పాయింట్ల కన్నా దిగజారితే మైనర్ బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 11000 పాయింట్లు.
- బ్యాంక్ నిఫ్టీ 27650 వద్ద నిరోధం ఎదుర్కొంటూ అనిశ్చితంగా ముగిసింది.

**సూచన** : స్వల్పకాలిక ట్రేడర్లు బై పొజిషన్లు హోల్డ్ చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

**మంగళవారం స్థాయిలివే...**

**నిరోధం** : 11200 **మద్దతు** : 11100

■ వి.సుందర్ రాజా

## బుల్లిష్ మొగ్గుతో ఆటుపోట్లు

ఆస్ట్రో వ్యూ

**తిథి** : మాఘ శుద్ధ చతుర్దశి **నక్షత్రం** : పునర్వసు

అశ్విని, మఖ, మూల నక్షత్ర జాతకులు, కర్కాటక, వృశ్చిక రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**నిఫ్టీ** : 11130.40 (+60.75)

**ట్రెండ్ మార్పు వేళలు** : 9.40

**ధోరణి** : గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై 10.20 వరకు అదే ధోరణిలో ట్రేడవుతూ తదుపరి 12 గంటల వరకు నిస్తేజంగా ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత మళ్లీ 1.45 వరకు మెరుగ్గా ఉండి చివరిలో నిస్తేజంగా మారవచ్చు.

**ట్రేడింగ్ వ్యూహం...**

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 10.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 10.30 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 12 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12.15 తర్వాత తిరిగి ఎటిపికన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 1.45 సమయానికి, 2 గంటల తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవాలి. ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**నిరోధ స్థాయిలు** : 11170, 11205

**మద్దతు స్థాయిలు** : 11090, 11055

**గమనిక** : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinancialastrologer.blogspot.in

## మౌలిక వసతుల అభివృద్ధికి

# రూ.288 లక్షల కోట్లు కావాలి

న్యూఢిల్లీ: గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఔట్‌లుక్ ప్రకారం.. దేశంలో మౌలిక వసతుల అభివృద్ధికి వచ్చే 25 ఏళ్లలో (2040కల్లా) 4.5 లక్షల కోట్ల డాలర్లు అవసరమని ఆర్థిక సర్వే పేర్కొంది. ప్రస్తుత మారకం రేటు ప్రకారం మన కరెన్సీలో ఈ విలువ రూ.288 లక్షల కోట్లు. ఆర్థిక ప్రగతితోపాటు ప్రజల ఆదాయ ఆర్జన స్థాయి పెరుగుతుండటంతో వచ్చే పాతికేళ్లలో మౌలిక సదుపాయాలకు డిమాండ్ మరింత పెరగనుంది. ప్రస్తుత ట్రెండ్ ప్రకారంగా చూస్తే మొత్తం డిమాండ్‌లో 3.9 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.250 లక్షల కోట్లు) వరకు ప్రభుత్వం ఇన్వెస్ట్ చేయగలదని అంచనా. నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఎన్ఐఐబి), ఎఐఐబి నుంచి రుణాలు పొందడం ద్వారా పెట్టుబడుల లోటును పూడ్చుకోవాల్సిన అవసరం ఉంది.

## ఆదాయ పన్ను చెల్లింపు

# సామాజిక బాధ్యత

### ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎస్‌పి చౌదురి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): ఆదాయ పన్నును చెల్లించటం సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎస్‌పి చౌదురి అన్నారు. సోమవారం నాడిక్కడ ఎఫ్‌టాప్సీ, టాక్స్ బార్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆదాయ పన్ను వసూళ్లలో తెలుగు రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయన్నారు. ఆదాయ పన్ను చెల్లింపు విషయంలో భిన్న రకాల వ్యక్తులు ఉంటారని, కొంత మంది నిజాయితీగా చెల్లించేందుకు ముందుకు వస్తుండగా మరికొందరు ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తుంటారని అన్నారు. దాదాపు 12 లక్షల మంది ఆదాయ పన్నులు చెల్లించకుండా తప్పుకుంటున్నారని, ఇందులో పలువురు మూడేళ్లుగా పన్నులకు సంబంధించి రిటర్నులు సమర్పించటం లేదని చౌదురి వివరించారు. పన్ను వసూళ్ల లక్ష్యాలను చేరుకునేందుకు తాము పలు చర్యలకు ఉపక్రమిస్తామని, సకాలంలో పన్నులు చెల్లిస్తున్న వారికి సెల్యూట్ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అలాగే ఆదాయ పన్నుకు సంబంధించి పలువులు లేవనెత్తిన సందేహాలను చౌదురి నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టాప్సీ అధ్యక్షుడు గౌర శ్రీనివాస్, టాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంమూర్తి పాల్గొన్నారు.

# 2022నాటికి రియల్టీలో 1.5 కోట్ల మందికి ఉపాధి

న్యూఢిల్లీ: దేశీయ రియల్టీ, నిర్మాణ రంగం వచ్చే ఐదేళ్లకాలంలో 1.5 కోట్ల మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఈ రంగంలో ఒత్తిడి నెలకొన్నప్పటికీ ఉపాధి కల్పన విషయంలో మాత్రం ఆశావాహ వాతావరణం నెలకొనడం విశేషం. దేశీయంగా అత్యధికంగా ఉపాధి అవకాశాలను కల్పిస్తున్న రంగాల్లో రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ రంగం ద్వితీయ స్థానంలో ఉంది. 2013 సంవత్సరంలో ఈ రంగం ద్వారా 4 కోట్ల మందికి ఉపాధి లభించింది. 2017 సంవత్సరంలో ఈ రంగం 5.2 కోట్ల మందికి ఉపాధిని కల్పించినట్టు అంచనా. 2022నాటికి ఈ రంగంలో ఉపాధి అవకాశాలు 6.7 కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. ఈ లెక్కన వచ్చే ఐదేళ్ల కాలంలో కొత్తగా 1.5 కోట్ల మందికి ఉపాధి లభించనుంది.

### మెడికల్ టెస్టుల ధరలను నియంత్రించాల్సిందే

వ్యాధి నిర్ధారణ పరీక్షల ధరలపై ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. నిర్ణీత ప్రమాణాలు ఖరారు చేసి వెంటనే వీటి ధరలను కట్టడి చేయాలని కోరింది. ఒకే పరీక్షకు వివిధ నగరాల్లో వసూలు చేస్తున్న ధరలపైనా ఆందోళన వ్యక్తం చేసింది. లిపిడ్ ప్రొఫైల్ పరీక్షకు కొన్ని నగరాల్లో రూ.90 కంటే తక్కువ వసూలు చేస్తుంటే కొన్ని నగరాల్లో మాత్రం అడ్డగోలుగా రూ.7,110 వరకు వసూలు చేస్తున్నారని పేర్కొంది. వివిధ నగరాల్లో ఈ పరీక్షకు వసూలు చేసే గరిష్ఠ చార్జీల్లో సగటున 3.5 రెట్లు తేడా ఉన్నట్టు తెలిపింది. ది క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయడం ద్వారా ఈ వ్యాధి నిర్ధారణ పరీక్షల అడ్డగోలు దోపిడికి తెరదించాలని కోరింది.

# కార్పొరేట్ రంగం హర్షం

న్యూఢిల్లీ: ఆర్థిక సర్వేపై భారత కార్పొరేట్ రంగం హర్షం వ్యక్తం చేసింది. వృద్ధి రేటు 7-7.5 శాతానికి దూసుకుపోయే అవకాశం ఉందన్న అంచనాపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం ఆర్థిక వృద్ధి నిలకడగా ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేట్ రంగ ప్రముఖులు సూచించారు. మానవనైపుణ్యాల పెంపు, వ్యవసాయ ఉత్పాదకత పెంపుపై ప్రభుత్వం దృష్టి సారించాలని వారు కోరారు. ఆర్థిక రంగాన్ని పరుగులెత్తించేందుకు ఆర్థిక సర్వే అనేక కొత్త ఆలోచనలను ఆవిష్కరించిందని కొనియాడారు.


### నవభారత్‌కు దిశానిర్దేశం



గుణాత్మకమైన మార్పు, అన్నివర్గాలకు భాగస్వామ్యంతో కూడిన సరికొత్త భారతావని ఆవిష్కరణకు దీర్ఘకాలిక వ్యూహాన్ని సర్వే ఆవిష్కరించింది. మధ్యకాలికంగా విధానపరమైన ఫోకస్ ఎలా ఉండాలో సర్వే స్పష్టంగా చెప్పింది. ఉద్యోగాల కల్పన ముఖ్యంగా మహిళల ఉపాధిపైనా, విద్యావంతులు, ఆరోగ్యవంతులైన శ్రామికుల తయారీ, వ్యవసాయ ఉత్పాదకత పెంపు వీటిని ప్రధానంగా ప్రస్తావించడం హర్షణీయం. ఇందులో కొన్ని అంశాలపై బడ్జెట్ దృష్టి సారించే అవకాశం ఉంది

*- సిఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ*

### మొండిపద్దులే పెద్ద గండం



బ్యాంకుల మొండిపద్దుల సమస్యను పరిష్కరించేంతవరకు ఆర్థిక వృద్ధి అందని పండుగానే ఉంటుంది. ఆర్థిక సర్వే పిఎస్‌యు బ్యాంకుల ఎన్‌పిఎలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, విద్య, ఉపాధి కల్పన, వ్యవసాయ రంగాలపై ఫోకస్ పెంచాలని సూచించడం ఆహ్వానించదగింది. దివాలా చట్టాల కింద మొండిపద్దుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు సరైన దిశలోనే ఉన్నాయి. బ్యాంకులకు అదనపు మూలధనాన్ని వీలున్నంత తొందరగా సమకూర్చడంతో పాటు బ్యాంకుల పనితీరుపై పర్యవేక్షణ పెంచాలి. ద్రవ్యోల్బణంపై కన్నేసి ఉంచాలి.

*- అసోచామ్ ప్రెసిడెంట్ సందీప్ జజోడియా*



# కృష్ణపట్నంలో స్నోమాన్ లాజిస్టిక్స్ వేర్‌హౌస్

## 3600 పాలెట్స్ సామర్థ్యంతో ఏర్పాటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం వద్ద టెంపరేచర్ కంట్రోల్డ్ వేర్‌హౌజింగ్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు స్నోమాన్ లాజిస్టిక్స్ లిమిటెడ్ వెల్లడించింది. కృష్ణపట్నంలోని గేట్‌వే డిస్ట్రిపార్క్స్ లాజిస్టిక్స్ పార్క్‌లో 3600 పాలెట్స్ సామర్థ్యం గల టెంపరేచర్ కంట్రోల్‌తో పాటు అదనంగా 10 వేల చదరపు అడుగుల్లో డ్రై వేర్‌హౌజింగ్‌ను ఏర్పాటు చేసినట్లు స్నోమాన్ తెలిపింది. వేర్‌హౌజింగ్ సదుపాయాలతో పాటు ఏడు హ్యాండ్లింగ్, లోడింగ్ బేస్, జి ప్లస్ 5 రేకింగ్ సిస్టమ్స్, బ్లాస్ట్ ఫ్రీజింగ్, భిన్న రకాల టెంపరేచర్ చాంబర్లు, ఆధునిక హ్యాండ్లింగ్ పరికరాలు సహా ఇతరత్రా సదుపాయాలను కల్పించినట్లు పేర్కొంది. వీటితో పాటు ప్రత్యేకంగా సముద్ర ఉత్పత్తుల (సీ ఫుడ్) ఎగుమతి కోసం ఒక డెడికేటెడ్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు స్నోమాన్ వెల్లడించింది. కొత్త వేర్‌హౌజింగ్ అందుబాటులోకి రావటంతో కంపెనీ మొత్తం సామర్థ్యం 1,07,200 పాలెట్స్‌కు చేరుకుందని తెలిపింది. కాగా 48 ఎకరాల్లో విస్తరించిన గేట్‌వే డిస్ట్రిపార్క్స్ లాజిస్టిక్ పార్క్‌లో స్నోమాన్ వినియోగదారులు కస్టమ్స్ క్లియరెన్స్, ఖాళీ కంటైనర్ ప్రొక్యూర్‌మెంట్, పోర్ట్ పికప్, డెలివరీ వంటి సేవలను అందుకోవచ్చని తెలిపింది. ప్రస్తుతం స్నోమాన్ లాజిస్టిక్స్ కోల్‌కతా, విశాఖపట్నం, భువనేశ్వర్, కొచ్చిన్, చెన్నై, ముంబైల్లో ఈ తరహా వేర్‌హౌజింగ్ కేంద్రాలను నిర్వహిస్తోంది. కృష్ణపట్నంలో కొత్త కేంద్రాన్ని ప్రారంభించటంతో కీలక సెక్టార్లలో కంపెనీ కార్యకలాపాలను పటిష్ఠం చేసే అవకాశం లభించిందని స్నోమాన్ లాజిస్టిక్స్ చైర్మన్ ప్రేమ్ కిషన్ గుప్తా తెలిపారు. ప్రస్తుతం 3600 పాలెట్స్ సామర్థ్యంతో ఈ వేర్‌హౌజ్‌ను ఏర్పాటు చేసినప్పటికీ వచ్చే రెండేళ్లలో దశల వారీగా దీన్ని 10 వేల పాలెట్స్‌కు విస్తరించనున్నట్లు సంస్థ సిఇఒ సునీల్ నాయర్ చెప్పారు.

## బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

BSE

ACI INFOCOM 6.91(6.91)25
ADITYA SPIN. 9.6(9.15)901
AGRO TECH FO 658.9(675.75)3197
AISHWARYA TE 9.04(8.76)57749
ALPHAGEO (I) 916.55(918.45)1983
ALU FLUORIDE 136.05(143.2)77962
AMAR RAJA BA 807.95(840.9)222892
ANDHRA BANK 54.25(56.05)277456
ANDHRA CEMEN 12.05(12.47)41071
ANDHRA PETRO 72.85(76.65)178995
ANJANI PORTL 232.4(241)3183
ASTRA MICRO 117.7(111.95)201187
AUROB.PHARMA 635.2(641.35)92854
AVANTEL LTD 526.9(501.85)7291
AVANTI FEEDS 2378.25(2438.55)11409
B.N.RATHI SE 44(45.25)5247
BALAJI AMINE 719.25(751.6)28725
BAMBINO AGRO 286.35(290)2512
BARTRONICSIN 14.16(14.17)13375
BHAGIRA.CHEM 315.65(307.1)3071
BHAGYA INL 42(41.85)4483
BHARATFIN 1031.7(1023.25)22264
BNR UDYOG 30.95(32.55)2487
CAMBRIDGE 88(89.5)5209
CCHHL 16.2(16.7)20008
CCL PRODUCTS 290.75(292.1)1435
CELESTIAL 18.1(18.65)16765
CIL SECURITS 34.25(35.5)768
COROM INTER 532.9(543.75)520301
CUBEX TUBING 26(25.25)5030
CYBERMATE 3.6(3.7)119795
CYIENT 649.25(642.85)57831
DANLAW TECH. 92.65(95.8)8826
DECAN CEMENT 580.4(592.35)367
DECCAN POLYP 2.95(3.1)5
DHAN ROTO SP 42.05(42)1303
DIAMONPOWER 19.05(19.4)45059
DIVI'S LAB. 1100.25(1122)42679
DIVYA.GRANIT 115(115)1654
DQ ENT 17.35(17.95)4585
DR.REDDY'S 2355.75(2504)97407
EMPEE SUGARS 4.59(4.74)1
EVEREST ORG. 141.7(143.75)421
FACOR ALLOYS 3.95(3.86)462600
FIRSTOBJ 16.1(15.95)1703
GATI LTD. 133.2(134.45)159409
GAYATRI BIO 9.65(10.1)2030
GAYATRI PROJ 217.05(220.4)22164
GENNEX LAB 4.89(5.07)128233
GMR INFRASTR 22.7(22.8)4744549
GODAVARI DRU 37.9(37.9)2237
GOLDST INFRA 215.2(216.7)25566
GOLDSTONE EN 15.15(15.9)24480
GRANULES (I) 134.95(136.6)103169
GVK POWERINF 20.2(21.2)468048
HBL P SYS 64.25(65.05)113829
HERITGFOOD 777.1(800.95)1618
HIND.FLUROCA 14.25(15)11409
HINDUSTN BIO .69(.66)100
I.C.S.A. IND 4.3(4.52)13149
IKF TECHNO .87(.73)1837898
INCAP LTD. 108.15(111)1633
IPAPPM 347(359.25)17725
IVRCL LTD 5.44(5.24)275316
KAKATIYA CEM 371.1(379.1)6364
KALLAM SPG. 21.65(22.05)35155
KARAN WOO-SN 1.65(1.58)200
KAVERI SEED 504.4(513.1)43915
KCP LTD 145.85(147.75)18651
KERNEX MICRO 56.55(54.85)28125
KNR CONST 313.55(315.1)6822
KREBS BIOCHM 145.5(149.15)3975
LANCO INFRA 1.61(1.69)5156885
LOKESH MACH 69.05(71)8660
LOTUS CHOC 52.8(52.85)17287
MADHUCON PRJ 32.2(33.55)33369
MOLD-TEK TEC 69.8(70.9)2541
MOSCHIP SEMI 39.05(40.4)60581
MSR INDIA 38(39.95)17499
N C L IND. 278.3(283.45)16309
NACLIND 53.95(53.85)28291
NATCO PHARM 982.85(995.15)18449
NCC 127(127.8)244538
NEHA INTER. 8.09(8)21603
NETTLINX LTD 85.9(84.25)55492
NEULAND LAB. 865.35(888.2)2748
NIHAR INFO 14.6(14.09)500
NILE LTD. 940.4(946.15)8686
NTL 4.73(4.67)1110
OIL COUNTRY 54.35(53.3)47885
PADMALAYA TE 5.8(5.9)13379
PALRED 103.75(105.25)5874
PANYAM CEMEN 58.8(58.85)7716
PENNAR STEEL 62.2(63.9)94195
PFL INFOTECH 10.65(10.16)2313
PHYTOCHEM I. 76(72.95)80331
PITTI LAMIN. 88.6(90.8)6551
POKARNA LTD 219.05(226.25)8036
PRAJAY ENGS. 15.45(16.25)20626
PREMIER EXPL 442.6(452.65)42923
PRISM CEMENT 130.3(134.55)125053
RAIN 403.3(419)417578
RAJ PACKAGIN 39.9(39.95)3525
RAJVIR IND 46.6(44.4)782
REG.CERAMIC 6.63(6.63)541
RESTILE CER. 8.11(8.12)12270
SAGAR CEM. 1011.75(1040.15)3883
SAMKRG PIST. 330.85(328.65)7368
SAMPRE NUTRI 72.05(75.25)14409
SANGHI IND. 125.95(129.85)39542
SATVAH.ISPAT 27.7(28.75)13631
SAVEN TECHNO 22.7(23.2)2235
SIBAR AUTO 18.64(17.76)14800
SMPL 1.6(1.56)16000
SMS PHARMACE 100.3(101.3)15085
SREE RAYALA 199.85(199.7)3460
STEEL EXCH 34.35(35.1)134046
SUJANA INDUS 1.02(.98)129800
SURANATP 5.8(5.97)12116
SURYACHAKRA 1.64(1.65)173721
SURYAMBA SP 77.7(78.8)1165
SURYLAK.COTT 90.1(93)6843
SUVEN LIFE S 240(215.1)1143860
TAJ GVK HOTL 175.8(183.1)8850
TANLA 33.55(34.8)205342
TCI INDUS. 999(957.75)40
TRANSCORP IN 45.5(47.85)8071
TRANSGENE BI 2.36(2.37)33912
TRANSPORT CO 280.8(274.85)6497
USHER AGRO 7.95(8.09)7425
VICEROY HOTE 17.8(19.15)103296
VIJAY TEXTIL 62.95(63.9)28659
VIMTA LABS 208.15(215.6)65939
VIRAT CRANE 48.3(50.4)3392
VIRINCHI 133.4(132.95)152380
VISAKA IND. 757.9(762.45)9113
VISTA PHARMA 42.2(43.45)40523
VIVIMED LABS 89.45(89.7)112454
VST INDUS. 3300(3327.9)315
WATERBASE 303.2(308.95)97153
XLENERGY 3.89(3.84)3312
YBRANTDIGI 6.46(6.63)225534
ZEN TECH 125.2(125.8)28659
ZENOTECH 47(48.1)15560

## ఇద్దరు భారతీయ అమెరికన్లకు ఆవిష్కర్తల హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు

వాషింగ్టన్, జనవరి 29: ఇద్దరు భారతీయ అమెరికన్ ఆవిష్కర్తలకు ప్రతిష్ఠాత్మక 'జాతీయ ఆవిష్కర్తల హాల్ ఆఫ్ ఫేమ్'లో చోటు లభించింది. ఎంఐఎంవో వైర్‌లెస్ పరిజ్ఞానానికి సంబంధించి ఆరోగ్యస్వామి పాల్‌రాజ్, దంతాలకు సంబంధించిన సూక్ష్మ సామగ్రి అంశంలో సుమిత మిత్రాలు ఈ ఏడాది హాల్ ఆఫ్ ఫేమ్‌లో స్థానం దక్కించుకున్నారు. జాతీయ ఆవిష్కర్తల హాల్ ఆఫ్ ఫేమ్ 2018కి విడుదల చేసిన జాబితాలో వీరిద్దరితో పాటు మరో 13 మందికి చోటు దక్కింది. పాల్‌రాజ్‌కు 2010లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం ప్రదానం చేసింది.

# తైవాన్‌లో కరచాలనం వద్దు!

చైనాకు తూర్పు దిక్కులో ఉన్న ఒక చిన్న ద్వీపం తైవాన్. ఇటీవల కాలంలో ఆసియాలో ఎక్కువ మంది యాత్రికులు పర్యటిస్తున్న దేశం. తనదైన విభిన్న సంస్కృతి, సంప్రదాయాలతో పర్యాటకులను అలరించే ఈ ద్వీపానికి వెళ్లినప్పుడు పాటించాల్సిన పద్ధతులేమిటో తెలుసుకుందాం..

తైవాన్‌లో ఎవరి ఇంటికి వెళ్లినా ముందు అడిగే మాట 'భోజనం చేశారా?' అని. మన సమాధానం ఏదైనాగానీ.. తినడానికి వారు తప్పనిసరిగా ఏదో ఒకటి పెడతారు. తినకపోతే బాధపడతారు. అందువల్ల తైవాన్‌లో ఎవరైనా ఇంటికి వెళ్లే ముందు తినకుండా ఉంటే మంచిది. తినేటప్పుడు చాప్‌స్టిక్స్‌ను అన్నంలో కానీ నూడిల్స్‌లో కాని గుచ్చకూడదు. వాటిని బౌల్‌పైనే పెట్టాలి. తినేటప్పుడు మెతుకులు కింద (టేబుల్‌పై) పడేస్తే అమర్యాదగా భావిస్తారు.

### ఇదో రకం పలకరింపు..

కొన్ని దేశాల్లో కౌగలించుకోవటాన్ని పలకరింపుగా భావిస్తారు. కొన్ని దేశాల్లో షేక్‌హ్యాండ్‌ను పలకరింపుగా భావిస్తారు. తైవాన్‌లో మాత్రం తలను పంకించటాన్ని పలకరింపుగా భావిస్తారు. తెలియని వారికి షేక్‌హ్యాండ్ ఇవ్వటాన్ని అమర్యాదగా భావిస్తారు. అందువల్ల తైవాన్‌లో షేక్‌హ్యాండ్‌లను ఇవ్వకుండా ఉంటే మంచిది.

### క్యూలుంటాయి..

తైవాన్‌లో ప్రజలు చాలా క్రమశిక్షణగా ఉంటారు. మార్కెట్లలో, సూపర్‌బజార్లలో, మాల్స్‌లో.. ఇలా ఎక్కడ చూసినా క్యూలు కనిపిస్తూ ఉంటాయి. క్యూని దాటుకొని ముందుకు వెళ్లటాన్ని వారు అమర్యాదగా భావిస్తారు. సాధారణంగా తైవాన్ ప్రజలు పర్యాటకులకు చాలా మర్యాద ఇస్తారు. అందునా చైనా భాష మాట్లాడే వారంటే మరింత గౌరవంగా చూస్తారు. అందువల్ల తైవాన్‌కు వెళ్లే ముందు నాలుగైదు చైనా పదాలను నేర్చుకొని వెళ్తే మంచిది.

–స్పెషల్ డెస్క్



**ఏ దేశంలో ఏముంది?** Foreign







కువైత్‌లోని భారత దౌత్య కార్యాలయం ఎదుట సోమవారం తెల్లవారుజామున బారులు తీరిన తెలుగువారు

# ఊరు పిలుస్తోంది!

## సరైన పత్రాలు లేనివారికి కువైత్ క్షమాభిక్ష

- స్వదేశాలకు వెళ్లిపోయేందుకు అనుమతి
- భారత ఎంబసీ వద్ద తెలుగువారి బారులు
- తెల్లవారుజామునే క్యూకట్టిన వేలాదిమంది



రాజంపేట(కడప), జనవరి 29: ఏజెంట్లు, దళారులు, యజమానుల మోసాల వల్ల కువైత్‌లో చట్టప్రకారం ఉండలేక, స్వదేశానికి తిరిగి రాలేక ఏళ్ల తరబడి మగ్గిపోతున్న వారికి ఊరట లభించింది. అటువంటివారికి క్షమాభిక్షతోపాటు, స్వదేశాలకు వెళ్లేందుకు అక్కడి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో బతుకు జీవుడా అంటూ వేలాది మంది స్వదేశీబాట పడుతున్నారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటలకే అక్కడి భారత దౌత్య కార్యాలయం(ఎంబసీ) వద్ద వేలాదిమంది క్యూ కట్టారు. ఒక్కసారిగా వేలాది మంది రావడంతో మన దౌత్య కార్యాలయ అధికారులతోపాటు కువైత్ అధికారులు కూడా అవాక్కైనట్టు తెలిసింది. కువైత్‌లో పనులకు మన దేశం నుంచి సుమారు 40 సంవత్సరాలుగా భారీగా ప్రజలు తరలివెళ్తున్నారు. అక్కడ వివిధ వృత్తుల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. మన తెలుగు రాష్ట్రాలకు చెందినవారే సుమారు 5 లక్షల మంది వరకు అక్కడ ఉంటున్నారు. అయితే ఏజెంట్లు, దళారులు, అక్కడి యజమానుల మోసాల వల్ల వేలాదిమంది అకామా, పాస్‌పోర్టు, ఆ దేశ గుర్తింపు కార్డు బతాకా కూడా లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనుమతి పత్రాలు లేని సుమారు 50 వేల మందికిపైగా తెలుగు రాష్ట్రాల ప్రజలు అక్కడ ఉన్నట్టు సమాచారం. పాస్‌పోర్టు, అకామా, బతాకా లేకుండా ఆ దేశంలో చట్టవిరుద్ధంగా ఉన్న వారు అపరాధరుసుము, శిక్షలు లేకుండా ఈ నెల 29వ తేదీ నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు స్వదేశాలకు వెళ్లిపోయేందుకు అనుమతి ఇస్తూ కువైత్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బతుకు జీవుడా అంటూ ఇల్లు చేరేందుకు మన దేశానికి చెందిన అలాంటివారంతా మన ఎంబసీ వద్ద బారులు తీరుతున్నారు. తొలిరోజు(సోమవారం) భారీగా భారత దౌత్య కార్యాలయం ఎదుట వేలాది మంది క్యూ కట్టారు. వారిలో ఎక్కువగా మహిళలు ఉన్నారు. ఆ దేశ అనుమతి పత్రాలు లేని వారు మన దౌత్య కార్యాలయానికి వెళ్లి తమ వద్ద ఉన్న పత్రాలు సమర్పిస్తే, అన్ని వివరాలు పరిశీలించి భారత్‌కు రావడానికి అధికారులు అనుమతి ఇస్తారు. అవుట్‌పాస్ జారీ చేస్తారు. ఈ అవుట్‌పాస్‌ను ఇమిగ్రేషన్ కార్యాలయంలో ఇస్తే, ఆ దేశంలో కేసులేమీ లేనట్టు ధ్రువీకరించుకొని ఇమిగ్రేషన్ స్టాంపు వేసి, విమాన టికెట్ తీసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా వారం రోజుల్లో పూర్తి కానుంది. ఆ వెంటనే వారంతా ఇక్కడికి చేరుకోడానికి వీలు కలుగుతుంది.

కాబోయే మొగుడు విదేశాల్లో ఉంటే బతుకు సుఖమయం.. అనుకునే పడతులెందరో! కానీ ఇది ఒకప్పటి మాట..

విదేశీ అల్లుణ్ణి తెచ్చుకోడానికి తల్లిదండ్రులు జంకుతున్నారు.. ఎందుకంటే పెళ్లి చేసుకున్నాక- భార్యను రాచిరంపాన పెడుతూ, వారిని కాలానికీ, ఖర్మానికీ వదిలేస్తున్నవారు ఎక్కువవుతున్నారు. చట్టానికి చిక్కరు.. కోర్టులకు అందరు.. పెద్ద మనుషుల మాట వినరు.. విడాకులివ్వరు.. ఇష్టానుసారం బతుకుతూంటారు.

# మోసకారి మొగుడా.. పాస్‌పోర్టు ఖల్లాస్!

## తాళికి విలువలేదు.. ఆలికి బతుకులేదు

### పెరుగుతున్న ప్రవాసుల వివాహ వివాదాలు.. పాస్‌పోర్టు జప్తుతో తిక్క కుదర్చాలని సర్కారు యత్నం



ఇలాంటి ప్రబుద్ధుల ఆట కట్టించడానికి కేంద్రం నడుం బిగించింది. ఎన్నారైల వివాహ వ్యవహారాలపై మూడు మంత్రిత్వ శాఖలు, జాతీయ మహిళా కమిషన్‌లతో ఓ నోడల్ ఏజెన్సీ- ఐఎన్‌ఏ ను ఏర్పాటు చేసింది. తెగ కొవ్వెక్కి, భార్యలను కొట్టి- వదిలేసి- కనిపించకుండా పోయిన ఓ పదిమంది భర్తల పాస్ పోర్టులను జప్తు చేస్తే- వారు దారికొస్తారని ఐఎన్‌ఏ సిఫార్సు చేసింది. దాన్ని ఆమోదించిన కేంద్రం- ఆ శాడిస్టు భర్తలకు తాఖీదులు పంపింది. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనకాగాంధీ రాజ్యసభకు లిఖితపూర్వకంగా ఇచ్చిన ఓ సమాధానంలో ఈ విషయం చెప్పారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం- విదేశాల్లో ఉన్న భారత ఎంబసీలకు 2015 నుంచి ఇప్పటి దాకా- వివాహ వివాదాలకు సంబంధించి- 3328 ఫిర్యాదులు అందాయి. ఇవన్నీ భార్యలు తమ భర్తలపై చేసిన ఫిర్యాదులే. వీటిలో 3268 గొడవల్ని కౌన్సెలింగ్, గైడెన్స్, విదేశీ చట్టాలపై అవగాహన కల్పించడం.. మొదలైన మార్గాల ద్వారా పరిష్కరించారు. తెలుగు రాష్ట్రాల విషయమే తీసుకుంటే- 2015 దాకా దాదాపు 4560 ఎన్నారైల పెళ్లిళ్ల పెటాకులయ్యాయి.. ఇది పోలీస్ స్టేషన్లు, ఫ్యామిలీ కోర్టులకు చేరిన వాటి లెక్క మాత్రమే. కోర్టుకు చేరని వారెందరో! తాళి బంధం తెగిపోయిన కేసుల్లో అధికశాతం భర్తల వేధింపులే కారణంగా కనిపిస్తోంది. కట్నం మరింత కావాలని కోరేవారు కొందరైతే- దాంపత్యం కుదరక విడిపోయే వారు ఎక్కువ. బాధాకరమైన విషయమేంటంటే- ఈ తెగదెంపులు పిల్లలు పుట్టాక చేసుకోవడం. బలవంతంగా భార్యల్ని వదిలించుకునే దుస్సంప్రదాయానికి అడ్డుకట్ట పడాలని ఎన్నో ఏళ్లుగా మహిళా సంఘాలు కోరుతున్నాయి. ఇప్పటికి ఓ గట్టి అడుగు ముందుకు పడింది. గతంలో లుక్‌అవుట్ నోటీసులు, రెడ్ కార్నర్ నోటీసులు కూడా ఉండేవి. అయితే గృహ హింస కేసులకు రెడ్ కార్నర్ పరిధిలోకి తీసుకురావడంపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దాంతో దాన్ని ఎత్తేశారు. లుక్ అవుట్ నోటీసులవల్ల కొంత ప్రయోజనం ఏర్పడింది.. కొన్ని అరెస్టులు కూడా జరిగాయి. ఈ అంశాన్ని ఎప్పటినుంచో పరిశీలిస్తున్న కేంద్రం- రిజిస్టర్ అయిన ఎన్నారై వివాహాల డేటాను సమీకరించాలని నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రాల వారీగా ఈ ప్రక్రియ సాగుతోంది. మహిళా కమిషన్లు కూడా ఇందుకు సాయపడుతున్నాయి. ఎన్నారైలు తప్పనిసరిగా తమ పెళ్లిళ్లను రిజిస్టర్ చేసేట్లుగా న్యాయశాఖ ఓ చట్టం కూడా తేనుంది. రిజిస్టర్ అయిన పెళ్లిళ్ల వివరాలను మహిళా శిశుసంక్షేమ శాఖ తన వెబ్‌సైట్లో పెడుతుంది. నిజానికి సుప్రీంకోర్టు 2006లోనే ఈ నిర్బంధ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఓ తీర్పు ఇచ్చింది. దాన్ని ఇన్నేళ్లూ కేంద్ర బుట్టదాఖలా చేసింది.

**విదేశీ కోర్టులే బెస్ట్..**

పాస్‌పోర్టును జప్తు చేయడమే కాదు, రద్దు చేయాలని మహిళాసంఘాలు ఎప్పటి నుంచో కోరుతున్నాయి. "ఇది మా దీర్ఘకాల డిమాండ్.. వివాహం చేసుకుని ఏడాదో రెండేళ్లో కాపురం చేసి ఆ తరువాత- నయానో భయానో పుట్టింటికి పంపేస్తున్న భర్తలనేక మంది ఉన్నారు. ఇలా పంపేసి.. వారు వెళ్లాక వారి వీసాను రద్దు చేయించేస్తున్నారు. వీసా రూల్స్ ప్రకారం ఆరు వారాలపాటు రాకపోతే అది రద్దు అయిపోతుంది. అంటే ఈ బాధిత మహిళలు ఆ దేశాల్లో అడుగు పెట్టే వీలు కూడా ఉండదు. ఆ శాడిస్టులు విడాకులు ఇవ్వరు. తీసుకోరు. ఎంతోమంది మహిళలు చేసే తప్పు ఇదే.. గొడవలు వస్తే అమ్మానాన్నల దగ్గరికి వచ్చేస్తారు. ఇక్కడికొచ్చాక అక్కడ విదేశంలో ఉంటున్నవాడిని ఎలా దారికి తెస్తాం? అదీకాక ఇక్కడికొచ్చాక ఆ అమ్మాయిలు విడాకుల నోటీసిస్తున్నారు.. ఏంటి లాభం? అమెరికాలోనూ, పశ్చిమ దేశాల్లోనూ కోర్టుల్లో సరైన న్యాయం లభిస్తుంది.. వెంటనే కూడా ఆ కేసులు తేలిపోతాయి.. మేం ఇచ్చే సలహా ఏంటంటే- గొడవలొస్తే అక్కడే పరిష్కరించుకోండి- విడాకులు తీసుకుంటే అక్కడే తీసుకోండి..!" అని ప్రగతిశీల మహిళా సంస్థ సంధ్య వివరించారు.

# కువైత్‌కు 'పనివాళ్లను' పంపం



- ఫిలిప్పైన్స్ ప్రకటన.. ఉన్నవాళ్లు తిరిగొచ్చేయాలని పిలుపు
- పెరుగుతున్న అత్యాచారాలకు నిరసనగా నిర్ణయం
- ఆరోపణలను ఖండించిన కువైత్.. భారత్‌వైపు చూపు!

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

తమ మహిళలను ఇళ్లలో పనిమనుషులుగా పనిచేసేందుకు కువైత్‌కు పంపబోమని ఫిలిప్పైన్స్ ప్రకటించింది. అక్కడ తమ దేశస్థులపై నానాటికి వేధింపులు, అత్యాచారాలు పెరుగుతుండడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. ఈ మేరకు ఫిలిప్పైన్స్ అధ్యక్షుడు రొడ్రిగో డుటెర్ట్ ప్రకటించారు. ఇటీవలే తమ దేశానికి చెందిన మరో మహిళ కువైత్‌లో అత్యాచారానికి గురై బలవన్మరణానికి పాల్పడిందని చెప్పారు. 'వీసా ఎగ్జిట్' సమస్యతో అనేక మంది స్వదేశానికి తిరిగి రాలేక అక్కడే పడరాని పాట్లు పడుతున్నారని, వారికి ఒప్పందం ప్రకారం వేతనాలు కూడా చెల్లించడం లేదని ఫిలిప్పైన్స్ విదేశాంగ శాఖ కార్యదర్శి ఆవేదన వ్యక్తం చేశారు. కువైత్‌లో 2.76 లక్షల మంది ఫిలిప్పైన్స్ దేశస్థులు పని చేస్తుండగా వారిలో అత్యధికులు మహిళలే. పైగా వీరిలో 60 శాతానికిపైగా అరబ్ షేక్‌ల ఇళ్లలో వంటపనులు, పాచి పనులు చేస్తున్నారు. కాగా ఫిలిప్పైన్స్ ప్రకటన ఇరుదేశాల ప్రయోజనాలకు విరుద్ధమని కువైత్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ప్రిన్స్ షేక్ సబా అల్ ఖాలీద్ అల్‌సబా అన్నారు. ఒకట్రెండు ఘటనలను ఆధారంగా చేసుకొని, మొత్తంగా దేశాన్నే నిందించడం సరికాదన్నారు. ఫిలిప్పైన్స్ రాయబారిని విదేశాంగ శాఖ అధికారులు పిలిపించుకొని నిరసన వ్యక్తం చేశారు. తమ దేశంలో విదేశీయులకు మానవహక్కులు బేషుగ్గా ఉన్నాయని పేర్కొన్నారు. ఫిలిప్పైన్స్ ప్రకటన నేపథ్యంలో కువైత్ భారత్‌వైపు చూస్తోంది. మన దేశంతో పాటు ఇతర దేశాల నుంచి తక్కువ వేతనాలకు మహిళలను తీసుకువచ్చే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థ అల్ దుర్రా.. భారత్ నుంచి పనివాళ్లుగా ఇప్పటికైతే పురుషులను తీసుకువస్తోందని, త్వరలో మహిళలను కూడా తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపింది. అయితే, గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం మహిళలను పంపించడాన్ని ఇండోనేషియా ఇప్పటికే నిషేధించింది. భారత్ తాత్కాలికంగా నిషేధం విధించినా ఆ తర్వాత తొలగించింది. రాయలసీమ, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన వేలాది మంది మహిళలు కువైత్‌లో దుర్భర పరిస్థితుల్లో పనిచేస్తున్నారు.

## ఫ్లోరైడ్ బాధితుల ఆసరాకు

# మేము సైతం..



సీఎం కేసీఆర్‌కు వివరాలు తెలియజేస్తున్న బృందం



ఫ్లోరైడ్ బాధితుడి నుంచి వివరాలు తెలుసుకుంటున్న బృందం

### నడుం బిగించిన ఎన్నారైలు

కోదాడ, జనవరి 18: ఇక్కడే పుట్టి.. ఇక్కడే పెరిగారు.. ఎక్కడో దేశం కాని దేశంలో ఉంటున్నారు. అయినా జన్మనిచ్చిన గడ్డను, ఇక్కడి ప్రజలు అనుభవిస్తున్న కష్టాలను ఆ ఎన్నారైలు మరిచిపోలేదు. ఫ్లోరైడ్ సమస్యతో కాళ్లు, చేతులు వంకర్లుపోయి.. తమ పని తాము చేసుకోలేని స్థితిలో ఉన్న బాధితులను చూసి చలించిపోయారు. ఫ్లోరైడ్ సమస్యను తీర్చే యజ్ఞంలో తామూ భాగస్వాములమవుతామని అంటున్నారు. ప్రభుత్వం సహకరిస్తే.. తమవంతుగా చేయూతనిచ్చేందుకు సిద్ధం అంటున్నారు. ఫ్లోరైడ్ బాధితులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.1500 పెన్షన్ ఏమాత్రం సరిపోదని, వారి జీవన ప్రమాణస్థాయిని పెంపొందించేందుకు పుష్టికరమైన ఆహారం, సౌకర్యాలు అవసరమంటున్నారు. ఇందుకు రూ.1000 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. అదే విధంగా రూ.100 కోట్లతో ప్రత్యేక ఆస్పత్రిని ఏర్పాటు చేస్తే, బాధితుల చికిత్సకయ్యే పూర్తి ఖర్చును ప్రభుత్వ ఖాతాకు జమ చేస్తామని అంటున్నారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌ను కలిసి విన్నవించామని ఎన్నారైల బృందం సభ్యుడు, సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలానికి చెందిన జలగం సుధీర్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. బాధితుల సమస్యలను తెలుసుకొని, ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో పర్యటిస్తున్నామని ఆయన చెప్పారు. అనంతరం బాధితుల వివరాలను సీఎం దృష్టికి తీసుకెళతామన్నారు. జన్మభూమి రుణం కొంతలో కొంత తీర్చుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నల్లగొండ జిల్లా చౌటుప్పల్‌లో ఫ్లోరైడ్ బాధితులకు ఆస్పత్రి నిర్మాణం కోసం 8 ఎకరాలను జాతీయ పౌష్టికాహార సంస్థకు కేటాయించినట్టు తెలిసిందన్నారు. అయితే.. సర్కారు రూ.100 కోట్లతో ఆస్పత్రిని నిర్మిస్తే.. బాధితులకు చికిత్స కోసం నిధులను తామే పంపిస్తామన్నారు. ఫ్లోరైడ్ బాధితుల సమస్యలపై ప్రపంచ వ్యాప్తంగా ఎన్నారైలకు అవగాహన కల్పిస్తామన్నారు.

### యువకులకు పిల్లనివ్వడం లేదు

ఫ్లోరైడ్ బాధితుల సమస్యలను తెలుసుకునేందుకు ఇప్పటికే నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని నాలుగు గ్రామాల్లో తమ ప్రతినిధులు పర్యటించారని ఎన్నారై జలగం సుధీర్ వెల్లడించారు. "నీళ్లలో ఫ్లోరైడ్ కారణంగా యువకుల్లో చాలామందికి కాళ్లు, చేతులు, నడుములు వంకర్లు పోయాయి. దీంతో వారికి ఎవరూ పిల్లనిచ్చేందుకు ముందుకు రావటంలేదని బాధితులు వాపోయారు. ఒకవేళ వివాహం అయినా విడాకులు తీసుకుంటున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు" అని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోనూ పలు గ్రామాల్లో పర్యటించామన్నారు.

# ఐఐఎంలకు కొత్తరూపు



**ఐఐఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్)లు... మేనేజ్‌మెంట్ విద్యను అందించడంలో పేరుగాంచిన సంస్థలు. ఉన్నత ప్రమాణాలు, అత్యుత్తమ బోధనతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్ - 50 బీ స్కూల్స్‌లో చోటు సాధిస్తున్నాయి. మేనేజ్‌మెంట్ కెరీర్‌ను ఎంచుకుకోవాలనుకునే ప్రతి ఒక్కరి లక్ష్యం ఐఐఎం అడ్మిషన్ సాధించడమే. వివిధ రంగాల్లో మార్పులకు అనుగుణంగా తమనుతాము తీర్చిదిద్దుకోవడం ద్వారానే ఐఐఎంలకు ఇంత పేరు లభించింది. ఈ దిశగా ఐఐఎంలను మరింత బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన బిల్లు ఇటీవలే చట్టరూపం దాల్చింది. దీని ద్వారా ఐఐఎంల పనితీరు పూర్తిగా మారిపోనుంది. కోర్సుల రూపకల్పన, డిగ్రీల ప్రదానం, తదితర విధాన నిర్ణయాల్లో ఐఐఎంలకు పూర్తి స్వేచ్ఛను కల్పిస్తున్న ఈ చట్టంలోని ముఖ్యాంశాలు...**

ప్రణాళిక సంఘం సూచనల మేరకు దేశంలో ఐఐఎంలను స్థాపించారు. మొదటి ఐఐఎంను 1961లో కోల్‌కతాలో ప్రారంభించారు. ఐఐఎం అహ్మదాబాద్‌ను 1961 డిసెంబర్‌లో, ఐఐఎం - బెంగళూరును 1973లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశంలో 20 ఐఐఎంలు ఉన్నాయి. వీటికి స్వయంప్రతిపత్తి హోదా ఉంది. మేనేజ్‌మెంట్ విద్యకు సంబంధించి పోస్ట్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా, ఫెలో ప్రోగ్రామ్ తదితర కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. ఐఐఎంలలో సంస్కరణలకు సంబంధించిన బిల్లుకు కేంద్ర కేబినెట్ గతేడాది జనవరిలో ఆమోదం తెలిపింది. తర్వాత లోక్‌సభ, రాజ్యసభ ఈ బిల్లును ఆమోదించాయి. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సంతకం చేయడంతో ఈ బిల్లు 2017 డిసెంబర్ 31న చట్టంగా మారింది. దీన్ని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ యాక్ట్, 2017గా వ్యవహరిస్తారు. ఇక నుంచి దేశంలోని 20 ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్‌గా (జాతీయ ప్రాముఖ్యత ఉన్న సంస్థలు) గుర్తిస్తారు. ప్రపంచస్థాయిలో ఎదురవుతున్న పోటీని తట్టుకునే విధంగా, పరిపాలనపరంగా మరింత బలోపేతం చేసే అంశాలకు ఈ చట్టంలో పెద్దపీట వేశారు.

## మరింత బలోపేతం

ఐఐఎంలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన అంశాలను చట్టంలో చేర్చారు. గతంలో ఐఐఎంల పరిపాలన, నియామకాలు తదితర అంశాల్లో ప్రభుత్వం, బ్యూరోకాట్ల జోక్యం ఎక్కువగా ఉండేది. తాజా చట్టం ద్వారా అన్ని అంశాల్లో స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అధికారాన్ని ఐఐఎంలకే కట్టబెట్టారు. దాంతో నూతన కోర్సులను ప్రవేశపెట్టడం, ప్రణాళికల రూపకల్పనలో ఐఐఎంలకు మరింత స్వేచ్ఛ లభిస్తుంది. ఐఐటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ), ఎయిమ్స్ (ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) సమాన / అంతకంటే ఎక్కువ స్థాయిలో ఐఐఎంలకు స్వయంప్రతిపత్తి హోదా ఇవ్వడానికి కొత్త చట్టం వీలు కల్పిస్తుంది.

## విద్యార్థులకు భాగస్వామ్యం

మరో విప్లవాత్మక మార్పు డైరెక్టర్ల ఎంపికలో విద్యార్థులకు భాగస్వామ్యం కల్పించడం. ప్రతి ఐఐఎం బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఆధ్వర్యంలో పని చేస్తుంది. నూతన విధానంలో ప్రతి ఐఐఎం బోర్డులో అలూమ్ని నుంచి ఐదుగురిని సభ్యులుగా నియమించుకుంటారు. ఈ బోర్డులో అలూమ్ని సభ్యులతోపాటు చైర్‌పర్సన్, కేంద్ర ప్రభుత్వ నామినీ, రాష్ట్ర ప్రభుత్వ నామినీ (ఐఐఎం ఉన్న రాష్ట్రం), ఫ్యాకల్టీల నుంచి ఇద్దరితోపాటు 19 మంది సభ్యులుగా ఉంటారు. ఈ బోర్డుకు ఐఐఎం డైరెక్టర్‌ను ఎన్నుకునే అధికారం ఉంటుంది. ఇంతకుముందు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐఐఎం డైరెక్టర్, వాటి బోర్డుల చైర్మన్ ఎంపిక జరిగేది. అయితే ఈ ప్రక్రియలో ఒక్కో ఇన్‌స్టిట్యూట్‌కు ఉండే ప్రత్యేకత, విశిష్టతను గుర్తించకుండా డైరెక్టర్లను నియమించేవారు. దీంతో ఎన్నో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఇన్‌స్టిట్యూట్‌కు ఉండే ప్రత్యేకతను పరిగణనలోకి తీసుకోకుండా డైరెక్టర్లు సొంత ఎజెండాలను అమలు చేసేవారు. నూతన విధానంలో ఇటువంటి వ్యవహారాలను చక్కదిద్దడానికి ప్రయత్నించారు. ఇక నుంచి డైరెక్టర్ల నియామకంలో అలూమ్ని పాత్ర కీలకంగా ఉంటుంది. ఈ క్రమంలో గత, ప్రస్తుత విద్యార్థుల అనుభవాలు, అభిప్రాయాలు, ఆలోచనలకు ప్రాధాన్యం ఇస్తారు. తద్వారా ఐఐఎం నేపథ్యం, ప్రత్యేకతలకు సరిపోయే వ్యక్తిని డైరెక్టర్‌గా నియమించుకునే వెసులుబాటు లభిస్తుంది. డైరెక్టర్ల పనితీరును సమీక్షించే అధికారం ఐఐఎం బోర్డుకు ఉంటుంది. ఈ బోర్డు ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా సమావేశం కావాలి.

## విదేశీ విద్యార్థులకు..

ఐఐఎంలలో ప్రవేశం పొందుతున్న విద్యార్థుల్లో డైవర్సిటీ (వైవిధ్యం) ఉండటం లేదనే వాదన కొంతకాలంగా వినిపిస్తుంది. కేవలం ఒక నేపథ్యానికి చెందిన వారే ఎక్కువగా ఎంపికవుతున్నారనే విమర్శ కూడా ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో ఐఐఎంలలో సాంస్కృతిక వైవిధ్యం ఉండాలనే అభిప్రాయం వ్యక్తమైంది. తాజా చట్టం ప్రకారం వచ్చే ఏడాది నుంచి విదేశీ విద్యార్థులు కూడా ఐఐఎంలో చేరేందుకు అవకాశం లభిస్తుంది. తద్వారా డైవర్సిటీ విషయంలోనూ ఐఐఎంలను బలోపేతం చేసే వెసులుబాటు చిక్కుతుంది.

## సొంతంగా కోర్సులు, కరిక్యులం

నూతన కోర్సులను ప్రవేశపెట్టడంలో మరింత స్వతంత్రంగా వ్యవహరించే అధికారం ఐఐఎంలకు లభిస్తుంది. ప్రస్తుతానికి కోర్సు కంటెంట్ విషయంలో మాత్రమే నిర్ణయాలు తీసుకునే అధికారం ఐఐఎంలకు ఉంది. ప్రస్తుత చట్టం ద్వారా అండర్‌గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ స్థాయుల్లో నూతన కోర్సులను ప్రారంభించే విషయంలో ఐఐఎంలకు మరింత స్వేచ్ఛ దక్కుతుంది. విదేశీయులను ఫ్యాకల్టీలుగా నియమించుకునే వెసులుబాటు కూడా ఉంది. మార్పులను దృష్టిలో పెట్టుకొని వినూత్నంగా కరిక్యులంను రూపొందించుకోవచ్చు.

## స్వేచ్ఛగా భాగస్వామ్యం

ఇతర ఇన్‌స్టిట్యూట్‌లతో భాగస్వామ్య ఒప్పందాల విషయంలో గతంలో పరిమితులు ఉండేవి. నూతన చట్టంతో విదేశీ యూనివర్సిటీలతో అవగాహనకు రావడం ఐఐఎంలకు సులువుగా మారుతుంది. గతంలో దీనికి కేంద్రం నుంచి అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. ఒక్కోసారి అనుమతి లభించకపోవచ్చు. ఇక నుంచి ఐఐఎంలు స్వతంత్రంగా అవగాహన ఒప్పందాలు చేసుకోవచ్చు. తద్వారా విభిన్న పరిస్థితుల మధ్య విద్యార్థులు నేర్చుకోవడానికి ఎక్కువ అవకాశాలు లభిస్తాయి.

## క్యాట్‌లో మార్పులేదు

ఐఐఎంలలో ప్రవేశానికి వీలు కల్పిస్తున్న క్యాట్ (కామన్ అడ్మిషన్ టెస్ట్) విషయంలో ప్రస్తుతానికి ఎటువంటి మార్పులను ఈ చట్టంలో చేర్చలేదు. ప్రతిభ ఆధారంగానే ఐఐఎంలలో ప్రవేశం కల్పించాలని చట్టం పేర్కొంది. అందువల్ల ప్రవేశ విధానంలో ఎటువంటి మార్పులు ఉండకపోవచ్చని నిపుణుల అభిప్రాయం. రిజర్వేషన్లు కూడా గతంలో మాదిరిగానే అమలవుతాయి. తాజా చట్టంపై కొన్ని భిన్నాభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. మార్పులు కార్యరూపంలోకి రావాలంటే చాలా వనరులు కావాలి. అహ్మదాబాద్, బెంగళూరు, కోల్‌కతా, లక్నో, ఇండోర్ వంటి పాత ఐఐఎంలకు సమస్య లేదు. నూతన ఐఐఎంలకే నిధుల సవాలు ఎదురవుతోంది.

## అకడమిక్ కౌన్సిల్ ఏర్పాటు

ప్రతి ఐఐఎంలో అకడమిక్ కౌన్సిల్ ఏర్పాటుచేస్తారు. ఇందులో మూడు విభాగాలు ఉంటాయి. అవి.. అకడమిక్ కంటెంట్ విభాగం, అడ్మిషన్ల ప్రక్రియను పర్యవేక్షించే విభాగం, పరీక్షల నిర్వహణకు మార్గదర్శకాలను రూపొందించే విభాగం. అంతేకాకుండా అన్ని ఐఐఎంల మధ్య సహకారం కోసం ఒక సమన్వయ సమితి కూడా ఉంటుంది. ఇందులో 20 ఐఐఎంల నామినీలు సభ్యులుగా ఉంటారు. ఆయా ఐఐఎంల మధ్య ఉమ్మడిగా ఉండే సమస్యలు, విధానాలపై ఈ సమన్వయ సమితి చర్చిస్తుంది.

## డిప్లొమా స్థానంలో డిగ్రీలు

ఐఐఎంలు పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (ఎంబీఏకు తత్సమానం), ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (పీహెచ్‌డీకి సమానమైన కోర్సు)లను ఆఫర్ చేస్తున్నాయి. అయితే వీటిని ఇండియన్ సొసైటీ రిజిస్ట్రేషన్ యాక్ట్ ప్రకారం ఏర్పాటు చేశారు. దీంతో సంప్రదాయ యూనివర్సిటీల మాదిరిగా ఎంబీఏ, పీహెచ్‌డీ పేర్లతో డిగ్రీలను ప్రదానం చేసే అధికారం ఉండేది కాదు. డిగ్రీ పేర్లలో తేడాల ఫలితంగా పలు సందర్భాల్లో విదేశాల్లో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ప్రస్తుతం ఐఐఎంలకు ప్రపంచస్థాయిలో గుర్తింపు లభిస్తుంది. దీంతో డిగ్రీలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆ మేరకు చట్టంలో పలు అంశాలను చేర్చింది. వీటి ప్రకారం ఐఐఎంలకు సంప్రదాయ పేర్లతో డిగ్రీని ప్రదానం చేసే అధికారం లభిస్తుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐఐఎంలు ఈ దిశగా చర్యలు చేపట్టే వెసులుబాటు దక్కుతుంది. అదేసమయంలో ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లకు డాక్టోరల్ హోదా వస్తుంది. తద్వారా మేనేజ్‌మెంట్ రంగంలో మరిన్ని పరిశోధనల దిశగా విద్యార్థులను ఆకర్షించేందుకు అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం ఐఐఎంలు అందిస్తున్న కోర్సులకు పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా స్థాయి మాత్రమే ఉంది.



---



పోటీ పరీక్షల ప్రత్యేకం
హిస్టరీ

# సమానత్వం కోసం.. ఉద్యమాలు

**బ్రిటిష్ వారు పరిపాలనా రంగంలో ప్రవేశపెట్టిన మార్పులు వర్గ వ్యవస్థ విచ్ఛిన్నానికి దారి తీశాయి. వీరు పదేళ్లకోసారి జనాభా లెక్కల్లో కులాలను వర్గీకరిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో తక్కువ జనాభా ఉన్న అగ్ర కులాలు, ఎక్కువ జనాభా ఉన్న నిమ్న కులాలపై ఆధిపత్యం చలాయిస్తున్నారనే విషయం అవగతమైంది. దీనికి వ్యతిరేకంగా సమానత్వం కోసం 19వ శతాబ్దంలో జరిగినవే కుల ఉద్యమాలు.**

మహారాష్ట్రలో కుల వ్యతిరేక ఉద్యమాలను బాల శాస్త్రి జంచేకర్, జ్యోతిరావ్ గోవిందరావ్ పూలే నడిపించారు.

## బాల శాస్త్రి జంచేకర్

మహారాష్ట్రలో అగ్ర కులాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మొదటి వ్యక్తిగా బాల శాస్త్రి జంచేకర్ గుర్తింపు పొందారు. ఈయన దర్పణ్ అనే పత్రికను నిర్వహించారు.

## జ్యోతిరావ్ గోవిందరావ్ పూలే (1827 - 90)

★ మహారాష్ట్రలో నిమ్న కులానికి చెందిన మాలి (తోటమాలి) అనే తెగలో జ్యోతిరావ్ గోవిందరావ్ పూలే జన్మించారు. అణగారిన వర్గాల తరపున కుల నిర్మూలన పోరాటం చేసిన తొలి భారతీయుడుగా గుర్తింపు పొందారు. నిమ్న వర్గాలకు విద్య, అస్పృశ్యతా నివారణకు కృషి చేశారు. తన భార్య సావిత్రి బాయి పూలేకు స్వయంగా విద్య నేర్పించి ఆమెను భారత దేశంలోనే తొలి ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారు.
★ నిమ్న వర్గాల బాలికల కోసం దేశంలోనే తొలి పాఠశాలను 1848లో పుణెలో ఏర్పాటు చేశారు. బ్రాహ్మణాధిక్యాన్ని ఖండిస్తూ 1872లో గులాంగిరి అనే గ్రంథాన్ని రచించారు. 'ఇషారా' అనే పుస్తకంలో నిమ్న కులాల వారి హక్కులను తెలిపి అగ్ర కులాల ఆధిపత్యాన్ని ఖండించారు. బరోడా మహారాజు షియాజీ షిండే ఇతనికి మహాత్మ అనే బిరుదు ఇచ్చారు.
★ పూలేని ప్రభావితం చేసిన గ్రంథం.. రైట్స్ ఆఫ్ మ్యాన్.
★ 1873లో సత్యశోధక్ సమాజ్ అనే సంస్థను స్థాపించి అణగారిన వర్గాల సమస్యలను వెలుగులోకి తెచ్చారు. 1884లో దీనబంధు, సర్వజనిక్ సభలను స్థాపించారు. ఆ తరవాతనే దీనబంధు పత్రికను స్థాపించారు.
★ 'తమాషా' అనే జానపద నాటకం ద్వారా సత్య శోధక్ సమాజ్ భావాలను ప్రచారం చేశారు.

## మహర్ ఉద్యమం (1894)

మహారాష్ట్రలోని నిమ్నకులాలను మహర్‌లుగా పరిగణించే వారు. వీరు కావలివారుగా, పాకీవారుగా, వార్తాహరులుగా పని చేసేవారు. 19వ శతాబ్దం చివర్లో మాజీ సైనికోద్యోగి అయిన గోపాల బాబ వాలంగేకర్ (బాబా వాంగ్లేకర్) మహర్ ఉద్యమాన్ని ప్రారంభించారు. మహర్‌లకు క్షత్రియ హోదాతోపాటు సైన్యం, ఇతర శాఖల్లోను ఉద్యోగావకాశా లను కల్పించాలని 1894లో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## మహర్ సత్యాగ్రహం (1891 - 1956)

★ బిఆర్ అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14న మో అనే గ్రామంలో జన్మించారు. ఇతని తండ్రి రాంజిమాలోజి సక్పాల్, తల్లి భీమాబాయి.
★ అంబేద్కర్ గురువు కృష్ణారావు అర్జున్ కేల్కర్. ఇతడు శివాజి చరిత్ర అనే గ్రంథాన్ని రచించారు. గౌతమ బుద్ధ చరిత్ర పుస్తకాన్ని అంబేద్కర్‌కు ఇచ్చారు. అంబేద్కర్, బాంద్రా గైక్వాడ్ షాయాజిరావ్ సహాయంతో కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్‌డి పూర్తిచేశారు. కొల్హాపూర్ సాహూ మహారాజు సహాయంతో లండన్ విశ్వవిద్యాలయంలో బార్ ఎట్ లా పూర్తి చేశారు.
★ ***అంబేద్కర్ స్థాపించిన పత్రికలు:*** మూక్ నాయక్ (కొల్హాపూర్ సాహూ సహాయంతో 1920లో), బహిష్కృత భారత్ (1927), జనత (1930)
★ ***అంబేద్కర్ స్థాపించిన పార్టీలు:*** ఇండిపెండెంట్ లేబర్ పార్టీ (1936), రిపబ్లికన్ పార్టీ (1956) (విధివిధానాలను తయారు చేసిన తరవాత మరణించారు)

### అంబేద్కర్ స్థాపించిన సంస్థలు:

బహిష్కృత హితకారిణి సభ (1924, ఈ సంస్థ ముంబైలో సరస్వతి విలాస్ అనే మాస పత్రికను స్థాపించింది), సమాజ్ సమతా సంఘ్ (1927, అగ్రవర్ణాలవారికి, కింది కులాల వారికి మధ్య సమానత్వ భావాలను ప్రచారం చేయడానికి స్థాపించారు), ఆల్ ఇండియా షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్, పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ (1945).

★ ***అంబేద్కర్ రచించిన గ్రంథాలు:*** అన్హిలేషన్ ఆఫ్ క్యాస్ట్ (దీన్ని బోయి భీమన్న తెలుగులో కుల నిర్మూలన అనే పేరుతో రచించాడు), థాట్స్ ఆన్ పాకిస్థాన్, థాట్స్ ఆన్ లింగ్విస్టిక్ స్టేట్స్ (1955), అన్‌టచబుల్స్, బుద్ధ అండ్ కారల్ మార్క్స్ - 1956, ద ప్రాబ్లమ్ ఆఫ్ రూపీ - 1923, రనడే, గాంధీ అండ్ జిన్నా - 1943, బుద్ధ అండ్ హిజ్ ధర్మ - 1957 (అంబేద్కర్ మరణం తరవాత ప్రచురణ), ద ఈవిల్ ఆఫ్ క్యాస్ట్, పాకిస్తాన్ అండ్ పార్టిషన్ ఆఫ్ ఇండియా, క్యాస్ట్స్ ఇన్ ఇండియా. 'వాట్ కాంగ్రెస్ అండ్ గాంధీ హావ్ డన్ టు ది అన్‌టచబుల్స్ 1945' అనే గ్రంథంలో గాంధీని విమర్శిస్తూ అంటరానివారు బౌద్ధ మతం స్వీకరించాలని తెలిపారు.

### రౌండ్ టేబుల్ సమావేశాలకు ప్రతినిధిగా

అంబేద్కర్ దళిత వర్గాల ఆలయ ప్రవేశాలకు, వారి సామాజిక రాజకీయ అభివృద్ధికి కృషి చేశారు. 1930, 1931, 1932లో లండన్‌లో జరిగిన మూడు రౌండ్ టేబుల్ సమావేశాలకు అధికారిక ప్రతినిధిగా హాజరయ్యారు. 1926 - 34 మధ్యలో బొంబాయి లెజిస్లేచర్ కౌన్సిల్‌కు నామినేట్ అయ్యారు. దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలను కల్పించే కమ్యూనల్ అవార్డును తెచ్చారు. ఈ అవార్డు గురించి గాంధీజీ, అంబేద్కర్ మధ్య 1932లో పూనా ఒప్పందం జరిగింది. 1942 - 46 మధ్యలో వైస్రాయి కౌన్సిల్‌లో కార్మిక శాఖ సభ్యునిగా నియమితులయ్యారు..

నెహ్రూ మంత్రి వర్గంలో న్యాయశాఖ మంత్రిగా పని చేశారు. హిందూ కోడ్ బిల్లు రచనలో కీలక పాత్ర పోషించారు. రాజ్యాంగ పితగా పేరు పొందారు. 1956 అక్టోబరు 14న బౌద్ధ మతాన్ని స్వీకరించారు. అదే ఏడాది డిసెంబరు 6న మరణించారు.

బి.వి. నారాయణరెడ్డి



---

# జాబ్ కార్నర్

## ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఒసిఎల్) మార్కెటింగ్ విభాగం వర్క్‌మన్ కేడర్‌లో జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **72** (వీటిలో ఎక్స్ సర్వీస్‌మెన్‌కు 14 ఖాళీలను కేటాయించారు.)
- అర్హత: కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/ పన్నెండో తరగతి ఉత్తీర్ణతతోపాటు వ్యాలిడ్ హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. డ్రైవింగ్‌లో కనీసం ఏడాది అనుభవం ఉండాలి. బిఇ/ ఎంబిఏ/ సీఏ/ ఐసిడబ్ల్యుఏ/ ఎల్‌ఎల్‌బి/ ఎంసిఏ వంటి ఉన్నత విద్యార్హత గల అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.
- వయసు: 18 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ ప్రొఫిషియెన్సీ ఫిజికల్ టెస్ట్ ద్వారా
- రాత పరీక్ష: ఫిబ్రవరి 25
- రాత పరీక్ష వివరాలు: పరీక్ష సమయం గంటన్నర. ఇందులో 100 బహుళైచ్ఛిక ప్రశ్నలు ఇస్తారు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ సహా జనరిక్ ఆప్టిట్యూడ్ నుంచి 40, రీజనింగ్ ఎబిలిటీస్ నుంచి 40, బేసిక్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్కిల్స్‌కు సంబంధించి 20 ప్రశ్నలు ఇస్తారు. రాత పరీక్షలో అర్హత సాధించాలంటే మొత్తమ్మీద 50 శాతాన్ని, ప్రతి సెక్షన్‌కు 40 శాతాన్ని కటాఫ్‌గా నిర్ణయించారు. ఎస్సీ/ ఎసీ అభ్యర్థులు 5 శాతం మార్కులు తెచ్చుకుంటే చాలు. రాత పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులను 1:2 నిష్పత్తిలో స్కిల్ ప్రొఫిషియెన్సీ ఫిజికల్ టెస్ట్‌కు అనుమతిస్తారు.
- రాత పరీక్ష ఫలితాల విడుదల: మార్చి 5న
- అభ్యర్థుల తుది ఎంపిక జాబితా విడుదల: మార్చి 15న
- దరఖాస్తు ఫీజు: రూ.150
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 10
- వెబ్‌సైట్: www.iocl.com

## మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **52**
- పోస్టులు: ప్రొఫెసర్స్ (ఇంగ్లీష్ 1, విమెన్ ఎడ్యుకేషన్ 1, ఇస్లామిక్ స్టడీస్ 1, పొలిటికల్ సైన్స్ 1, బొటనీ 1, కమిస్ట్రీ 1, ఫిజిక్స్ 1, సిడబ్ల్యుఎస్ 1, డిడిఇ 1, మౌలానా అబుల్ కలాం ఆజాద్ చైర్ 1), అసోసియేట్ ప్రొఫెసర్స్ (ఇంగ్లీష్ 2, పర్షియన్ 1, హిందీ 1, విమెన్ ఎడ్యుకేషన్ 1, మాస్ కమ్యూనికేషన్ & జర్నలిజం 1, సోషల్ వర్క్ 1, సోషియాలజీ 1, ఎకనామిక్స్ 1, హిస్టరీ 1, కెమిస్ట్రీ 1, మేథమెటిక్స్ 1, సిపిడియుఎంటి 1, సియుసిఎస్ 1), అసిస్టెంట్ ప్రొఫెసర్స్ (అరబిక్ 1, సిడబ్ల్యుఎస్ 1)
- ఎంఎఎన్‌యుయు ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఫర్ విమెన్ (శ్రీనగర్)లోని ఖాళీలు: అసోసియేట్ ప్రొఫెసర్స్ (ఉర్దు 1, అరబిక్ 1, ఇంగ్లీష్ 1, పర్షియన్ 1, ఎకనామిక్స్ 1, హిస్టరీ 1, పొలిటికల్ సైన్స్ 1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 1), అసిస్టెంట్ ప్రొఫెసర్స్ (హిస్టరీ 1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 1, కశ్మీరీ 1)
- లైబ్రరీ/ ఎగ్జామినేషన్/ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాల్లోని ఖాళీలు: కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ 1, లైబ్రేరియన్ 1, ఫిజికల్ ఎడ్యుకేషన్ - డైరెక్టర్ 1, డిప్యూటీ డైరెక్టర్ 1, అసిస్టెంట్ డైరెక్టర్ 1
- మోడల్ స్కూల్ టీచర్ ఖాళీలు: పిజిటి ఇంగ్లీష్ 1, టిజిటి (ఇంగ్లీష్ 1, హిందీ 1, ఫిజికల్ ఎడ్యుకేషన్ 1), ఎలక్ట్రానిక్ గాడ్జెట్ అండ్ ఎలక్ట్రానిక్స్ 2, స్యూయింగ్ నీడిల్ వర్క్ అండ్ ఎంబ్రాయిడరీ 1, యోగా టీచర్ 3
- దరఖాస్తు ఫీజు: మోడల్ స్కూలు టీచర్‌కు రూ.300, మిగిలిన పోస్టులకు రూ.500
- దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 28
- వెబ్‌సైట్: www.manuu.ac.in

## ఏపీ ఉద్యానశాఖ

విజయనగరం జిల్లా కలెక్టర్, చైర్మన్ సెలెక్షన్ కమిటీ కాంట్రాక్ట్ ప్రాతిపదికన బహుళ ప్రయోజన విస్తరణ అధికారుల (ఎంపిఇఒ) నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **11**
- కాంట్రాక్ట్ వ్యవధి: ఏడాది
- అర్హత: బిఎస్సీ (హార్టికల్చర్ / అగ్రికల్చర్) / డిప్లొమా (హార్టికల్చర్) / బిఎస్సీ (బిజడ్‌సి) / ఎమ్మెస్సీ (హార్టికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: జనవరి 1 నాటికి 18 నుంచి 40 ఏళ్లలోపు ఉండాలి.
- వేతనం: నెలకు రూ.12,000
- ఎంపిక: అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మెరిట్‌కు 80 శాతం, ఇంటర్వ్యూకి 20 శాతం వెయిటేజీ ఇస్తారు.
- దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 22
- వెబ్‌సైట్: www.vizianagaram.ap.gov.in

## మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్

మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ ఆధ్వర్యంలోని 71 సబ్ ఏరియా/ హెచ్ క్యూ నార్తర్న్ కమాండ్ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **90**
- పోస్టులు: క్లర్క్ 1, సివిల్ మోటార్ డ్రైవర్ 42, వెహికిల్ మెకానిక్ 2, క్లీనర్ 3, క్యాంప్ గార్డ్ / చౌకీదార్ 1, సఫాయివాలా 1, లేబర్ 13, ఫైర్‌మన్ 25, కుక్ 1, ల్యాబ్ అసిస్టెంట్ 1
- అర్హత: పోస్టును అనుసరించి పదోతరగతి/ ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ద్వారా
- ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 17
- చిరునామా: The Commanding Officer, 5471 ASC Bn(MT) (Erstwhile 5121 ASC Bn (MT)), Pin - 905121 C/O 56 APO.


## ఇండియన్ ఎయిర్‌ఫోర్స్

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సదరన్ ఎయిర్ కమాండ్ గ్రూప్ సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **22**
- పోస్టులు: మల్టీ టాస్కింగ్ స్టాఫ్ 8, హౌస్ కీపింగ్ స్టాఫ్ 5, కుక్ 6, మెస్ స్టాఫ్ 3
- అర్హత: పదోతరగతి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 26
- చిరునామా: Commanding Officer, Signal Unit, C/o AF Station, Hakimpet, Secunderabad - 500014

'ఇంకా ఎన్నాళ్లు ఆడతానన్నదానిపై ఇప్పుడే ఓ అంచనాకు రాలేను. 12 నెలల్లో మూడు గ్రాండ్‌స్లామ్స్ గెలుచుకున్నా. ఈ వయసులో ఇలా సాధించడాన్ని ఇంకా నమ్మలేకపోతున్నా. భవిష్యత్‌లో మరిన్ని టైటిళ్లు అందుకుంటానేమో! ఒకటి మాత్రం కచ్చితంగా చెప్ప గలను.. నాలో సత్తా ఉన్నన్నాళ్లు ఆడుతూనే ఉంటా'

- రోజర్ ఫెడరర్



# కొత్త కొత్తగా..


రోజర్ ఫెడరర్.. పదిహేనేళ్ల క్రితం అతను అనామక ఆటగాడు.. అతనిపై ఎవరికీ అంచనాల్లేవ్.. అతను ఒకటి రెండు రౌండ్లకే పరిమితమవుతాడన్నది అందరి భావన.. అలాంటి స్థితిలో అనూహ్యంగా తొలి మేజర్ టైటిల్ గెలిచి అందరినీ ఆశ్చర్యపరిచాడు.. ఇప్పుడు అతను ఓ దిగ్గజం... లేటు వయసులోనూ గ్రాండ్‌స్లామ్స్ కొల్లగొడుతూ ప్రత్యర్థులకు దడ పుట్టిస్తున్నాడు.. నిరుడు రికార్డు స్థాయిలో ఎనిమిదో వింబుల్డన్‌ను ఖాతాలో వేసుకున్న అతను, ఇప్పుడు ఆరోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గాడు. ఓవరాల్‌గా 20వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో తానే సిసలైన టెన్నిస్ సమ్రాట్‌నని నిరూపించుకున్నాడు.. వయసు పైబడుతున్నదన్న మాటే గానీ, కుర్రాళ్లకు ఏమాత్రం తీసిపోకుండా ఎప్పటికప్పుడు తన ఆటతీరును మెరుగుపరుచుకుంటూ విభిన్నమైన వ్యూహాలతో 'కొత్త కొత్తగా..' అంటూ ముందుకు సాగుతున్నాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

గతేడాది 35 ఏళ్ల వయసులో ఫెడరర్ ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచినప్పుడు అందరూ షాక్ తిన్నారు. అప్పటికి ఐదేళ్లుగా ఒక్క మేజర్ టైటిల్ లేక కొట్టుమిట్టాడుతున్న స్విస్ స్టార్‌లో ఉన్నట్టుండి ఇంతశక్తి ఎలా వచ్చిందా అని ఆశ్చర్యపోయారు. నిజానికి ఫెడరర్ విజయాల్లో కీలకపాత్ర బ్యాక్‌హ్యాండ్ షాట్లదే. బేస్‌లైన్ నుంచి అతను కొడుతున్న బ్యాక్‌హ్యాండ్ షాట్లకు ప్రత్యర్థుల వద్ద బదులే లేకుండా పోతోంది. ఒకప్పుడు ఐదుసెట్ల మ్యాచ్‌లను అలవోకగా గెలిచిన ఫెడరర్‌కు మధ్యలో గాయం కారణంగా ఆటలో వేగం మందగించింది. కోర్టులో చురుగ్గా కదల్లేకపోయేవాడు. కానీ, మోకాలి శస్త్రచికిత్స తర్వాత స్విస్ మాస్టర్‌లో పూర్తిగా మార్పు కనిపించింది. తన ఆటలో కొత్త కోణాన్ని ఆవిష్కరించాడు.


**స్నీక్ ఎటాక్..:** ఈ వ్యూహాన్ని బ్రహ్మాస్త్రంగా మలచుకున్న ఫెడరర్.. కోర్టులో ఎదురుదాడికి దిగుతూ ప్రత్యర్థిని అయోమయానికి గురిచేస్తాడు. ప్రత్యర్థిని పదేపదే తప్పులకు పాల్పడేలా చేస్తాడు. ప్రత్యర్థి సర్వీస్ చేసేటప్పుడు ఈ రిటర్న్ వ్యూహాన్ని ఫెడరర్ అమలుచేస్తాడు. ప్రత్యర్థి సర్వీస్ చేయగానే, వేగంగా సర్వీస్ బాక్స్ వద్దకు దూసుకెళ్లి హాఫ్ వాలీపై రిటర్న్ కొడతాడు. ఆపై నెట్‌వద్దకు వెళ్లి ర్యాలీని ముగించేందుకు ప్రయత్నిస్తాడు. రెండో సర్వీస్‌ను ఎదుర్కొనేటప్పుడు ఫెడరర్ ఈ వ్యూహాన్ని అనుసరిస్తాడు. ఫలితంగా ప్రత్యర్థి సర్వీసులో తడబాటుకు గురయ్యేందుకు అవకాశముంటుంది. రోజర్ స్నీక్ ఎటాక్‌ను ఎంచుకోవడంలోనూ వ్యూహముంది. ఈ వయసులో తాను కుర్రాళ్ల తరహాలో కోర్టులో సుదీర్ఘంగా ర్యాలీలు ఆడలేనని ఫెడరర్ గ్రహించాడు. సుదీర్ఘ ర్యాలీలు ఆడి అలసిపోయి, మ్యాచ్‌లో వెనకబడడం కంటే ర్యాలీని త్వరగా ముగించాలని చూస్తాడు. ఇలా చేయడం వల్ల మ్యాచ్ ఆద్యంతం తాజాగా ఉండి ప్రత్యర్థిపై పైచేయి సాధించవచ్చన్నది ఫెడరర్ వ్యూహం. ఆ మధ్య సిన్సినాటి, మియామీ టోర్నీలతో పాటు గ్రాండ్‌స్లామ్స్‌లోనూ ఫెడరర్ ఇదే ప్రణాళికతో ముందుకెళ్లాడు.. విజయవంతమయ్యాడు. దీనికితోడు వ్యూహాత్మకంగా టోర్నీలను ఎంచుకుంటూ ముందుకు సాగడం కూడా ఫెడరర్ సక్సెస్ సీక్రెట్స్‌లో ఒకటిగా చెప్పుకోవచ్చు. ఇందుకు నిదర్శనమే అతను వీలైనంతవరకు క్లేకోర్టు ఈవెంట్లకు దూరమవడం. నిరుడు ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గగానే.. సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ అయిన ఫ్రెంచ్ ఓపెన్‌కు కావాలనే దూరంగా ఉన్నాడు. ఎర్రమట్టి తనకు అచ్చిరాకపోవడమే ఇందుకు కారణం. తన ఫేవరెట్ అయిన గ్రాస్‌కోర్టు, హార్డ్‌కోర్టు టోర్నీలపైనే పూర్తిగా దృష్టి సారించాడు. ఫలితంగా వింబుల్డన్ నెగ్గాడు.. ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. అంటే.. 12నెలల్లోనే మూడు గ్రాండ్‌స్లామ్స్ ఖాతా లో వేసుకొని మునుపటి రోజర్‌ను మరిపిస్తున్నాడు. కెరీర్ ఆరంభంలో ఎలాగైతే కష్టపడ్డాడో, 36 ఏళ్ల వయసులోనూ కఠోర సాధనతో ముందుకెళ్తున్న ఫెడరర్.. ఇదేఫామ్‌ను కొనసాగిస్తే మరో రెండు, మూడేళ్లు అతనిలో అత్యుత్తమ ఆటతీరును చూడొచ్చు. ఈలోపే అతను దిగ్గజ క్రీడాకారిణి, ఆల్‌టైమ్ టెన్నిస్ గ్రేట్ మార్గరెట్ కోర్ట్ (ఆస్ట్రేలియా) 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్ల రికార్డును అందుకున్నా ఆశ్చర్యం లేదు.

## రోజర్‌ను చూస్తూ ఏడుస్తూనే ఉన్నా..



**మెల్‌బోర్న్:** స్విస్ స్టార్ ఫెడరర్ ఆదివారం ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ గెలిచిన వెంటనే తీవ్ర భావోద్వేగానికిలోనై కన్నీళ్లు పెట్టుకున్న సంగతి గుర్తుందిగా! ఆ రోజు విజయానందాన్ని ఆపుకోలేక ఫెడరర్ చిన్నపిల్లాడిలా వెక్కివెక్కి ఏడవడం స్టేడియంలోని ప్రేక్షకులు, అభిమానులతో పాటు తోటి ప్లేయర్స్‌ను కూడా కంటతడి పెట్టించింది. కెనడాకు చెందిన టెన్నిస్ బ్యూటీ ఎవ్‌గెనీ బౌచర్డ్ అయితే, రోజర్ మాట్లాడినంతసేపు ఏడుస్తూనే ఉందట. ఈ విషయాన్ని ఆమే వెల్లడించింది. 'మ్యాచ్ గెలిచాక రోజర్ కన్నీటిపర్యంతమవడంతో నాకు కూడా కన్నీళ్లు ఆగలేదు. అతను ఏడుపు ఆపి ప్రసంగిస్తున్నప్పుడు కూడా నేను ఏడుస్తూనే ఉన్నాను' అని బౌచర్డ్ ట్వీట్ చేసింది.

## రిచర్డ్స్ తరహాలోనే.. కోహ్లీ కుదురుకుంటాడు!


హోల్డింగ్

**జొహాన్నెస్‌బర్గ్:** టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ఇప్పుడు దూకుడుగా కనిపిస్తున్నా.. భవిష్యత్తులో శాంత చిత్తాన్ని అలవర్చుకుంటాడని వెస్టిండీస్ పేస్ లెజెండ్ మైకేల్ హోల్డింగ్ అన్నాడు. కోహ్లీ, విండీస్ దిగ్గజం వివియన్ రిచర్డ్స్ మధ్య కొన్ని విలక్షణమైన పోలికలున్నాయని చెప్పాడు. కాగా, కొత్త బంతి బౌలర్‌గా జస్‌ప్రీత్ బుమ్రా సామర్థ్యంపై మైకేల్ సందేహాలు వ్యక్తం చేశాడు. 'కుడి చేతి వాటం బ్యాట్స్‌మెన్‌కు బంతిని దూరంగా తీసుకెళ్లడం లో బుమ్రా ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయంలో భువనేశ్వర్ నా మొదటి ఎంపిక'ని హోల్డింగ్ అన్నాడు.

## ఆస్ట్రేలియాలో టీ-20 వరల్డ్‌కప్

**దుబాయ్:** 2020లో జరిగే టీ-20 వరల్డ్‌కప్‌నకు ఆస్ట్రేలియా ఆతిథ్యం ఇవ్వనుందని ఐసీసీ ప్రకటించింది. అయితే మ్యాచ్ నిర్వహణ వేదికలను మంగళవారం మెల్‌బోర్న్‌లో ప్రకటించే అవకాశముంది. తొలిసారి ఆస్ట్రేలియాలో టీ-20 వరల్డ్‌కప్ జరగనుంది. 2020 అక్టోబరు - నవంబరు మధ్య మెగా టోర్నీని షెడ్యూల్ చేయనున్నట్టు సమాచారం. అయితే మొదటిసారి పురుషుల, మహిళల ప్రపంచకప్‌లను వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. మహిళల టీ-20 వరల్డ్‌కప్‌కు వెస్టిండీస్ వేదిక కానుంది.

## నెం.1 వోజ్నియాకి

**పారిస్:** ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను అందుకున్న డెన్మార్క్ టెన్నిస్ బ్యూటీ కరోలిన్ వోజ్నియాకి మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్‌గా నిలిచింది. సోమవారం ప్రకటించిన డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియన్ ఓపెన్ రన్నరప్ హలెప్‌ను వెనక్కినెట్టి వోజ్నియాకి టాప్‌ర్యాంక్‌ను అందుకుంది. హలెప్ రెండోర్యాంక్‌కు పడిపోయింది. 27ఏళ్ల వోజ్నియాకి టాప్‌ర్యాంకర్‌గా నిలవడం



ఇది రెండోసారి. 2010 అక్టోబరులో ఆమె నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. స్విటోలినా 3, ముగురుజా 4, ప్లిస్కోవా 5వ ర్యాంక్‌తో టాప్-5లో ఉన్నారు. పురుషుల సింగిల్స్‌లో ఫెడరర్ ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా నిలిచినా, అతని 2వ ర్యాంక్‌లో ఎలాంటి మార్పులేదు. అయితే టాప్‌ర్యాంకులో ఉన్న నడాల్ కన్నా ఫెడరర్ 150 పాయింట్లు మాత్రమే వెనకబడి ఉన్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనలిస్టు సిలిచ్ మూడు స్థానాలు ఎగబాకి 3వ ర్యాంక్‌లో నిలిచాడు. దిమిత్రోవ్, జ్వెరెవ్‌లు వరుసగా 4, 5 ర్యాంకుల్లో ఉన్నారు. జొకోవిచ్ 13వ ర్యాంక్‌లో నిలిచాడు.

**టాప్-50లోకి పేస్:** భారత వెటరన్ స్టార్ లియాండర్ పేస్ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో 14 స్థానాలు మెరుగుపరచుకొన్నాడు. 47వ ర్యాంకును అందుకొని మళ్లీ టాప్-50లో చేరాడు. రోహన్ బోపన్న ఓ స్థానం కోల్పోయి 20వ ర్యాంకులో నిలవగా.. దివిజ్ శరణ్ 45వ ర్యాంక్‌తో కెరీర్ బెస్ట్ అందుకున్నాడు. యుకీ భాంబ్రీ సింగిల్స్‌లో 118వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. రామ్‌కుమార్ 140, సుమిత్ 218, ప్రజ్నేశ్ 244, శ్రీరామ్ బాలాజీ 391వ ర్యాంకులో కొనసాగుతున్నారు.

## 4-2తో గెలిస్తే భారత్‌కు 'టాప్'



**దుబాయ్:** వన్డే ర్యాంకింగ్స్‌లో రెండోస్థానంలోఉన్న టీమిండియా అగ్రభాగానికి చేరుకొనే అవకాశం లభించింది. దక్షిణాఫ్రికాతో ఆరు వన్డేల సిరీస్‌ను 4-2తో కనుక కోహ్లీసేన గెలిస్తే.. ఆతిథ్య జట్టును వెనక్కునెట్టి టాప్ ర్యాంక్ చేజిక్కించుకుంటుంది. గురువారం డర్బన్ మ్యాచ్‌తో వన్డే సిరీస్ మొదలుకానుంది. టాప్‌ర్యాంక్‌ను నిలబెట్టుకోవాలంటే దక్షిణాఫ్రికా సిరీస్‌ను డ్రా చేసుకొంటే సరిపోతుంది. ఒకవేళ సఫారీలు కనుక 5-1తో సిరీస్ గెలుచుకొంటే.. దశాంశమాన తేడాతో ఇంగ్లండ్ తర్వాత భారత్ మూడోస్థానానికి పడిపోతుంది. వన్డే బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో కెప్టెన్ కోహ్లీ (876) మొదటి స్థానంలో నిలిచాడు. విరాట్ తర్వాతి స్థానాల్లో డివిల్లీర్స్ (872), వార్నర్ (823), రోహిత్ శర్మ (816) ఉన్నారు. ధోనీ 13వ స్థానానికి పడిపోగా, ధవన్ 12వ ర్యాంక్‌లో నిలిచాడు. బౌలర్లలో బుమ్రా (728) మూడో ర్యాంక్‌లో ఉండగా, ఇమ్రాన్ తాహిర్ (743), బౌల్ట్ (729) తొలి రెండుస్థానాల్లో కొనసాగుతున్నారు. అక్షర్‌పటేల్ (643) పదో ర్యాంక్‌లో ఉన్నాడు.

## దక్షిణాఫ్రికా క్రికెట్‌లో ఇంకా వర్ణవివక్ష ?


ఆమ్లా, ఫెహ్లుక్వాయో, ఎంగిడి, రబాడ, ఫిలాండర్, కేశవ్ మహరాజ్ (వృత్తంలో ఆటగాళ్లు)

**జొహాన్నెస్‌బర్గ్:** సౌతాఫ్రికా క్రికెట్ జట్టు ఫొటో ఒకటి ప్రస్తుతం సోషల్‌మీడియాలో తీవ్ర వివాదాస్పదమైంది. అంతేకాదు.. దక్షిణాఫ్రికాలో ఇంకా జాతి వివక్ష కొనసాగుతోందన్న నెటిజన్ల విమర్శలకు తావిచ్చింది. ఇంతకీ ఆ ఫొటో కథాకమామీషు ఏమిటంటే.. భారత్‌పై వాండరర్స్‌లో మూడోటెస్ట్ ముగిశాక సిరీస్ ట్రోఫీతో దక్షిణాఫ్రికా జట్టు ఫొటోకు పోజిచ్చింది. ఆ ఫొటోలో హషీమ్ ఆమ్లా, పెహ్లుక్వాయో, ఎంగిడి, రబాడా, ఫిలాండర్, కేశవ్ మహరాజ్ ఒకవైపు ఉండగా.. కెప్టెన్ డుప్లెసిస్, ఎల్గర్, డివిల్లీర్స్, మోర్కెల్, అలీవర్, మోరిస్, స్టెయిన్, డికాక్, మార్‌క్రమ్ మరోపక్క నిలుచున్నారు. వారంతా అలా ఉద్దేశపూర్వకంగా నిల్చున్నారో లేదో తెలియదుకానీ.. ఆ ఫొటోను చూసిన నెటిజన్లు మాత్రం దక్షిణాఫ్రికాపై విరుచుకుపడ్డారు. ఆ దేశంలో ఇంకా వర్ణవివక్ష కొనసాగుతోందని, అందుకే నల్లజాతీయులంతా ఓ పక్క, శ్వేత జాతీయులంతా మరోపక్క నిల్చున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. 1948 నుంచి 1991 వరకూ సౌతాఫ్రికాలో వర్ణవివక్ష తీవ్రస్థాయిలో ఉన్న విషయం తెలిసిందే. దాంతో దక్షిణాఫ్రికాను క్రికెట్‌నుంచి వెలివేయగా.. ఆ వివక్ష అంతమైన వెంటనే ఆ జట్టు మళ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేసింది. కాగా.. తాజా ఫొటోపై నెటిజన్ల విమర్శల నేపథ్యంలో క్రికెట్ సౌతాఫ్రికా(సీఎస్ఏ) స్పందించింది. దేశ క్రికెట్‌లో వర్ణవివక్షే లేదని సీఎస్ఏ సీఈవో తబాంగ్ మొరోయ్ స్పష్టంచేశారు.

# కుర్రాళ్లూ.. కుమ్మేయండి!

వేలంపై కాదు.. ఆటపై దృష్టి పెట్టండి.. తమ కుర్రాళ్ల ఏకాగ్రత ఎక్కడ చెదురుతుందోనని భారత అండర్-19 కోచ్ రాహుల్ ద్రావిడ్ చేసిన సూచన ఇది. ఎంత కాదనుకున్నా ఐపీఎల్ వేలంపై ఆటగాళ్ల ఆసక్తిని ఎవరూ దూరం చేయలేరు.. ఊహించినట్టుగానే పలువురు క్రికెటర్లకు భారీ ధర పలికింది. ఇదంతా బాగానే ఉంది.. కానీ ఇప్పుడు వారు సెమీస్ పోరులో దాయాది పాకిస్థాన్‌తో తలపడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నేడు జరిగే ఈ హైఓల్టేజ్ పోరులో కీలక ఆటగాళ్లపై డబుల్ ఒత్తిడి నెలకొంది. తమ 'విలువ'కు న్యాయం చేకూర్చడంతో పాటు పాక్‌ను దిమ్మతిరిగేలా ఓడించి ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

తెల్లవారుజామున 3 గం. నుంచి STAR SPORTS

- నేడు పాకిస్థాన్‌తో భారత్ సెమీస్ పోరు
- అండర్-19 ప్రపంచకప్



**క్రైస్ట్‌చర్చ్:** అండర్-19 ప్రపంచకప్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత్‌కు ఇప్పటిదాకా అపజయమన్నది లేదు. ఇప్పుడు ఇదే జోరుతో నేడు (మంగళవారం) పాకిస్థాన్‌తో సెమీఫైనల్లో తలపడేందుకు సన్నద్ధమైంది. మరోవైపు తొలి సెమీస్‌లో అఫ్ఘానిస్థాన్‌ను ఆస్ట్రేలియా ఓడించి ఫైనల్‌కు చేరింది. మూడుసార్లు చాంపియన్‌గా నిలిచిన భారత్ ప్రొఫెషనల్ ఆటతీరుతో అదరగొట్టి వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో నెగ్గింది. క్వార్టర్స్ వరకు జరిగిన మ్యాచ్‌ల్లో అద్భుత ప్రదర్శన కనబరచిన కెప్టెన్ పృథ్వీషా, శుభ్‌మన్ గిల్, పేసర్లు కమలేశ్ నాగర్‌కోటి, శివమ్ మవిలకు ఐపీఎల్ వేలంలో భారీగా ధర పలికింది. ఇప్పుడు వీరిపై మరింతగా దృష్టి ఉండడంతో ఈ కీలక మ్యాచ్‌లో ఏమేరకు రాణిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఇక రెండుసార్లు చాంపియన్‌గా నిలిచిన పాకిస్థాన్ తమ ప్రారంభ మ్యాచ్‌లో ఓడి వరుసగా మూడు మ్యాచ్‌ల్లో సత్తా చాటుకుంది. కాబట్టి ఎలాంటి అలక్ష్యాన్ని ప్రదర్శించినా భారత్ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. పాక్ పేసర్ షహీన్ అఫ్రీది విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నా బ్యాట్స్‌మెన్ వైఫల్యం ఆందోళన పరుస్తోంది. మరోవైపు అండర్-19 ప్రపంచకప్ ముఖాముఖి పోరులో భారత జట్టుపై 4-3తో పాక్‌దే పైచేయిగా ఉంది.

**ఆల్‌రౌండ్ షో:** భారత జట్టు బ్యాటింగ్, బౌలింగ్‌లో ప్రత్యర్థి జట్లకన్నా పటిష్ఠంగా ఉంటూ భారీ విజయాలను సొంతం చేసుకుంటోంది. ఓపెనర్లు పృథ్వీ షా, మన్‌జ్యోత్ కల్రా శుభారంభాలు అందించగలుగుతున్నారు. ఆ తర్వాత శుభ్‌మన్, అభిషేక్ శర్మ, హార్విక్ దేశాయ్ జట్టుకు భారీ స్కోర్లు సాధించి పెడుతున్నారు. క్వార్టర్స్‌లో 86 పరుగులతో అదరగొట్టిన శుభమన్ మొత్తం 239 పరుగులతో జట్టు టాపర్‌గా ఉన్నాడు. బౌలింగ్‌లో నాగర్‌కోటి 7 వికెట్లు తీశాడు. అతను దాదాపు 150 కి.మీ వేగంతో బంతులు వేయగలుగుతున్నాడు. 8 వికెట్లు తీసిన శివమ్ మవి కూడా ఇబ్బందిపెడుతున్నాడు. ఇక స్పిన్నర్ అనుకూల్ రాయ్ ఈ మ్యాచ్‌లో కీలకం కానున్నాడు.

## ఫైనల్లో ఆస్ట్రేలియా

**క్రైస్ట్‌చర్చ్:** అండర్-19 వరల్డ్‌కప్‌లో అఫ్ఘానిస్థాన్ సంచలనాలకు ఆస్ట్రేలియా చెక్ పెట్టింది. సోమవారం జరిగిన సెమీఫైనల్లో ఆసీస్ ఆరు వికెట్లతో అఫ్ఘాన్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్ఘానిస్థాన్ 48 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటైంది. ఇక్రమ్ (80) మినహా అంతా విఫలమయ్యారు. అనంతరం 182 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ 37.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ జాక్ ఎడ్వర్డ్స్ (72) హాఫ్ సెంచరీతో మెరిశాడు.

**స్కోర్లు: అఫ్ఘానిస్థాన్:** 48 ఓవర్లలో 181 (ఇక్రామ్ 80, మెర్లో 4/24); **ఆస్ట్రేలియా:** 37.3 ఓవర్లలో 182/4 (ఎడ్వర్డ్స్ 72).

## కళ్లన్నీ సైనా, సింధుపైనే!

నేటినుంచి ఇండియా ఓపెన్



**న్యూఢిల్లీ:** కొత్త సీజన్‌లో భారత్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ టోర్నీ ఇండియా ఓపెన్ మంగళవారం ఇక్కడ ప్రారంభంకానుంది. ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీ ఫైనల్‌కు చేరిన ఉత్సాహంలో ఉన్న సైనా నెహ్వాల్, డిఫెండింగ్ చాంపియన్ పీవీ సింధుపైనే అందరి దృష్టి నిలిచింది. 2015 చాంపియన్ కిడాంబి శ్రీకాంత్ ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ ద్వారా కొత్త సీజన్‌కు శ్రీకారం చుడుతున్నాడు. నాలుగో సీడ్ సైనా..తొలి రౌండ్‌లో సోఫీ దాల్ (డెన్మార్క్)ను ఎదుర్కోనుంది. డెన్మార్క్‌కు చెందిన నటాలియా రోడ్‌తో సింధు టోర్నీని ఆరంభించనుంది.

**శ్రీకాంత్..కొత్త సీజన్..:** రెండోసీడ్‌గా బరిలో దిగుతున్న శ్రీకాంత్..హాంకాంగ్‌కు చెందిన లీ చ్యూక్ యూతో మొదటి రౌండ్‌లో తలపడతాడు. స్థాయికి తగ్గ ప్రదర్శనచేస్తే ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ విక్టర్ అక్సెల్సన్‌ను శ్రీకాంత్ ఎదుర్కొనే అవకాశముంది. ప్రణయ్ ఓ క్వాలిఫయర్‌తో ఇండియా ఓపెన్ పోరును మొదలుపెట్టనున్నాడు. సాయిప్రణీత్ తొలిరౌండ్‌లో రాజీవ్ ఒసెప్ (ఇంగ్లండ్)ను ఢీకొంటాడు. పారుపల్లి కశ్యప్-హాన్స్ క్రిస్టియన్ (డెన్మార్క్)ను, అజయ్ జయరామ్-టామి సుగియార్తొ (ఇండోనేసియా)తో తలపడతారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్-చాంగ్ టక్, యీ చున్ (హాంకాంగ్)ను, జాతీయచాంపియన్లు సుమిత్‌రెడ్డి, మనుఅత్రి-ఓంగ్ యూ, టియో యీ (మలేసియా)ను ఎదుర్కొంటారు.

## అప్పుడు బాత్రూమ్‌లో దాక్కున్నా!

- ఐపీఎల్ వేలంపై యువ పేసర్ నాగర్‌కోటి




**న్యూఢిల్లీ:** కమలేశ్ నాగర్‌కోటి... అండర్-19 క్రికెట్ ప్రపంచకప్‌లో సంచలన బౌలింగ్‌తో అదరగొడుతున్న భారత యువ పేసర్. అయితే అందరిలాగే ఐపీఎల్ వేలంపై ఆసక్తిగా ఎదురుచూసినా తీరా ఆరోజు మాత్రం తీవ్ర ఒత్తిడికి గురయ్యాడట. ఏం చేయాలో తెలీక బాత్రూమ్‌లో కూర్చున్నానని చెబుతున్నాడు. రూ.3.2 కోట్ల భారీ ధరకు ఇతడిని కోల్‌కతా నైట్‌రైడర్స్ వేలంలో కొనుగోలు చేసింది. 'వేలాన్ని నేను చూడలేదు. ఆ సమయంలో ఆందోళనకు గురయ్యాను. వెంటనే బాత్రూమ్‌కు వెళ్లి అక్కడే కూర్చున్నాను. స్నేహితులు విపరీతంగా ఫోన్స్ చేస్తున్నారు. ఎవరికీ సమాధానం చెప్పలేదు. నా రూమ్మేట్ పంకజ్ యాదవ్ లైవ్ స్ట్రీమ్ ద్వారా లైన్‌లోకి వచ్చినా కూడా అందుబాటులో లేనని చెప్పా' అని నాగర్‌కోటి తెలిపాడు.

## సుమిత్, సర్జుబాలకు పతకాలు ఖాయం


సర్జుబాల

**న్యూఢిల్లీ:** ఇండియా ఓపెన్ బాక్సింగ్ టోర్నీలో సుమిత్ సంగ్వాన్ (91 కిలోలు), సర్జుబాల దేవి(51 కి.) సెమీఫైనల్‌కు చేరుకుని పతకం ఖాయం చేసుకున్నారు. ఇదే విభాగంలో పింకి జాంగ్రాకూడా సెమీస్‌లో ప్రవేశించింది. కాగా హైదరాబాద్‌కు చెందిన నిఖత్ జరీన్ 51కిలోల క్వార్టర్స్‌లోనే నిష్క్రమించింది. మంగోలియాకు చెందిన జర్గలన్ ఓచిర్బత్ చేతిలో ఓడింది. 60 కిలోల విభాగంలో శివ థాపా, మనీష్ కౌశిక్ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకున్నారు.

## మలేసియాలో 'పద్మావత్'పై నిషేధం




కౌలాలంపూర్, జనవరి 29: సంజయ్‌లీలా భన్సాలీ చిత్రం 'పద్మావత్'ను కష్టాలు ఇంకా వెంటాడుతున్నాయి. కర్ణిసేన, రాజ్‌పుత్‌ల ఆందోళనల మధ్య ఎట్టకేలకు భారత్‌లో జనవరి 25న ఈ చిత్రం విడుదలైన సంగతి తెలిసిందే. కాగా మలేసియాలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు అక్కడి సెన్సార్ బోర్డు అనుమతి నిరాకరించింది. ముస్లింల మనోభావాలు దెబ్బతీసే సన్నివేశాలు ఇందులో ఉన్నాయని.. మలేసియాలో ఎక్కువ మంది ముస్లింలు ఉన్నందున విడుదలకు అంగీకరించడం కుదరదని నేషనల్ ఫిల్మ్ సెన్సార్‌షిప్ బోర్డు(ఎల్‌పీఎఫ్) చైర్మన్ మహ్మద్ జాంబేరీ అబ్దుల్ అజీజ్ స్పష్టం చేశారు. అయితే ఈ నిషేధాన్ని వ్యతిరేకిస్తూ సినిమా డిస్ట్రిబ్యూటర్లు.. ఫిల్మ్ అప్పీల్ కమిటీని ఆశ్రయించినట్లు సమాచారం.

# ఒక మొగులు.. ముగ్గురు చంద్రులు!

- రేపు విశ్వంలో అద్భుత ఖగోళ ఘట్టం
- దాదాపు 150 ఏళ్ల తరువాత తొలిసారి
- తనివితీరా వీక్షించండి : శాస్త్రవేత్తలు
- రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన ఆలయాల మూత


భద్రాచలం, ఉండి, బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్పడే బుధవారం రాత్రి అరుదైన ఖగోళ ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఆకాశంలో మూడు రకాల చంద్రుళ్లను చూసే అద్భుత అవకాశం కలగనుంది. సూపర్ మూన్, బ్లడ్ మూన్, బ్లూ మూన్.. అన్నీ కలిపి ఒకేసారి రావడం ఈసారి సంపూర్ణ చంద్రగ్రహణం ప్రత్యేకత. భూమి చుట్టూ దీర్ఘ వృత్తాకార కక్ష్యలో తిరిగే క్రమంలో చంద్రుడు ఒక్కసారిగా భూమికి దగ్గరగా వస్తాడు. అప్పుడు ఏర్పడే పౌర్ణమినాటి చంద్రుణ్ణి సూపర్ మూన్ అంటారు. ఒకే నెలలో రెండుసార్లు పౌర్ణమి వస్తే, అలా నెల చివరిలో వచ్చే రెండో పౌర్ణమి నాటి చంద్రుడిని బ్లూమూన్ అంటారు. ఇది రెండున్నరేళ్లకు ఒకసారి వస్తుంది. ఇక, సూపర్ మూన్ సందర్భంగా చంద్ర గ్రహణం ఏర్పడితే అప్పుడు ఎర్రగా కనబడే పౌర్ణమి నాటి చంద్రుణ్ణి బ్లడ్ మూన్ అని పిలుస్తారు. ఇలాంటి ఖగోళ ఘట్టం 1866 తర్వాత మళ్లీ ఇప్పుడే కనిపిస్తోంది. భారతదేశంలో బుధవారం సాయంత్రం 5.20 గంటలకు ప్రారంభమై రాత్రి 8.41 వరకు ఉంటుంది. మామూలు చంద్రగ్రహణంతో పోల్చితే, బుధవారం కనిపించబోయే చంద్రుడు 14 శాతం పెద్దగానూ, 31 శాతం కాంతివంతంగానూ ఉంటాడని ప్రముఖ ఆస్ట్రో ఫిజిక్స్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ప్రజ్వల్ శాస్త్రి తెలిపారు. గ్రస్తోదయ సంపూర్ణ చంద్ర గ్రహణం నేపథ్యంలో బుధవారం తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ఆలయాలను మూసివేయనున్నారు. తిరుమలలో ఆలయం మూసివేయడంతోపాటు ఉదయం 10.45 నుంచి రాత్రి 9.30 వరకు అన్నప్రసాదాలనూ నిలిపివేయనున్నారు. భద్రాద్రిలో ఉదయం 5.30 నుంచి 8.30 వరకు, మధ్యాహ్నిక ఆరాధన అనంతరం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామివారి దర్శనం ఉంటుంది. యాదాద్రిలోనూ కొండపై శ్రీ లక్ష్మీనరసింహస్వామి బాలాలయాన్ని ఉదయం 10 గంటలకు ద్వార బంధనం చేయనున్నారు.





బీటింగ్ రిట్రీట్ సెర్మనీ సందర్భంగా త్రివర్ణశోభితమైన రాష్ట్రపతి భవన్

# ఆ తలాక్ ఆగాలి!



బడ్జెట్ సమావేశాల తొలి రోజున పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్రపతి కోవింద్


(మొదటి పేజీ తరువాయి)

ప్రయోజనం కలిగినట్లు చెప్పుకొచ్చారు. ఇన్నాళ్ళూ వెదురు కర్ర చెట్ల జాబితాలో ఉండడం, చెట్లను నరకడం నిషేధించడం వల్ల గిరిజనులు ఎంతో నష్టపోయారన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి నెలకొందని అంటూ అభివృద్ధిని దేశ మారుమూల ప్రాంతాలకు కూడా తీసికెళుతున్నామన్నారు. హింసను విడనాడి- రాజ్యాంగానికి లోబడి- జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకొచ్చే ఎవరితోనైనా చర్చలకు సిద్ధమని ప్రకటించారు రాష్ట్రపతి. మావోయిస్టుల సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనూ ఇతరత్రా హింస తగ్గిందని చెబుతూ- కాశ్మీర్‌లో హింసోన్మాదాలు సీమాంతర ఉగ్రవాదం వల్ల వచ్చినవే అన్నారు. ఆర్మీ, పారామిలటరీ, ఇతర దళాల సమన్వయంతో హింసను రెచ్చగొట్టేవారికి గట్టిగా బుద్ధి చెప్పామన్నారు. గడచిన మూడేళ్ళలో ప్రభుత్వం 93 లక్షల ఇళ్ళను నిర్మించిందని, 2022 నాటికి అందరికీ ఇళ్ళు కట్టించి ఇచ్చే పథకాన్ని పూర్తి చేస్తామని రాష్ట్రపతి వాగ్దానం చేశారు. విద్యారంగంలో సంస్కరణలు తెస్తున్నామంటూ- ప్రాథమిక, ఉన్నతవిద్యా రంగంలో మార్పులు చోటు చేసుకోబోతున్నాయన్నారు. అటల్ ఇన్నోవేషన్ మిషన్ కింద దేశవ్యాప్తంగా 2400 అటల్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయబోతున్నామని, చిన్నప్పటి నుంచే సృజన, వ్యాపారాత్మక ధోరణి అలవడేలా ఈ మిషన్‌ను తెచ్చామని అన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా అన్ని ఉన్నత విద్యా కోర్సుల పరీక్షలనూ ఒకే గొడుగు కిందకు తెచ్చే ప్రయత్నం సాగుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థికపరిస్థితులు మందగించినా భారత్‌లో వృద్ధి ఆశావహంగానే ఉందని వివరించారు. 2016-17 తొలి త్రైమాసికంలో కాస్త మందగించినా రెండో త్రైమాసికంలో పరిస్థితి మెరుగుపడిందన్నారు. గడచిన మూడున్నరేళ్ళుగా ద్రవ్యోల్బణం, లోటు మొత్తం మీద తగ్గాయని పేర్కొన్న రాష్ట్రపతి- విదేశీ ద్రవ్య నిల్వలు మాత్రం 410 బిలియన్‌ల మేర పెరిగినట్లు వెల్లడించారు. దేశంలో ఆర్థిక అనుసంధానం సాధించడం లక్ష్యంగా పేర్కొంటూ అందుకే జీఎస్టీ తెచ్చామన్నారు. బ్యాంకుల బలోపేతానికి గాను 2 లక్షల కోట్లు వాటికి పంపిణీ చేశామన్నారు. అవినీతిపై పోరాటం కొనసాగిస్తున్నామని చెబుతూ ఏడాది కాలంలో మూడున్నర లక్షల నకిలీ కంపెనీల రిజిస్ట్రేషన్ రద్దు పర్చడం ఈ దిశగా ఓ పెద్ద చర్య అని వివరించారు. జాతీయ ఇమ్యునైజేషన్ పథకం ద్వారా మారుమూల ప్రాంతాల్లో సైతం వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం సాగిస్తున్నామని చెప్పారు.

# ప్రజల ఆకాంక్షల మేరకే బడ్జెట్!

- 'ట్రిపుల్ తలాక్'పై రాజకీయాలొద్దు
- బిల్లును సత్వరమే ఆమోదించాలి
- పార్టీలన్నీ సహకరించాలి: మోదీ

న్యూఢిల్లీ, జనవరి 29: కేంద్ర బడ్జెట్ ప్రజల ఆకాంక్షల మేరకే ఉంటుందని ప్రధాని మోదీ చెప్పారు. సామాన్యుల అంచనాలకు తగ్గట్లుగానే ఉంటుందని తెలిపారు. భారత ఆర్థిక వృద్ధిని ప్రపంచం గుర్తిస్తోందన్నారు. అంతర్జాతీయ క్రెడిట్ రేటింగ్ సంస్థలు, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటి సంస్థలు ఇప్పటికే దేశ ఆర్థిక వృద్ధిని గుర్తించాయని వెల్లడించారు. సోమవారం ఆయన పార్లమెంటు ఆవరణలో మీడియాతో మాట్లాడారు. ట్రిపుల్ తలాక్ బిల్లుపై రాజకీయాలు చేయొద్దని, ఇది అత్యంత ప్రధానమైన అంశమని మోదీ స్పష్టం చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే ఈ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందేందుకు సహకరించాలని అన్ని రాజకీయ పార్టీలను అభ్యర్థించారు. ప్రస్తుత సమావేశాల్లోనైనా బిల్లును ఆమోదించి ముస్లిం మహిళలకు నూతన సంవత్సర కానుకగా ఇద్దామని అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేశారు. బిల్లు ఆమోదం పొందితే ముస్లిం మహిళలు స్వేచ్ఛగా, నిర్భయంగా జీవించే అవకాశం ఉంటుందన్నారు. పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి కూడా ఈ బిల్లును ప్రస్తావించారు. ఇది అతిత్వరలోనే చట్టంగా రూపొందుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.



బడ్జెట్ సమావేశాల తొలిరోజు పార్లమెంట్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

# బడ్జెట్‌కు ముందే బాదుడు

- బ్లాక్ మార్కెట్‌కు తరలిన సిగరెట్లు
- పొగరాయుళ్లను దోచుకుంటున్న వ్యాపారులు

హైదరాబాద్ సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏదైనా.. కేంద్ర బడ్జెట్‌లో తప్పనిసరిగా వేటి ధర పెరుగుతుంది!? ఈ ప్రశ్నకు వచ్చే జవాబు.. 'సిగరెట్లు'! ఈ ఏడాది పార్లమెంటులో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ఇంకా రెండు రోజుల సమయం ఉంది. అప్పుడే సిగరెట్లు బ్లాక్ చేసేశారు. ధరలు పెంచేశారు. ప్రతి సిగరెట్ ప్యాక్ మీద రూ.10పైనే ధరలు పెంచి దోచుకుంటున్నారు. ఉదాహరణకు, గోల్డ్ ఫ్లేక్ కింగ్ ఎమ్మార్పీ ధర రూ.150 ఉంటే.. ఇప్పుడే రూ.160కి విక్రయిస్తున్నారు. 'ఇదేంటీ రేట్లు ఇంకా పెరగలేదు కదా' అని పొగరాయుళ్లు అడిగితే, వ్యాపారులు తమకు రేట్లు పెంచి అమ్ముతున్నారని చెబుతున్నారు. ఈ సిగరెట్ల బ్లాక్ మార్కెట్ వెనక పెద్ద మాఫియా ఉందని, కోట్లలో దండుకుంటోందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఇందుకు అధికారులకూ లంచాలు ముడుతున్నాయన్న ఆరోపణలున్నాయి.

# డోన్ట్ వర్రీ.. బీ హ్యాపీ!

- కొన్ని అవరోధాలు తప్ప.. అన్ని మంచి రోజులే..
- ఆర్థిక సర్వేపై రాహుల్ వ్యంగ్యాస్త్రాలు
- మోదీనామిక్స్ వల్లే ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం: చిదంబరం

న్యూఢిల్లీ, జనవరి 29: ఆర్థిక సర్వేపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కొన్ని అవరోధాలు తప్ప.. ఇక్కడ అన్ని మంచి రోజులే ఉన్నాయని విమర్శించారు. పారిశ్రామిక వృద్ధి, వ్యవసాయ వృద్ధి, ఉద్యోగాల కల్పన, జీడీపీ రేటులో తగ్గుదల అనే అవరోధాలను మినహాయిస్తే అన్నీ మంచి రోజులేనని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ట్విటర్‌లో మోదీ ప్రభుత్వానికి చురక అంటించారు. చివర్లో 'బాధపడకండి.. సంతోషంగా ఉండండి!('డోన్ట్ వర్రీ బీ హ్యాపీ!) అంటూ ఓ వీడియో సాంగ్‌ను పోస్టు చేశారు. కాగా, ఈ ఆర్థిక సర్వే నిరుత్సాహపరిచేలా ఉందని కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం అన్నారు. సార్వత్రిక ఎన్నికలకు వెళ్లడానికి ఏడాది ముందు దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధాని మోదీ కష్టాల్లో పడేశారని ఆరోపించారు. దూరదృష్టితో ఆలోచించకపోవడం, నోట్ల రద్దు, జీఎస్టీ వంటి నిర్ణయాలతో 'మోదీనామిక్స్' దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని విమర్శించారు. కాగా, పార్లమెంటులో ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి కోవింద్ ప్రసంగిస్తున్న సమయంలో ఆమ్‌ఆద్మీ పార్టీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. 20 మంది ఆప్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించారు.

### రాహుల్‌కు ఫస్ట్ బెంచ్!



ప్రభుత్వ కార్యక్రమాల్లో రాహుల్ గాంధీ ఎక్కడ కూర్చోబోతున్నారు? కేంద్రం ఆయనకు ఏ వరుసలో ఏ సీటు కేటాయించబోతోంది? అనేది కొన్నిరోజుల నుంచి చర్చగా మారింది. ఇటీవల రిపబ్లిక్ డే వేడుకల్లో రాహుల్‌కు ఆరో వరుసలో సీటు కేటాయించడం వివాదాస్పదమైంది. అయితే.. సోమవారం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగిన రాష్ట్రపతి ప్రసంగ కార్యక్రమంలో మాత్రం ఆయన ముందు వరుసలో కూర్చున్నారు. అందరినీ పలుకరిస్తూ కనిపించారు. రాహుల్ పక్కన సోనియాగాంధీ, బీజేపీ సీనియర్ నేత ఆడ్వాణీ, మాజీ ప్రధాని మన్మోహన్ కూర్చున్నారు. అదే వరుసలో ప్రధాని మోదీ, అమిత్‌షా కూర్చున్నారు. ఇటీవలే కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన సోనియాగాంధీకి ఆడ్వాణీ వంటి సీనియర్లు శుభాకాంక్షలు తెలుపగా.. కేంద్రమంత్రి స్మృతి ఇరానీ మాత్రం చూసి చూడనట్లు వెళ్లిపోయారు.

# నగదు సాయం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో ఈ మేరకు సంకేతాలు కనిపించాయి. బడ్జెట్ సమావేశాల ఆరంభం సందర్భంగా రాష్ట్రపతి కోవింద్ ప్రసంగంలోనూ 2020 కల్లా రైతు ఆదాయాన్ని రెట్టింపుచేసేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. దీనిని బట్టి ఫిబ్రవరి 1న జైట్లీ ప్రవేశ పెట్టబోయే వార్షిక బడ్జెట్‌లో సబ్సిడీలను నేరుగా రైతులకే అందజేసే దిశగా ప్రతిపాదనలు ఉంటాయని అంచనా వేస్తున్నారు.

### తీవ్ర దుర్భిక్షం

పర్యావరణ మార్పుల వల్ల దేశవ్యాప్తంగా వ్యవసాయం తీవ్ర దుర్భిక్షాన్ని ఎదుర్కోనుందని, రైతుల రాబడి నాలుగో వంతు మేర పడిపోనుందని ఆర్థిక సర్వే తెలిపింది. ఎవరికి అందుతుందో తెలియని కరెంటు, ఎరువుల సబ్సిడీలను ఎత్తేసి ఆ మొత్తాలను నేరుగా రైతులకే ఆదాయ వనరులాగా అందించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఇప్పటికే దుర్భిక్ష ఛాయలు కనిపిస్తున్నాయని, మెట్ట భూముల్లో ఆదాయం 25 శాతం, మాగాణి భూముల్లో ఆదాయం 18 శాతం తగ్గనున్నట్లు తెలిపింది. 2022 కల్లా రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న ప్రధాని మోదీ కల నెరవేరాలంటే ప్రస్తుతం తీసుకుంటున్న చర్యలు ఏ మాత్రం సరిపోవని, విప్లవాత్మక చర్యలు చేపట్టాలని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. సాగునీటి సౌకర్యాలను భారీగా పెంచేయడం, బిందు సేద్యం, ఇతర ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగంలోకి తేవడం, గంపగుత్తగా రైతులందరికీ ఇస్తున్న విద్యుత్, ఎరువుల సబ్సిడీలకు బదులు రైతు

### తెలంగాణ మోడల్

తెలంగాణ ప్రభుత్వం ఈ రబీ సీజన్ నుంచి -ప్రతీ సీజన్‌లోనూ- ఎకరాకు రూ 4000 చొప్పున రైతులకు ఎరువుల సబ్సిడీ రూపేణా చెల్లించనుంది. ఈ మోడల్ ప్రకారం- రైతు తన వ్యవసాయ భూమి ఎంతో, ఎంత విస్తీర్ణంలో పండించదల్చుకున్నాడో రిజిస్టర్ చేయించుకోనక్కర లేదు. తనకి నచ్చిన పంట వేసుకోవచ్చు, తనకి నచ్చిన మార్కెట్‌లోకి తీసుకెళ్లి అమ్ముకోవచ్చు. పారదర్శకమైన విధానమిది. ఇది చైనాలో చాలా కాలంగా అమలవుతున్న విధానం. ఎకరాకు ఇన్‌పుట్ సబ్సిడీ మద్దతు పథకం పేరిట చాలా విజయవంతంగా అమలు చేశారక్కడ. రైతు కష్టం, నష్టం తీర్చే ఈ తరహా పథకాన్ని కేంద్రం 2016 నుంచి అధ్యయనం చేస్తూనే ఉందని, నిర్ణయం తీసుకోవాల్సింది మోదీయేనని ఆర్థిక శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

ల న ం నేరుగా ఆదుకోవడం తక్షణావసరమని చెప్పింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక సర్వేను అరుణ్ జైట్లీ సోమవారం పార్లమెంటుకు సమర్పించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రైతు కుటుంబ సగటు ఆదాయం రూ.3600 దాటటమే కష్టమని సర్వే పేర్కొంది. ఎరువులు, విద్యుత్ సబ్సిడీలను ఎత్తేసి, నేరుగా వారి ఆదాయానికి కొంత సొమ్ము జత చేర్చాలని చెప్పింది. చుక్కచుక్కకు మరింత పంట నినాదంతో మాత్రమే భారతీయ వ్యవసాయరంగం ముందుకు వెళ్లగలదని పేర్కొంది. విద్యుత్ సబ్సిడీని ఎత్తేసి నేరుగా రైతు ఖాతాకు అందిస్తే నీటి వృధాను అరికట్టవచ్చని చెప్పింది. సమర్థవంతమైన పంటల బీమా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా మాత్రమే దుర్భిక్షాన్ని ఎదుర్కోగలమని తెలిపింది. డ్రోన్ల వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడటం ద్వారా పంటనష్టం జరిగిన వారం రోజుల్లో పరిహారం అందేట్లు చూడాలని చెప్పింది. వ్యవసాయ ఆదాయం వాటా తగ్గుతున్నప్పటికీ దేశ వృద్ధిరేటుకు ఇప్పటికీ అదే కీలకంగా ఉందని చెప్పింది. రైతుల ఆదాయ మార్గాలను పెంచడం ద్వారా వ్యవసాయంలో రిస్క్ తగ్గించాలని సూచించింది.

### మధ్యప్రదేశ్‌లోనూ..

మధ్యప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న భావనాతరర్ భుగతన్ యోజన(బీబీవై) పథకం కూడా కేంద్ర పరిశీలనలో ఉంది. 8 పంటలు- సోయాబీన్, మినుము, కంది, పెసర, నువ్వులు, వేరుశెనగ, మొక్కజొన్న, రామ్‌తిల్- లకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చే పథకం ఇది. ఇదే తరహా పథకాన్ని హరియాణా ప్రభుత్వం 4 కాయగూర పంటలు - కాలిఫ్లవర్, టమాటా, ఉల్లి, ఆలుగడ్డలకు వర్తింపజేస్తోంది. మొత్తం మీద వ్యవసాయ రంగ దుస్థితికి కొంతమేర అయినా పరిష్కారం చూపే దిశగా కేంద్రం ఆలోచన చేస్తోందనేది సుస్పష్టం. దీనికి కారణం గత నాలుగేళ్ళుగా అంటే మోదీ అధికారంలోకి వచ్చినది మొదలు- వ్యవసాయ-జీడీపీ 2 శాతం మేర పడిపోయింది. వ్యవసాయాదాయం కూడా అంతేమేర తగ్గిపోయింది. పెట్టిన పెట్టుబడి అందక, మద్దతు ధర రాక, మనసు వికలమై- రైతుల ఆత్మహత్యలు పెరిగాయి.

### గులాబీ రంగు ఎందుకంటే?

దేశంలో లింగ నిష్పత్తి, విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి మెరుగుపడిందని ఆర్థిక సర్వే పేర్కొంది. తొమ్మిదేళ్ల క్రితం 43 మంది విద్యార్థులకు ఒకతరగతి గది ఉండేదని, ఇప్పుడు 30 మంది విద్యార్థులకు ఒక తరగతి గది ఉందని కొనియాడింది. టీచర్ విద్యార్థి నిష్పత్తి ఒక్కరికి 23 మంది చొప్పున ఉందని, అయితే చైనా, బ్రెజిల్, రష్యాల కన్నా వెనుకబడి ఉందని తెలిపింది. దేశంలో 6.3 కోట్ల మంది మహిళల కొరత ఉందని, లింగ నిష్పత్తి ఇంకా పెరగాల్సి ఉందని జైట్లీ వ్యాఖ్యానించారు. ఆ స్పృహ కోసమే ఆర్థిక సర్వే కవర్ పేజీలను గులాబీ రంగులో ముద్రించామన్నారు. గ్రామీణ ఉపాధి హామీని వినియోగించుకోవడంలో 54 శాతంతో మహిళలే ముందున్నారని తెలిపింది. కార్మిక శక్తిలో మహిళల వాటా తగ్గడం ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోందని వ్యాఖ్యానించింది.

### 5 రాష్ట్రాల నుంచే 70% ఎగుమతులు

భారతదేశ ఎగుమతుల్లో 70% ఐదు రాష్ట్రాల నుంచే లభిస్తున్నాయని, వాటిలో తెలంగాణ కూడా ఉందని ఆర్థిక సర్వే పేర్కొంది. భారతదేశ చరిత్రలోనే మొదటిసారిగా తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు కలిపి 70 శాతానికి పైగా ఎగుమతులు చేశాయని స్పష్టం చేసింది. అంతర్జాతీయ ఎగుమతులపై లభించిన కొత్త జీఎస్టీ డాటా ప్రకారం ఆయా రాష్ట్రాల్లో ఎగుమతులు పెరగడంతో జీవన ప్రమాణాలు పెరిగాయని పరోక్షంగా తెలిపింది. కొత్త డాటా ఆధారంగా జరిపిన ఈ సర్వేలో ఆయా రాష్ట్రాల్లో వివిధ కంపెనీల స్థాయిల్లో జరిగిన ఎగుమతులను పరిశీలించేందుకు అవకాశం ఏర్పడిందని పేర్కొంది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. ఈ ఐదు రాష్ట్రాల్లో ఎగుమతులు పెరగడం అసాధారణమని సర్వే అభిప్రాయపడింది. అంతేగాక రాష్ట్రాల మధ్య జరిగిన వర్తకం కూడా జీడీపీలో 60 శాతం మేరకు ఉంటుందని జీఎస్టీ డాటా సూచించింది.

### పొలంలో చెత్త తగులబెడితే భారీ జరిమానా

ఆదాయ వనరులు అంతంత మాత్రంగానే ఉన్నా కేంద్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఆర్థిక సర్వే కొనియాడింది. 8 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు బహిరంగ మల విసర్జన రహిత రాష్ట్రాలుగా నిలిచాయని కొనియాడింది. అందులో ఏపీ, తెలంగాణ లేవు. సరైన పారిశుద్ధ్యం లేకపోవడం వల్ల దేశంలో ఏటా లక్ష మంది పిల్లలు మరణిస్తున్నారని వెల్లడించింది. వ్యవసాయ వ్యర్థాలను తగులబెట్టే రైతులకు భారీ జరిమానాలు విధించాలని చెప్పింది. నగరాల్లో వాతావరణ నాణ్యతను పెంచేందుకు బస్సులను పెంచాలని, పాత వాహనాలను తీసేయాలని సూచించింది. ఉపాధి కోసం పురుషులు పట్టణాలకు వలస వెళ్తున్నారని, సాగులో మహిళల పాత్ర పెరిగిందని ప్రస్తావించింది. మహిళలకు రుణాలు, భూమి హక్కు, నీరు, సాంకేతిక పరిజ్ఞానం అందజేయాలని చెప్పింది. అప్పుడే వ్యవసాయ రంగ ఉద్పాదకత పెరుగుతుందని తెలిపింది.



### కంప్యూటర్‌ను మెదడులా పనిచేయించే స్విచ్!

వాషింగ్టన్, జనవరి 29: కంప్యూటర్లు మనిషి మెదడులా పనిచేసేలా చేసే సూపర్ కండక్టింగ్ స్విచ్‌ను అమెరికాలోని ది నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్టాండర్డ్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. జీవ వ్యవస్థలా నేర్చుకునేతత్వం కలిగి, అన్ని ప్రాసెసర్లను అనుసంధానం చేసుకొని గత జ్ఞాపకాలను దాచుకునేలా చేసే ఈ స్విచ్‌కు 'సినాప్సీ' అని పేరు పెట్టారు. అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ స్విచ్.. సెల్ఫ్ డ్రైవింగ్ కార్లకు, కేన్సర్ చికిత్సకు ఉపయోగపడుతుందని పరిశోధకులు తెలిపారు.



### దృఢమైన అల్యూమినియం మిశ్రమమిదీ!

వాషింగ్టన్, జనవరి 29: స్టెయిన్‌లెస్ స్టీల్‌కు పోటీనిచ్చే అత్యంత దృఢమైన అల్యూమినియం మిశ్రమాన్ని అమెరికాలోని పర్డ్యూ వర్సిటీ శాస్త్రవేత్తలు సృష్టించారు. టైటానియం అంత గట్టిగా ఉండే ఈ లోహానికి వంగే గుణం ఉంటుందని, బరువు కూడా తక్కువగా ఉంటుందని, తక్కువ ఖర్చుకే దీన్ని తయారు చేయవచ్చని పరిశోధకులు తెలిపారు. దీన్ని ఎంత త్వరగా పారిశ్రామిక రంగంలో అడుగుపెట్టిద్దామా అన్న కుతూహలంతో ఉన్నామని, స్టెయిన్‌లెస్ స్టీల్‌కు, టైటానియానికి ఇది సరైన ప్రత్యామ్నాయంగా పనిచేస్తుందని వెల్లడించారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.